

'రాష్ట్రంలో నిరుపేదలెవరూ డబ్బులేని కారణం
గా ఉన్నత విద్యకు దూరం కాకూడదు.
అందుకే ఫీజుల చెల్లింపు పథకాన్ని చేపట్టాం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 285

గురువారం 5-1-2023




సియాచిన్ పై వీర వనిత
సియాచిన్‌లో తొలిసారి కెప్టెన్ శివ చౌహాన్ దళాధిపతిగా నియమితురాలైంది. - 11లో



సిరీస్ లక్ష్యంగా...
పుణేలో నేడు శ్రీలంకతో రెండో టి20 మ్యాచ్ ఆడనున్న భారత్. - 12లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'రిపబ్లికన్' మెక్‌కార్తీకి ఎదురుదెబ్బ
అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్ ఎన్నికల్లో మెక్‌కార్తీ ఓటమి.. తొలిరోజు స్పీకర్‌ను ఎన్నుకోలేకపోవడం గత వందేళ్లలో ఇదే తొలిసారి.
- వివరాలు 6లో▶



ఢీకొట్టి.. 3 కిలోమీటర్లు లాక్కెళ్లి..
యూపీలోని మావై బుజుర్గ్ గ్రామంలో స్కూటీపై ప్రయాణిస్తున్న మహిళా లెక్చరర్‌ను ఓ భారీ ట్రక్కు బలంగా ఢీకొట్టి, 3కి.మీ. ఈడ్చుకెళ్లింది.
- వివరాలు 6లో▶



హైడ్రోజన్ మిషన్‌కు 19,744 కోట్లు
గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌ను ప్రోత్సహిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఇందుకోసం ఈ ఏడాది రూ.19,744 కోట్లు కేటాయించింది.
- వివరాలు 6లో▶



భారత్‌లో అమెరికా రాయబారిగా..
భారత్‌లో అమెరికా రాయబారిగా ఎరిక్ గార్సెట్టిని అధ్యక్షుడు జో బైడెన్ పునర్నియమించారు. దీన్ని సెనేట్ ఆమోదించాల్సి ఉంది.
- వివరాలు 6లో▶

న్యూస్‌రీల్

పొంగులేటికి భద్రత కుదింపు



ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయం రోజురోజుకు మలుపు తిరుగుతోంది. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డికి భద్రత కుదిస్తూ నిర్ణయం వెలువడటం హాట్ టాపిక్‌గా మారింది. ఆయనకు 3+3గా ఉన్న సెక్యూరిటీని ప్రభుత్వం 2+2కు తగ్గించింది.
- వివరాలు 2లో▶

సీబీఐకి బదిలీ చేయొద్దు



'ఎమ్మెల్యేలకు ఎర' కేసును సీబీఐకి అప్పగిస్తూ హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును కొట్టివేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ద్విసభ్య ధర్మాసనం ముందు అప్పీలు చేసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని నిందితులు కుట్రపన్నారంది.
- వివరాలు 3లో▶

ఫార్ములా- ఈ రేస్ టికెట్ల అమ్మకాలు షురూ



ఏబీబీ ఎఫ్ఐఏ ఫార్ములా– ఈ వరల్డ్ చాంపియన్‌షిప్ రేస్ టికెట్‌ల అమ్మకాలు బుధవారం ప్రారంభమయ్యాయి. నెక్లెస్‌రోడ్డులోని 2.8 కిలోమీటర్ల స్ట్రీట్ సర్క్యూట్‌లో ఫిబ్రవరి 11న ఈ పోటీలను నిర్వహించనున్నారు.
- వివరాలు 3లో▶

సంక్షోభంలో పాక్



చుక్కలనంటుతున్న నిత్యావసరాల ధరలు. తీర్చలేని రుణభారం. నానాటికీ పతనమవుతున్న కరెన్సీ విలువ. తీవ్ర రూపుదాలుస్తున్న కరెంటు కొరత. ప్రకృతి విలయాలు... ఇలా ఎటు చూసినా సమస్యలతో పాకిస్తాన్ పీకల్లోతు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతోంది.
- వివరాలు 6లో▶

'రేవంత్' వేదాంతం..


- పదవిలో ఉన్నా లేకున్నా పార్టీకి కట్టుబడి పనిచేస్తా. అధ్యక్షుడిగా వేరేవారిని నియమించినా భుజాలపై మోస్తా. పార్టీ కోసం పదవులను, అవసరమైతే ప్రాణాలను కూడా త్యాగం చేసేందుకు సిద్ధం. అందరూ మానవమాత్రులే. అప్పుడప్పుడూ పొరపాట్లు జరుగుతాయి. వాటిని సరిదిద్దుకుంటాం.

..సీనియర్లు లేని శిక్షణ

- 'హాథ్‌సే హాథ్‌జోడో' పాదయాత్రల గురించి చర్చించడంతోపాటు ధరణి పోర్టల్‌పై నేతలకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశానికి పలువురు సీనియర్లు డుమ్మా కొట్టారు. ఏఐసీసీ సమన్వయకర్త గిరీష్ జోడంకర్ హాజరైన భేటీకి సీనియర్లు గైర్హాజరవడం చర్చనీయాంశమయింది.

మాణిక్యం ఎగ్జిట్.. మాణిక్ ఎంట్రీ

రాష్ట్ర కాంగ్రెస్‌లో కీలక పరిణామాలు.. పార్టీ ఇన్‌చార్జిని మార్చిన అధిష్టానం


మాణిక్ రావు ఠాక్రే


మాణిక్యం ఠాగూర్

- మాణిక్యం ఠాగూర్ స్థానంలో మాణిక్‌రావ్ ఠాక్రే నియామకం
- మాణిక్యంకు గోవా బాధ్యతలు
- సీనియర్ల ఒత్తిడి, మాణిక్యం విముఖత నేపథ్యంలోనే అధిష్టానం నిర్ణయం?
- మరోవైపు హాథ్‌సే హాథ్‌జోడో, ధరణి పోర్టల్‌పై టీపీసీసీ భేటీ
- ఏఐసీసీ నేత గిరీష్ జోడంకర్ హాజరు.. పలువురు సీనియర్లు డుమ్మా
- డీసీసీ అధ్యక్షులతో రేవంత్, జోడంకర్ భేటీ.. స్థానిక సమస్యలపై చార్జిషీట్‌కు దిశానిర్దేశం

సాక్షి, హైదరాబాద్/సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ కాంగ్రెస్‌కు సంబంధించి బుధవారం కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా మాణిక్యం ఠాగూర్‌ను అధిష్టానం తప్పించింది. ఆయన స్థానంలో మహారాష్ట్రకు చెందిన సీనియర్ నేత మాణిక్‌రావ్ ఠాక్రేను నియమించింది. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదేశాల మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. మాణిక్యం ఠాగూర్‌కు మిగతా 2వ పేజీలో ▶

చక్కదిద్దలేక.. స్వచ్ఛందంగా
కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జిగా తప్పుకున్న మాణిక్యం ఠాగూర్ - 2లో

మూడు నెలలుగా పాలు లేవ్..

అంగన్‌వాడీల్లో గర్భిణులు, పిల్లలకు నిలిచిన పాల సరఫరా

- లబ్ధిదారులకు అందని పాల ప్యాకెట్లు
- గతేడాది సెప్టెంబర్‌తోనే ముగిసిన కాంట్రాక్టు
- కొత్త టెండర్ ఖరారు కాలేదు.. తాత్కాలిక ఏర్పాటూ చేయని యంత్రాంగం
- క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ సిబ్బందిపై లబ్ధిదారుల ఆగ్రహం
- ఇలాగైతే పోషకాహార లోపాన్ని ఎలా అధిగమిస్తారనే ఆందోళన
- ఏమని చెప్పాలో తెలియక అంగన్‌వాడీలు సతమతం

➔ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు అందించే పాల పంపిణీ పత్తా లేకుండా పోయింది. దాదాపు మూడు నెలలుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పాల స్టాకు కనిపించడం లేదు. పాల సరఫరాకు సంబంధించిన కాంట్రాక్టు ముగియడమే దీనికి కారణమని అధికారులు చెప్తున్నారు. అయితే ఈ విషయంలో ముందు జాగ్రత్త పడకపోవడం, మూడు నెలలైనా టెండర్ ఖరారు చేయకపోవడం, కనీసం తాత్కాలిక ఏర్పాట్లయినా చేయకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. అధికారుల తీరుతో పోషకాహార లోపాన్ని అధిగమించాలన్న లక్ష్యం దెబ్బతింటోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. - 5లో

కానిస్టేబుల్‌ను కాల్చి చంపించి వారిని ఎన్‌కౌంటర్ చేసేలా

- డిపార్ట్‌మెంట్‌లో మెప్పు కోసం ఓ పోలీస్ పక్కా స్కెచ్
- ములుగు కేంద్రంగా సాయుధ దళం ఏర్పాటుకు ప్రణాళిక
- వారితో యాక్షన్లు చేయించి.. తర్వాత ఎన్‌కౌంటర్ చేయాలని కుట్ర
- భగ్నం చేసిన హైదరాబాద్ పోలీస్ నిఘా విభాగం



3 లో

- మావోయిస్టుల తరహాలో ఓ దళం ఏర్పాటు.. తాడ్వాయి అడవుల్లో ట్రయల్‌రన్.. మావోయిస్టులు ఉన్నారనే భ్రమ కలిగించేందుకు పక్కా స్కెచ్ వేశారు పోలీస్ శాఖలోని ఓ అధికారి. అంతా ఆయన అనుకున్నట్టు జరిగితే.. ఓ హెడ్‌కానిస్టేబుల్‌ను కాల్చి చంపించాలనేది ప్లాన్. ఈ కుట్రకోణాన్ని హైదరాబాద్‌లోని పోలీస్ నిఘా విభాగం పసిగట్టి, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఆధారాలు, కొన్ని వివరాలు సేకరించి బయటపెట్టింది.

బాబు మరో షో!

- పబ్లిసిటీ కోసం మరోసారి ప్రతిపక్ష నేత చీప్ ట్రిక్స్
- కందుకూరు, గుంటూరు ఘటనల నేపథ్యం..
- సభలు, రోడ్ షోలకు ముందస్తు అనుమతి తీసుకోవాలన్న ప్రభుత్వం
- కుప్పంలో అనుమతి లేకుండా రోడ్ షో నిర్వహణకు విఫలయత్నం
- స్థానికుల నుంచి స్పందన కరువు..
- రెచ్చిపోయిన టీడీపీ శ్రేణులు.. పోలీసులతో వాగ్వాదం, తోపులాట
- పోలీసుల సంయమనంతో ఫలించని 'పచ్చ' వ్యూహం


121 పెద్దూరు వద్ద డీఎస్పీని తీవ్ర స్వరంతో దూషిస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: పబ్లిసిటీనే ప్రధాన అజెండాగా చంద్రబాబు మరో షోకు తెరతీశారు. తన పబ్లిసిటీ కోసం కందుకూరు, గుంటూరులో 11 మంది ప్రాణాలు పోవడానికి కారణమయ్యిందే కాక.. ప్రశాంతంగా ఉన్న కుప్పంలో బుధవారం ఉద్రిక్త పరిస్థితులు కల్పించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, డీజీపీపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. టీడీపీ మూకలు పోలీసులపై దాడులకు తెగబడేలా రెచ్చగొట్టారు. వెరసి.. ఎల్లో మీడియా ద్వారా పబ్లిసిటీ చేయించుకొని, రాజకీయ మైలేజీ పొందడానికి విఫలయత్నం చేశారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు కుప్పం శాసన సభ్యుడిగా మూడు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటించాలని భావించారు. కందుకూరు, గుంటూరు ఘటనల నేపథ్యంలో రోడ్ల మీద బహిరంగ సభలను నిషేధిస్తూ ప్రభుత్వం జీఓ ఇచ్చిన విషయం తెలిసిందే. చంద్రబాబు పర్యటన నేపథ్యంలో చిత్తూరు జిల్లా పోలీసులు.. ఆయన పీఏ మనోహర్‌కు ముందస్తు మిగతా 10వ పేజీలో ▶

రోడ్లపై సభలు వద్దనటం తప్పా?

వరుసగా రెండు సంఘటనల్లో ఏకంగా 11 మంది ప్రాణాలు బలి

- ఇలాంటి దుర్ఘటనలకు చెక్ పెడుతూ రోడ్లపై సభలు వద్దన్న ప్రభుత్వం
- మరీ అత్యవసరమైతే ముందస్తు అనుమతి తీసుకోవాలని ఉత్తర్వులు.. ఈ ఉత్తర్వులకు కూడా చంద్రబాబు నాయుడి వక్రభాష్యం - 10లో

ఇదండీ సంగతి



ఆయనే మనకు శిక్షణా తరగతులు నిర్వహించేది!



చాక్‌పీస్ కొన్నా జీఎస్టీ బిల్లు!

- ప్రభుత్వ స్కూళ్లలో పీఎఫ్ఎంఎస్ విధానం
- అలాగైతేనే ఆడిట్ లెక్కలోకి తీసుకునే పరిస్థితి
- ఇచ్చే కాసిన్ని నిధులకూ సవాలక్ష పేచీలేమిటంటూ ప్రధానోపాధ్యాయుల ఆగ్రహం

- ప్రభుత్వ బడుల నిర్వహణ నిధుల వినియోగంపై కొత్త నిబంధనలొచ్చాయి. బడిలో చేసే ప్రతి ఖర్చును, వాటికి సం బంధించిన జీఎస్టీ బిల్లులను హెచ్‌ఎంలు ముందుగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ విధానంపై ప్రధానోపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. - 3లో



7న బీజేపీకి తొలి పరీక్ష!

- ఎల్లుండి 119 నియోజకవర్గాల్లో ఒకేసారి అసెంబ్లీ సమ్మేళనాలు
- కనీసం 3–4వేల మందితో నిర్వహించాలన్న అధినాయకత్వం
- నియోజకవర్గాల స్థాయిలో పార్టీ వాస్తవ బలం బయటపడుతుందన్న అంచనాలు

- అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర బీజేపీ తొలి పరీక్షకు సిద్ధమవుతోంది. 7న పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీనడ్డా వర్చువల్‌గా 119 నియోజకవర్గాల అసెంబ్లీ సమ్మేళనాలనుద్దేశించి ప్రసంగించనున్నారు. వీటి ద్వారా పార్టీ క్షేత్రస్థాయి సంస్థాగత బలాబలాలు, ఎన్నికల సన్నద్ధతపై స్పష్టత రానుందని భావిస్తున్నారు. - 2లో

క్లుప్తంగా...

తెలంగాణ రహదారుల ప్రాజెక్టుల్ని వేగవంతం చేయండి

నితిన్ గడ్కరీని కోరిన కిషన్ రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో ఇప్పటికే చేపట్టిన వివిధ జాతీయ రహదారుల ప్రాజెక్టులతోపాటు ప్రతిష్టాత్మకమైన రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) పనులను వేగవంతం చేయాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. ఢిల్లీలో బుధవారం నితిన్ గడ్కరీతో భేటీ అయిన కిషన్‌రెడ్డి తెలంగాణలో జాతీయ రహదారుల ప్రాజెక్టుల పురోగతిపై చర్చించారు. కాగా, తన విజ్ఞప్తికి నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారని...ప్రాజెక్టుల పురోగతిపై అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేశారని కిషన్‌రెడ్డి మీడియాకు తెలిపారు.

కేసీఆర్‌తో బీఆర్‌ఎస్ ఏపీ అధ్యక్షుడు భేటీ



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ బుధవారం ప్రగతిభవన్‌లో పార్టీ అధినేత కె.చంద్రశేఖర్ రావుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏపీలో పార్టీ పటిష్టత తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ ఏపీ నేత చింతల పార్థసారథి తదితరులున్నారు.

ఢిల్లీకి సీఎస్ సోమేశ్



సాక్షి, హైదరాబాద్: మూడు రోజుల పాటు జరగనున్న కీలక సమావేశాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ గురువారం ఢిల్లీ వెళ్తున్నారు. కేంద్ర కేబినెట్ కార్యదర్శి ఆధ్వర్యంలో జరిగే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల సమావేశంలో ఆయన పాల్గొంటారు. ఈ సందర్భంగా పలు అంశాలపై జరిగే చర్చల్లో ఆయన పాల్గొంటారు. బృందాలుగా ఏర్పాటు చేసే గ్రూప్ చర్చల్లో కూడా ఆయన పాల్గొంటారు.

వక్రంగా మాట్లాడటం బండికి తగదు: లింగయ్య



సాక్షి, హైదరాబాద్: ప్రజలకు ఉపయోగపడే సలహాలు ఇవ్వకుండా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకుని వక్రంగా మాట్లాడటం సరికాదని రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్‌తో కలిసి బుధవారం బీఆర్‌ఎస్ శాసనసభా పక్షం కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేస్తున్నా బండి సంజయ్ ప్రశ్నించిన పాపాన పోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిపక్షాలు అభినందించాలని, పేదలకు ఉపయోగపడే ఈ కార్యక్రమంలో భాగంగా 1.54 లక్షల కోట్ల మందికి ఉచిత పరీక్షలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం ద్వారా 55 లక్షల మందికి ఉచిత పరీక్షలు నిర్వహించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

గవర్నర్‌ను కలిసిన మర్రి

సాక్షి, హైదరాబాద్: తన తండ్రి, దివంగత మాజీ సీఎం మర్రి చెన్నారెడ్డి 103వ జయంత్యుత్సవాల్లో పాల్గొనాల్సిందిగా బీజేపీ నేత, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను కోరారు. ఈమేరకు బుధవారం గవర్నర్‌ను రాజ్‌భవన్‌లో కలిశారు. ఉత్సవాలకు హాజరుకావాల్సిందిగా ఆహ్వాన పత్రికను అందజేసినట్లు శశిధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

పొత్తు ఉన్నా లేకున్నా హుస్నాబాద్‌లో పోటీ చేస్తాం



హుస్నాబాద్: బీఆర్‌ఎస్‌తో పొత్తు ఉన్నా, లేకున్నా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో హుస్నాబాద్‌లో సీపీఐ పోటీ చేస్తుందని ఆ పార్టీ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి వెల్లడించారు. సిద్దిపేటజిల్లా హుస్నాబాద్‌లోని అన బేరి సింగిరెడ్డి అమరులభవన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ తో సీపీఐ పొత్తు విషయంపై జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఇంకా చర్చ జరగలేదని, పొత్తులుంటే ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉండాలని వివరించారు. సీట్ల సర్దుబాటు విషయానికొస్తే ప్రాధాన్యత సీట్లలో హుస్నాబాద్ కూడా ఉంటుందని, ఈ స్థానాన్ని ఎట్టి పరిస్థితుల్లో వదులుకోబోమని స్పష్టంచేశారు. హుస్నాబాద్‌లో సీపీఐ పోటీ చేయాలని ప్రజలతో పాటు పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నారని ఆయన తెలిపారు.

చక్కదిద్దలేక.. స్వచ్ఛందంగా..!



కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జిగా తప్పుకున్న మాణిక్యం ఠాగూర్

- ప్రతిరోజూ తలనొప్పి భరించలేకే నిర్ణయం
- తెలంగాణ పార్టీలో కయ్యాలు తన కెరీర్‌ను దెబ్బతీస్తాయనే ఆందోళన
- ఆరు నెలల క్రితమే తప్పుకుందామనే ఆలోచన

సాక్షి, హైదరాబాద్: మాణిక్యం ఠాగూర్.. కాంగ్రెస్ రాష్ట్రాల ఇన్‌చార్జుల జాబితాలో పాపులర్ అయిన పేరు ఇది. తెలంగాణ ఇన్‌చార్జిగా ఆయన బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పార్టీ మూడు కొట్లాటలు, ఆరు తగాదాలన్నట్టుగా నిత్యం వార్తల్లో నిలిచింది. 2020 సెప్టెంబర్‌లో బాధ్యతలు తీసుకున్న ఆయన తర్వాత బాధ్యతల నుంచి తప్పుకునే వరకు ప్రతిరోజూ ఏదో ఒక తలనొప్పితోనే సతమతమయ్యారు. పార్టీ నేతలను సమన్వయం చేయలేక, పరిస్థితులను చక్కదిద్దలేక, అధిష్టానానికి ఏం చెప్పాలో అర్థం కాక నానా అవస్థలు పడ్డారు. టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి నియామకం తర్వాత ఈ తలనొప్పులు తీవ్రరూపం దాల్చాయి. ఈ నేపథ్యంలో ఆయన బుధవారం హైదరాబాద్‌లో జరిగిన పార్టీ సమావేశానికి డుమ్మా కొట్టడం, తెలంగాణ కాంగ్రెస్ వాట్సాప్ గ్రూప్ నుంచి వైదొలగడం చర్చనీయాంశమయ్యింది. ఆయన రాష్ట్ర బాధ్యతల నుంచి తప్పుకుంటారని, కొత్త ఇన్‌చార్జి వస్తారనే అభిప్రాయం వ్యక్తమయ్యింది.

విఫల ఇన్‌చార్జిగా మిగిలిపోతానని..!

రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించేందుకు మాణిక్యం ఠాగూర్ విముఖత వ్యక్తం చేయడం వెనుక పలు కారణాలున్నాయని గాంధీభవన్ వర్గాలంటున్నాయి. ముఖ్యంగా తెలంగాణ పార్టీలోని కయ్యాలు తన వ్యక్తిగత కెరీర్‌ను దెబ్బతీసే అవకాశం ఉందని ఆయన భావించినట్టు తెలుస్తోంది. తాను ఇన్‌చార్జిగా వచ్చిన తర్వాత జరిగిన దుబ్బాక, హుజూరాబాద్, మునుగోడు ఉప ఎన్నికల్లో పార్టీ వైఫల్యం తనకు చుట్టుకుంటే తానో విఫల ఇన్‌చార్జిగా మిగిలిపోతాననే ఆందోళన ఆయన రాష్ట్ర పార్టీ నేతల వద్ద వ్యక్తం చేశారు. పార్టీ పరిస్థితులను చక్కదిద్దలేకపోయానని అధిష్టానం భావిస్తే సంస్థాగతంగా కూడా తనకు ఇబ్బంది అవుతుందని భావించే వారని మాణిక్యంతో సన్నిహితంగా ఉన్న నేతలు వెల్లడించారు. దీనికి తోడు లోక్‌సభ ఎన్నికలు కూడా సమీపిస్తున్నా.. తన సొంత నియోజకవర్గమైన విరుదకు సమయం ఇవ్వలేకపోతున్నానని, కోరుకున్న విధంగా తమిళనాడు పీసీసీ ఇచ్చినా, ఇవ్వకపోయినా తాను నియోజకవర్గానికి వెళ్లిపోతానని ఆయన చెప్పేవారని టీపీసీసీ ముఖ్య నేత ఒకరు చెప్పారు.

‘సీనియర్ల ఎపిసోడ్’ నేపథ్యంలో..

ఆరునెలల క్రితమే మాణిక్యం ఈ నిర్ణయానికి వచ్చినా తగిన సమయం కోసం ఎదురు చూశారని, రేవంత్‌రెడ్డిపై సీనియర్ నేతలు తిరుగుబాటు చేయడం, పార్టీ నేతలతో మాట్లాడేందుకు దిగ్విజయ్‌సింగ్ రాష్ట్రానికి రావడం, ఆ సమయంలో అన్ని వేళ్లూ ఆయన వైపే చూపించడంతో..ఇక తన వల్ల కాదని అధిష్టానానికి తేల్చి చెప్పేశారని సమాచారం. మరోవైపు తెలంగాణ కాంగ్రెస్ నాయకులకు సమష్టిగా పార్టీని అధికారంలోకి తీసుకురావాలన్న ఆలోచనలు ఏవీ లేవని... కేవలం తమ సొంత రాజకీయాలు, ఒకరిపై ఒకరు ఆధిపత్యాన్ని చూపించుకోవడం, ఇతరులపై ఆరోపణలు చేయడం, గ్రూపు రాజకీయాలపైనే పూర్తిగా దృష్టి సారించారని మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీలకు ఫిర్యాదు చేశారని కూడా తెలిసింది.

మాణిక్యం ఎగ్జిట్.. మాణిక్ ఎంట్రీ

▶ మొదటి పేజీ తరువాయి

గోవా రాష్ట్ర వ్యవహారాలను అప్పగించారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యవహారశైలిపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిన రాష్ట్రంలోని సీనియర్ నేతల ఒత్తిడితో పాటు, పార్టీ ఇన్‌చార్జిగా కొనసాగేందుకు మాణిక్యం సైతం విముఖత వ్యక్తం చేసిన నేపథ్యంలో అధిష్టానం ఈ మార్పు చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు మాణిక్యంను తప్పిస్తూ ఏఐసీసీ ఉత్తర్వులు వెలువడడానికి కొద్దిగా ముందు, టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో రేవంత్‌రెడ్డి వేదాంత ధోరణిలో మాట్లాడడం పార్టీలో ఆసక్తి రేకెత్తిస్తోంది. ఏఐసీసీ సమన్వయకర్త గిరీష్ జోడంకర్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాల్గొన్న ఈ భేటీకి సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, ఏఐసీసీ కిసాన్ సెల్ వైస్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి తదితరులు హాజరు కాగా.. కారణాలేవైనా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వీహెచ్, దామోదర రాజనర్సింహ, జగ్గారెడ్డి, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ప్రేంసాగర్‌రావు లాంటి నాయకులు పాల్గొనకపోవడం చర్చనీయాంశమవుతోంది.

పలు అంశాలపై టీపీసీసీ చర్చ

బోయిన్‌పల్లిలోని గాంధీ ఐడియాలజీ సెంటర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో పలు అంశాలపై చర్చ జరిగింది. ముఖ్యంగా జనవరి 26 నుంచి నిర్వహించాల్సిన ‘హాథ్‌సే హాథ్ జోడో’ పాదయాత్రల గురించి నేతలు చర్చించారు. ధరణి పోర్టల్‌పై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నేతలకు అవగాహన కల్పించారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు ఏదైనా ప్రమాదం జరిగి ప్రాణాలు కోల్పోయిన పక్షంలో బీమా కల్పన, మీడియాతో సమన్వయం, ఎన్నికల నిబంధనలు తదితర అంశాలపై కూడా చర్చ జరిగింది. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, సీనియర్ నేతలు జానారెడ్డి, షబ్బీర్‌అలీ, మల్లురవి, గాలి అనిల్‌కుమార్, సంపత్‌కుమార్, సుదర్శన్‌రెడ్డి, చిన్నారెడ్డి, అంజన్‌కుమార్ యాదవ్, హర్కర వేణుగోపాల్, రాములు నాయక్, నిరంజన్‌లతో పాటు పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ), టీపీసీసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, సీనియర్ ఉపాధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, డీసీసీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల చైర్మన్లు, పీసీసీ ప్రతినిధులు కూడా సమావేశంలో పాల్గొన్నారు.

కేసీఆర్ ఏ గట్టునుంటారో చెప్పండి: రేవంత్

ఈ సమావేశాన్ని రేవంత్‌రెడ్డి పార్టీ జెండా ఆవిష్కరణ ద్వారా ప్రారంభించారు. సమావేశం ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విభజన వివాదాల విషయంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఏ గట్టునుంటారో చెప్పాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో



సభలో మాట్లాడుతున్న టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

కేసీఆర్ వైఖరి ఏంటో స్పష్టం చేయాలన్నారు. ‘గోదావరి, కృష్ణా నదీ జలాల విషయంలో కేసీఆర్ ఎటువైపు ? ఆస్తుల విభజనలో తెలంగాణ వైపా, ఆంధ్రప్రదేశ్ వైపా?’ అని ప్రశ్నించారు. ఎన్నో త్యాగాలు చేసి కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇస్తే ఆ గట్టున చేరిన కేసీఆర్ తెలంగాణను ముంచాలనుకుంటున్నాడని విమర్శించారు. రెండుసార్లు ప్రజలు అధికారమిచ్చినా కేసీఆర్ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చలేకపోయారని, కేసీఆర్ పాలనలో దగా పడని వర్గం లేదని అన్నారు.

కేసీఆర్ కుటుంబాన్ని ఉప్పెనలా కప్పేద్దాం

కాంగ్రెస్ కార్యకర్తలంతా కార్యోన్ముఖులై కదలాలని, ఉప్పెనలా కేసీఆర్ కుటుంబాన్ని కప్పేద్దామని రేవంత్ పిలుపునిచ్చారు. పదవిలో ఉన్నా లేకున్నా తాను పార్టీ కోసం కట్టుబడి పనిచేస్తానని, పార్టీ అధికారంలోకి వస్తుందంటే ఎలాంటి త్యాగం చేయడానికైనా సిద్ధమని అన్నారు. పార్టీ ఏ ఆదేశాలిచ్చినా సామాన్య కార్యకర్తలా పనిచేస్తానన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, అందరితో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. రాష్ట్ర కాంగ్రెస్ కుటుంబానికి జానారెడ్డి పెద్దదిక్కులాంటివారని, ఆయన సూచనల ప్రకారం నడుచుకుని పార్టీని రాష్ట్రంలోని అన్ని మూలలకు తీసుకెళ్దామని చెప్పారు. కొన్ని దుష్టశక్తులు ఆశించినట్టుగా తెలంగాణ సమాజానికి నష్టం చేయబోమని కాంగ్రెస్ శ్రేణులు నిరూపించారని, తెలంగాణ ప్రజలకు నష్టం కలిగేలా కాంగ్రెస్ పార్టీ వ్యవహరించబోదని ఈ వేదిక నుంచి సందేశం ఇద్దామని అన్నారు.

ఐక్యంగా పనిచేస్తే అధికారం: జోడంకర్

రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర స్ఫూర్తితో రాష్ట్రంలో కూడా హాథ్ సే హాథ్ జోడో యాత్రలు చేయాలని గిరీష్ జోడంకర్ పిలుపునిచ్చారు. ఈ యాత్రలను ఎన్నికల ప్రచారంగా ఉపయోగించుకోవాలని, హాథ్‌సే హాథ్ జోడో యాత్రల విజయవంతం కోసం ఈనెల 8వ తేదీన జిల్లా, మండల, బూత్ స్థాయి సమావేశాలు నిర్వహించుకోవాలని సూచించారు. పార్టీ నేతల మధ్య సమన్వయానికి ఇలాంటి సమావేశాలు ఉపయోగపడతాయన్నారు. నేతలందరూ ఐక్యంగా పనిచేస్తే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీదే అధికారమని వ్యాఖ్యానించారు.

వైఎస్సార్ పాదయాత్ర ఓ చరిత్ర

అంతకుముందు సమావేశం ప్రారంభం సందర్భంగా సీఎల్పీ నేత భట్టి మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలర్పించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని, దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు బీజేపీ చేస్తున్న కుయుక్తులను తిప్పికొట్టేందుకే రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టారని చెప్పారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ చేపట్టిన పాదయాత్ర ఓ చరిత్రగా నిలిచిపోయిందని, గ్రామీణ పేదరికాన్ని నిర్మూలించేందుకు ఈ యాత్ర తోడ్పడిందని తెలిపారు. వైఎస్సార్ స్ఫూర్తితో తెలంగాణలో పాదయాత్రలు చేద్దామని రేవంత్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. హాథ్‌సే హాథ్‌జోడో యాత్ర ద్వారా రాష్ట్రంలోని ప్రతి గడపను తట్టి రాహుల్‌గాంధీ ఆలోచనను ప్రజల్లోకి తీసుకెళ్దామని చెప్పారు.

కేడర్‌ను ఉత్తేజితుల్ని చేయండి

టీపీసీసీ సమావేశానంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులతో ఏఐసీసీ నియమించిన హాథ్‌సే హాథ్ జోడో అభియాన్ సమన్వయకర్త గిరీష్ జోడంకర్, రేవంత్‌రెడ్డిలు సమావేశమయ్యారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీ కేడర్‌ను ఉత్తేజితులను చేయాలని, జనవరి 26 నుంచి జరగనున్న పాదయాత్రలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. అదే విధంగా జిల్లాలు, నియోజకవర్గాల వారీగా స్థానిక ప్రజలెదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ఎక్కడికక్కడ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై చార్జిషీట్లు వేయాలని దిశానిర్దేశం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో ఈసారి అధికారం దక్కించుకునే దిశలో కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లలేని వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

మహారాష్ట్ర పీసీసీ చీఫ్‌గా.. మంత్రిగా..

తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా నియమితులైన మాణిక్‌రావు ఠాక్రే 2008 నుంచి 2015 వరకు మహారాష్ట్ర పీసీసీ అధ్యక్షుడిగా పని చేశారు. 1985 నుంచి 2004 మధ్య నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, 2009-18 మధ్య ఎమ్మెల్సీగా పని చేశారు. శరద్ పవార్, విలాస్ రావు దేశ్‌ముఖ్, సుశీల్ కుమార్ షిండేల మంత్రి వర్గాల్లో మూడుసార్లు వివిధ శాఖల మంత్రిగా సేవలందించారు. మంత్రిగా పరిపాలన అనుభవంతో పాటు ఎనిమిదేళ్లు పీసీసీ అధ్యక్షుడిగా పనిచేసిన నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం మాణిక్‌రావ్ ఠాక్రేను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది.

ధర్నాకు అనుమతించండి

కాంగ్రెస్ పిటిషన్‌పై సర్కార్‌కు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని సర్పంచ్‌ల సమస్యలపై కాంగ్రెస్ తలపెట్టిన ధర్నాకు అనుమతి వ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. కాంగ్రెస్‌కు కూడా కొన్ని ఆంక్షలు విధించింది. 300 మందికంటే ఎక్కువ మంది ధర్నాలో పాల్గొనకూడదని, కోవిడ్ నిబంధనలు ఉంటే పాటించాలని ఆదేశించింది. నిబంధనలు పాటించకుంటే పోలీసులు ఆ మేరకు చర్యలు తీసుకోవచ్చని స్పష్టం చేసింది. ధర్నా జరిపే రెండుమూడు రోజుల ముందే పోలీస్ కమిషనర్ నుంచి అనుమతి పొందాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 2న ఇందిరా పార్కు వద్ద గల ధర్నా చౌక్‌లో తాము నిరసన కార్యక్రమం చేపట్టా మని, దానికి అనుమతి ఇవ్వడానికి పోలీసులు నిరాకరించారని పేర్కొంటూ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్ రెడ్డి బుధవారం లంచ్‌మోషన్‌లో విచారణ చేపట్టారు. ధర్నా చౌక్‌లో కూడా ప్రభుత్వం ధర్నాలకు అనుమతి ఇవ్వకపోవడం సరికాదని పిటిషనర్ తరఫున న్యాయవాది పొన్నం అశోక్‌గౌడ్ నివేదించారు. 300 మందితో మాత్రమే కార్య క్రమం చేపడతామని, ఇతర నిబంధనలు పాటిస్తా మని చెప్పినా పోలీసులు అనుమతి నిరాకరించారని చెప్పారు. వేలాదిగా ప్రజలు తరలివస్తే ట్రాఫిక్ తోపాటు పిల్లలు, వృద్ధులకు ఇబ్బంది కలుగుతుందని అనుమతి ఇవ్వలేదని ప్రభుత్వం వాదనలు వినిపించింది. వాదనలు విన్న న్యాయమూర్తి.. 300 మందితో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్యక్రమం నిర్వహించుకోవడా నికి అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

3+3 సెక్యూరిటీ నుంచి 2+2కు...

- మాజీ ఎంపీ పొంగులేటికి భద్రత కుదింపు... ‘వై’ ప్లస్ కేటగిరీ నుంచి నార్మల్‌కు మార్పు
- బీఆర్‌ఎస్‌పై ఘాటు వ్యాఖ్యల పర్యవసానమేనని చర్చ



సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయం రోజురోజుకూ మలుపులు తిరుగుతూ సంచలనాలకు వేదిక అవుతోంది. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డికి భద్రత కుదిస్తూ నిర్ణయం వెలువడటం ఉమ్మడి జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం ఆయనకు 3+3గా ఉన్న సెక్యూరిటీని ప్రభుత్వం 2+2కు తగ్గించింది. అంతేకాకుండా ఎస్కార్ట్ వాహనాన్నీ తొలగించింది. ఈ విషయాన్ని పొంగులేటి క్యాంపు కార్యాలయ వర్గాలు కూడా ధ్రువీకరించాయి. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఆయన బీఆర్‌ఎస్‌పై చేసిన ఘాటు వ్యాఖ్యల పర్యవసానమేననే చర్చ జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో ఆయన కోవలోనే ఉన్న అధికార పార్టీ నేతలెవరికీ భద్రత తగ్గించకుండా ఆయనకు మాత్రమే కోత పెట్టడం చర్చనీయాంశమైంది.

పార్టీ వైపు వేలు చూపినందుకేనా?

సిట్టింగ్ ఎంపీగా ఉన్నా గత ఎన్నికల్లో టికెట్ దక్కనప్పటి నుంచి పొంగులేటి అనుచరవర్గం తీవ్ర అసంతృప్తితో ఉంది. ఉమ్మడి జిల్లాలో ఆయన ఎక్కడ పర్యటించినా అనుచరులు పార్టీ, రాజకీయ భవిష్యత్‌పై అసహనం వ్యక్తం చేస్తూ వచ్చారు. అయితే ఈ ఏడాది ఎన్నికలు ఉండటంతో పొంగులేటి బీఆర్ఎస్‌లోనే కొనసాగుతారా, లేదా ఎటువైపైనా పయనిస్తారా అన్న చర్చ సాగుతోంది. ఇంతలోనే నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం ఆయన ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. బీఆర్‌ఎస్‌లో ఉన్నా గత నాలుగున్నరేళ్లలో ఏం ఒరిగిందని, భవిష్యత్‌లో జరగాల్సిందేమిటో ఆలోచించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ వ్యాఖ్యలు దుమారం లేపగా, ఈ వ్యాఖ్యలు చేసిన నాలుగో రోజే ఆయన భద్రతను ప్రభుత్వం కుదించడం గమనార్హం. దీన్ని ఆయన అనుచరగణం కక్షసాధింపు చర్యగా అభివర్ణిస్తోంది.

2019 నుంచి కొనసాగిస్తూ..

2019లో పార్లమెంట్ ఎన్నికల్లో పొంగులేటికి టికెట్ దక్కకపోవడంతో అనుచర నేతలు, కేడర్‌కు టచ్‌లో ఉంటూ కార్యక్రమాల వేగం పెంచారు. ఉమ్మడి జిల్లా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి సరిహద్దున విస్తరించి ఉండటంతో ఈ ప్రాంతాల్లో కూడా ఆయన పలుమార్లు పర్యటించారు. దీంతో ప్రభుత్వం ఆయనకు 3+3 సెక్యూరిటీతోపాటు ఇంటి వద్ద గార్డ్, ముగ్గురు సిబ్బందితో కూడిన ఎస్కార్ట్ వాహనాన్ని ఏర్పాటు చేసింది. బుధవారం నుంచి సెక్యూరిటీని 2+2కు తగ్గించడంతోపాటు ఎస్కార్ట్ వాహనం, ఇంటి వద్ద గార్డ్‌ను కూడా తొలగించింది. తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో నిత్యం పర్యటించే ప్రముఖులకు ప్రభుత్వం ‘వై’ ప్లస్ కేటగిరీ భద్రత కల్పిస్తుంది. ఇందులో 3+3 సెక్యూరిటీ, ఎస్కార్ట్ వాహనంతోపాటు ఇంటి వద్ద గార్డ్‌ను కేటాయిస్తారు. ఇందులో భాగంగానే పొంగులేటికి ప్రభుత్వం వై ప్లస్ కేటగిరీ భద్రత కల్పిస్తోంది. ప్రస్తుతం 2+2కు కుదించడంతోపాటు ఎస్కార్ట్ వాహనాన్ని, గార్డ్‌ను తొలగించగా, ఆయనను నార్మల్ కేటగిరీ భద్రత కేటగిరీలో చేర్చినట్లయింది. ఉమ్మడి జిల్లాలో పొంగులేటికి మాత్రమే భద్రతను కుదించడం గమనార్హం. ఏ పదవి లేకుండా ఉమ్మడి జిల్లాలో ఉన్న ప్రముఖులకు భద్రత విషయంలో ఎలాంటి మార్పులు జరగకపోగా, పొంగులేటితో పోలిస్తే వీరు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పర్యటించేది తక్కువే కావడం గమనార్హం.

సీఎం గారూ మేలుకోండి

- ‘ధరణి’పై కేసీఆర్‌కు వైఎస్ షర్మిల బహిరంగ లేఖ
- రైతుల్ని ఎన్నో సమస్యలు వేధిస్తున్నాయని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ‘తెలంగాణలో భూ రికార్డుల ప్రక్షాళనతో పాటు డిజిటలైజేషన్ చేస్తామని తెచ్చిన ‘ధరణి’ పోర్టల్ రైతులకు, భూయజమానుల పాలిట శాపంగా మారింది. ఎన్నో సమస్యలు వారిని వేధిస్తున్నాయి. మీరు చేసిన తప్పులకు రైతులు, సామాన్యులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. అయినా మీరు స్పందించరా? ఇప్పటికైనా మేల్కొని సమస్యలు పరిష్కరించండి..’ అని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల.. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరారు. ఈ మేరకు ఆమె బుధవారం బహిరంగ లేఖ రాశారు. ‘‘ధరణిలో సమస్యలు పరిష్కారం కాక రైతులు ఎవుసం వదిలి కోర్టుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర వ్యాప్తంగా ధరణి వెబ్‌సైట్ బాధితుల సంఖ్య 22 లక్షలకు పైగానే ఉంది. తెలంగాణలోని ప్రతి గ్రామంలో కనీసం 200 వందలకు పైగా ధరణిపై ఫిర్యాదులు నమోదు అయినట్లు తెలుస్తోంది. మరోవైపు ‘కొండ నాలుకకి మందు వేయబోతే ఉన్న నాలుక ఊడినట్లు..’.. ధరణిలో రికార్డులను సవరించడం పక్కకు పెడితే.. ఉన్న భూరికార్డులు తారుమారయ్యాయి. మీ ధరణి వల్ల రైతాంగం దిక్కుతోచని స్థితిలోకి వెళ్లిపోయింది’ అని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంకెప్పుడు మేల్కొంటారు?

‘గతంలో భూ సమస్య ఎదురైతే తహసీల్దార్ కార్యాలయంలోనే పరిష్కారం దొరికేది. మీ ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత కలెక్టర్ దగ్గరకు వెళ్లినా పరిష్కారం దొరకడం లేదు. కలెక్టర్లు బాధపడుతూ.. మేము ఏమీ చేయలేం.. కోర్టుకు వెళ్లాలని సూచించడం మీ దిక్కుమాలిన పాలనకు అద్దం పడుతోంది. మరోవైపు ధరణిని అడ్డం పెట్టుకుని మీ పార్టీ నాయకులు చేస్తున్న కబ్జాలకు అంతు లేకుండా పోయింది. ఇంత జరుగుతున్నా.. ఇంకెప్పుడు మేలుకుంటారు?’ అని షర్మిల ఆ లేఖలో పేర్కొన్నారు.

7న రాష్ట్ర బీజేపీకి తొలి పరీక్ష!

ఎల్లుండి 119 నియోజకవర్గాల్లో ఒకేసారి అసెంబ్లీ సమ్మేళనాలు

- కనీసం 3, 4 వేల మందితో నిర్వహించాలన్న అధినాయకత్వం
- నియోజకవర్గాల స్థాయిల్లో పార్టీ వాస్తవ బలం బయటపడుతుందన్న అంచనాలు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర బీజేపీ తొలి పరీక్షకు సిద్ధమవుతోంది. ఈనెల 7న పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీనడ్డా వర్చువల్‌గా లేదా వీడియో రికార్డింగ్ ద్వారా 119 నియోజకవర్గాల పరిధిలో అసెంబ్లీ సమ్మేళనాలనుద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ సమ్మేళనాలను కనీసం 3, 4 వేల మందితో నిర్వహించి పార్టీ బలాన్ని చాటాలని నాయకత్వం ఆదేశించింది. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్ర కమిటీ సభ్యులు, ఏడు అనుబంధ మోర్చాల సభ్యులు, ఐటీసెల్ కమిటీలు, ఇలా నియోజకవర్గ స్థాయి అన్ని కమిటీలు పాల్గొనేలా చూడాలని సూచించింది. వీటిలో భాగంగా పార్టీ క్షేత్రస్థాయి సంస్థాగత బలాబలాలు, ఎన్నికల సన్నద్ధతపై స్పష్టత రానుంది. వీటి ద్వారా రాష్ట్ర పార్టీ ఎన్నికల కార్యాచరణ ప్రణాళిక అమలు ప్రారంభమవుతుందని పార్టీ ముఖ్యనేతలు అంచనా వేస్తున్నారు. ఏడాదిలోగానే అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలింగ్ బూత్ స్థాయిలో డిజిటలైజేషన్ సాంకేతికతను వినియోగించుకునే ప్రక్రియకు నాయకత్వం శ్రీకారం చుట్టనుంది. ప్రత్యర్థి పార్టీలకు అందనంతగా సాంకేతికతను ఉపయోగించుకుని ప్రజలకు చేరువ కావాలని నిర్ణయించింది. ఇందులోభాగంగా 7న తెలంగాణ ఎన్నికల తయారీ కోసమే ప్రత్యేకంగా సిద్ధం చేసిన ‘సరళ్’ (సంఘటన్ రిపోర్టింగ్ అండ్ అనాలిసిస్) మొబైల్ యాప్‌ను నడ్డా ప్రారంభించి బూత్ కమిటీలు, ఇతర క్షేత్రస్థాయి కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తారు. గ్రామస్థాయిలో కార్యక్రమాలు, పోలింగ్ బూత్‌స్థాయి విషయాలు, సంస్థాగత అంశాలపై ఎప్పటికప్పుడు యాప్ ద్వారా జాతీయపార్టీ ఆదేశాలివ్వనుంది.

7న ఏం చేస్తారు?

7న రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో పోలింగ్ కేంద్రస్థాయి అధ్యక్షులు, సభ్యులు (ఒక్కో కేంద్రం నుంచి 20 మంది), యువ, మహిళ, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, కిసాన్ మోర్చాలు, ఐటీసెల్ సభ్యులు, ఇతర కమిటీల నుంచి దాదాపు 3, 4 వేల మంది పాల్గొంటారు. హాజరైన కార్యకర్తలు మిస్డ్‌కాల్ ఇవ్వడం ద్వారా నమోదుతోపాటు సరళ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటారు. వారు తమ తమ పోలింగ్ కేంద్ర వివరాలను ఆ యాప్‌లో నమోదు చేస్తారని ఈ కార్యక్రమ సమన్వయకర్త, బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు నల్లు ఇంద్రసేనారెడ్డి తెలిపారు. రాబోయే రోజుల్లో జాతీయ పార్టీ మొదలు రాష్ట్ర, జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గస్థాయి వరకు సంస్థాగతంగా ఎలాంటి కార్యక్రమం చేపట్టినా ఆ ప్రాంతంలోని ప్రాథమిక సభ్యులు, బూత్ కమిటీ సభ్యులకు సమాచారాన్ని చేరవేసేందుకు ఈ వివరాలు ఉపయోగిస్తారని చెప్పారు. కేంద్రం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను, రాష్ట్ర సర్కార్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకపోవడం వంటి వాటిపై డిజిటల్ రూపంలో ఓటర్లను చేరుకోవాలని పార్టీ నిర్ణయించిందన్నారు. దీని ద్వారా విస్తృత పరిధిలో కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి ఎక్కువ మంది ప్రజలను చేరుకుని ఎన్నికల్లో విజయం సాధించాలని భావిస్తోందని చెప్పారు. అసెంబ్లీ స్థాయిల్లో ఇప్పటికే నియమించిన నాలుగంచెల విస్తారక్, ప్రభారీ, కన్వీనర్, పాలక్ వ్యవస్థల ద్వారా కూడా ఆయా అంశాలపై పర్యవేక్షణ సాగుతుందని తెలిపారు.

ఇంటి కుళాయికి బిరడా

- పశువుల కాపరికి మరో షాక్
- వివాదాస్పదం కావడంతో తొలగించిన అధికారులు

మంగపేట: రోడ్డువెంట మొక్కల్ని పశువులు ధ్వంసం చేస్తున్నాయంటూ పశువుల కాపరికి రూ.7,500 జరిమానా విధించిన అధికారులు.. తాజాగా సదరు కాపరి ఇంటి కుళాయికి బిరడా బిగించడం వివాదాస్పదమైంది. ములుగు జిల్లా మంగపేటలో అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలను పశువులు ధ్వంసం చేయడానికి కారకుడంటూ పశువుల కాపరి గంపోనిగూడెంకు చెందిన బోయిన యాకయ్యకు పంచాయతీ అధికారులు రూ.7500 జరిమానా విధించడం తెలిసిందే. తాజాగా యాకయ్య ఇంటి కుళాయి (నల్లా)ను సైతం పంచాయతీ అధికారులు సీజ్ చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. కలెక్టర్ కృష్ణ ఆదిత్య వాహనానికి పశువులు అడ్డం వచ్చాయి. ఎంత హారన్ కొట్టినా వాటిని పక్కకు అదిలించకుండా పశువుల కాపరి యాకయ్య ఫోన్ మాట్లాడుతుండడంతో కలెక్టర్ అసహనానికి గురయ్యారు. దీంతో తన గన్‌మెన్‌ను పంపి కాపరి ఫోన్‌ను లాక్కున్నట్టు స్థానికులు చెబుతున్నారు. దీనికి పశువులు మొక్కలను ధ్వంసం చేస్తున్నాయన్న సాకుతో జరిమానా విధించినట్లు చెబుతున్నారు. నల్లాకు బిరడా బిగింపుపై పశువుల కాపరి యాకయ్య మాట్లాడుతూ రూ.7,500 జరిమానాను మూడు నెలల్లో చెల్లించాలని చెప్పి ఫోన్ ఇచ్చారని తెలిపాడు. ఇంటికి వచ్చి చూడగా పంచాయతీ సిబ్బంది తన ఇంటి నల్లాకు బిరడా వేసి సీజ్ చేశారని పేర్కొన్నాడు. సాయంత్రం ఎంపీడీవో ఫోన్ చేసి నల్లా బిరడా తొలగించుకోమన్నారని, తనకు తెలియదని చెబి తే.. పంచాయతీ సిబ్బంది వచ్చి తొలగించి వెళ్లారని వివరించాడు. తనకు విధించిన జరిమానాపై పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేశాడు.



నల్లా పైప్‌కు వేసిన బిరడా

నిర్లక్ష్యానికే జరిమానా: ఎంపీడీవో

మండలంలోని ఏటూరునాగారం-బూర్గంపాడు ప్రధాన రోడ్డుకిరువైపులా నాటిన అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలను పశువులు ధ్వంసం చేస్తున్నా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసినందుకే పశువుల కాపరికి పంచాయతీరాజ్ చట్టం ప్రకారం జరిమానా విధించామని ఎంపీడీవో శ్రీధర్ ఓ వీడియోలో వివరణ ఇచ్చారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. దీనిపై వివరణ కోరేందుకు ఎంపీడీవోకు ఫోన్ చేయగా స్విచాఫ్ అని వస్తోంది.

క్లుప్తంగా...

కోర్టుల్లో 1,904 పోస్టుల భర్తీ

నోటిఫికేషన్లు జారీ చేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా ఏర్పాటైన వాటితో కలిపి పలు కోర్టుల్లో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల భర్తీకి హైకోర్టు ఆరు వేర్వేరు నోటిఫికేషన్లు జారీ చేసింది. ఎగ్జామినర్, ఫీల్డ్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్, ప్రాసెస్ సర్వర్, ఆఫీస్ సబార్డినేట్ విభాగాల్లో మొత్తం 1,904 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. ఈ పోస్టులకు ఈ నెల 11 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానుండగా.. ఈ నెల 31తో ముగియనుంది. ఫిబ్రవరి 15 నుంచి హాల్‌టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని హైకోర్టు రిజిస్ట్రార్ తెలిపారు. వివరాలకు వెబ్‌సైట్ http://tshc.gov.inను సందర్శించవచ్చు.

నిమ్స్‌లో 132 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ

డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌కు అనుమతిస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: నిజాం వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్)లో 132 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి అనుమతి లభించింది. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పద్ధతిలో శాఖాపరమైన ఎంపిక కమిటీ (డీఎస్సీ) ద్వారా ఈ పోస్టులను భర్తీ చేసుకునేందుకు అనుమతినిస్తూ ఆర్థిక శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కేడర్ వారీగా ఖాళీల వివరాలు, రోస్టర్ పాయింట్లు, ఉద్యోగ అర్హతలు తదితర వివరాలను సంబంధిత కార్యదర్శి ద్వారా తీసుకుని భర్తీ చేయాలని డీఎస్సీకి సూచిస్తూ ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ పోస్టుల విషయంలో గతంలో ఉన్న ఉత్తర్వులన్నీ రద్దు చేస్తున్నట్టు కూడా వెల్లడించారు.

కాంగ్రెస్, బీజేపీల్లో చేరొద్దు

విద్వేష రాజకీయాల వైపు వెళ్లి ఖమ్మంను కలుషితం చేయకండి: తమ్మినేని వీరభద్రం




సాక్షి ప్రతినిధి, ఖమ్మం: తాత్కాలిక ప్రయోజనాలు ఆశించి ఖమ్మం జిల్లా సంస్కృతి, విలువలను కలుషితం చేసే నిర్ణయాలు తీసుకోవద్దని, విద్వేష భావాలు పెంచే రాజకీయాల వైపు వెళ్లవద్దని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పార్టీ నేతలకు సూచించారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా హడావుడి చేసిన వారం దరూ తనకు మిత్రులేనని, వారంతా బీజేపీ, కాంగ్రెస్‌లోకి వెళ్తున్నట్లు మీడియాలో వార్తలు రావడం దురదృష్టకరమన్నారు. ముస్లింలు ఎక్కువ ఉన్న తెలంగాణలో బీజేపీ ఎదిగితే సమాజంలో మతఘర్షణలు ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. శాటిలైట్ ఆధారంగా చేస్తున్న పోడు భూముల సర్వే చట్టవిరుద్ధంగా ఉందని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు పాల్గొన్నారు.

రెండు భాషల్లో జేఎల్ పరీక్షలకు వినతి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించనున్న లెక్చరర్ ఉద్యోగాల భర్తీకి తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో పరీక్షలను నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కోరారు. ఈమేరకు బుధవారం టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రాంచంద్రన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అఖిల భారత సర్వీసుల పరీ క్షలు కూడా అభ్యర్థులు తమకు నచ్చిన భాషను ఎంపిక చేసుకుని రాసే వెసులుబాటు ఉందన్నారు. జూనియర్ లెక్చరర్ల నోటిఫికేషన్‌లో మొదటి పేపర్ జనరల్ స్టడీస్ రెండు భాషల్లో, ఆప్షనల్ పేపర్ ఆంగ్ల మాధ్యమానికే పరిమితం చేశారని తెలిపారు. దీంతో గ్రామీణ నిరుద్యోగ అభ్యర్థులకు తీవ్రం నష్టం కలుగుతుందని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో గతంలో పరీక్షలను తెలుగులో కూడా నిర్వహించారని గుర్తు చేశారు.

అభిషేక్ బెయిల్‌పై విచారణ వాయిదా




సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంలో అరెస్టయిన అభిషేక్ బోయినపల్లి, విజయ్‌నాయర్‌ల బెయిల్ పిటిషన్లపై ప్రత్యేక కోర్టు విచారణ వాయిదా వేసింది. బెయిల్ కోరుతూ వేర్వేరుగా వీరిద్దరూ దాఖలు చేసిన పిటిషన్లను బుధవారం రౌజ్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంకే నాగ్‌పాల్ విచారించారు. నిందితుల తరపు న్యాయ వాదులు వాదనలు వినిపిస్తూ ఈడీ అభియోగాలు నమ్మశక్యంగా లేవన్నారు. సోదాల్లో ఎక్కడా సొమ్ములు లభించినట్లు ఆధారాలు చూపలేకపోయారన్నారు. ఫోన్లు మార్చడానికి పలు కారణాలు ఉన్నాయని, అది వ్యక్తిగతమని ధర్మాసనానికి వివరించారు. వాదనల అనంతరం అభిషేక్ బోయినపల్లి పిటిషన్‌పై విచారణ ఈనెల 12కు, విజయ్‌నాయర్ బెయిల్ పిటిషన్‌పై విచారణ ఈనెల 13కు వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి పేర్కొన్నారు. అభిషేక్, విజయ్‌నాయర్‌లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జైలు నుంచి విచారణకు హాజరయ్యారు.

చాక్‌పీస్ కొన్నా జీఎస్టీ బిల్లు!

ప్రభుత్వ స్కూళ్లలో పీఎఫ్‌ఎంఎస్ విధానం

చిన్నాచితకా ఖర్చులకూ జీఎస్టీ బిల్లులు తప్పనిసరి

- అలాగైతేనే ఆడిట్ లెక్కలోకి తీసుకునే పరిస్థితి
- సర్కార్ తీరు బాగోలేదంటూ ప్రధానోపాధ్యాయుల నిరసన
- ఇచ్చే కాసిన్ని నిధులకూ సవాలక్ష పేచీలేమిటని ఆగ్రహం
- దుర్వినియోగాన్ని అరికట్టేందుకే అంటున్న అధికారులు



విద్యార్థుల సంఖ్యను బట్టి నిర్వహణ నిధుల తీరు (రూ.లలో)

విద్యార్థుల సంఖ్య	నిధులు
1-30	10,000
31-100	25,000
101-250	50,000
251-1000	75,000
1000 దాటితే	1,00,000

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ బడుల నిర్వహణ నిధుల వినియోగంలో కొత్త నిబంధనలు ప్రధానోపాధ్యాయుల్లో ఆందోళన రేపుతున్నాయి. ఇటీవల అమల్లోకి తెచ్చిన 'పబ్లిక్ ఫండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (పీఎఫ్‌ఎంఎస్)' ప్రకారం ప్రతి చిన్న ఖర్చుకు కూడా పక్కాగా జీఎస్టీ బిల్లు ఉండాలనడం, అలా ఉంటేనే ఆడిట్ విభాగం ఆమోదిస్తుందని ఉన్నతాధికారులు స్పష్టం చేయడం, ఇకపై నిధులను పాఠశాల ఖాతాలో కాకుండా నోడల్ బ్యాంకు ఖాతాలో వేయనుండటం వంటివి ఇబ్బందికరమని ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు. పాఠశాలల నిర్వహణకు ఇచ్చే నిధులే అరకొర అని, అదీ ప్రభుత్వాలకు ఎప్పుడో బుద్ధి పుట్టినప్పుడు విడుదల చేస్తున్నారని.. దీనికీ సవాలక్ష నిబంధనలు పెడితే బడుల నిర్వహణకు ఇబ్బంది అవుతుందని అంటున్నారు. టీ తెప్పించినా దానికి జీఎస్టీ బిల్లు కావాలంటే ఎలాగని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు నిధులు దుర్వినియోగం కాకుండా ఉండేందుకే ఇలాంటి విధానం తీసుకొచ్చామని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

సరిగా అందని నిర్వహణ నిధులు

రాష్ట్రవ్యాప్తంగా 24,852 ప్రభుత్వ పాఠశాలలు, 467 మండల రిసోర్స్ కేంద్రాలు (ఎంఆర్సీలు) ఉన్నాయి. ప్రతీ స్కూల్ నిర్వహణ కోసం విద్యార్థుల సంఖ్యను బట్టి ఏటా రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు సమగ్ర శిక్షా అభియాన్ నిధులు అందుతాయి. బడులకు కావాల్సిన దస్తర్లు, చాక్‌పీస్‌లు, ఊడ్చే చీపుర్లు, రిజిస్టర్లు, టీచర్ల డైరీలు, శానిటైజర్ వంటి సామగ్రి, జాతీయ పర్వదినాల్లో స్వీట్లు, జెండాలు, అలంకరణ సామగ్రి, బిస్కెట్లు, టీలు వంటి వాటికి వినియోగిస్తారు. వీటికోసం ఏడాదికి ఎంత ఖర్చు అవుతుందనేది విద్యాశాఖ అంచనా వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతుంది. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే జూన్‌లోనే ప్రభుత్వం ఈమేరకు నిధులు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ కొన్నేళ్లుగా బడుల నిర్వహణ నిధుల విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతోంది. కరోనా కాలంలో 2020–21లో సగం నిధులు కూడా ఇవ్వలేదు. 2021–22లో ముందుగా సగం నిధులిచ్చారు. ఆర్థిక సంవత్సరం ముగిసే రోజైన మార్చి 31న మిగతా నిధులిచ్చారు. ఈ ఏడాది మాత్రం మొత్తం నిధులు (రూ.74.16 కోట్లు) విద్యా సంవత్సరం మధ్యలో ఇటీవలే విడుదల చేశారు. స్కూళ్లు తెరిచి ఇప్పటికే ఆరు నెలలు కావడంతో ఆయా బడుల ప్రధానోపాధ్యాయులే సొంత జేబు నుంచి నిర్వహణ ఖర్చులు పెట్టుకున్నారు. ప్రభుత్వం నిధులు ఇచ్చాక తీసుకుందామనుకున్నారు. అయితే ఈసారి నిధులు సకాలంలోనే వచ్చినా 'పీఎఫ్‌ఎంఎస్' విధానం కారణంగా ఇబ్బంది వస్తోందని ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు. వచ్చిన నిధులను వాడుకోవడం కష్టంగా ఉందని, ఇప్పటికే ఖర్చు చేసిన డబ్బులను వెనక్కి తీసుకోవడం సమస్యగా మారిందని అంటున్నారు.

అన్ని ఖర్చులకు జీఎస్టీ బిల్లు ఎలా?

సమగ్ర శిక్షా అభియాన్ నుంచి విడుదలయ్యే నిధులు సంబంధిత నోడల్ బ్యాంకులో జమవుతాయి. బడిలో చేసే ఖర్చుల వివరాలను, వాటికి సంబంధించిన జీఎస్టీ బిల్లులను హెచ్‌ఎంలు ముందుగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. ప్రింట్ పేమెంట్ అడ్వైజ్ (పీపీఏ) ద్వారా స్కూల్ హెచ్‌ఎం నోడల్ బ్యాంకుకు వెళ్లి డబ్బులు డ్రా చేసుకోవాలి. గత ఆరు నెలల్లో చేసిన ఖర్చుల వివరాలను కూడా ఇదే విధానంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీనిపై హెచ్‌ఎంలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. బడిలో టీలు తెప్పించినా, దస్తర్లు కొన్నా, స్కావెంజర్‌కు శౌచాలయ పనుల కోసం డబ్బులిచ్చినా జీఎస్టీ బిల్లులు ఎలా సమర్పిస్తామని ప్రశ్నిస్తున్నారు. అయితే హెచ్‌ఎంలు చూపించే రూ.5 వేల వరకు ఖర్చుకు నోడల్ బ్యాంకు జీఎస్టీ బిల్లులను అడిగే ప్రశ్నే లేదని అధికారులు అంటున్నారు. ఇది నిజమే అయితే ఆడిట్ విభాగం నుంచి స్పష్టతేదీ ఇవ్వలేదని, కొత్త విధానంలో అన్ని ఖర్చులకు జీఎస్టీ బిల్లు తప్పనిసరని చెబుతున్నారని ప్రధానోపాధ్యాయులు చెప్తున్నారు. హెచ్‌ఎం పరిధిలో ఉండే రూ.5 వేలపై అధికారం ఇచ్చినా, మిగతా ఖర్చు ఆడిట్‌లో సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తలనొప్పిగా మారిన ఈ విధానాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నారు.

తక్షణమే ఈ విధానం మార్చాలి

స్కూల్ ఫండ్స్‌లో ప్రతీ పైసాకు జీఎస్టీ బిల్లు సాధ్యం కాదు. ఇది హెచ్‌ఎంల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే చర్య. ఎప్పుడో వచ్చే నిధుల కోసం హెచ్‌ఎంలను ఇబ్బందిలోకి నెట్టడం సరికాదు. దీన్ని తక్షణమే మార్పు చేయాలి.

– చావా రవి, యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఆడిట్ నుంచి క్లారిటీ ఇవ్వాలి

రూ.5 వేల వరకూ హెచ్‌ఎంలు ఇచ్చే లెక్కను ఆమోదిస్తున్నారు. ఆడిట్ వాళ్లే సమస్యలు సృష్టించే వీలుంది. ఖర్చు రూ.5 వేలు దాటితేనే జీఎస్టీ ఉంటుందనే భరోసా ఆడిట్ విభాగం నుంచి వస్తే బాగుంటుంది.

– రాజా భానుచంద్ర ప్రకాశ్, ప్రభుత్వ హెచ్‌ఎంల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

కానిస్టేబుల్‌ను కాల్చిచంపించి.. వారిని ఎన్‌కౌంటర్ చేసేలా..

డిపార్ట్‌మెంట్‌లో మెప్పు కోసం ఓ పోలీస్ పక్కా స్కెచ్

- ములుగు కేంద్రంగా సాయుధ దళం ఏర్పాటుకు ప్రణాళిక
- వారితో యాక్షన్లు చేయించి.. తర్వాత ఎన్‌కౌంటర్ చేయాలని కుట్ర
- అమలుకు ముందే భగ్నం చేసిన హైదరాబాద్ పోలీస్ నిఘా విభాగం

సాక్షి ప్రతినిధి, వరంగల్: మావోయిస్టురహిత రాష్ట్రంగా మార్చేందుకు పోలీస్ శాఖ చర్యలు చేపడుతుండగా.. అదేశాఖలో పనిచేసే ఓ అధికారి మావోయిస్టుల తరహాలో దళాన్ని ఏర్పాటు చేసేందుకు పన్నిన కుట్ర వెలుగులోకి వచ్చింది. తాడ్వాయి అడవుల్లో ట్రయల్ కూడా నిర్వహించినట్లు సమాచారం. సదరు వ్యక్తులు అనుకున్నది అనుకున్నట్లుగా జరిగితే.. వరంగల్‌లో ఓ హెడ్‌కానిస్టేబుల్‌ను కాల్చి చంపించి మావోయిస్టులు ఉన్నారనే భ్రమ కల్పించాలని పక్కా స్కెచ్ వేసినట్లు సమాచారం. ఈ కుట్ర వెనుక ములుగు జిల్లాలో పనిచేసే ఓ ఏఆర్ ఎస్‌ఐ కీలక పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది. పకడ్బందీగా జరిగిన ఈ కుట్రకోణాన్ని పసిగట్టిన హైదరాబాద్‌లోని పోలీస్ నిఘావిభాగం.. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఆధారాలతో కూడిన కొన్ని వివరాలు సేకరించినట్లు సమాచారం. ఈ మేరకు ములుగు పోలీస్ అధికారుల సహకారంతో రంగంలోకి దిగిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ బృందం.. సదరు ఏఆర్ ఎస్‌ఐతో పాటు మరో ఇద్దరిని రెండు రోజుల కిందట అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

ఒక్క దెబ్బకు రెండు పిట్టలు!:

ఈ విచారణలో సాయుధ దళం ఏర్పాటుతోపాటు వరంగల్‌లో హెడ్‌కానిస్టేబుల్ హత్యకు సంబంధించిన వివరాలను సేకరించి.. సదరు హెడ్‌కానిస్టేబుల్‌ను సైతం అప్రమత్తం చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇదిలాఉండగా ఈ కుట్రకోణం వెనుక భారీ ప్రణాళిక దాగి ఉందన్న ప్రచారం కూడా జరుగుతోంది. సాయుధ దళం ఏర్పాటు చేసి.. ఆ సభ్యులతో యాక్షన్లు చేయించి.. తిరిగి వారిని ఎన్‌కౌంటర్ పేరిట హతమార్చి పోలీస్‌శాఖలోనూ పేరు తెచ్చుకోవాలన్న మరో కోణం దాగి ఉన్నట్లు కూడా ప్రచారంలో ఉంది. వరంగల్‌లో హెడ్‌కానిస్టేబుల్‌ను కాల్చి చంపే యాక్షన్‌టీమ్ తనను కలిసేందుకు ములుగు ప్రాంతానికి వచ్చే క్రమంలో ఎన్‌కౌంటర్ చేయాలన్న కుట్ర పన్నినట్లు సమాచారం. ఒక్క దెబ్బకు రెండు పిట్టలన్నట్లు.. ఇటు హెడ్‌కానిస్టేబుల్‌ను కాల్చి చంపి మావోయిస్టులు ఉన్నట్లు భ్రమలు కల్పించడంతోపాటు మరోవైపు ఎన్‌కౌంటర్ చేసి పోలీసు అధికారులు మెప్పు పొందవచ్చని భావించి ఈ కుట్రకు తెర లేపినట్లు సమాచారం. ముందే ఈ వివరాలన్నీ సేకరించి విచారిస్తున్న ప్రత్యేక నిఘా విభాగం.. వీటన్నింటిపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

ఎన్జీటీ ఆదేశాలపై సుప్రీంకు

- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం
- పర్యావరణ అనుమతులు లేకుండా ప్రాజెక్టులు చేపట్టినందుకు..
- రూ.920 కోట్ల జరిమానా విధించిన ఎన్జీటీ
- వారంలో సుప్రీంలో ఎస్‌ఎల్పీ వేయనున్న తెలంగాణ
- న్యాయ నిపుణులతో నీటిపారుదల శాఖ చర్చలు



సాక్షి, హైదరాబాద్: పర్యావరణ అనుమతులు లేకుండా పాలమూరు–రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాల నిర్మాణాన్ని చేపట్టినందుకు రూ. 920.85 కోట్ల భారీ జరిమానాను విధిస్తూ జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టులో సవాలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వారం రోజుల్లో సుప్రీం కోర్టు స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయనున్నట్టు రాష్ట్ర నీటిపారుదల శాఖ వర్గాలు తెలిపాయి. పాలమూరు–రంగారెడ్డి, డిండి ప్రాజెక్టులకు సంబంధించి వేర్వేరు పిటిషన్లు వేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఆ రెండు ఎత్తిపోతల పథకాల తొలి దశ పనులను కేవలం తాగునీటి అవసరాల కోసమే చేపట్టినందున పర్యావరణ అనుమతుల నుంచి మినహాయింపు ఉందని తెలంగాణ వాదిస్తోంది. పర్యావరణ అనుమతులు వచ్చిన తర్వాతే రెండో దశ కింద సాగునీటి అవసరాలకు సంబంధించిన పనులు చేపడతామని పేర్కొంటోంది. ఈ విషయంలో తెలంగాణ వాదనలను పరిగణనలోకి తీసుకోకుండా ఎన్జీటీ ఏకపక్ష నిర్ణయం తీసుకుందంటూ సుప్రీం కోర్టులో వాదనలు వినిపించాలని నిర్ణయించింది. ఎన్జీటీ తీర్పు విషయంలో అవలంబించాల్సిన భవిష్యత్తు కార్యాచరణపై నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్ ఇటీవల న్యాయనిపుణులతో సమావేశమై చర్చించారు. ఎన్జీటీ తీర్పును సమగ్రంగా అధ్యయనం చేసిన తర్వాత వచ్చే వారం సుప్రీం కోర్టులో ఎస్‌ఎల్పీ దాఖలు చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.528 కోట్లు, డిండి ప్రాజెక్టుకు రూ. 92.85 కోట్లను పర్యావరణ పరిహారంగా చెల్లించడంతో పాటు పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుపై విధించిన స్టేను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించి పనులు కొనసాగించినందుకు మరో రూ.300 కోట్ల జరిమానాను విధిస్తూ ఎన్జీటీ గత నెలలో ఆదేశాలు జారీ చేసింది. ఏపీ ప్రభుత్వంతో పాటు ఆ రాష్ట్రంలోని మరో 9 మంది ప్రైవేటు వ్యక్తులు వేసిన కేసు విషయంలో ఈ నిర్ణయం తీసుకుంది.

'స్పోర్ట్స్ కోటాను అనుమతించండి'

సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌లో పాల్గొనే అభ్యర్థులకు స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్‌ను వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, కాళోజీ నారాయణరావు ఆరోగ్య వర్సిటీని హైకోర్టు ఆదేశించింది. ఎంబీబీఎస్, బీడీఎస్ కౌన్సెలింగ్‌లో స్పోర్ట్స్ కోటా రద్దు చేస్తూ తీసుకొచ్చిన జీవోను కొట్టివేసింది. బీడీఎస్ కౌన్సెలింగ్‌కు కూడా కోటా వర్తింపజేయాలంది. స్పోర్ట్స్ కోటా కింద కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ రెండు వారాల్లోగా ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించాలని పిటిషనర్‌కు సూచించింది. ప్రభుత్వ జీవోను సవాల్ చేస్తూ లక్ష్మీరెడ్డి ఈ పిటిషన్ వేశారు.

సీబీఐకి బదిలీ చేయొద్దు

'ఎమ్మెల్యేలకు ఎర' కేసులో రాష్ట్ర ప్రభుత్వం అప్పీలు

- సీఎం కేసీఆర్ ప్రెస్‌మీట్ నాటికే కేసు వివరాలు బయటికొచ్చాయి
- ఆయన కొత్తగా వివరించినదేమీ లేదు
- సిట్ విషయంగా సింగిల్ జడ్జి పొరపడ్డారు
- ఆ ఉత్తర్వులను రద్దు చేసి.. సిట్ దర్యాప్తు కొనసాగించేలా ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి
- నేడు విచారించనున్న హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం!



సాక్షి, హైదరాబాద్: 'ఎమ్మెల్యేలకు ఎర' కేసును సీబీఐకి అప్పగిస్తూ హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును కొట్టివేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ద్విసభ్య ధర్మాసనం ముందు అప్పీలు చేసింది. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి రాష్ట్ర ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని నిందితులు కుట్రపన్నారని అందులో వివరించింది. సీఎం కేసీఆర్ మీడియా సమావేశం ఏర్పాటు చేసే నాటికే కేసుకు సంబంధించిన పలు వివరాలు బహిర్గతం అయ్యాయని, ఆయన కొత్తగా వివరించింది ఏమీ లేదని పేర్కొంది. సీఎం వివరాలు వెల్లడించే సమయానికి సిట్ ఏర్పాటుకాలేదని, కేసు మెటీరియల్ చేరవేసే అవకాశమే లేదని, సింగిల్ జడ్జి ఈ విషయంలో పొరపడ్డారని తెలిపింది. ఒక రాజకీయ నేతగా తన ప్రభుత్వాన్ని అస్థిరపర్చే కుట్ర జరిగిందని తెలిసినప్పుడు మీడియాకు వివరాలు వెల్లడించడం తప్పు ఎలా అవుతుందని సింగిల్ జడ్జి ఒప్పుకున్నారని వివరించింది. అందువల్ల సిట్ దర్యాప్తును కొనసాగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరింది. దీనిపై గురువారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టే అవకాశం ఉంది.

కీలక అంశాలను పరిశీలించలేదు..

ప్రభుత్వం తన అప్పీలులో మరిన్ని అంశాలను వివరించింది. ''హైకోర్టులో బీజేపీ పిటిషన్ దాఖలు చేసే నాటికి సీఎం ప్రెస్‌మీట్ నిర్వహించలేదు. సిట్ ఏర్పాటు కాలేదు. మొయినాబాద్ పోలీసులు కేసునమోదు చేసిన కొన్ని గంటల్లోనే దర్యాప్తు నిష్పక్షపాతంగా లేదంటూ బీజేపీ పిటిషన్ దాఖలు చేయడం ఆమోదయోగ్యం కాదు. నిజానికి ఈ కేసులో నిందితులపై పోలీసులు ఎఫ్ఐఆర్ దాఖలు చేయడాన్ని సింగిల్ జడ్జి ప్రశంసించారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగంగా పోలీసుల చర్య స్వాగతించదగినదని వ్యాఖ్యానించారు. అయితే గతంలో పీవీ నరసింహారావు కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సింగిల్ జడ్జి పరిగణనలోకి తీసుకోలేదు. ప్రభుత్వాన్ని అస్థిరపర్చే కుట్ర జరిగిందనడానికి, ఎమ్మెల్యేలకు కోట్ల రూపాయలు ఎర వేసేందుకు ప్రయత్నించారనడానికి అన్ని వీడియో, ఆడియో ఆధారాలు ఉన్నాయి. రిట్ పిటిషన్ పరిధిలో లేని అంశంలోకి సింగిల్ జడ్జి వెళ్లారు. సిట్ దర్యాప్తును అడ్డుకోవడానికి బలమైన కారణాలేమీ లేకపోయినా.. నిందితుల హక్కుల పరిరక్షణ కోసమంటూ సిట్‌ను రద్దు చేసి, కేసు దర్యాప్తును సీబీఐకి బదిలీ చేయడం సరికాదు'' అని పేర్కొంది.

అడుగడుగునా అడ్డుకునే యత్నం..

తొలుత సిట్ దర్యాప్తుపై సింగిల్ జడ్జి స్టే విధించగా.. ద్విసభ్య ధర్మాసనం దర్యాప్తు కొనసాగించాలని ఆదేశించిందని, సుప్రీంకోర్టుకు కూడా సిట్ దర్యాప్తును అడ్డుకోలేదని ప్రభుత్వం అప్పీలులో వివరించింది. దర్యాప్తును హైకోర్టు సింగిల్ జడ్జి పర్యవేక్షించాలన్న ద్విసభ్య ధర్మాసనం ఉత్తర్వులను కూడా సుప్రీంకోర్టు రద్దు చేసిందని.. సిట్ స్వతంత్రంగా దర్యాప్తు చేయవచ్చని సూచించిందని గుర్తు చేసింది. ఇలా సిట్ దర్యాప్తును అడుగడుగునా అడ్డుకునేందుకు నిందితులు ప్రయత్నించిన విషయాన్ని సింగిల్ జడ్జి గమనంలోకి తీసుకోలేదని పేర్కొంది. అంతేగాకుండా తమపై నమోదైన కేసును ఏ సంస్థ దర్యాప్తు చేయాలో నిందితులే కోరుకోవడం చట్ట విరుద్ధమని.. ఈ విషయంలో సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను సింగిల్ జడ్జి పరిశీలించలేని వివరించింది. నిందితులు దాఖలు చేసిన పిటిషన్‌లో సీఎంను ప్రతివాదిగా చేయలేదన్న అంశాన్ని సింగిల్ జడ్జి విస్మరించారని.. కేసు దర్యాప్తు కొనసాగుతుండగా ఇలాంటి ఉత్తర్వులివ్వడం ద్వారా సాక్షులు ప్రభావితం అవుతారని, పోలీసుల నిబద్ధతను తప్పుబట్టినట్టు అవుతుందని పేర్కొంది. ఈ అంశాలన్నీ పరిగణనలోకి తీసుకుని సింగిల్ జడ్జి తీర్పును రద్దు చేయాలని.. సిట్ దర్యాప్తు కొనసాగించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరింది.



కొత్తగా ప్రారంభించిన బస్సులో ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎండీ సజ్జనార్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు

ప్రయాణికుల ఆదరణతో ప్రగతిరథం పరుగులు

- ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వెల్లడి
- స్లీపర్, స్లీపర్ కమ్ సీట్ బస్సులు ప్రారంభం

భాగ్యనగర్‌కాలనీ (హైదరాబాద్): ప్రయాణికుల ఆదరణతో టీఎస్‌ఆర్టీసీ అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని, ఆర్థికంగా పటిష్టంగా తయారవుతోందని సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ చెప్పారు. ప్రయాణికుల వల్లే ప్రగతిరథ చక్రం పరుగులు పెడుతోందని, 2022లో ప్రయాణిక దేవుళ్లు టీఎస్‌ఆర్టీసీని ఎంతగానో ఆదరించి, ప్రోత్సహించారని పేర్కొన్నారు. బుధవారం కూకట్‌పల్లి సర్కిల్ భాగ్యనగర్ కాలనీలోని బస్‌స్టాప్‌లో కొత్త స్లీపర్, స్లీపర్ కమ్ సీట్ బస్సులను ఎండీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొన్నారు. అనంతరం సజ్జనార్ మాట్లాడారు. గత 15 రోజుల క్రితం సూపర్ డీలక్స్ బస్సులను ప్రారంభించామని, ఈ నెలాఖరులో కొత్త ఏసీ బస్సులను కూడా ప్రారంభించనున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో హైదరాబాద్ నగరంలో ఎలక్ట్రిక్ బస్సులను కూడా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. స్లీపర్ బస్సులు హైదరాబాద్–విజయవాడ, కాకినాడ మధ్య రాకపోకలు సాగిస్తాయని తెలిపారు.

సీఎం సహకారంతో ఆర్టీసీ అభివృద్ధి: బాజిరెడ్డి

ప్రయాణికుల సౌకర్యార్థం నూతన బస్సులను ప్రారంభించామని బాజిరెడ్డి గోవర్ధన్ చెప్పారు. ముఖ్యమంత్రి సహకారంతో ఆర్టీసీని అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. త్వరలో ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. సంస్థలోని 50 వేల మంది ఉద్యోగుల కృషి వల్లే రోజు రోజుకూ రెవెన్యూ మెరుగుపడుతోందని చెప్పారు.

'ఎక్సెల్ రబ్బర్'పై ఐటీ దాడులు

- హైదరాబాద్‌లోని 8 ప్రాంతాలతోపాటు దేశవ్యాప్తంగా సోదాలు
- హార్డ్ డిస్క్‌లు, పలు డాక్యుమెంట్ల సీజ్



హైదరాబాద్‌లోని ఎక్సెల్ కార్యాలయం

సాక్షి, హైదరాబాద్: ఎక్సెల్ రబ్బర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌పై బుధవారం ఆదాయపన్ను శాఖ (ఐటీ) దాడులు నిర్వహించింది. హైదరాబాద్‌లోని మాదాపూర్, సంగారెడ్డి జిల్లా బొల్లారం సహా ఎనిమిది ప్రాంతాల్లో, చెన్నై, బెంగళూర్, ఏపీ సహా దేశవ్యాప్తంగా మొత్తం 20 ప్రాంతాల్లో సోదాలు జరిగాయి. హైదరాబాద్‌లో బుధవారం తెల్లవారుజాము నుంచి సుమారు 12 బృందాలు సోదాల్లో పాల్గొన్నాయి. సీఆర్‌పీఎఫ్ పోలీసుల బందోబస్తు మధ్య అధికారులు తనిఖీలు నిర్వహించారు. గచ్చిబౌలిలోని ఎక్సెల్ బ్రాంచ్ ఆఫీస్, కోకాపేట్‌లో ఆరుగురు డైరెక్టర్లు, సీఈఓల ఇళ్లలో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా బాచుపల్లి, పాశమైలారంలోని ఎక్సెల్ రబ్బర్ యూనిట్ 5, విలాస్ పాలిమర్స్ ప్రైవేట్, ఎస్ టైర్స్ లిమిటెడ్ కంపెనీల్లో సోదాలు చేశారు. సెర్చ్ వారెంట్‌తో సోదాల్లో పాల్గొన్న అధికారులు రబ్బర్ ఇంపోర్ట్స్ అండ్ ఎక్స్‌పోర్ట్‌కు సంబంధించిన డాక్యుమెంట్లను పరిశీలించారు. ఈ కంపెనీలోకి బ్రిటన్ నుంచి రూ.500 కోట్ల పెట్టుబడులు రావడం, దానికి సంబంధించిన పన్నుల వివరాలను పొందుపర్చకపోవడం వంటి ఆరోపణలు ఈ సంస్థపై ఉన్నట్లు సమాచారం. టాక్స్ చెల్లింపులోనూ భారీగా అవకతవకలు జరిగినట్లు గుర్తించినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే గత ఐదేళ్లకు సంబంధించిన ఆదాయ వ్యయాలు, ఐటీ చెల్లింపులకు సంబంధించిన డాక్యుమెంట్స్‌ను ఐటీ అధికారులు పరిశీలించారు. ఎక్సెల్ దాని అనుబంధ సంస్థలపై విలాస్ పాలిమార్స్‌సహా మరో రెండు కంపెనీలకు చెందిన హార్డ్ డిస్క్‌లు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన డాక్యుమెంట్లను సీజ్ చేసినట్లు తెలిసింది. సోదాలు గురువారం కూడా జరిగే అవకాశాలు ఉన్నాయి. ఐతే ఈ సోదాలకు సంబంధించిన వివరాలను ఐటీశాఖ అధికారులు వెల్లడించాల్సి ఉంది.

'13 జిల్లాల స్పౌజ్ కేసులు పరిష్కరించాలి'

సాక్షి, హైదరాబాద్: 317 జీవో కారణంగా తలెత్తిన 13 జిల్లాల స్పౌజ్ కేసులను వెంటనే పరిష్కరించాలని పీఆర్టీయూటీఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు సీఎస్ సోమేశ్‌కుమార్‌ను కోరారు. ఉపాధ్యాయులకు యాజమాన్యాల వారీగా కొత్త జిల్లాల సీనియారిటీ ప్రాతిపదికన పదోన్నతులు, బదిలీలు కల్పించాలని కోరారు. పరస్పర బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మరో అవకాశం ఇవ్వాలని సీఎస్ దృష్టికి తెచ్చారు. దీనిపై సీఎస్ సానుకూలంగా స్పందించినట్లు యూనియన్ నేతలు తెలిపారు.

ఈ-కుబేర్‌తో ఉద్యోగ, ఉపాధ్యాయుల పాట్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వేలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ వేతనాల నుంచి పొదుపు చేసుకున్న మొత్తాన్ని అవసరాలకు వాడుకోలేకపోతున్నారని టీపీసీసీ ప్రతినిధి, ఉపాధ్యాయ సంఘం మాజీ నేత గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ-కుబేర్ వల్ల ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ట్రెజరీ, అకౌంట్స్ విభాగం రాష్ట్ర డైరెక్టర్ శ్రీరామచంద్రమూర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కుబేర్ ద్వారా మంజూరు కావలసిన దాదాపు రెండు లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు.

ఫార్ములా- ఈ రేస్ టికెట్ల అమ్మకాలు షురూ

- రూ.1000 నుంచి రూ.10 వేల వరకు
- బుక్ మై షో ద్వారా విక్రయాలు

సాక్షి, హైదరాబాద్: మోటారు స్పోర్ట్ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఏబీబీ ఎఫ్ఐఏ ఫార్ములా- ఈ వరల్డ్ చాంపియన్‌షిప్ రేస్ టికెట్ల అమ్మకాలు బుధవారం ప్రారంభమయ్యాయి. హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్ఎండీఏ కమిషనర్ అర్వింద్‌కుమార్ తొలి టికెట్ కొనుగోలు చేసి అమ్మకాలను లాంఛనంగా ప్రారంభించారు. నెక్లెస్‌రోడ్డులోని 2.8 కిలోమీటర్ల స్ట్రీట్ సర్క్యూట్‌లో ఫిబ్రవరి 11న ఈ పోటీలను ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు ఎలక్ట్రిక్ రేస్ కార్‌లలో 8 సీజన్స్ పూర్తయ్యాయని, 9వ సీజన్‌లో 4వ లెవల్ పోటీలకు హైదరాబాద్ వేదికగా నిలిచిందని చెప్పారు. ప్రపంచంలో అత్యుత్తమ నగరంగా గుర్తింపును పొందిన హైదరాబాద్ నగరం ఈ- మొబిలిటీకి గ్లోబల్ డెస్టినేషన్‌గా మారనుందన్నారు.

మొత్తం 22,500 టికెట్‌లు..

- ఫార్ములా- ఈ రేస్ కోసం ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేయనున్నారు. 25వేలకు పైగా సీట్ల సామర్థ్యంతో వీటిని ఏర్పాటు చేస్తారు. వీటిలో 22,500 సీట్లకు మాత్రమే టికెట్‌లను విక్రయించనున్నారు.
- బుక్ మై షో, ఏస్ నెక్స్ట్‌జెన్.కామ్ ద్వారా టికెట్‌లను బుక్ చేసుకోవచ్చు. నాలుగు కేటగిరీల్లో టికెట్‌లు లభిస్తాయి. రూ.1000 విలువైనవి సుమారు 5000 సీట్లు ఉన్నాయి. ఇవి కాకుండా మిగతావి రూ.3500, రూ.6000, రూ.10వేల చొప్పున విక్రయించనున్నారు.

సందర్శకులకు అనుమతి....

- ఫిబ్రవరి 11న ఉదయం 10.40 గంటలకు క్వాలిఫైయింగ్ రేస్ నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటల వరకు పోటీలు కొనసాగుతాయి. పోటీలకు ముందు రోజు ఫిబ్రవరి 10న సాధారణ సందర్శకులను, స్కూల్ పిల్లలను సైతం అనుమతిస్తారు. ఫార్ములా- ఈ పోటీల దృష్ట్యా ఫిబ్రవరి 6నుంచి 11 వరకు నగరంలో ఈ- మొబిలిటీ అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నారు.
- నెక్లెస్‌రోడ్డు మార్గంలో ఫిబ్రవరి 8వ తేదీ సాయంత్రం నుంచి 11వరకు వాహనాల రాకపోకలను నిలిపివేస్తారు. ఆ మార్గంలో వెళ్లే వాహనాలను ఇతర మార్గాల్లోకి మళ్లిస్తారు.



జనం ఆకలితో ఉన్నప్పుడు అధిక ధరలు వస్తాయని ధాన్యాన్ని నిల్వ చేసి ఉంచుతుంది.
– జరాతుష్ట్ర

సాక్షి

గురువారం, జనవరి, 5

ఆమెను చంపింది ఎవరు?

కొన్ని ఘటనలు ఉలిక్కిపడేలా చేస్తాయి. విస్మరిస్తున్న వాస్తవాలను కటువుగా కళ్ళెదుట నిలిపి, జవాబివ్వమని ప్రశ్నిస్తాయి. కొత్త సంవత్సరాన్ని స్వాగతిస్తున్న క్షణాలలో ఢిల్లీలో జరిగిన దారుణ ఘటన అలాంటిదే. న్యూ ఇయర్ పార్టీ నుంచి స్కూటీ మీద ఇంటికి తిరిగి వెళుతున్న అంజలి అనే 20 ఏళ్ళ చిరుద్యోగిని ఎదురుగా కారులో అయిదుగురు యువకులు ఢీ కొట్టి, సుల్తాన్‌పురి నుంచి కంఝూవాలా వరకు 12 కి.మీ పైగా అలాగే రోడ్డుపై కారుతో ఈడ్చుకెళ్ళి ప్రాణం తీసిన ఘటన ఘోరం. బాధితురాలిపై అత్యాచారం జరగలేదని తేల్చినా, తలకూ, వెన్నుకూ బలంగా దెబ్బలు తగిలాయనీ, పక్కటెముకలు బయటకొచ్చాయనీ, మెదడు మిస్సయిందనీ చెబుతుంటే ఒళ్ళు జలదరిస్తుంది

కారు ముందు భాగంలో ఎడమవైపు చక్రం కింద ఇరుక్కొని, రక్షించమని కేకలు పెడుతున్నా పట్టించుకోని వాహనదారుల మదోన్మత్తత వల్ల ఒంటి నిండా 40కి పైగా గాయాలతో బాధితురాలు ప్రాణాలు కోల్పోవడం కలచివేస్తుంది. కాపాడమని ఆమె అరుస్తున్నా, ప్రత్యక్షసాక్షి ఒకరు కారును వెంబడిస్తూ పదే పదే ఫోన్ చేసినా పట్టించుకోని గస్తీ పోలీసుల లోపం కోపం తెప్పిస్తుంది. ఇది అరుదైన ప్రమాదం కాదు, అమానవీయ హత్య అనిపిస్తుంది. మంచు కమ్మేసిన శీతకాలంలో... దారి కనిపించని చిమ్మచీకటిలో... ఢిల్లీలో వెలగని వీధి దీపాలు, లోపభూయిష్ఠ పాలనా వ్యవస్థ, అలక్ష్యం చూపిన పోలీసులు, ఒంటరి స్త్రీని చూస్తే చెలరేగే వంకర బుద్ధులు – ఇలా అందరూ కలసి చేసిన హత్య ఇది. దీంతో, అమృతోత్సవ భారతంలోనూ బయట ఎంత సురక్షితమనే ప్రశ్న ఉదయిస్తుంది.

కేంద్ర హోమ్‌శాఖ ఈ ఘటనను తీవ్రంగా పరిగణించి, నివేదిక కోరడంతో ఢిల్లీ పోలీసులు అప్రమత్తం కాక తప్పలేదు. హంతక వాహనం తమ ముందు నుంచే పోతున్నా పట్టించుకోని పోలీస్ గస్తీ వ్యాన్ సహా అనేక లోపాలు జరిగాయని ఒప్పుకోక తప్పలేదు. మృతురాలితో కలసి ఆ రాత్రి స్కూటీపై ప్రయాణించి, ప్రమాదం జరిగాక ఎవరికీ ఏమీ చెప్పకుండా పోయిన రెండో యువతి నిధి మాటలు, చేష్టలు అనుమానాస్పదమే. కారు కింద యువతి ఉందని తెలీక బండి నడిపామంటున్న నిందితుల మాటలూ నమ్మశక్యం కానివి. వారు అక్కడక్కడే అనేక యూ టర్న్‌లు తీసుకుంటూ బండి నడిపిన విధానం కారు కింది బాధితురాలి శరీరాన్ని వదిలించుకోవాలని చేసిన ప్రయత్నమే. అందరి దృష్టితో ఇప్పుడిప్పుడే వేగవంతమవుతున్న దర్యాప్తులో పోనుపోనూ మరిన్ని బయటపడవచ్చు.

నేరం జరగకుండా నిరోధించాలి, ఒకవేళ జరిగితే త్వరితగతిన సాక్ష్యాధారాలు సేకరించాలి. ఈ రెంటిలోనూ ఢిల్లీ పోలీసులు విఫలమయ్యారు. ఓ ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలో పనిచేస్తూ, తండ్రి లేని కుటుంబానికి తానే ఆధారమైన అమ్మాయి ప్రాణాలు కోల్పోయిన ఈ కంఝూవాలా ఘటన అనేక చేదు నిజాలు చెబుతోంది. ఘటనవేళ ప్రత్యక్షసాక్షి పదే పదే ఫోన్ చేసినా, పోలీస్ స్పందన అమితాలస్యమైంది. ప్రమాదం జరిగినా కారును వేగంగా ముందుకూ వెనకకూ దూకిస్తూ, కిలోమీటర్ల దూరం పోనిచ్చిన యువకుల తీరు చట్టమంటే భయం లేనితనానికి ప్రతీక. అలాగే, పోలీసులకూ, పౌరవ్యవస్థలకూ మధ్య సమన్వయమూ కొరవడింది. 'పోలీస్ కంట్రోల్ రూమ్' వ్యాన్ తమ దోవలో ఎదురుపడ్డా హంతక వాహనాన్ని ఆపకపోవడం మరీ దారుణం. పోలీస్ స్పందనలో పెరగాల్సిన వేగం సహా ఇది అనేక పాఠాలు నేర్పుతోంది.

అయితే, ఈ ఘటన పాలకులు చేపట్టాల్సిన చర్యలకు బదులు ఢిల్లీని పాలిస్తున్న ఆప్, దేశాన్ని పాలిస్తున్న బీజేపీల మధ్య ఆరోపణల పర్వానికి దారితీసింది. అరెస్టయిన నిందితుల్లో ఒకరు బీజేపీ సభ్యుడు కావడం అగ్నికి ఆజ్యం పోసింది. రాజకీయాలు పక్కనపెడితే, ఢిల్లీ లాంటి చోట కొన్నేళ్ళ క్రితం దాకా కేంద్రీయ పోలీసు స్పందనా వ్యవస్థ ఉండేది. ఎక్కడ నుంచి సహాయం కోరుతూ ఏ కాల్ వచ్చినా యంత్రాంగం అప్రమత్తమై, దగ్గరలోని సిబ్బందిని హుటాహుటిన పంపే వీలుండేది. ఆ వ్యవస్థను మార్చేయడం పెద్ద పొరపాటు. ఆ కేంద్రీయ వ్యవస్థను వెంటనే పునరుద్ధరించాలి. మహిళా పోలీస్ స్టేషన్లతో పాటు మహిళా గస్తీ సిబ్బంది అవసరం. దాని వల్ల సామాన్య మహిళలకు భరోసా పెరుగుతుంది. 24 గంటల పోలీస్ పోస్ట్‌ల సమర్థ నిర్వహణ, గస్తీ, ఎలక్ట్రానిక్ నిఘా చట్టాన్ని అతిక్రమించాలనుకొనేవారికి బెదురు పుట్టిస్తాయి.

దేశంలో రోజూ 415 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని లెక్క. పైగా, 2021లో రోడ్డు ప్రమాద మరణాల్లో సగం మంది ద్విచక్ర వాహనదారులే. ఈ పరిస్థితుల్లో ఆఫీసు పని ముగిసి, రాత్రి పొద్దుపోయి ఇంటికి వచ్చేవారి భద్రత ఎలా? ఇక, క్రికెటర్ రిషబ్ పంత్ ప్రాణాలతో బయటపడ్డ ఘోర రోడ్డు ప్రమాదఘటన లాంటివి రహదారి భద్రతపై దృష్టి పెంచాలని గుర్తు చేస్తున్నాయి. ఒకపక్క అధిక వేగం, తప్పుడు లేన్లలో డ్రైవింగ్, సిగ్నల్స్ ఉల్లంఘన, రోడ్డుపైనే పార్కింగ్, అధిక శబ్దంతో హారన్ కొట్టడం లాంటి అనేక తప్పులు, మరోపక్క మత్తులో అమాయకుల ప్రాణం తీస్తున్న తాజా కంఝూవాలా ఘటన లాంటివి జరుగుతుంటే గుడ్లప్పగించి చూస్తే ఎలా? ఒకరు చేసే తప్పుకు వేరెవరికో శిక్ష పడే ఈ రహదారి ఘటనల్లో దోషులు భయపడేలా కఠిన శిక్షలు విధించాలి. అమెరికా లాగా లెక్క దాటి తప్పులు చేస్తే డ్రైవింగ్‌లైసెన్స్ రద్దు లాంటివి మన దగ్గరా ప్రవేశపెట్టాలి. 'నిర్భయ' అత్యాచార – హత్యోదంతం జరిగి పదేళ్ళయినా, పాలకులు చట్టాలు చేయడమే తప్ప ప్రాథమిక చర్యలు విస్మరిస్తున్నారు. ఇలాగైతే... అర్ధరాత్రి సైతం స్త్రీ స్వేచ్ఛగా సంచరించగలిగిననాడే దేశానికి స్వాతంత్ర్యం వచ్చినట్టు అన్న గాంధీ మాటల్లో మనకు స్వాతంత్ర్యం ఎప్పటికి వచ్చేటట్టు?

ఆధారాలు లేకుండానే అనుమతులా?

విశ్లేషణ



దేవీందర్ శర్మ

జన్యుమార్పిడి పంటలపై ఎప్పుడు చర్చ మొదలైనా, సాక్ష్యాల ఆధారంగా ముందుకెళ్లాలని కొందరు శాస్త్రవేత్తలు చెబుతూంటారు. తద్వారా శాస్త్రీయ సమాచారం, ప్రజా విచారణలన్నీ పక్కకు తొలగిపోయేలా చేస్తూంటారు. నిజానికి శాస్త్రపరమైన విచారణను పరిమితం చేయడం మార్కెట్ పోకడల్లో ఒకటి. జీఎం (జన్యు మార్పిడి) ఆవాల విషయంలో జరుగుతున్నది స్పష్టంగా అదే. ఇటీవలే డీఎంహెచ్–11 జన్యుమార్పిడి ఆవాలకు పర్యావరణ అనుమతులు కూడా ఇచ్చేశారు. చిత్రంగా, దేశ వంటనూనె దిగుమతులను ఈ సరికొత్త ఆవాల ద్వారా తగ్గించుకోవచ్చు అన్న భావనను కలిగిస్తున్నారు. అయితే దీని దిగుబడి చాలా తక్కువ అన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుంటే జరుగుతున్న ప్రచారం ఎంత తప్పుడు భావనో అర్థమైపోతుంది.

ప్రశ్నలు వేయడం, వాటికి సమాధానాలు కనుక్కోవడంతోనే సైన్స్ ప్రస్థానం మొదలవుతుందని మా సైన్స్ టీచర్ చెబుతూండేది. ఇంకోలా చెప్పాలంటే... సైన్స్ ఎల్లప్పుడూ ప్రశ్నలకు సిద్ధంగా ఉంటుందీ అనాలి! దీనివల్ల సాంఘిక, ఆర్థిక ఆందోళనలకు తావిచ్చే, పర్యావరణ విధ్వంసానికి దారితీసే అపోహలను తొలగించుకోవచ్చు. అందుబాటులో ఉన్న సాక్ష్యాలపై వ్యాఖ్యానం చేయవచ్చు. అయితే ఆర్థిక ప్రయోజనాల కారణంగా సత్యాన్వేషణ తాలూకూ గొంతుకలను నొక్కివేసే ప్రయత్నం జరుగుతోంది. ఈ క్రమంలో ప్రదర్శించే సాక్ష్యాలు కూడా నమ్మదగ్గవిగా ఉండవు. విషయం ఏమిటంటే... జన్యుమార్పిడి పంటలపై ఎప్పుడు చర్చ మొదలైనా, సాక్ష్యాల ఆధారంగా ముందుకెళ్లాలని కొందరు శాస్త్రవేత్తలు చెబుతూంటారు. తద్వారా శాస్త్రీయ సమాచారం, వాదం, ప్రజా విచారణలన్నీ పక్కకు తొలగిపోయేలా చేస్తూంటారు.

దేశంలోకి మొట్టమొదటి జన్యుమార్పిడి పంట బీటీ కాటన్‌ను 2001లో వాణిజ్యస్థాయిలో విడుదల చేశారు. అప్పట్లో జరిగిన జెనెటిక్ ఇంజినీరింగ్ అప్రైజల్ కమిటీ (జీఈఏసీ) సమావేశాల్లో పాల్గొన్న వారిలో నేనూ ఉన్నాను. జన్యుమార్పిడి పంటల ప్రవేశంపై తుది నిర్ణయం తీసుకునే ఈ జీఈఏసీ సభ్యులతోపాటు, 'జెనిటిక్ మ్యానిపులేషన్ అండ్ ద మానిటరింగ్ కమిటీ'కి సంబంధించిన పర్యవేక్షణ బృందం కూడా ఈ సమావేశంలో పాల్గొంది. బీటీ పత్తి విత్తనాన్ని అభివృద్ధి చేసిన మహికో – మోన్‌శాంటో సభ్యులు, కొంతమంది పౌర సమాజపు ప్రతినిధులు కూడా అందులో ఉన్నారు. రెండు నెలలు ఆలస్యంగా నాటినా ఆ ఏడాది పత్తి పంట దిగుబడి యాభై శాతం ఎక్కువైనట్లు దేశంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన సమాచారం చెబుతోందని సమావేశంలో ప్రస్తావించారు. బీటీ కాటన్ కారణంగానే ఇలా జరిగిందనడంతో ఆశ్చర్యం వేసింది నాకు.

ఆ సమాచారం తప్పనీ, అశాస్త్రీయమైందనీ, దాన్ని ఏదైనా పరిశోధన సంస్థతో నిర్ధారించాలనీ నేను పర్యవేక్షణ కమిటీ ఛైర్మన్, అప్పటి ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసీఏఆర్) డిప్యూటీ డైరెక్టర్‌ను కోరాను. సాధారణ పరిస్థితుల్లో ఎదిగేందుకు ఐదు నెలల సమయం తీసుకునే పంటలో రెండు నెలలు ఆలస్యంగా విత్తినా అధిక దిగుబడి సాధించడం దాదాపు అసాధ్యం. వ్యవసాయ పరిశోధనల్లో విత్తనాలు వేసే సమయం చాలా ముఖ్యమైన అంశమన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అలాంటి అంశంలో ఒక ప్రైవేట్ కంపెనీకి మినహాయింపు ఇస్తే, భవిష్యత్తులో యూనివర్సిటీ శాస్త్రవేత్తలను కూడా విత్తిన సమయం గురించి పట్టించుకోవద్దని చెప్పే అవకాశం ఏర్పడుతుంది. జీఈఏసీ ఛైర్మన్‌కు నేను వేసిన ప్రశ్న ఏమిటంటే– రెండు నెలలు ఆలస్యంగా విత్తినా దిగుబడి పెరగడమంటే... అది రైతులకు చాలా ప్రయోజనకరమైంది కాబట్టి, రైతులందరూ రెండు నెలలు ఆలస్యంగా విత్తుకోవాలని ఎందుకు సలహా ఇవ్వకూడదూ? అని!



ప్రతీకాత్మక చిత్రం

ఈ సమావేశం పూర్తయిన తరువాత సాయంకాలం ఐసీఏఆర్ ఉన్నతాధికారి ఒకరు నాతో మాట్లాడుతూ, బీటీ విత్తనాల ట్రయల్స్ ఇంకో ఏడాది చేయాల్సిందిగా మహికో–మోన్‌శాంటో కంపెనీని కోరినట్లు తెలిపారు. అవసరమైనంత మేర అన్ని పరీక్షలు పూర్తి చేసినట్లు మోన్‌శాంటో చెప్పినా జన్యుమార్పిడి పంటల అనుమతిని ఒక ఏడాది ఆలస్యం చేయగలిగామన్నమాట. ఆ సమావేశంలో ప్రశ్నలేవీ వేయకుండా 'సాక్ష్యాల' ఆధారంగా అనుమతులిచ్చి ఉంటే ఏడాది ముందుగానే జన్యుమార్పిడి పంటలు దేశంలోకి వచ్చేసి ఉండేవి.

బీటీ వంకాయపై నిషేధం

దేశంలోకి బీటీ వంకాయ అనుమతిని నిరాకరిస్తూ 2010లో అప్పటి పర్యావరణ శాఖ మంత్రి జైరామ్ రమేశ్ ఒక ప్రకటన చేశారు. 'డెసిషన్ ఆన్ కమర్షియలైజేషన్ ఆఫ్ బీటీ బ్రింజాల్(బీటీ వంకాయ వాణిజ్యీకరణ మీద నిర్ణయం)' పేరుతో అప్పట్లో 19 పేజీల డాక్యుమెంట్ ఒకటి విడుదలైంది. దీనిపై శాస్త్రవేత్తలు ఎన్ని మాటలు చెప్పినా నా అంచనా ప్రకారం ప్రతి వృక్ష శాస్త్రవేత్తా కచ్చితంగా చదవాల్సిన డాక్యుమెంట్ అది. దేశ విదేశాల్లోని శాస్త్రవేత్తలతో, ఏడు దఫాలుగా ప్రజలతో సంప్రదింపుల తరువాత జైరామ్ రమేశ్ ఆ డాక్యుమెంట్‌ను విడుదల చేశారు. జన్యుమార్పిడీ టెక్నాలజీపై రైతులు, ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకు దేశం మొత్తమ్మీద వంకాయ పండించే ప్రాంతాల్లో సంప్రదింపులు జరపడం ఇదే తొలిసారి.

జాగరూకత, ముందస్తు జాగ్రత్త, సిద్ధాంతాల ఆధారంగా జైరామ్ రమేశ్ ఒక నిర్ణయం తీసుకుంటూ... ఏ కొత్త టెక్నాలజీ అయినా ఆయా సముదాయాల సామాజిక, సాంస్కృతిక విలువలకు ప్రాధాన్యమివ్వాలని స్పష్టం చేశారు.

మీడియాలో ఒక వర్గం జన్యుమార్పిడి పంటలపై బహిరంగ విచారణను తోసిపుచ్చింది. అంతా బూటకం అని కొట్టి పారేసింది కూడా. అయితే ప్రజలు లేవనెత్తిన కీలకమైన అభ్యంతరాలను మంత్రి గుర్తించి తగు నిర్ణయం తీసుకోవడం మాత్రం నాకు ఆనందం కలిగించింది. అంతేకాదు... జన్యుమార్పిడి విత్తన సంస్థల అధ్యయనాల నియమాలు, సమాచారాన్ని విశ్లేషించిన తీరు, ఫలితాలన్నింటినీ ప్రస్తావిస్తూ డాక్యుమెంట్‌ను రూపొందించడమూ ప్రశంసనీయమైన అంశం.

జాగరూకతతోనే ముందుకు

వాస్తవ పరిస్థితులకూ, కొందరు సేకరించే సాక్ష్యాలకూ మధ్య ఉన్న అంతరం సైన్స్ ఆధారిత పద్ధతుల అవసరాన్ని మరోసారి నొక్కి చెబుతోంది. శాస్త్రపరమైన విచారణను పరిమితం చేయడం మార్కెట్ పోకడల్లో ఒకటి. వ్యాపార ప్రయోజనాలను కాపాడేందుకు మార్కెట్లు సైన్స్‌ను తొక్కేసేందుకూ ప్రయత్నిస్తూంటాయి. జీఎం ఆవాల విషయంలో జరుగుతున్నదీ అదే. జీఈఏసీ ఇటీవలే దీనికి పర్యావరణ అనుమతులు ఇచ్చేసింది. ఈ డీఎంహెచ్–11 జన్యుమార్పిడి ఆవాల పంట దిగుబడి సామర్థ్యం ఎంతన్నది ఐసీఏఆర్‌కూ తెలియక ముందే పర్యావరణ అనుమతులు రావడం గమనార్హం. దేశ వంటనూనె దిగుమతులను ఈ సరికొత్త ఆవాల ద్వారా తగ్గించుకోవచ్చు అన్న భావనను కలిగిస్తున్నారు. అయితే దీని దిగుబడి చాలా తక్కువ అన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుంటే అదెంత తప్పుడు భావనో అర్థమైపోతుంది.

ఆసక్తికరమైన అంశం ఏమిటంటే, సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన సమాచారం ప్రకారం... జీఎం ఆవాల పరీక్షలకు అన్ని ప్రోటోకాల్స్‌ను ఢిల్లీ యూనివర్సిటీ స్వయంగా సిద్ధం చేసింది. విద్యార్థినే ప్రశ్నాపత్రం తయారు చేయమని అడగటం లాంటిది ఇది. అంతేకాదు... హెర్బిసైడ్ల(గడ్డిమందుల)ను తట్టుకునే ఆవాల వెరైటీ బీటీ వంకాయ మాదిరిగా కనీస పరీక్షలను కూడా ఎదుర్కోలేదు. జీఎం ఆవాల పరీక్షల్లో ఆరోగ్య నిపుణులు ఎవరూ లేకపోవడం, తేనెటీగలపై జీఎం ఆవాల ప్రభావం ఏమిటన్నది పరిశీలించకపోవడం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్న లోపాలు. ఇన్ని లోపాల మధ్య జీఈఏసీ విత్తనాల వృద్ధికి ఎలా అనుమతిచ్చిందో అర్థం కావడం లేదు.

సైన్స్ అంటే సత్యాన్ని వెతకడం. ఇటాలియన్–బ్రిటిష్ ప్రొఫెసర్ మైకెలా మాసిమీ 2017లో లండన్ రాయల్ సొసైటీ అవార్డు అందుకుంటున్న సందర్భంగా చేసిన ప్రసంగంలో అచ్చంగా ఈ వ్యాఖ్యే చేశారు. ''ప్రజలకు సైన్స్ విలువను అర్థమయ్యేలా చేయడం మన బాధ్యత అని నేను నమ్ముతున్నాను. కచ్చితత్వం, సాక్ష్యాలు, సిద్ధాంతాలపై విశ్వాసం, కచ్చితమైన పద్ధతులను అవలంబించడం వంటి వాటిని కూడా నిశితంగా పరిశీలించాలి''!

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ రంగ నిపుణులు
ఈ–మెయిల్: hunger55@gmail.com

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

వదులుకుంటేనే ఆరోగ్యం



చక్కెర అనేది ఒక డ్రగ్. వ్యసనానికి గురిచేసే పదార్థం. కొకెయిన్, హెరాయిన్ మెదడులోని ఏ ప్రాంతాలను ఉత్తేజితం చేస్తాయో అలాగే పనిచేస్తుంది. అందుకే దాన్ని విడిచిపెట్టలేం. కానీ నేనేం చెప్తానంటే, మీరు ఎంత త్వరగా దాన్ని వదిలిపెడితే అంత త్వరగా మీ రోగనిరోధక వ్యవస్థ బలోపేతం అవుతుంది. మీ వయసు గడియారం వెనక్కి తిరుగుతుంది.

– ఫ్రాంక్ లిప్‌మాన్, ఫంక్షనల్ మెడిసిన్ డాక్టర్

మోసం గురో!



ఒక ఆడి లేదా బీఎండబ్ల్యూ కారు నడపడం యూఎస్‌లో సాధారణం. మీరు ఉన్నత మధ్యతరగతి వాళ్లయితే చాలు, వాటిని కొనగలరు. కానీ ఇండియాలో వాటిని కొనాలంటే మీరు అత్యంత ధనికులై ఉండాలి; పైగా ఆ పిచ్చి ట్రాఫిక్‌లో నడపను కూడా లేరు. ఇండియా దాటిపోయిన తర్వాతే మిమ్మల్ని ప్రభుత్వం ఎలా మభ్యపెట్టిందో గుర్తించగలరు.

– దీపక్ సింగ్, వ్యాఖ్యాత

ఏం చేస్తున్నట్టు?



సహజ సంపదలకు నెలవైన బలూచిస్తాన్ (పాకిస్తాన్)లో దుఃఖకరమైన వాస్తవం ఇది. బంగారం, రాగి, చమురు, విలువైన రాళ్ళు, బొగ్గు లాంటి ఒక ట్రిలియన్ డాలర్లకు పైగా విలువైన సహజ సంపదను అక్కడ కనుక్కున్నారు. అయినా ఆసుపత్రులు లేవు, వైద్యులు లేరు, రోడ్లు లేవు. రోగులను మోసుకెళ్లాల్సి వస్తోంది.

– ఫజీలా బలూచ్, యాక్టివిస్ట్

వాడకం ఆగదు



ఒక టీ–షర్ట్ జీవిత కథ: కొత్తగా ఉన్నప్పుడు – పార్టీలకు. పాతబడితే– ఇంట్లో వేసుకుంటాం. దానికో రంధ్రం పడితే – రాత్రిళ్లు వేసుకుంటాం. రాత్రుళ్లు కూడా వేసుకోదగ్గట్టుగా లేకపోతే – క్లీనింగ్‌కు ఉపయోగిస్తాం.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

చేతిలో జుట్టు



ఈ దేశీయ మగవాళ్లకు మహిళల జుట్టు పొడవును కూడా నియంత్రించాలన్న పట్టుదల ఏమిటో!

– జెహ్రా జబీన్ షా, కవయిత్రి

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

టెన్త్‌కే ఇంత కష్టమా?

కోవిడ్ అనంతరం పూర్తి అకడమిక్ క్యాలెండర్ ప్రకారం పాఠశాలలు ప్రారంభమైన సంవత్సరం ఇదే. అందువల్ల కావచ్చు ఎస్సెస్సీ బోర్డు పదవ తరగతి పరీక్షా విధానంలో మార్పులు తెస్తూ కొత్త విధానాన్ని ప్రకటించింది. వారం రోజుల క్రితం టెన్త్ పరీక్షల టైమ్ టేబుల్‌ను విడుదల చేస్తూ ఎస్సెస్సీ బోర్డు మోడల్ పేపర్లను ఆన్‌లైన్‌లో ఉంచింది. అయితే కోవిడ్ కాలంలో అనుసరించిన విధంగానే 11 పేపర్లకు బదులు ఆరు పేపర్లతో పరీక్ష విధానాన్ని ప్రకటించడం ఆహ్వానించదగిన పరిణామమే. కానీ పరీక్షా విధానమే ఇటు ఉపాధ్యాయ లోకాన్నీ, అటు విద్యార్థి లోకాన్నీ విస్మయానికి గురి చేసింది. భాషా పేపర్లోనూ, భాషేతర పేపర్లలోనూ ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులు సైతం ఈ విధానాన్ని చూసి ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు కోవిడ్ కారణంగా కనీస సామర్థ్యాలు లేకుండానే 8వ, 9వ తరగతి పూర్తి చేసి పదో తరగతికి వచ్చినవారు. అటువంటి వారికి ఏమాత్రం కొరుకుడు పడనంత కష్టంగా ఒక పబ్లిక్ సర్వీస్ కమిషన్... ఉద్యోగార్థులకు నిర్వహించే పరీక్షా పేపర్‌లా 10వ తరగతి మోడల్ పరీక్షా పేపర్లు ఉన్నాయి. విద్యార్థులు రెండున్నర గంటల్లో మొత్తం ఒకటి, రెండూ, మూడు సెక్షన్‌లు కలిపి పద్దెనిమిది ప్రశ్నలకు సమాధానాలు రాయాల్సి వస్తున్నది. అంటే గ్రూప్ వన్ స్థాయి పరీక్షలో వలే పది, పదిహేను నిమిషాలకు ఒక ప్రశ్న రాస్తూ సమయంతో పోటీపడి సమాధానాలు పూర్తి చేయాల్సి ఉంటుంది.

ఇక పార్ట్–బి ఆబ్జెక్టివ్ టైప్ విషయానికి వస్తే రెండు పేపర్లు ఒకే పేపర్‌గా మారడం వల్ల పార్ట్–బి మార్కులు పెరిగాయి. పాఠ్యపుస్తకాలలోని పేరాగ్రాఫ్ ఇచ్చి ప్రశ్నలు అడుగుతున్న విధానంలో సమాధానాల ఆప్షన్స్ అన్నీ సరియైన విధంగానే ఉంటూ ఎలిమినేట్ మెథడ్‌లో తొలగిస్తే కానీ జవాబును గుర్తించలేని విధంగా ప్రశ్నలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఆన్‌లైన్ విద్య ఏ మేరకు అందిందో అందరికీ తెలిసిందే. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని తక్షణమే కఠినతరమైన పదవ తరగతి పరీక్ష విధానాన్ని మార్చాలి. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు న్యాయం చేయాలి.

– జుర్రు నారాయణ యాదవ్, తెలంగాణ టీచర్స్ యూనియన్, జిల్లా అధ్యక్షులు, మహబూబ్‌నగర్ । 94940 19270

పిల్లకాకిపై ఉండేలు దెబ్బ!

అభిప్రాయం



డాక్టర్ ఏరుకొండ నరసింహుడు

గత కొంతకాలంగా తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ; రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణా మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) వివాదాస్పద నిర్ణయాలు తీసుకుంటూ అటు విద్యార్థులనూ, ఇటు ఉపాధ్యాయులనూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అటువంటి వివాదాస్పద ఉత్తర్వుల జాబితాలో తాజాగా 2022 డిసెంబర్ 28న పదవ తరగతి పరీక్షల నిర్వహణపై ఇచ్చిన జీఓఎమ్ఎస్ నం. 33 ఒకటి. వాస్తవానికి ఈ ఉత్తర్వు విద్యా సంవత్సరం ప్రారంభంలో ఇవ్వాల్సి ఉండగా సమ్మేటివ్ అసెస్‌మెంట్–1 పరీక్షలు 11 పేపర్లుగా రాసిన అనంతరం చాలా ఆలస్యంగా డిసెంబర్‌లో మేలుకోవడమే విద్యా శాఖ అలసత్వానికి నిదర్శనం.

కోవిడ్‌కు ముందు 10వ తరగతి విద్యార్థులకు 11 పేపర్లతో పరీక్షలు నిర్వహించేవారు. హిందీ మినహా మిగిలిన అన్ని సబ్జెక్టులను రెండు పేపర్లుగా విభజించి పరీక్షలు నిర్వహించేవారు. గత రెండు, మూడు ఏళ్లుగా కోవిడ్ మహమ్మారి కారణంగా భౌతికంగా తరగతులు సరిగా జరుగకపోవడం వల్ల, విద్యార్థులు ఆన్‌లైన్ తరగతులు సరిగా వినకపోవడం వల్ల విద్యార్థుల్లో తగ్గిన అభ్యసన సామర్థ్యాలను దృష్టిలో ఉంచుకొని పేపర్ల సంఖ్య తగ్గించడానికి ఉపాధ్యాయ సంఘాల ప్రాతినిధ్యం మేరకు రాష్ట్ర విద్యాశాఖ జీఓ 33 ద్వారా 11 పేపర్లను 6 పేపర్లకు తగ్గించడంతో పాటుగా... ఎస్‌సీఈఆర్‌టీ ద్వారా మోడల్ పేపర్లను కూడా విడుదల చేసింది.

కానీ ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ రెండు సబ్జెక్టుల పరీక్షలను ఒకేరోజు ఒక్కొక్క పేపర్‌ను ఒక గంట ముప్పై నిమిషాలపాటు నిర్వహించాలని ఉత్తర్వులలో పేర్కొనడం హాస్యాస్పదంగా మారింది. వాస్తవానికి నిర్వాహణలో ఇది చాలా ఇబ్బందికరమైన విషయం. ఒక పేపరు రాసిన వెంటనే ఆ పేపరును తీసుకొని మరో పేపరును విద్యార్థికి స్వల్ప సమయం తేడాతో ఇస్తారు. రెండు పేపర్లను చదువుకోవడానికి మరో ఇరవై నిముషాల సమయం అదనంగా ఇచ్చినా మూడు గంటల ఇరవై నిముషాల పాటు ఈ రెండు పరీక్షలు ఒకే రోజు నిర్వహించడం వలన విద్యార్థికి చాలా అన్యాయం జరుగుతుంది, ఇటు పరీక్ష నిర్వాహకులకూ ఇబ్బందే. అందుకని ఈ రెండు పరీక్షలను వేరు వేరు రోజులలో నిర్వహించాలని తెలంగాణ టీచర్స్ యూనియన్‌తో పాటు అన్ని ఉపాధ్యాయ సంఘాలు విద్యాశాఖను కోరుతున్నా పట్టించుకోవడం లేదు.

గతంలో ఒక్కొక్క సబ్జెక్ట్ రెండు పేపర్లు ఉండగా ఇప్పుడు ఒక సబ్జెక్ట్‌లోని అన్ని పాఠాలను మొత్తం చదివి ఒకే రోజు పరీక్షను రాయాల్సి ఉంటుంది. కాబట్టి విద్యార్థి పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని రోజు విడిచి రోజు పరీక్షలు నిర్వహించాల్సిన అవసరమున్నది. రెండు పేపర్ల విధానంలో పరీక్షలు ఉన్న సందర్భాలలో సంక్షిప్తరూప ప్రశ్నలు ఎక్కువగా ఉండి విద్యార్థులు తక్కువ సమయంలో ఎక్కువ మార్కులు స్కోర్ చేయడానికి అవకాశం ఉండేది. ఇప్పుడు వ్యాసరూప ప్రశ్నల సంఖ్యను పెంచడం వలన రాసే సమయం అధికంగా పెరగడమేకాక, ఛాయిస్ విధానాన్ని తగ్గించడం వలన విద్యార్థులు అన్ని ప్రశ్నలకు జవాబులు రాయడానికి సమయం సరిపోక 10 జీపీఏను సాధించడం కష్టంగా మారింది.



అలాగే 2022 డిసెంబర్ 30 నాడు స్పెషల్ రివిజన్ క్లాసుల పేరిట ఎస్‌సీఈఆర్‌టీ వారు మరో వివాదస్పద ఉత్తర్వును ఇచ్చారు. వారాంతపు సెలవులను, సెలవు దినాలను కూడా మినహాయించకుండా ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు 10వ తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాసులు నిర్వహించాలనేది దాని సారాంశం. ఇది ఇబ్బందులతో కూడుకున్నది. గ్రామీణ ప్రాంతాల్లో... చుట్టుపక్కల రెండు, మూడు గ్రామాల నుండి విద్యార్థులు తమ హైస్కూల్‌కు వస్తారు. ముఖ్యంగా అమ్మాయిలను సాయంత్రం 6 గంటల వరకు ఉంచడం వల్ల... తలెత్తే రవాణాసౌకర్యం సమస్య ఎలా పరిష్కరించాలి. ముఖ్యంగా భద్రతాపరమైన అంశాలపై జవాబుదారు ఎవరనే ప్రశ్న తలెత్తుతున్నది.

పాఠశాలలో కేవలం మధ్యాహ్న భోజన సౌకర్యం మాత్రమే ఉన్నది. ఉదయం ఎనిమిది గంటల నుండి సాయంత్రం ఆరుగంటల వరకు విద్యార్థులకు ఉదయం టిఫిన్, సాయంత్రం స్నాక్స్ ఎవరివ్వాలి? జాయిఫుల్ లర్నింగ్‌కు, ఆర్‌టీఈకి విరుద్ధంగా వారాంతపు, ప్రభుత్వ సెలవు దినాలలో ప్రత్యేక తరగతులు నిర్వహించాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

ఎస్‌సీఈఆర్‌టీ గతంలో ఎప్పుడూ నేరుగా ఉపాధ్యాయులకు ఆదేశాలు ఇచ్చేది కాదు. ఏ ఆదేశాలైనా పాఠశాల విద్యాశాఖద్వారానే వచ్చేవి. కాని ఈ మధ్యకాలంలో నేరుగా పాఠశాల విద్యాశాఖతో సంబంధం, సమన్వయం లేకుండానే పాఠశాలకు సంబంధించిన పనిదినాలపైనా, సెలవులపైనా పాఠశాల విద్యాశాఖ జారీచేసిన అకడమిక్ క్యాలెండర్‌కు భిన్నంగా ఎస్‌సీఈఆర్‌టీ దాని పరిధిని దాటి ఆదేశాలు ఇస్తోంది. దీంతో అసలు ఎవరి ఆదేశాలను పాటించాలో అర్థంకాక ఉపాధ్యాయులలో ఒక గందరగోళ పరిస్థితి ఏర్పడుతోంది. ఏదైనా విధానపరమైన నిర్ణయం తీసుకునేటప్పుడు రాష్ట్రంలోని ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలు కూడా తీసుకొని వివాదాలు లేకుండా రాష్ట్ర విద్యాశాఖ, టీఎస్ఎస్‌సీఈఆర్‌టీలు ఇప్పటికైనా విధానాల రూపకల్పన చేస్తే భవిష్యత్తులో ఎటువంటి విమర్శలు, వివాదాలు లేకుండా విద్యావ్యవస్థ సజావుగా కొనసాగుతుంది!

వ్యాసకర్త రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ టీచర్స్ యూనియన్ । 97010 07666

కర్మఫలం

'తగునిది తగదని యెదలో
వగవక సాధులకు పేదవారలకెగ్గుల్
మొగిజేయు దుర్వినీతుల
కగున నిమిత్తాగమంబులయిన భయంబుల్'

భారతం ఆదిపర్వం ప్రథమాశ్వాసంలో ఉన్న నన్నయగారి పద్యం ఇది.

ఒకప్పుడు జనమేజయుడు చాలా కాలం పట్టే యజ్ఞం ఒకదాన్ని తలపెట్టి చేస్తున్నాడు. అక్కడకు ఒక కుక్కపిల్ల వచ్చింది. దాన్ని జనమేజయుని తమ్ములు కొట్టారు. అది పెద్దగా ఏడ్చుకొంటూ తల్లి దగ్గరకు వెళ్లింది. ఆ తల్లి పేరు సరమ. సరమ దేవతల కుక్క.

తల్లి కొడుకుని అడిగింది, ''ఎందుకు ఏడుస్తున్నావు, ఎవరు కొట్టారు నిన్ను?'' అని. ''జనమేజయుని యజ్ఞం దగ్గర అతడి తమ్ములు కొట్టారు'' అని చెప్పాడు కొడుకు. ''నీవేమైనా చేయకూడని పని చేశావా?'' అని ప్రశ్నించింది సరమ. ''నేను ఏ తప్పూ చేయలేదు. అక్కడి పదార్థాల్ని వాసన చూడలేదు. కన్నెత్తి కూడా చూడలేదు'' అన్నాడు కొడుకు.



జ్యోతిర్మయం

కొడుకు చేయని తప్పుకు దండింపబడటం సరమ సహించలేక పోయింది. సరాసరి జనమేజయుడు ఉన్న చోటుకు వచ్చింది. కోపంతో అన్నది, ''వీడు నా కొడుకు. ఎలాంటి తప్పూ చేయలేదు. ఎందుకు కొట్టారు నా కొడుకుని?'' అని నిలదీసింది.

జనమేజయుడుగానీ, అతడి తమ్ములుగానీ నోరు మెదపలేదు. మౌనం వల్ల చేసిన నేరం ఒప్పుకున్నట్లు అయ్యింది.

అప్పుడు సరమ అంటుంది, ''ఈ పని చెయ్యవచ్చు, ఈ పని చెయ్యకూడదు అనే విచక్షణా జ్ఞానం లేకుండా సాధువులకు, పేదవారికి ఎవరు నీతి తప్పి కీడు కలుగజేస్తారో, వారికి ఏ కారణం లేకుండానే భయానకమైన ప్రమాదాలు సంభవిస్తుంటాయి. అమాయకుడైన నా కొడుకుకి కీడు కలుగజేశారు కాబట్టి అందుకు ప్రతిఫలంగా మీరు భవిష్యత్తులో మిక్కిలి బాధను అనుభవిస్తారు.''

సరమ అన్నట్లుగానే జనమేజయుడు కొద్దికాలంలోనే గొప్ప బాధను అనుభవింపక తప్పలేదు.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్యమాసం, **తిథి:** శు.చతుర్దశి రా.1.29 వరకు, తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** మృగశిర రా.9.22 వరకు, తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.10.14 నుండి 10.58 వరకు, తదుపరి ప.2.38 నుండి 3.24 వరకు, **అమృతఘడియలు:** ప.11.50 నుండి 1.33 వరకు : **రాహుకాలం** : ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం** : ఉ.6.00 నుండి 7.30 వరకు : **సూర్యోదయం** 6.36 : **సూర్యాస్తమయం** 5.35.

3 నెలలుగా పాలు లేవ్..

రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాలకు నిలిచిన పాల సరఫరా

వికారాబాద్‌లోని గరీబ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు వీరు. ఇక్కడ రెండున్నర నెలలుగా చిన్నారులతోపాటు గర్భిణులు, బాలింతలకు పాలు ఇవ్వడం లేదు. ఇదేమిటని అడిగితే పాలు అసలే రావడం లేదని నిర్వాహకులు చెప్తున్నారని పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు.



అంగన్‌వాడీలు, పాల పంపిణీ వివరాలివీ..

రాష్ట్రంలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు	149
మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు	35,700
ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు	31,711
మినీ అంగన్‌వాడీ కేంద్రాలు	3,989
వాటిలో నమోదైన గర్భిణులు, పాలిచ్చే తల్లులు	4,57,643
మూడేళ్లలోపు చిన్నారులు	10,34,562
మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు	6,67,783
నెలకు సగటున సరఫరా చేస్తున్న పాలు (టెట్రా ప్యాక్)	18.5లక్షల లీటర్లు

సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీల్లో పంపిణీ చేసే పౌష్టికాహారం సరఫరాపై రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ చేతులెత్తేసింది. దాదాపు మూడు నెలలుగా ఈ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పాలు అందడం లేదు. అంగన్‌వాడీల్లో నమోదైన చిన్నారులకు రోజుకు 100 మిల్లీలీటర్లు.. గర్భిణులు, బాలింతలకు రోజుకు 200 మిల్లీలీటర్ల చొప్పున పాలు సరఫరా చేయాల్సి ఉంది. వీటిని టెట్రా ప్యాకెట్ల రూపంలో లబ్ధిదారులకు అందిస్తున్నారు. గతేడాది సెప్టెంబర్ నెలాఖరుతో అంగన్‌వాడీ కేంద్రాలకు పాల సరఫరా కాంట్రాక్టు ముగిసింది. ఇప్పటివరకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కొత్త కాంట్రాక్టరు ఎంపిక టెండరు ఖరారు చేయలేదు. కనీసం పాత కాంట్రాక్టర్‌కే తాత్కాలికంగా పాల పంపిణీ బాధ్యతలనూ అప్పగించలేదు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారులు పాలు అందించడం లేదేమిటంటూ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను నిలదీస్తున్నారు.

పాల బడ్జెట్ ఏటా రూ.100 కోట్లు: పిల్లలు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపాన్ని అధిగమించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పాల పంపిణీ కోసం ఏటా దాదాపు రూ.100 కోట్లు ఖర్చు చేస్తోంది. ప్రతినెలా సగటున 18.5 లక్షల లీటర్ల పాలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్నారు. ఒక్కో లీటరు పాలకు సగటున రూ.43, ప్యాకింగ్, రవాణా చార్జీ కింద మరో రూ.9 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు సంస్థకు చెల్లిస్తోంది. ఇంత కీలకమైన, ప్రయోజనకరమైన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాల్సిన రాష్ట్ర మహిళాశిశు సంక్షేమశాఖ నిర్లక్ష్యంతో పాల పంపిణీ నిలిచిపోయింది.

మూడు నెలలుగా అందక..: కాంట్రాక్టు గడువు ముగిసే క్రమంలో సదరు సంస్థ అన్ని కేంద్రాలకు కోటా మేర పాలు పంపిణీ చేసి ఆపేసింది. ఆ స్టాకు అందుబాటులో ఉన్నంత వరకు అక్టోబర్ రెండో వారం వరకు అంగన్‌వాడీ నిర్వాహకులు పాల ప్యాకెట్లను లబ్ధిదారులకు సర్దుబాటు చేశారు. తర్వాత పంపిణీ నిలిచిపోయింది. మూడు నెలలుగా పాలు అందకపోవడంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనితో కాంట్రాక్టరే పాలు సరఫరా చేయడం లేదంటూ క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు చెప్తున్నట్టు తెలిసింది. దీనిపై అధికారులను అడిగితే.. త్వరలో టెండర్లు ఖరారవుతాయని, పాల పంపిణీ మొదలవుతుందన్నారు.

మంత్రి గంగులకు పితృ వియోగం

కరీంనగర్/సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తండ్రి గంగుల మల్లయ్య బుధవారం సాయంత్రం కరీంనగర్‌లోని తమ స్వగృహంలో గుండెపోటుతో మృతి చెందారు. తండ్రి మరణవార్తతో మంత్రి గంగుల హుటాహుటిన ఇంటికి చేరుకున్నారు. మల్లయ్యకు నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కమలాకర్ చిన్న కుమారుడు.

సీఎం కేసీఆర్ సంతాపం

మంత్రి గంగుల కమలాకర్ తండ్రి మల్లయ్య (87) మృతి పట్ల ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు సంతాపం వ్యక్తం చేశారు.



తండ్రి భౌతిక కాయం వద్ద గంగుల

విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి.. ఫోన్ చేసి గంగులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే మంత్రులు, స్పీకర్ పోచారం, ఇతర ప్రముఖులు మల్లయ్య మృతికి సంతాపం ప్రకటించారు.

53 లక్షల రైతులు.. 4,031 కోట్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతుబంధు సొమ్ము అన్నదాతల ఖాతాల్లో జమ అవుతోంది. బుధవారం నాటికి రాష్ట్రంలో నాలుగు ఎకరాల వరకు వ్యవసాయ భూమి ఉన్న రైతులకు జమ చేసినట్లు వ్యవసాయశాఖ వెల్లడించింది. 53 లక్షల మంది రైతులకు రూ. 4,031 కోట్లు జమ చేశారు. మొత్తం 80 లక్షల ఎకరాలకు చెందిన వ్యవసాయ భూములున్న సన్న, చిన్నకారు రైతులకు రైతుబంధు సొమ్ము జమ చేశారు. వారం రోజులుగా సొమ్ము జమ చేస్తున్నా, ఇంకా నాలుగు ఎకరాల వరకే పరిమితం కావడం గమనార్హం. అయితే సంక్రాంతి నాటికి మిగిలిన రైతులందరికీ కూడా రైతుబంధు అందజేస్తామని వ్యవసాయశాఖ వర్గాలు వెల్లడించాయి. కాగా, రైతు రుణ బకాయిలు పేరుకుపోవడంతో కొన్ని బ్యాంకు బ్రాంచీలు రైతుబంధు సొమ్మును జమ చేసుకునేందుకు ప్రయత్నాలు చేయగా, ఎట్టి పరిస్థితుల్లోనూ దీన్ని బకాయిలకు మినహాయించుకోవద్దని ప్రభుత్వం స్పష్టం చేసింది.

'అనామక' ఖాతాలకు పరిష్కారం

- జిల్లాల వారీగా భూముల వివరాలు పంపాలని కలెక్టర్లకు సీసీఎల్‌ఏ సమాచారం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని కొన్ని వ్యవసాయ భూములకు నమోదైన అనామక ఖాతాల సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. భూ రికార్డులను నమోదు చేసే సమయంలో ఖాతా నంబర్ల విషయంలో దొర్లిన తప్పులను ధరణి పోర్టల్ ద్వారా సవరించేందుకు ఉపక్రమించింది. ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టు కింద ఖమ్మం జిల్లాలో 99999 నంబర్ మీద ఉన్న వ్యవసాయ భూముల ఖాతాలను నోషనల్ ఖాతాలుగా మార్చి కొత్త నంబర్లు ఇచ్చిన భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ) కార్యాలయ వర్గాలు, అన్ని జిల్లాల్లో ఇదే పద్ధతిని అమలు చేయనున్నాయి. ఇందుకోసం పూర్తి వివరాలతో తమకు లేఖలు రాయాలని సీసీఎల్‌ఏ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లకు సమాచారం అందింది. ఈ లేఖల ఆధారంగా ధరణి పోర్టల్‌లోని టెక్నికల్ మాడ్యూల్ (టీఎం-33) ద్వారా ఈ ఖాతాల్లోని సర్వే నంబర్లు అందుబాటులోకి వస్తాయని తెలిపింది. ఖాతా నంబర్, పట్టాదారు పేరు, భూమి స్వభావం, సదరు సర్వే నంబర్‌లోని సబ్‌డివిజన్లు, భూమి విస్తీర్ణం తదితర వివరాలతో తమకు సమాచారం పంపాలని సీసీఎల్‌ఏ కలెక్టర్లను కోరింది. కాగా, ధరణి పోర్టల్ అందుబాటులోకి రాకముందు వ్యవసాయ భూమిలోని కొంత భాగాన్ని నాలా కన్వర్షన్ ద్వారా చదరపు గజాల్లో అమ్మడంతో ఆ భూములపై లావాదేవీలు నిలిచి పోయాయి. ఈ నేపథ్యంలో ధరణి పోర్టల్ లో దీనికోసం ప్రత్యేక ఆప్షన్‌ను ప్రభుత్వం కల్పించింది. అమ్మిన భూమి విస్తీర్ణం, సర్వేనంబర్ వివరాలతో రిజిస్టర్డ్ డాక్యుమెంట్‌ను ధరణిలో అప్‌లోడ్ చేస్తే కలెక్టర్ ద్వారా నోటీసు పంపి అప్రూవ్ చేయాలని, ఆ భూములకు ప్రత్యేక సబ్ డివిజన్ వస్తుందని సీసీఎల్‌ఏ వర్గాలు చెపుతున్నాయి. గజాల్లో అమ్మగా మిగిలిన భూమిని వ్యవసాయ భూమి కింద కొత్త సబ్‌డివిజన్‌గా పరిగణించనున్నట్టు సమాచారం.

దళితుడినైనందునే.. బొట్టుపెట్టి అవమానించారు

కోటగిరి: నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో పనిచేస్తున్న దళిత ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌ను ఈనెల 2న కొందరు సంఘ్ పరివార్ కార్యకర్తలు, వివిధ పార్టీల నేతలు కలిసి బలవంతంగా స్కూల్ నుంచి మందిరం వరకు లాక్కెళ్లి బొట్టు పెట్టిన ఘటన వివాదాస్పదంగా మారింది. ఓ దళితుడినైనందునే తనను చిన్న చూపు చూస్తూ ఘోరంగా అవమానించారని ఆరోపిస్తూ ఉపాధ్యాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఐదుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు ఐపీసీ 353, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. గతంలో గణపతి పండుగ చందా విషయంలో ఆ వ్యక్తులు తనతో అసభ్యంగా ప్రవర్తించారని, ఎస్సీ రిజర్వేషన్లు, తన కులాన్ని కించపరుస్తూ మాట్లాడారని బాధిత ఉపాధ్యాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. తనపై కక్ష సాధింపు కోసం కుట్రపన్ని ఇటీవల స్కూల్లోకి చొరబడి తనపై రౌడీయిజం చేశారని, తన విధులను ఆటంకపర్చడమే గాక, బహిరంగంగా అవమానించారని వాపోయారు. దళిత సంఘాల మద్దతుతో తాను న్యాయం కోసం పోరాడుతానని ప్రకటించారు. విద్యార్థులు దైవంపై భారం వేయకుండా కష్టపడితే పైకి వస్తారని చెప్పాను తప్ప.. ఏ దేవతను తాను కించపరిచి మాట్లాడలేదని మల్లికార్జున్ స్పష్టంచేశారు. కాగా, మతాన్ని, దేవతలను దూషించాడన్న ఆరోపణలపై పోలీసులు టీచర్‌పై కూడా కేసు నమోదు చేశారు. అట్రాసిటీ కేసు నమోదైన వారిలో గాండ్ల శ్రీనివాస్, ఎడ్లెడి రాజు, పబ్బ శేఖర్, ఎముల నవీన్, రుద్రూర్ మురళి ఉన్నారు.

ప్రేమ.. పెళ్లికి తల్లి అడ్డు చెప్పిందని..

- బాలిక ఆత్మహత్య

దహెగాం: ప్రేమ..పెళ్లి వద్దని తల్లి మందలించడంతో మనస్తాపం చెందిన ఒక బాలిక ఆత్మహత్య చేసు కుంది. కుమురంభీం జిల్లా దహెగాం మండలం రాళ్లగూడ గ్రామంలో బుధవారం జరిగిన ఈ సంఘటనపై ఎస్ఐ సనత్‌కుమార్ తెలిపిన వివరాలివి. రాళ్ల గూడ గ్రామానికి చెందిన నాగపురి స్వరూపకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. భర్త మోహన్ చనిపోయాడు. చిన్నకూతురు శిరీష(16) ఇంటర్ ఫెయిల్ కావడంతో ఇంటివద్దే ఉంటోంది. అదే గ్రామానికి చెందిన యువకుడిని ఎనిమిది నెలలుగా ప్రేమిస్తోంది. ఈ విషయం తల్లికి తెలియడంతో ఇప్పుడే ప్రేమ, పెళ్లి ఏంటని మందలించింది. దీంతో మనస్తాపం చెందిన శిరీష బుధవారం వేకువజామున ఇంటి వెనకాల పురుగు మందు తాగింది. వెంటనే శిరీషను తల్లి కాగజ్‌నగర్‌లోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



శిరీష

రైతు ఆత్మహత్యతో ఉద్రిక్తత

- ఇండస్ట్రియల్ జోన్ కిందికి పంట భూములు
- దీంతో అమ్ముడు పోని భూమి
- మనస్తాపంతో ఉరి వేసుకున్న రైతు
- కామారెడ్డి జిల్లాలో ఘటన

కామారెడ్డి టౌన్: తన మూడు ఎకరాల భూమి మున్సిపల్ నూతన మాస్టర్ ప్లాన్‌లో ఇండస్ట్రియల్ జోన్‌లోకి వెళ్లడంతో, ఆ భూమిని అమ్ముకోవడానికి వీలుపడక మనస్తాపానికి గురైన ఓ రైతు ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. కామారెడ్డి జిల్లా అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన పయ్యావుల రాములు (42)కు కామారెడ్డి పట్టణ శివారులోని ఇల్చిపూర్ వద్ద 3 ఎకరాల పంట భూమి ఉంది. కాగా, ఇటీవల మున్సిపల్ నూతన మాస్టర్‌ప్లాన్‌లో అక్కడి భూములన్నీ ఇండస్ట్రియల్ జోన్‌లోకి చేర్చారు. అప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాములు ఆ భూమిని గతంలోనే అమ్మకానికి పెట్టాడు. ఇప్పుడు ఆ భూమి ఇండస్ట్రియల్ జోన్‌లోకి వెళ్లడంతో కొనుగోలుకు ఎవరూ ముందుకురాక మనస్తాపంతో రాములు మంగళవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం ఈ విషయాన్ని గమనించిన తల్లి.. చుట్టుపక్కల వారికి తెలపడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. రాములు మృతితో రైతులు గ్రామంలో కాసేపు ఆందోళన చేశారు. అనంతరం మృతదేహాన్ని ట్రాక్టర్‌లో తీసుకుని కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన చేయడానికి తరలివచ్చారు. అయితే కామారెడ్డి కొత్త బస్టాండ్ ముందు పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో రైతులు అక్కడే రెండు గంటల పాటు ఆందోళన చేపట్టారు. తర్వాత రాములు మృతదేహాన్ని అక్కడే వదిలేసి మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి ధర్నాకు దిగారు. ఈ సమయంలో 2 గంటల పాటు రోడ్డుపైనే ట్రాక్టర్‌లో మృతదేహం అలానే ఉంది. తర్వాత పోలీసులు గట్టి బందోబస్తు మధ్య మృతదేహాన్ని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. అయితే తన భర్త మృతదేహాన్ని తన అనుమతి లేకుండా ఆస్పత్రికి తరలించినందుకు రాములు భార్య.. తన కుటుంబ సభ్యులు, ఇతర రైతులతో కలసి మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి వారికి సంఘీభావం ప్రకటించారు. 2 పంటలు పండే రైతుల భూములను ఇండస్ట్రియల్ జోన్‌లోకి మార్చడం దారుణమన్నారు.

నా కుటుంబాన్ని ఆదుకోండి: తన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రాములు భార్య శారద కోరారు. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం వల్ల తన భర్త ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. బుధవారం రాత్రి ఆమె ఆందోళన విరమించి ఆస్పత్రికి వెళ్లారు. మృత దేహానికి పోస్టుమార్టం అనంతరం స్వగ్రామానికి తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న మృతుని భార్య, ఇద్దరు పిల్లలు

రామ్‌పూర్ ప్రత్యేక కోర్టులో జయప్రద

ఎన్నికల నియమావళి కేసులో బెయిల్ మంజూరు



బరేలి: ఉత్తరప్రదేశ్‌లోని రామ్‌పూర్ ప్రత్యేక కోర్టుకు సినీనటి, బీజేపీ నాయకురాలు జయప్రద హాజరయ్యారు. 2019నాటి ఎన్నికల నియమావళి ఉల్లంఘన కేసులో ఆమె కోర్టు ఎదుట గత మూడున్నరేళ్లుగా గైర్హాజర్ కావడంతో గత నెలలో కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్లు జారీ చేసింది. బుధవారం ఆమె కోర్టులో హాజరుకావడంతో న్యాయమూర్తి బెయిల్ మంజూరు చేశారు. ''మాజీ ఎంపీ , బీజేపీ నాయకురాలు జయప్రద కోర్టు ఎదుట హాజరై బెయిల్ దరఖాస్తును సమర్పించారు. దీంతో కోర్టు ఆమెకు బెయిల్ మంజూరు చేసింది'' అని ప్రభుత్వం తరఫున లాయర్ తెలిపారు. స్థానిక అధికారుల అనుమతి లేకుండా 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో జయప్రద ఎన్నికల ర్యాలీ నిర్వహించడంతో రెండు వేర్వేరు పోలీసు స్టేషన్లలో ఆమె రెండు ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయి.

వైరస్‌లను భోంచేస్తుంది

వింత సూక్ష్మజీవి ఉనికిని గుర్తించిన సైంటిస్టులు

వాషింగ్టన్: వైరస్‌లు. ఈ పేరంటేనే మనకు హడల్. కరోనా వంటి పలు రకాల వైరస్‌లు మనకే గాక ఇతర జీవ జాతులకూ ప్రాణాంతకాలు కూడా. అలాంటి వైరస్‌లనే లంచ్‌లోకి నమిలి మింగేసే ఒక వింత జీవి ఒకటి తాజాగా వెలుగులోకి వచ్చింది. నీళ్లలో తమ పరిధిలో ఉన్న నానా రకాల క్లోరో వైరస్‌లనూ అదీ ఇదీ అని లేకుండా ఇది భారీ సంఖ్యలో తినేస్తుందట! ఈ సూక్ష్మజీవిని యూనివర్సిటీ ఆఫ్ నెబ్రాస్కా–లింకన్స్ పరిశోధకులు తొలిసారిగా కనిపెట్టారు. దీన్ని స్వచ్ఛమైన నీటిని కలుషితం చేసే హాల్టేరియా అనే సూక్ష్మజీవుల్లో ఓ జాతికి చెందినదిగా గుర్తించారు. ఇది మరో భోజనంతో పని లేకుండా కేవలం వైరస్‌లను మాత్రమే తిని సుష్టుగా పెరుగుతుందని, తమ సంతతినీ వృద్ధి చేసుకుంటోందని వారి పరిశోధనల్లో తేలడం విశేషం. పరిశోధనలో భాగంగా ఓ మంచినీటి కొలను నుంచి నీటిని సేకరించారు. అందులోకి క్లోరో వైరస్‌లను వదిలారు. కొంతకాలానికి వాటి సంఖ్య విపరీతంగా తగ్గిపోతుండటం వారిని ఆశ్చర్యపరిచింది. అదే సమయంలో మరో రకం సూక్ష్మజీవులు పరిమాణంలో మామూలు కంటే ఏకంగా 15 రెట్లు పెరిగిపోతున్న వైనమూ కంటబడింది. వాటిని హాల్టేరియాగా గుర్తించారు. తినడానికి మరేమీ అందుబాటులో లేకపోవడంతో అవి హాయిగా క్లోరో వైరస్‌లనే తిని అరాయించుకుని అంతలా పెరిగాయట! ఈ పరిశోధన 'ప్రొసీడింగ్స్ ఆఫ్ ద నేషనల్ అకాడెమీ సైన్సెస్'లో పబ్లిషైంది. దీని ఫలితాలు ఆహారచక్రం గురించిన మన అవగాహనను విప్లవాత్మకంగా మారుస్తాయని పరిశోధన బృందానికి చెందిన డాక్టర్ డిలాంగ్ అంటున్నారు.



బ్రెయిన్ స్ట్రోక్‌కి రక్తం గ్రూప్‌తో లింక్

ఎ గ్రూప్ ఉన్న వారికి 60 ఏళ్ల లోపు స్ట్రోక్ వచ్చే ప్రమాదం

వాషింగ్టన్: మీ రక్తం ఏ గ్రూప్ ..? దానిని బట్టి మీకు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఎంతో చెప్పేయొచ్చు. ఎ గ్రూప్ రక్తం ఉన్న వారికి స్ట్రోక్ వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయని తాజా అధ్యయనంలో వెల్లడైంది. అమెరికాలోని మేరీల్యాండ్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తల బృందం చేసిన అధ్యయనంలో మనిషి రక్తంలో గ్రూప్‌కి, స్ట్రోక్‌కి మధ్య సంబంధం ఉందని తేలింది. ఈ అధ్యయనం వివరాలను మెడికల్ జర్నల్ ఆఫ్ ది అమెరికన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ ప్రచురించింది. ఒక మనిషి రక్తం గ్రూప్‌కు సంబంధించిన జన్యు రకాలను, మెదడు సహా ఇతర శరీర భాగాలకు రక్త సరఫరా సరిగా జరగకపోవడం వల్ల యుక్త వయసులో వచ్చే స్ట్రోక్స్‌కు సంబంధించిన డేటాను శాస్త్రవేత్తలు విశ్లేషించారు.

- ఒక వ్యక్తి రక్తం గ్రూప్ ఎ అయితే 60 ఏళ్ల కంటే ముందుగానే స్ట్రోక్ వచ్చే అవకాశం ఉంది. ఎందుకంటే ఈ గ్రూప్ కలిగిన వారి రక్తం గడ్డకట్టే ప్రమాదం అధికంగా ఉంటుంది. మిగతా గ్రూప్‌ల వారి కంటే స్ట్రోక్ వచ్చే అవకాశం 16% ఎక్కువ.
- ఓ–బ్లడ్ గ్రూప్ వారు నిశ్చింతగా ఉండొచ్చు. వారికి స్ట్రోక్ వచ్చే ప్రమాదం తక్కువగా ఉంది. మిగతా గ్రూప్‌ల కంటే రిస్క్ 12% తక్కువ.



- బి గ్రూప్ రక్తం ఉన్న వారికి ఏ వయసులోనైనా స్ట్రోక్ వచ్చే అవకాశాలున్నాయి.

ఉత్తర అమెరికా, యూరప్, ఆసియా దేశాల్లో బ్రెయిన్ స్ట్రోక్స్‌పై జరిగిన 48పైగా అధ్యయనాలను విశ్లేషించి తాజా నివేదికను రూపొందించారు. ఈ అధ్యయనాల్లో 18 నుంచి 59 వరకు వయసు కలిగిన వారు ఉన్నారు. గతంలో ఒ గ్రూప్ కాని వారికి స్ట్రోక్ వచ్చే అవకాశాలున్నాయని తేలిందని అధ్యయనానికి నేతృత్వం వహించిన డాక్టర్ బ్రాక్సన్ మిచెల్ చెప్పారు.

క్లుప్తంగా...

సోనియాకు అస్వస్థత



న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు, ఎంపీ సోనియా గాంధీ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. వైరల్ రెస్పిరేటరీ ఇన్ఫెక్షన్ బారినపడ్డారు. చికిత్స కోసం బుధవారం ఉదయం ఢిల్లీలోని సర్ గంగారాం ఆసుపత్రిలో చేరారు. సోనియా వెంట ఆమె కుమార్తె ప్రియాంకాగాంధీ వాద్రా ఉన్నారని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. సోనియా ఆరోగ్యంపై గంగారాం ఆసుపత్రి బోర్డు ఆఫ్ మేనేజ్‌మెంట్ చైర్మన్ డాక్టర్ అజయ్ స్వరూప్ హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. డిపార్టుమెంట్ ఆఫ్ చెస్ట్ మెడిసిన్‌లో ఆమెను డాక్టర్ ఆరూప్ బసు ఆధ్వర్యంలో అబ్జర్వేషన్‌లో ఉంచినట్లు తెలిపారు. సోనియా గాంధీ మంగళవారం నుంచే అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిసింది.

బ్రిటన్ విద్యార్థులు 18 ఏళ్లొచ్చేదాకా...

గణితం నేర్వాల్సిందే: రిషి

లండన్: బ్రిటన్ విద్యార్థులకు 18 ఏళ్లు వచ్చేదాకా గణిత బోధన ఖచ్చితంగా ఉండాలని ఆ దేశ ప్రధాని రిషి సునాక్ అభిప్రాయపడ్డారు. ' 18 ఏళ్లు వచ్చేవరకు ప్రతి ఏటా గణితం చదవాల్సిందేననే నిబంధన బ్రిటన్‌లో ఇన్నాళ్లూ లేదు. ఇకపై అలా కుదరదు. ఖచ్చితంగా నేర్చుకోవాలి. ప్రపంచంలో ఏ ఉద్యోగం చూసినా డేటా, గణాంకాలతో ముడిపడి ఉంది. విద్యా వ్యవస్థకు గణితమే ప్రధాన భూమిక. అలాంటి విభాగంలో బ్రిటన్ విద్యార్థులు వెనుకంజ వేయొద్దు. గణితం నేర్వాల్సిందే' అని కొత్త ఏడాదిలో చేసిన తొలి ప్రసంగంలో సునాక్ స్పష్టంచేశారు. గణితం బోధనను తప్పనిసరి చేసేలా నిబంధనలను మార్చుతామని ప్రధాని చెప్పారని ప్రధాని కార్యాలయ అధికార ప్రతినిధి చెప్పారు. కాగా, బ్రిటన్‌లో చాన్నాళ్లుగా గణిత బోధకుల తీవ్ర కొరత ఉందని ది అసోసియేషన్ ఆఫ్ స్కూల్, కాలేజ్ లీడర్స్ తెలిపింది.

ఫస్ట్‌క్లాస్ టికెటెలా కొన్నాడో?

బాలీవుడ్ నటుడు సతీశ్ షాకు జాతి వివక్ష

ముంబై: లండన్ హీత్రూ విమానాశ్రయంలో తనకు జాతి వివక్ష అనుభవం ఎదురైందని ప్రముఖ బాలీవుడ్ నటుడు సతీశ్ షా చెప్పారు. ఫస్ట్‌క్లాస్‌లో ప్రయాణానికి టికెటెలా కొన్నాడంటూ ఇద్దరు ఎయిర్‌పోర్టు సిబ్బంది తనను ఉద్దేశించి మాట్లాడుకున్నారని తెలిపారు. భారతీయుడిని కాబట్టి కొన్నానంటూ నవ్వుతూ బదులిచ్చానని వెల్లడించారు. సతీశ్ ట్వీట్ వైరల్‌గా మారింది. 12,000 లైక్‌లు రాగా 1,300 మంది రీట్వీట్ చేశారు. భారతీయుడిని కాబట్టి ఖరీదైన టికెట్ కొన్నానంటూ సతీశ్ షా జవాబు చెప్పడం పట్ల నెటిజన్లు హర్షం వ్యక్తం చేశారు. బ్రిటిషర్లు భారత్‌ను 200 ఏళ్లపాటు పాలించకపోతే ఇప్పుడు భారతీయులకు ఇంగ్లాండ్ ఒక కాలనీగా మారి ఉండేదని ఓ నెటిజన్ అభిప్రాయపడ్డారు. సతీశ్ షా ను హీత్రూ విమానాశ్రయం ట్విట్టర్‌లో క్షమాపణ కోరింది. ఆ సంఘటనకు సంబంధించిన ఇతర వివరాలు ఉంటే ఇవ్వాలని విన్నవించింది.

లైంగిక సుఖానికి దూరమయ్యా...

రూ.10,006 కోట్లివ్వండి


మధ్యప్రదేశ్ ప్రభుత్వంపై ఓ వ్యక్తి కేసు

రత్లాం: గ్యాంగ్ రేప్ కేసు నుంచి నిర్దోషిగా బయటపడిన ఓ వ్యక్తి తనకు ప్రభుత్వం నష్ట పరిహారంగా రూ.10,006.2 కోట్లు చెల్లించాల్సిందేనంటూ కోర్టుకెక్కాడు. మధ్యప్రదేశ్‌లోని రత్లాం పట్టణంలో ఈ సంఘటన జరిగింది. గిరిజనుడైన కాంతూ అలియాస్ కాంతీలాల్ భీల్(35)ను గ్యాంగ్ రేప్ కేసులో 2020 డిసెంబర్ 23న పోలీసులు అరెస్టు చేశారు. దాదాపు రెండేళ్లపాటు జైల్లో ఉన్నాడు. స్థానిక కోర్టు 2022 అక్టోబర్ 20న అతడిని నిర్దోషిగా ప్రకటిస్తూ తీర్పునిచ్చింది. అంతరం కాంతీలాల్ జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. జైల్లో ఉన్నప్పుడు భార్యతో లైంగిక సుఖానికి దూరమయ్యానని, దేవుడిచ్చిన వరం వృథా అయ్యిందని, తీవ్ర మానసిక క్షోభ అనుభవించానని పిటిషన్‌లో పేర్కొన్నారు. తనకు రూ.10,006.2 కోట్ల నష్ట పరిహారం చెల్లించేలా మధ్యప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. ఇందులో రూ.10,000 కోట్లు మానసిక క్షోభ అనుభవించినందుకు మిగతా రూ.6.02 కోట్లు ఇతర ఖర్చుల కోసమని విన్నవించాడు.

సంక్షోభంలో పాక్

తలకు మించిన భారంగా ఇంధన దిగుమతులు

- కరెంటు ఆదా కోసం రంగంలోకి ప్రభుత్వం
- మార్కెట్లు, మాల్స్, ఫంక్షన్ హాళ్లు త్వరగా మూసేయాలని ఆదేశం
- జనం పెదవి విరుపు, వ్యాపారుల గగ్గోలు



ఇస్లామాబాద్: చుక్కలనంటుతున్న నిత్యావసరాల ధరలు. తీర్చలేని రుణ భారం. నానాటికీ పతనమవుతున్న కరెన్సీ విలువ. తీవ్ర రూపు దాలుస్తున్న కరెంటు కొరత. పులి మీద పుట్రలా పడ్డ ప్రకృతి విలయాలు... ఇలా ఎటు చూసినా సమస్యలతో పొరుగు దేశం పాకిస్తాన్ నానాటికీ పీకల్లోతు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతోంది. మరో శ్రీలంకలా మారకముందే ఏదోలా సమస్య నుంచి బయట పడే మార్గాల వెదుకులాటలో పడింది. ఆపద నుంచి గట్టెక్కించకపోతారా అని అంతర్జాతీయ ద్రవ్య నిధి తదితరాల వైపు ఆశగా చూస్తోంది...

పాకిస్తాన్‌లో నానాటికీ తీవ్ర రూపు దాలుస్తున్న ఆర్థిక సంక్షోభానికి అడ్డుకట్ట వేసేందుకు షహబాజ్ షరీఫ్ ప్రభుత్వం ఆపసోపాలు పడుతోంది. దేశ మొత్తం దిగుమతుల్లో ఇంధన బిల్లుదే పెద్ద వాటా. ప్రస్తుతం విదేశీమారక నిల్వలు 11.7 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. దేశ మొత్తం దిగుమతి అవసరాలను తీర్చడానికి ఇవి మరో నెల రోజులు మాత్రమే సరిపోతాయి. ఈ నేపథ్యంలో ఇంధన పొదుపు కోసం ప్రభుత్వం తక్షణం రంగంలోకి దిగి పలు చర్యలు చేపట్టింది. మార్కెట్లన్నీ రాత్రి 8.30కల్లా మూసేయాలంటూ బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఫంక్షన్ హాళ్లు, రెస్టారెంట్లు కూడా పదింటికల్లా మూతబడాల్సిందేనని తేల్చి చెప్పింది. షాపింగ్ మాల్స్ కూడా ముందుగానే మూతపడుతున్నాయి. 'ఇంధన పొదుపు' లక్ష్యంతో మంగళవారం కేంద్ర కేబినెట్ సమావేశంలో తీసుకున్న ఈ నిర్ణయాలన్నీ తక్షణం అమల్లోకి వస్తాయని పాక్ రక్షణ మంత్రి ఖవాజా మహమ్మద్ అసిఫ్ వెల్లడించారు.

రూ.6,200 కోట్ల ఆదాయే లక్ష్యం...

పాక్‌లో విద్యుదుత్పాదన చాలావరకు చమురు ఆధారితమే. చమురు దిగుమతులపై ఏటా 300 కోట్ల డాలర్ల దాకా ఖర్చు పెడుతోంది. తాజా చర్యల ఉద్దేశం ఈ వ్యయాన్ని వీలైనంత తగ్గించడమే. అంతేగాక ప్రభుత్వ శాఖల్లో కూడా విద్యుత్ వాడకాన్ని కనీసం 30 శాతం తగ్గించడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని అధికారులు వెల్లడించారు. దీనివల్ల మొత్తమ్మీద 6,200 కోట్ల రూపాయలు ఆదా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు వివరించారు. వీటితో పాటు ఉద్యోగులు వీలైనంత వరకూ ఇంటి నుంచి పని చేసేలా చూడాలని కూడా ప్రభుత్వం యోచిస్తోంది. నాసిరకపు విద్యుత్ బల్బుల తయారీ తదితరాలపై త్వరలో నిషేధం కూడా విధించనున్నారు. అయితే, ప్రభుత్వ తాజా నిర్ణయంపై దుకాణదారులు, ఫంక్షన్ హాల్స్, మాల్స్ యజమానులు గగ్గోలు పెడుతున్నారు. కరోనాతో రెండేళ్లకు పైగా సతమతమై ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న తమ పాలిట ఇది పిడుగుపాటు నిర్ణయమేనని, దీన్ని తక్షణం వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రాత్రి పొద్దుపోయేదాకా షాపింగులు, రెస్టారెంట్లలో డిన్నర్లు పాకిస్తానీలకు రివాజు. ప్రభుత్వ నిర్ణయంపై వారినుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది.

600 కోట్ల డాలర్ల రుణం!

మరోవైపు ఆర్థిక సంక్షోభం నుంచి బయట పడేందుకు ఐఎంఎఫ్ నుంచి కనీసం 600 కోట్ల డాలర్ల తక్షణ రుణం సాధించేందుకు పాక్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. గత ఆగస్టులో ఐఎంఎఫ్ నుంచి పాక్ 110 కోట్ల డలర్ల రుణం తీసుకుంది. గత వేసవిలో విరుచుకుపడ్డ ఆకస్మిక వరదలు దేశాన్ని అతలాకుతలం చేసి వదిలాయి. వాటివల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు ఏకంగా 4,000 కోట్ల డాలర్ల మేర నష్టం వాటిల్లిందని అంచనా.

గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌కు రూ.19,744 కోట్లు

న్యూఢిల్లీ: దేశంలో కర్బన ఉద్గారాలను తగ్గించడానికి గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌ను ప్రోత్సహిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఇందుకోసం ఈ ఏడాది రూ.19,744 కోట్లు కేటాయించింది. ఈ మేరకు బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఆమోద ముద్ర వేసింది. కేబినెట్ సమావేశానంతరం కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ కేబినెట్ వివరాలను విలేకరులకు వెల్లడించారు. నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ ద్వారా 2030 నాటికి రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులు, 6 లక్షలకు పైగా ఉద్యోగాలు వస్తాయని తాము భావిస్తున్నట్లుగా చెప్పారు. వచ్చే అయిదేళ్లలో ఏడాదికి 50 లక్షల టన్నుల చొప్పున గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా నిర్ణయించుకున్నట్టు తెలిపారు. ప్రభుత్వం ఇప్పుడు కేటాయించిన రూ.20 వేల కోట్ల విలువైన ప్రోత్సాహకాలతో దాని ధర తగ్గుతుందని అన్నారు. కార్బన్ రహిత హైడ్రోజన్‌ను ఆటోమొబైల్స్ , ఆయిల్ రిఫైనరీలు, స్టీల్ ప్లాంట్లలో ఇంధనంగా వినియోగించవచ్చునని ఠాకూర్ చెప్పారు. ఈ మిషన్ కోసం ప్రాథమికంగా రూ.19,744 కోట్లు కేటాయించామని, స్ట్రాటజిక్ ఇంటర్‌వెన్షన్స్ ఫర్ గ్రీన్ హైడ్రోజన్ ట్రాన్సిషన్ (సైట్) కార్యక్రమానికి రూ.17,490 కోట్లు, పైలెట్ ప్రాజెక్టులకు రూ.1,466 కోట్లు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌కి రూ.400 కోట్లు, ఇతర అవసరాల కోసం రూ.388 కోట్లు ఖర్చు చేయడానికి కేబినెట్ అంగీకారం తెలిపిందని మంత్రి వివరించారు. ఈ మిషన్ సాకారమైతే ఇంధన రంగంలో భారత్ స్వయంప్రతిపత్తిని సాధిస్తుంది.



బిల్కిస్ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన సుప్రీం

న్యూఢిల్లీ: బిల్కిస్ బాను అత్యాచార ఘటన దోషుల ముందస్తు విడుదలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. ఈ మేరకు సీపీఎం నేత సుభాషిణీ అలీ, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా తదితరులు దాఖలు చేసిన పిటిషన్లపై న్యాయమూర్తులు జస్టిస్ అజయ్ రస్తోగీ, జస్టిస్ బేలా ఎం.త్రివేదీల ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. కాసేపటికే, ఈ విషయమై గతంలో బిల్కిస్ బానో వేసిన పిటిషన్‌పై విచారణ నుంచి గత డిసెంబర్ 13న జస్టిస్ త్రివేదీ తప్పుకున్న విషయాన్ని ఆమె తరఫు న్యాయవాది శోభా గుప్తా ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దాంతో న్యాయమూర్తులిరువురూ కాసేపు చర్చించుకున్నారు. అనంతరం ఈ విచారణ నుంచి కూడా ఆమె తప్పుకుంటున్నట్టు జస్టిస్ రస్తోగీ చెప్పారు. ఆమె స్థానంలో మరో న్యాయమూర్తితో కలిసి ఫిబ్రవరి నుంచి విచారణ కొనసాగుతుందని పేర్కొన్నారు. తాజా పిటిషన్లను బిల్కిస్ ఇప్పటికే దాఖలు చేసిన పిటిషన్‌కు కలిపి విచారిస్తామని వెల్లడించారు.

రిటైరైన జస్టిస్ నజీర్

ప్రజా న్యాయమూర్తి అంటూ సీజేఐ ప్రశంస

న్యూఢిల్లీ: జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా విశేష సేవలందించారని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ కొనియాడారు. బుధవారం సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ వీడ్కోలు సభలో ఆయన ప్రసంగించారు. ''జస్టిస్ నజీర్‌ది బహుముఖీన వ్యక్తిత్వం. సాధారణ కుటుంబంలో జన్మించి స్వయం కృషితో ఉన్నత స్థానానికి చేరుకున్నారు. ప్రజా న్యాయమూర్తిగా పేరుగడించారు'' అన్నారు. న్యాయ వ్యవస్థలో మహిళల ప్రాతినిధ్యం తగినంత లేకపోవడం బాధాకరమని జస్టిస్ నజీర్ అన్నారు. జూనియర్ లాయర్లకు మంచి వేతనాలు, మరిన్ని అవకాశాలు కావాలని అభిప్రాయపడ్డారు.



పుర్రె పగిలి, వెన్ను విరిగి...

- చిత్రవధ అనుభవించిన అంజలి
- ఢిల్లీ కారు ప్రమాదంపై పోస్టుమార్టం
- మద్యం సేవించి లేదు: కుటుంబం

న్యూఢిల్లీ: వెన్నెముక విరిగిపోయింది. పుర్రె పగిలింది. దాంతో మెదడులో కొంత భాగం బయటికొచ్చి రోడ్డు పొడవునా పడిపోయింది. పక్కటెముకలు విరిగి ఛాతీ భాగం పగిలిపోయింది. వీపుపై చర్మం ఆనవాళ్లే లేకుండా పోయి శరీర భాగాలు బయటపడ్డాయి. అందరినీ కలచివేసిన ఢిల్లీ రోడ్డు ప్రమాదంలో బాధితురాలు అంజలి పోస్టుమార్టం నివేదికలో తాజాగా వెలుగు చూసిన వివరాలివి! జనవరి 1 తెల్లవారుజామున అంజలి స్కూటీని కారు గుద్దేయడం, కారు కింద పడి అరుస్తున్నా అందులోని ఐదుగురు యువకులు ఆగకుండా 12 కిలోమీటర్ల దూరం అతి వేగంగా ఈడ్చుకుపోయి ఆమెను పొట్టన పెట్టుకోవడం తెలిసిందే. ఆ క్రమంలో అంజలి ఎంతటి నరకం అనుభవించిందో పోస్టుమార్టం నివేదిక కళ్లకు కట్టింది. ఆమె ఒంటిపై 40కి పైగా గాయాలున్నట్టు తేల్చింది. అంతేగాకుండా ప్రమాద సమయంలో స్కూటీపై ఉన్న ఆమె స్నేహితురాలు నిధి చెప్పినట్టుగా అంజలి మద్యం సేవించలేదని నివేదికతో స్పష్టమైందని ఆమె కుటుంబీకులు చెబుతున్నారు.



కుటుంబంలో ఒకరికి ఉద్యోగం: ఆప్

అంజలి కుటుంబాన్ని ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా పరామర్శించారు. రూ.10 లక్షల పరిహారం త్వరలో ఇవ్వడంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వోద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న ఆమె తల్లికి పూర్తి వైద్యం అందిస్తామన్నారు. బాధితురాలి వ్యక్తిత్వ హననానికి పాల్పడేందుకు స్నేహితురాలే ప్రయత్నిస్తున్నట్టు కన్పిస్తోందని ఢిల్లీ మహిళా కమిషన్ అధ్యక్షురాలు స్వాతీ మలివాల్ ఆరోపించారు. ప్రమాద సమయంలో అంజలి తాగి ఉందని నిధి చెప్పడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ''అంతటి ఘోర ప్రమాదానికి గురైన మిత్రురాలిని కాపాడే ప్రయత్నం కూడా చేయకుండా ఇంటికెళ్లి పడుకున్న వ్యక్తి మాటలు నమ్మలేం. స్టేట్‌మెంట్‌లో ఆమె చెప్పిన విషయాలపై లోతుగా విచారణ జరగాలి'' అని డిమాండ్ చేశారు.

యూపీలోనూ అదే దారుణం

ఢీకొట్టి 3 కి.మీ. లాక్కెళ్లిన లారీ!

మహిళా లెక్చరర్ దుర్మరణం

లక్నో/కౌశాంబి(యూపీ): సంచలనం సృష్టించిన ఢిల్లీ ఘటన తరహాలోనే ఉత్తరప్రదేశ్‌లోనూ బుధవారం ఓ దారుణం జరిగింది. బందా జిల్లా మావై బుజుర్గ్ గ్రామంలో స్కూటీపై వెళ్తున్న మహిళా లెక్చరర్‌ను వేగంగా వచ్చిన ఓ భారీ ట్రక్కు బలంగా ఢీకొట్టి 3 కిలోమీటర్లు లాక్కెళ్లింది. దీంతో ఆమె తీవ్రగాయాలపాలై కన్ను మూసింది. ఈ క్రమంలో లారీలో మంటలు చెలరేగాయి. మంటలార్పి ట్రక్కు కింది నుంచి మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. లక్నోకు చెందిన ఆమె యూనివర్సిటీ నుంచి ఇంటికెళ్తూ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయింది.



కౌశాంబిలోనూ...

యూపీలోని కౌశాంబిలోనూ జనవరి ఒకటిన ఇలాంటి ఘటనే జరిగింది. కౌసల్య దేవి అనే అమ్మాయి కంప్యూటర్ క్లాసు కోసం సైకిల్‌పై వెళ్తుండగా ఒక కారు అదుపు తప్పి అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. సైకిల్‌తోపాటు ఆమెను 200 మీటర్ల దూరం ఈడ్చుకెళ్లింది. అమ్మాయి అదృష్టవశాత్తూ గాయాలతో బయటపడింది.

రిపబ్లికన్ అభ్యర్థి మెక్‌కార్తీకి ఎదురుదెబ్బ

- అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్ ఎన్నికలో విపక్షానికి పరాభవం
- మూడు రౌండ్ల ఓటింగ్‌లో లభించని మెజార్టీ
- తొలిరోజు స్పీకర్‌ను ఎన్నుకోలేకపోవడం గత వందేళ్లలో ఇదే తొలిసారి

వాషింగ్టన్: అమెరికా కాంగ్రెస్(పార్లమెంట్)లో దిగువ సభ అయిన ప్రతినిధుల సభ(హౌజ్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్)లో ప్రతిపక్ష రిపబ్లికన్ పార్టీదే మెజార్టీ. అయినప్పటికీ స్పీకర్ ఎన్నికలో ఆ పార్టీ అభ్యర్థి నెగ్గలేకపోయారు. నూతన సభ మంగళవారం కొలువుదీరింది. తొలిరోజు సభాపతి (స్పీకర్) ఎన్నిక నిర్వహించారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా పోటీకి దిగిన కెవిన్ మెక్‌కార్తీ మెజార్టీ ఓట్లు కూడగట్టడంలో విఫలమయ్యారు. మంగళవారం రాత్రంతా సభలో హైడ్రామా చోటుచేసుకుంది. మూడు రౌండ్లు ఓటింగ్ నిర్వహించారు. స్పీకర్‌గా నెగ్గడానికి 218 ఓట్లు అవసరం కాగా, మెక్‌కార్తీకి తొలి రెండు రౌండ్లలో 203 ఓట్ల చొప్పున, మూడో రౌండ్‌లో 202 ఓట్లు వచ్చాయి. దీంతో తదుపరి ఓటింగ్‌ను స్థానిక కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నానికి వాయిదా వేశారు. స్పీకర్ లేకుండానే సభ వాయిదా పడింది. అమెరికా చరిత్రలో 1923 నుంచి చూస్తే ప్రతినిధుల సభలో తొలి రోజు స్పీకర్‌ను ఎన్నుకోలేకపోవడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. మెక్‌కార్తీ ఇక ఏం చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. కొత్త స్పీకర్ ఎన్నికయ్యే దాకా సభలో ఓటింగ్ నిర్వహిస్తారు. మెక్‌కార్తీకి వ్యక్తిగతంగా, రాజకీయంగా చాలామంది ప్రత్యర్థులు ఉన్నారని రిపబ్లికన్ ముఖ్యనేత ఒకరు చెప్పారు. ఆయన స్పీకర్‌గా ఎన్నిక కావడం సొంత పార్టీలోనే కొందరికి ఇష్టం లేదన్నారు. మెక్‌కార్తీ స్పీకర్ కావడం కష్టమేనని రిపబ్లికన్ సభ్యుడు బాబ్‌గుడ్ వ్యాఖ్యానించారు. స్పీకర్ లేకుండా సభ సంపూర్ణం కాదు. నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించడం, కమిటీలకు చైర్మన్లను నియమించడం, సభా కార్యకలాపాలు నిర్వహించడం వంటివి స్పీకర్ బాధ్యతలే. మెజారిటీ ఉన్నా సొంత పార్టీ అభ్యర్థి స్పీకర్‌గా నెగ్గకపోవడం విపక్షానికి చేదు అనుభవమేనని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.



భారత్‌లో అమెరికా రాయబారిగా ఎరిక్..!

సెనేట్ ఆమోదానికి పంపిన బైడెన్



వాషింగ్టన్ : భారత్‌లో అమెరికా రాయబారిగా ఎరిక్ గార్సెట్టిని (51) అధ్యక్షుడు జో బైడెన్ పునర్నియమించారు. ఎరిక్ నియామకాన్ని అమెరికా కాంగ్రెస్‌లో సెనేట్ ఆమోదించాల్సి ఉంది. లాస్ ఏంజెల్స్ మాజీ మేయర్ అయిన ఎరిక్ గార్సెట్టి బైడెన్‌కు అత్యంత సన్నిహితుడు. గతంలో 2021 జులైలో ఎరిక్‌ను భారత రాయబారిగా నియమించినప్పుడు అప్పట్లో రిపబ్లికన్ సెనేటర్ చక్ గ్రాసిటీ అడ్డుకున్నారు. మరోవైపు తన పాలనా విభాగంలోని కీలక పదవుల్లో అరడజనుకిపైగా ఇండియన్ అమెరికన్లను బైడెన్ మంగళవారం రీ నామినేట్ చేశారు. బైడెన్ డిప్యూటీ సెక్రటరీ ఆఫ్ స్టేట్ ఫర్ మేనేజ్‌మెంట్ రిసోర్సెస్ పదవికి రిచర్డ్ వర్మ, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ఎగ్జిక్యూటివ్ బోర్డు ప్రతినిధిగా డాక్టర్ వివేక్ హాలెగెరె మూర్తి (45)ని రీ నామినేట్ చేస్తూ సెనేట్ ఆమోదానికి పంపించారు. వీరే కాకుండా ప్రవాస భారతీయులైన అంజలి చతుర్వేది, రవి చౌధరి, గీతా రావు గుప్తా, రాధా అయ్యంగార్‌లను ప్రభుత్వంలో వివిధ పదవులకు రీ నామినేట్ చేస్తూ సెనేట్‌కు పంపించారు.

తోటి ప్రయాణికురాలిపై మూత్ర విసర్జన

- న్యూయార్క్–ఢిల్లీ ఎయిర్ ఇండియా ఫ్లైట్‌లో దారుణం
- నిందితుడిపై 30 రోజులపాటు నిషేధం విధించిన ఎయిరిండియా

ముంబై: న్యూయార్క్–ఢిల్లీ ఎయిర్ ఇండియా విమానంలో షాకింగ్ సంఘటన జరిగింది. మద్యం మత్తులో ఉన్న ఓ ప్రయాణికుడు తోటి ప్రయాణికురాలిపై మూత్ర విసర్జన చేశాడు. అతడు 70 ఏళ్ల వృద్ధుడని తెలిసింది. గత ఏడాది నవంబర్ 26న జరిగిన ఈ ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఖరీదైన బిజినెస్ క్లాస్‌లో ప్రయాణిస్తూ అందరూ తలదించుకొనేలా ప్రవర్తించాడు. దీంతో అతడు 30 రోజులపాటు తమ విమానాల్లో ప్రయాణించకుండా ఎయిర్ ఇండియా యాజమాన్యం నిషేధం విధించింది. తీవ్ర అభ్యంతరకరంగా, అమర్యాదకరంగా ప్రవర్తించాడని ఆక్షేపించింది. ఎయిర్ ఇండియా సమాచారం ప్రకారం.. నవంబర్ 26న ఏఐ–102 విమానం అమెరికాలోని న్యూయార్క్ జేఎఫ్‌కే ఎయిర్‌పోర్టు నుంచి స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఢిల్లీకి బయలుదేరింది. ప్రయాణికులంతా భోజనం చేసిన తర్వాత లైట్లు ఆర్పేశారు. కొద్దిసేపటికి మద్యం మత్తులో ఉన్న వృద్ధుడు నెమ్మది నడుచుకుంటూ వెళ్లి, సీట్లో కూర్చున్న ప్రయాణికురాలిపై మూత్ర విసర్జన చేశాడు. అనంతరం అక్కడే నిల్చున్నాడు. మరో ప్రయాణికుడు ఇదంతా గమనించి, గట్టిగా మందలించడంతో తన సీట్లోకి తిరిగి వచ్చాడు. విమానంలోని సిబ్బంది బాధితురాలికి మరో సీట్ ఏర్పాటు చేశారు. విమానంలో తనకు జరిగిన అవమానంపై బాధితురాలు ఎయిర్ ఇండియా అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. అధికారులు ఢిల్లీలో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వృద్ధుడిపై కేసు నమోదయ్యింది. విమానం ఢిల్లీలో ల్యాండ్ అయిన తర్వాత నిందితుడిని ఎయిర్ ఇండియా సిబ్బంది పట్టుకోకుండా వదిలేశారని బాధితురాలు ఆరోపించింది. ఆమెకు న్యాయం చేకూర్చేందుకు దర్యాప్తు సంస్థలకు పూర్తిగా సహకరిస్తామని ఎయిర్ ఇండియా ప్రకటించింది. ఎయిర్ ఇండియా నుంచి పూర్తి నివేదిక కోరామని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తప్పవని పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్(డీజీసీఏ) స్పష్టం చేసింది. నిందితుడి కోసం గాలించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఢిల్లీ పోలీసు అధికారుల బుధవారం తెలియజేశారు.



సాక్షి కరీంనగర్

గురువారం । 5 జనవరి । 2023



'కెప్టెన్'ను కలిసిన జీవీ

కరీంనగర్: మాజీ ఎంపీ కెప్టెన్ వి.లక్ష్మీకాంతా రావును బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీఆర్ మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



సీఎంను కలిసిన కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్: హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛం అందించారు.

గరిష్ఠం/కనిష్ఠం
31.0/18.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలతో తేమశాతం పెరుగుతుంది. చలి కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

వాహనదారులు పన్ను చెల్లించండి



తిమ్మాపూర్: వాహనదారులు తక్షణమే త్రైమాసిక పన్ను చెల్లించాలని ఉమ్మడి జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ సూచించారు. పన్ను చెల్లించకుండా తిరిగే వాహనాలను సీజ్‌చేస్తామని హెచ్చరించారు. తిమ్మాపూర్‌లోని రవాణాశాఖ కార్యాలయంలో మాట్లాడుతూ.. 2022–23 సంవత్సరానికి ప్రభుత్వం నిర్దేశించిన ఆదాయ లక్ష్యాన్ని చేరుకోవడంతోపాటు రహదారి భద్రతను పెంపొందించేలా రవాణాశాఖ అధికారులు కృషి చేయాలని కోరారు. త్రైమాసిక పన్ను చెల్లించని, ఫిట్‌నెస్ లేని వాహనాలపై దృష్టి సారించాలని సూచించారు. కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల రవాణా అధికారులు కొండల్‌రావు, ఉమామహేశ్వర్‌రావు, నాగలక్ష్మి ,సిరాజుద్దీన్, మసూద్ అలీ, రజినీదేవి, వంశీధర్, కిశోర్ చంద్రారెడ్డి, రంజిత్, రవికుమార్, భీంసింగ్, అశోక్, కరుణాకర్, దినేశ్ ఉన్నారు.

ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలి



సప్తగిరికాలనీ(కరీంనగర్): ఇటీవల చేపట్టిన ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బోనగిరి మహేందర్ అధ్యక్షతన బుధవారం బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. బీఎస్‌ఎఫ్, యూత్ కాంగ్రెస్, డీవైఎఫ్ఐ, ఎస్‌ఎఫ్ఐ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు. ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యల పరిష్కార పోరాట సమితి ఏర్పాటు చేసి 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. నాయకులు జక్కనపల్లి గణేశ్, యుగంధర్, తిరుపతి నాయక్, అబ్దుల్ రెహమాన్, హేమంత్ కుమార్, రజనీకాంత్, తిరుపతి, నరేశ్, శ్రీకాంత్, షహబత్ ఉల్లాఖాన్, సంగుపట్ల మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

స్వల్పంగా పెరిగిన పత్తి ధర



జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్లో పత్తిధరలు క్రమంగా పెరుగుతున్నాయి. బుధవారం స్థానిక మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.8,400 పలికింది. మార్కెట్‌కు 38 వాహనాల్లో 386 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకొచ్చారు. క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.8,400, మోడల్ ధర రూ.8,300, కనిష్ట ధర రూ.7,800కు కొనుగోలు చేశారు. గన్నీ సంచుల్లో ఐదుగురు రైతులు ఎనిమిది క్వింటాళ్ల పత్తిని తీసుకరాగా క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.8,000, మోడల్‌ధర రూ.7,900, కనిష్ట ధర రూ.7,200కు ఖరీదు వ్యాపారులు కొనుగోలు చేశారు.

'రూటు మార్చిన బండి.. చిచ్చుపెట్టితే తరిమి కొడతాం'

మానకొండూర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ మతాల మధ్య చిచ్చు పెట్టడం సాధ్యం కావడంలేదని, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నాడని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామక్రిష్ణారావు మండిపడ్డారు. మండల కేంద్రంలో బుధవారం మాట్లాడుతూ.. ఎంపీ బండి సంజయ్ మానసిక పరిస్థితి బాగాలేదని ఆయన్ను సైక్రియాజిస్టు దగ్గరకు తీసుకెళ్లాలని బీజేపీ నాయకులకు సూచించారు. సీఎం కేసీఆర్ తెలంగాణ సాధిస్తేనే సంజయ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అయ్యాడన్న అంశం గుర్తుంచుకుంటే మంచిదన్నారు. ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తే ఇక చూస్తు ఊరుకోరని, ఆంధ్రా, తెలంగాణ ప్రజలు తరిమికొడతారని అన్నారు. జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, సర్పంచ్ పిట్టల మధు, ఉప సర్పంచ్ నెల్లి మురళి, తదితరులు ఉన్నారు.


నేడు విజయసారథి సంస్మరణ సభ

కరీంనగర్‌కల్చరల్: పద్మశ్రీ శ్రీభాష్యం విజయసారథి సంస్మరణ సభను గురువారం సాయంత్రం ఆరుగంటలకు జ్యోతినగర్‌లోని ఎక్స్‌ప్లోరికా కేంబ్రిడ్జి పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు సాహిత్యగౌతమి అధ్యక్షుడు గంద్ర లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు.

సరసమైన ధరలకే విరాసత్!

ఫోన్ పే, గూగుల్ పే సౌకర్యం కూడా కలదు

- గంగాధర మండల రెవెన్యూ అధికారుల దందా
- వ్యవసాయ భూమి విరాసత్‌కు రూ.5లక్షలు డిమాండ్
- ఆర్‌ఐ, వీఆర్‌ఏలకు రూ.1.50 లక్షలు ఫోన్‌పే చేసిన రైతు
- రైతు ఆరోపణలు అవాస్తవమని ఖండించిన తహసీల్దార్



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: జిల్లాలో రెవెన్యూ అధికారుల ఇష్టారాజ్యం నడుస్తోంది. వారసత్వ భూముల విరాసత్ విషయంలో చేతులు తడపందే పనులు కావడం లేదు. గంగాధర తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఏడాదికాలంలో విరాసత్ విషయంలో రైతును కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు. చివరికి విసిగిన రైతుతో బేరమాడారు. రూ.5లక్షలకు బేరం కుదిరింది. పనికి ముందు రూ.2 లక్షలు, విరాసత్ అనంతరం రూ.3లక్షలు ఇచ్చేలా ఒప్పందం జరిగింది. ఒప్పందం ప్రకారం.. తొలుత రైతు గంగాధర్ రూ.1.70 లక్షలు ఇచ్చాడు. అయినా ఫైలు ముందుకు కదల్లేదు. ఏమైందని నిలదీస్తే.. సాంకేతిక కారణాలు అడ్డువస్తున్నాయని, ఈ విరాసత్ చేయడం కుదరదని అందుకే జాప్యం అవుతోందని చెబుతూ కాలయాపన చేస్తూ వచ్చారు. దీంతో విసిగిపోయిన రైతు గంగాధర్ బుధవారం ఏకంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగుచూసింది.

అసలేం జరిగింది?

గంగాధర మండలం గట్టుభూత్కూర్ గ్రామంలో కాంపెల్లి గంగాధర్ అనే రైతు 2012లో అదే గ్రామానికి చెందిన చెక్కబండి వెంకటరమణారెడ్డి పొలాన్ని సాదా బైనామా ద్వారా కొనుగోలు చేశాడు. అప్పటికే వెంకటరమణారెడ్డి తండ్రి అనంతరెడ్డి మరణించారు. వెంకటరమణారెడ్డి వృత్తిరీత్యా అందుబాటులో లేకపోవడంతో విరాసత్‌లో జాప్యమైంది. 2022 జనవరిలో రైతు గంగాధర్ వినతి మేరకు వెంకటరమణారెడ్డి విరాసత్‌కు దరఖాస్తు చేశారు. దాన్ని తహసీల్దార్ గుర్రం శ్రీనివాస్ సాంకేతిక కారణాలు చెప్పి తిరస్కరించాడు. తరువాత ఇదే దరఖాస్తు కోసం రైతు గంగాధర్ పలుమార్లు తహసీల్దార్ ఆఫీసుకు తిరిగాడు. ఆరునెలలపాటు రైతును తిప్పించుకున్న రెవెన్యూ సిబ్బంది చివరికి బేరానికి దిగారు. రూ.5లక్షలు ఇస్తేనే పనవుతుందని తేల్చిచెప్పారు. అప్పటికే విసిగిపోయిన రైతు గంగాధర్ చివరికి సరే అన్నాడు. గతేడాది జూన్ 17వ తేదీన ఆర్‌ఐ అశోక్‌కు రూ.50వేలు ఫోన్ పే ద్వారా పంపాడు. వీఆర్‌ఏ మునీందర్‌కు జూన్ 25న రూ.లక్ష ఫోన్ పే ద్వారా, రూ.20వేలు నగదు రూపంలో చెల్లించాడు. మిగిలిన డబ్బులు విరాసత్ తరువాత ఇస్తానని చెప్పినా.. ఆర్‌ఐ, వీఆర్‌ఏలు పని ముందుకు వెళ్లకుండా కాలయాపన చేస్తున్నారని రైతు వాపోయాడు.

రూ.5 లక్షలిస్తేనే పని చేస్తారట



నేనేంతో కష్టపడి ఆ భూమిని కొన్నాను. ఆ సమయంలో భూయజమాని వెంకటరమణారెడ్డి తండ్రి మరణించారు. దీంతో నేను సాదా బైనామా రాయించుకున్నా. తరువాత మేం ఎవరి పనుల్లో వారిమి మునిగిపోయాం. గతేడాది మేం విరాసత్ ప్రక్రియ ప్రారంభించాం. ఏడాదికాలంగా రెవెన్యూ సిబ్బంది అయిన ఆర్‌ఐ అశోక్, వీఆర్‌ఏ మునీందర్ ద్వారా రూ.5లక్షలు ఇస్తేనే పని అవుద్దన్నారు. అందులో భాగంగానే నేను రూ.1.70 లక్షలు చెల్లించాను. మిగిలినవి తరువాత ఇస్తా అని చెప్పాను. అయినా, మొత్తం ఇస్తేనే విరాసత్ చేస్తామని, దిక్కున్నచోట చెప్పుకోవాలని రెవెన్యూ సిబ్బంది తెలిపారు.

– కాంపెల్లి గంగాధర్, రైతు

అవన్నీ అవాస్తవాలు

ఆ రైతు చెప్పేవన్నీ అవాస్తవాలు. ఆ భూమి వారసత్వం విషయంలో చిన్న వివాదం ఉంది. విచారణ జరిపించి నివేదికను కలెక్టర్‌కు పంపాం. సదరు రైతు మా ఆర్‌ఐ, వీఆర్‌ఏలను మభ్యపెట్టి ఫోన్ పే ద్వారా డబ్బులు పంపి ఇరికించాడు. ఈ విషయం ఈ రోజే నా దృష్టికి వచ్చింది. అదేరోజు మా సిబ్బంది చెప్పి ఉంటే.. లీగల్‌గా ప్రొసీడ్ అయ్యేవాళ్లం. వాటిని చూపెడుతూ కొంతకాలంగా బ్లాక్ మెయిల్ చేస్తున్నాడని మా సిబ్బంది వాపోయారు. బెదిరిపోయిన సిబ్బంది ఆ డబ్బును ఇప్పటికే వెనకకు ఇచ్చేశామని కూడా తెలిపారు. వాస్తవానికి ఆ విరాసత్ ఫైల్ ఎప్పటికైనా కావాల్సిందే. మేము కూడా పనిని ఎక్కడా ఆపిందే లేదు.

– గుర్రం శ్రీనివాస్, తహసీల్దార్, గంగాధర

అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన లూయిస్ బ్రెయిలీ



కరీంనగర్: స్పర్శ ద్వారానే అక్షరజ్ఞానాన్ని, ప్రపంచ జ్ఞానాన్ని తెలుసుకునే మార్గాన్ని కనిపెట్టి అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన గొప్ప వ్యక్తి లూయిస్ బ్రెయిలీ అని కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ అన్నారు. లూయిస్ బ్రెయిలీ 214వ జయంతి సందర్భంగా శాతవాహన యూనివర్సిటీ దగ్గర ఉన్న లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అంధులు బ్రెయిలీని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. లూయిస్ స్ఫూర్తితో ఎంతోమంది అంధులు జీవితంలో ఎన్నో మైలురాళ్లను దాటారని అన్నారు. అనంతరం జాతీయ అంధుల సమాఖ్య కరీంనగర్‌శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి శిక్షణ కలెక్టర్ లెనిన్ హాజరయ్యారు. బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. పలువురికి చేతికర్రలు పంపిణీ చేశారు. జిల్లా సంక్షేమ అధికారి కె.సబిత, అంధుల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ నర్మద, సీడీపీవోలు కస్తూరి, ఉమారాణి, డీసీపీవో శాంత, సఖి అడ్మిన్ లక్ష్మీ, అంధుల జాతీయ సమైక్య జిల్లా అధ్యక్షుడు సురేశ్, అడ్వైజర్ నర్సయ్య, కోఆర్డినేటర్ ఏ.రాజయ్య, కార్యదర్శి జి.సత్యనారాయణ ఉన్నారు.

ఆయిల్‌పామ్ ఎగుమతి చేసేలా ఎదగాలి

- రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్



మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్: పంటలసాగులో అన్నపూర్ణగా నిలిచిన తెలంగాణ నుంచి ఆయిల్‌పామ్‌ను ఎగుమతి చేసేలా తీర్చిదిద్దుదామని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉద్యాన, వ్యవసాయ, పట్టుపరిశ్రమ, లోహియా ఎడిబుల్ ఆయిల్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ తోటల సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మంత్రి కమలాకర్ ముఖ్యఅతిథి పాల్గొని మాట్లాడుతూ.. వంటనూనెకు మంచి డిమాండ్ ఉందని, అందుకు అనుగుణంగా ఆయిల్‌పామ్‌ను సాగు చేయాలని సూచించారు. విత్తనాల పంపిణీ నుంచి పంట అమ్మకం వరకు లోహియా ఎడిబుల్ సంస్థ బాధ్యత వహిస్తుందని అన్నారు. భారతదేశం 90 నుంచి 95శాతం నూనెను దిగుమతి చేసుకుంటోందని, మనం ఆయిల్‌పామ్ పంటను ఎగుమతి చేసే దిశగా ఎదగాలని సూచించారు. కలెక్టర్ కర్ణన్ మాట్లాడుతూ రైతులకు విత్తనాలు, డ్రిప్‌ను సబ్సిడీపై అందించడం జరుగుతుందని, తక్కువ సమయంలో అధిక దిగుబడి సాధించవచ్చని సూచించారు. చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తన పొలంలో ఆయిల్‌పామ్ సాగుచేస్తున్నానని తెలిపారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే వి.సతీశ్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీధర్, ఉద్యానవనశాఖ అధికారి శ్రీనివాస్, ఆత్మపీడీ ప్రియదర్శిని, శిక్షణ కలెక్టర్ లెనిన్ వాత్సల్ టోప్పో, లోహియా సంస్థ అధికారి రంగనాయకులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టు వరకు నీరు అందించాలి

యాసంగిలో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని మంత్రి గంగుల కమలాకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంత్రి అధ్యక్షతన ఇరిగేషన్‌శాఖ అధికారులు, గుత్తేదారులతో జిల్లాస్థాయి ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు సమావేశం జరిగింది. మంత్రి మాట్లాడుతూ.. జిల్లాలోని 11మండలాల్లో 1,31,768 ఎకరాల విస్తీర్ణంలో కాకతీయ కాలువ ఆధారంగా వివిధ రకాల పంటలు సాగుచేయడం జరుగుతోందని వివరించారు. రబీ, యాసంగిలో డీ 83, 86 కాలువల ద్వారా దిగువకు నీటిని విడుదల చేసేముందు ఓవర్‌ఫ్లోతో ఇబ్బంది పడకుండా అధికారులు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. పెండింగ్ కాలువలు, చెరువుల పనులు త్వరగా పూర్తిచేయాలని గుత్తేదారులను ఆదేశించారు. కాలువల నిర్మాణంలో ఎదురయ్యే భూ సంబంధిత, ఆర్థిక సమస్యలను త్వరలోనే పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో కలెక్టర్ కర్ణన్, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, వొడితెల సతీశ్‌కుమార్, అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్, తదితరులు ఉన్నారు.

ఇక ప్రభుత్వ స్థలాల్లోనే నర్సరీ

- ప్రైవేట్ స్థలాల్లో నిర్వహణ ఉండదిక
- వ్యయం తగ్గించాలని నిర్ణయం



తిమ్మాపూర్‌లో హరితహారం నర్సరీ

జిల్లాలో పరిస్థితి	
మండలాలు:	16
హరితహారం నర్సరీలు:	350
గ్రామ పంచాయతీలు:	313
మునిసిపాలిటీలు:	5(కరీంనగర్, హుజూరాబాద్, జమ్మికుంట, కొత్తపల్లి, చొప్పదండి)
మొక్కల లక్ష్యం:	47,19,921

కరీంనగర్ అర్బన్: తెలంగాణకు హరితహారం నర్సరీలు ఇక ప్రభుత్వ స్థలాల్లోనే నిర్వహించనున్నారు. పట్టా భూముల్లో లీజు, కౌలు తదితర ఒప్పందాలు ఉండవద్దని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ కాగా తదనుగుణంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. హరితహారాన్ని మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం పర్యవేక్షణలోకి వెళ్లడంతో ప్రతీది పక్కాగా ఉండేలా వ్యవహరిస్తున్నారు. అందులో భాగంగా హరిత నర్సరీలను పూర్తిగా సర్కారు స్థలాల్లోనే నిర్వహించాలని నిర్ణయించారు. ఒకవేళ ప్రైవేటు స్థలాల్లో ఏర్పాటు చేస్తే నిర్వహణ వ్యయం పంచాయతీలే భరించేలా ఆదేశాలిచ్చారు. ప్రతి మండలంలో 2022–23 (ఆర్థిక సంవత్సరం) నుంచి ఇదే నిర్ణయం పాటించాలని సిబ్బందికి సూచించారు. ఈ క్రమంలో ఉపాధి హామీ యంత్రాంగం సదరు పనుల్లో నిమగ్నమయ్యారు. నర్సరీలకు స్థలం గుర్తించి మొక్కలు పెంచే కార్యక్రమానికి రంగం సిద్ధం చేస్తున్నారు.

350 నర్సరీలకు 200కు పైగా ప్రైవేట్ స్థలాలు

జిల్లాలో 313 గ్రామ పంచాయతీలుండగా 5 మునిసిపాలిటీలున్నాయి. కాగా ప్రతి గ్రామంలో నర్సరీ ఉండాలని, ప్రభుత్వ స్థలంలోనే నర్సరీని ఏర్పాటు చేయాలని స్పష్టంగా నిర్దేశించారు. అలాగే మండలానికి రెండు ప్రత్యేక నర్సరీలు ఉండనున్నాయి. గతంలో ప్రైవేటు స్థలాల్లో నీటి వసతి ఏర్పాటు చేసి నెలకు కనీసం రూ.1,000 చొప్పున అద్దె చెల్లించేవారు. కొన్ని మండలాల్లో సగానికిపైగా ప్రైవేటు స్థలాలపైనే ఆధారపడ్డారు. పూర్తిగా సర్కారు స్థలాల్లో ఉంటే ఖర్చు ఆదా చేసుకునే వీలుంటుందని ప్రభుత్వం భావిస్తోంది. పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డు, పాఠశాలలు వంటి ఖాళీ స్థలాల్లో ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు.

ఏటా మొక్కల మిగులు

ప్రతి ఏటా హరితహారం కార్యక్రమం కింద మొక్కలు నాటుతుండగా పూర్తిస్థాయిలో మొక్కలు నాటడం లేదు. వేల మొక్కలు మిగులుతుండగా మరో సంవత్సరం నాటినా ప్రయోజనం లేదని ఉపాధి అధికారులు చెబుతున్నారు. గతంలో జిల్లాలో లక్షల్లో మొక్కలు మిగిలాయి. 2016, 2017, 2018 సంవత్సరాల్లో మొత్తంగా 30లక్షల మొక్కలు మిగులగా కోట్ల నష్టం. సదరు ఘటనలు పునరావృతం కాకుండా ప్రతి మొక్క నాటబడేలా పర్యవేక్షణ ఉండాలని, ఒక్క మిగలకుండా కార్యచరణ ఉండాలని ప్రభుత్వం సూచించింది.

మొదలైన పనులు

పంచాయతీలు గుర్తించిన స్థలాలను చదును చేసుకోవడం, మట్టిని తరలించడం పనులు ఇప్పటికే కొన్నిచోట్ల మొదలు పెట్టారు. సకాలంలో వానలు పడితే మొక్కలు నాటేందుకు ఇబ్బంది తలెత్తొద్దని భావిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో సర్కారు స్థలాలు లేవని చెబుతున్నారు. ఇందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. ఇదిలాఉండగా నర్సరీలకు పూర్తిగా ప్రభుత్వ స్థలాలే ఎంపిక చేయాలని ఇప్పటికే ఆదేశించామని, ప్రతి గ్రామంలో నర్సరీ ఉండాలని మార్గదర్శకాలు జారీ చేసినట్లు డీఆర్డీవో అధికారులు వివరించారు. ప్రైవేటు స్థలంలో నిర్వహిస్తే ఈజీఎస్ నుంచి బిల్లులు రావని పేర్కొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు



సంబరాల్లో బీజేపీ శ్రేణులు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ పట్టణం తీగలగుట్టపల్లి ఎల్‌సీ నంబరు 18 వద్ద రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ) నిర్మాణ పనులకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. దీంతో బుధవారం బీజేపీ శ్రేణులు రైల్వే ఓవర్‌బ్రిడ్జి వద్ద సంబరాలు జరుపుకున్నారు. పలువురు నేతలు మాట్లాడుతూ తొమ్మిది ఏళ్లగా రాష్ట్రంలో అధికారంలో కొనసాగుతున్న కేసీఆర్ ప్రభుత్వం ఆర్‌వోబీ నిర్మాణం చేయాలనే ఆలోచన, ప్రయత్నాలు చేయలేదన్నారు. కరీంనగర్ ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ ఆర్‌వోబీ సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక దృష్టి సారించి, తగిన ప్రయత్నాలు చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వ సేతు బంధన్ నిధులతో ఆర్‌వోబీ నిర్మాణం చేపట్టడానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని అన్నారు. తీగలగుట్టపల్లి ప్రాంతంలో రూ.154.74 కోట్ల కేంద్ర ప్రభుత్వం నిధులతోనే రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఘనతేనని, బీజేపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు.

6,7 తేదీల్లో అర్చక పరీక్షలు

కరీంనగర్‌కల్చరల్: రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ ఉత్తర్వుల మేరకు ఈ నెల 6,7 తేదీల్లో అర్చక పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్, నోడల్ అధికారి, చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎనిమిది ఆగమాల్లో ప్రవేశ, వర, ప్రవర మూడుస్థాయిల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో పరీక్షలకు ఆన్‌లైన్‌లో 518 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. జనవరి 6న 374 మందికి లిఖిత పూర్వక, 144 మందికి మౌఖిక పరీక్షలు కరీంనగర్ కోర్టు చౌరస్తా వద్ద గల రాజరాజేశ్వర కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నామని, అభ్యర్థులు హాల్‌టికెట్, కావాల్సిన ధ్రువపత్రాలతో అరగంట ముందే హాజరు కావాల్సి ఉంటుందన్నారు. అర్చక పరీక్షలు తెలుగు, సంస్కృతం, హిందీ భాష మాత్రమే రాయాల్సి ఉంటుందని తెలిపరు. పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని, ఎలాంటి మాల్ ప్రాక్టీస్ తావు లేదని, వదంతులు నమ్మవద్దని అభ్యర్థులకు సూచించారు.

మంత్రి కమలాకర్‌కు పితృ వియోగం

- అనారోగ్యంతో కన్నుమూసిన గంగుల మల్లయ్య
- కమలాకర్‌ను పరామర్శించిన నేతలు, అధికారులు





కమలాకర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్, మంత్రి ఈశ్వర్, జీవీఆర్, తదితరులు

కరీంనగర్: రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ తండ్రి గంగుల మల్లయ్య బుధవారం సాయంత్రం క్రిస్టియన్‌కాలనీలోని ఆయన స్వగృహంలో గుండెపోటుతో చనిపోయారు. కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో హైదరాబాద్‌లో చికిత్స పొందారు. గంగుల మల్లయ్యకు నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. కమలాకర్ చిన్న కుమారుడు. తండ్రి మృతితో కమలాకర్ ఇంట్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. మల్లయ్య పార్థివదేహానికి పలువురు నేతలు, అధికారులు, కార్యకర్తలు, ప్రజలు నివాళి అర్పించారు. మంత్రి కొప్పుల ఈశ్వర్, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, బాలకిషన్, సతీశ్‌బాబు, మేయర్ వై.సునీల్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ. రామక్రిష్ణారావు, గ్రంథాలయ చైర్మన్ అనిల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డి, చల్మెడ లక్ష్మీనర్సింహారావు, సీపీ సత్యనారాయణ, అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్, మున్సిపల్ కమిషనర్ ఇస్లావత్, డీటీసీ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్, పోలీసు సిబ్బందితో పాటు కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు మంత్రి కమలాకర్‌ను ఓదార్చి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ మంత్రి కమలాకర్‌కు ఫోన్ చేసి పరామర్శించారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ గంగుల మల్లయ్య మరణంపై విచారం వ్యక్తం చేశారు. మంత్రి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

క్లుప్తంగా

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, నాయకులు

కరీంనగర్: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను బుధవారం అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి గోల్కొండ శ్రీధర్, జిల్లా అధ్యక్షుడు ముక్కల కుమార్, సీనియర్ నాయకులు జీహెచ్‌ఎం భూంరెడ్డిని తొలిమెట్టు కార్యక్రమం అమలు తీరు, తదితర విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేఎఫ్ జావేద్, కోశాధికారి రాజమౌళి, కార్యదర్శులు ఆసిఫ్ ఆ లీ, శుభాన్ సిద్ధికి, తిరుపతి, ఆడిట్ కమిటీ కన్వీనర్ శ్యాం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల క్యాలెండర్ ఆవిష్కరించిన జిల్లా జడ్జి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జిల్లా జడ్జి ప్రతిమ, న్యాయవాదులు

కరీంనగర్‌క్రైం: న్యాయవాదులు పని చేసే రోజులు, సెలవులకు సంబంధించి ఆల్ ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ ముద్రించిన క్యాలెండరును జిల్లా జడ్జి బి.ప్రతిమ బుధవారం ఆవిష్కరించారు. న్యాయవాదులకు ఎంతో ఉపయోగపడేలా క్యాలెండర్‌ను ముద్రించిన లాయర్స్ అసోసియేషన్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ జి.సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు జి.బీమాసాహెబ్, సీనియర్ న్యాయవాదులు జగదీశ్ చందర్‌రావు, గుణవంత్‌సింగ్, ఎంవీ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శేఖర్‌రావుకు పురస్కారం



అవార్డు అందుకుంటున్న శేఖర్‌రావు

సప్తగిరికాలనీ(కరీంనగర్): విద్యారంగంలో చేస్తున్న కృషికి గుర్తింపుగా ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావుకు బ్రెయిన్ ఫీడ్ సంస్థ వారు జీవితకాల సాఫల్య పురస్కారాన్ని బుధవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చేతుల మీదుగా పురస్కారం స్వీకరించారు. ఈ సందర్భంగా శేఖర్‌రావు మాట్లాడుతూ అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు. ఉపాధ్యాయులు, ట్రస్మా సంఘ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

హరితహారం.. లాభాల సారం

• ఈ మొక్కలు నాటితే లాభదాయకం • ఆగ్రోఫారెస్టు పథకం ద్వారా సాగుకు చర్యలు

కరీంనగర్ అర్బన్: రోజురోజుకూ వ్యవసాయ రంగంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. నేల అనుకూలతలను బట్టి వాణిజ్య పంటలైన శ్రీచందనం, టేకు, వెదురు, సరుగు పంటలపై దృష్టిసారిస్తే తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందే అవకాశముంది. ఆగ్రో ఫారెస్టు పథకం ద్వారా వ్యవసాయ భూముల్లో అటవీ వాణిజ్య పంటలు సాగు చేసేలా ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తోంది. ఇందుకు హరితహారం పథకాన్ని వినియోగిస్తోంది. నర్సరీల్లో సదరు మొక్కలకు ప్రాధాన్యతనివ్వగా ఇప్పటి నుంచే రైతులను తదనుగుణంగా అప్రమత్తం చేయనున్నారు. పర్యావరణానికి మేలు కలగడంతో పాటు రైతులకు అదనపు ఆదాయం లభించనుంది. పొలాల గెట్లు, సరిహద్దుల్లో వీటిని నాటుకున్నా కొన్నేళ్లకు ఆదాయం పొందొచ్చని అటవీ శాఖ చెబుతున్న మాట.

సరుగుడు



ఇవి నిటారుగా పెరిగే వృక్షాలు. ఇళ్ల నిర్మాణ సమయంలో ఎక్కువగా ఉపయోగిస్తారు. తక్కువ సారం ఉన్న ఇసుక నేలల్లో సైతం సాగు చేసుకోవచ్చు. ఎకరానికి 335 మొక్కల వరకు జూన్ నుంచి సెప్టెంబర్ వరకు నాటుకోవచ్చు. అంతరపంటగా తర్భూజ, నువ్వులు, వేరుశనగ, పప్పు దినుసులు వేసుకోవచ్చు. నాలుగేళ్ల తరువాత ఎకరానికి 40– 60 టన్నుల మేర దిగుబడి వస్తుంది.

టేకు.. కలపకు రారాజు



టేకును ఇంటి నిర్మాణం, ఫర్నీచర్ వినియోగంలో విరివిగా ఉపయోగిస్తారు. మన జిల్లా నేలలు టేకు సాగుకు అనుకూలం. ఎకరానికి 400 వరకు మొక్కలను నాటుతారు. పొలమంతా కాకుండా ఒడ్లు, ఇళ్ల, పొలాల సరిహద్దులో వీటిని నాటుకోవచ్చు. వీటిని ప్రభుత్వమే ఉచితంగా పంపిణీ చేస్తోంది. ఉపాధి పథకం ద్వారా గుంతలు తవ్వి నాటుతున్నారు. నాలుగేళ్ల పాటు కాపాడితే ఒక్కో చెట్టుకు 10నుంచి 12 ఘనపుటడుగుల కలప వస్తుంది. అంటే సుమారు రూ.30 వేల ఆదాయం వస్తుంది. ఎకరానికి రూ.60– 90లక్షల ఆదాయం వచ్చే అవకాశముంది.

ఎర్ర చందనం.. 20 ఏళ్లు కష్టపడితే లాభాల పంట



శ్రీచందనం తర్వాత లాభదాయకమైన పంట ఎర్రచందనం. మూడున్నర వెడల్పు దూరం ఉండేలా ఎకరానికి 335 మొక్కలు నాటుకోవచ్చు. ఒక్కో మొక్క రూ.30 ఉంటుంది. నాటిన తర్వాత 20 ఏళ్లకు చేతికి వస్తుంది. ఒక్కో చెట్టు ద్వారా రూ.2లక్షల నుంచి రూ.7లక్షల వరకు ఆదాయం వస్తుంది. 20– 30 ఏళ్ల వరకు ఆగాల్సి ఉంటుంది.

వెదురు.. పచ్చబంగారం



వ్యవసాయ క్షేత్రాల్లోనూ వీటిని సాగు చేస్తే దిగుబడి బాగా వస్తుంది. ఎకరానికి వెయ్యి మొక్కలు నాటుతారు. ఉద్యానవన, అటవీ నర్సరీలో లభిస్తాయి. నాలుగేళ్ల తర్వాత ఇది చేతికి వస్తుంది. ఎకరానికి 10–14 టన్నుల మేర దిగుబడి వస్తుంది. ఒకసారి వీటిని కొట్టివేసినా కాండం కుచ్చుల నుంచి మళ్లీ పెరుగుతాయి. నర్సరీల ద్వారా రైతులకు ఆదాయాన్నిచ్చే మొక్కల గురించి అవగాహన కల్పిస్తున్నామని, టేకు, సరుగు, వెదురు, ఎర్రచందనం మొక్కలు నర్సరీల్లో అందుబాటులో ఉంటాయని అటవీ, ఉద్యాన శాఖల అధికారులు చెబుతున్నారు.



శ్రీగంధం.. లాభాల సుగంధం

శ్రీగంధం సాగు చేస్తే 15 ఏళ్ల తర్వాత కాసుల పంటనే. నీరు నిల్వ ఉండని అన్ని రకాల నేలలు దీనికి అనుకూలం. ఎకరంలో 350– 430 మొక్కలు నాటుకోవచ్చు. దీని కాండం పరిపుష్టి కావడానికి 15 ఏళ్లు పడుతుంది. ఒక్కో చెట్టుకు 20– 25 కిలోల వరకు కాండం(గంధం) దిగుబడి వస్తుంది. అంటే ఒక ఎకరంలో 400 మొక్కలు తీసుకున్నా పదివేల కిలోల వరకు గంధం వస్తుంది. విపణిలో కిలోకు రూ.27 వేల నుంచి రూ.30వేల వరకు ధర ఉంది. మొక్క నాణ్యతను బట్టి రూ.30 నుంచి రూ.50వరకు లభిస్తుంది. మొక్కలు సిద్దిపేట జిల్లా ములుగులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఉద్యానవన విశ్వవిద్యాలయంతో పాటు ప్రైవేటు నర్సరీల్లో కూడా ఉన్నాయి.

ఇంటికి నిప్పు పెట్టిన కేసులో ఇద్దరు అరెస్ట్

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీకి చెందిన దేవయ్య ఇంటిని తగలబెట్టిన ఘటనలో బుధవారం ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ రమేశ్ తెలిపారు. దేవయ్య కుమారుడు రాజశేఖర్ అదే కాలనీకి చెందిన పిట్టల సంజన అనే యువతిని ప్రేమ వివాహం చేసుకోగా, యువతి సోదరుడు (మైనర్) క్షణికావేశానికి లోనై తన మిత్రుడు గాజుల హర్షవర్ధన్‌తో కలిసి దేవయ్య ఇంటికి నిప్పు పెట్టాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇంటిని తగలబెట్టిన హర్షవర్ధన్, బాలుడిని అరెస్టు చేశారు. హర్షవర్ధన్‌ను కోర్టులో హాజరుపరచగా 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు తెలిపారు. బాలుడిని జువైనల్ జస్టిస్ బోర్డులో హాజరుపరచగా చైల్డ్ వేల్ఫేర్ ఆఫీసర్ జువైనల్ హోమ్‌కు తరలించారు.

ఇసుకలారీ ఢీకొని వృద్ధురాలు మృతి

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద బుధవారం ఇసుక లారీ ఢీకొని అన్నాడి బుచ్చవ్వ(75) అక్కడికక్కడే మృతిచెందింది. ఎస్సై ఉపేందర్‌రావు వివరాలు.. సుల్తానాబాద్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన బుచ్చవ్వ పని నిమిత్తం సుల్తానాబాద్‌కు వచ్చింది. ఈక్రమంలో పోత్కపల్లి రీచ్ నుంచి హైదారాబాద్‌కు చెందిన లారీ డ్రైవర్ ఇసుక లోడ్‌తో అతి వేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ వచ్చి వృద్ధురాలిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్ద అల్లుడు అనంతరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్టీయూ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి గంగుల కమలాకర్, నాయకులు

కరీంనగర్: ఉపాధ్యాయులకు సమాచార భాండాగారం, కార్యకర్తలకు ఉద్యమ కరదీపిక ఎస్టీయూ డైరీ అని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. జిల్లాశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీ, క్యాలెండర్, జీఓల అనుబంధ పుస్తకాలను బుధవారం క్యాంపు కార్యాలయంలో మేయర్ వై.సునీల్‌రావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 75 వసంతాల వజ్రోత్సవాలు జరుపుకున్న ఏకైక సంఘం ఎస్టీయూ అని నాయకులకు అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ హయాంలో మన ఊరు–మన బడితో ప్రభుత్వ పాఠశాలల దశ మారనున్నదని, ప్రత్యేక ప్రణాళికతో విద్యారంగంపై మరింత దృష్టి సారించనున్నామని పేర్కొన్నారు. కాగా పలు సమస్యలను ఎస్టీయూ నాయకులు మంత్రి దృష్టికి తీసుకురాగా, పరిష్కారంలో పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కట్టా రవీంద్రచారి, పిన్నింటి తిరుపతిరావు, రాష్ట్ర నాయకులు దయానంద్, పీఆర్ శ్రీనివాస్, సాన కిషన్, వెంకటరమణ, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓల సంఘం..

కొత్తపల్లి(కరీంనగర్): తెలంగాణ మండల అభివృద్ధి అధికారుల (ఎంపీడీఓ) సంఘం జిల్లా శాఖ క్యాలెండర్‌ను బుధవారం కరీంనగర్‌లోని ఎమ్మెల్యే మీ సేవ కార్యాలయంలో మంత్రి గంగుల కమలాకర్ ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దివ్యదర్శన్‌రావు, ఎ.శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓలు రవీందర్ రెడ్డి, విజయలక్ష్మి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాతీయ జూడో పోటీల్లో పతకాలు సాధించాలి



ఎంపికైన విద్యార్థులతో జనార్దన్‌రెడ్డి తదితరులు

కరీంనగర్‌స్పోర్ట్స్: సీబీఎస్ఈ జాతీయస్థాయి జూడో పోటీల్లో రాణించి పతకాలు సాధించి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి అన్నారు. హర్యానాలోని సోనిపట్‌లో ఈ నెల 7 నుంచి 12 వరకు జరిగే సీబీఎస్ఈ జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపికైన స్థానిక వివేకానంద రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులను బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించి మాట్లాడారు. పాఠశాలకు చెందిన సాత్విక్ వాసుదేవరెడ్డి, కమలహాసిని, అనన్యశ్రీ, భవజ్ఞరెడ్డి, దీక్షమేఘన, వెంకటరీతిక, ఆకుల సిరివల్లి పోటీల్లో పాల్గొననున్నట్లు పీఈటీ టి.సత్యనారాయణ తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను స్కూల్ చైర్మన్ పి.సుధాకర్ రావు, డైరెక్టర్ లలితాకుమారి, వైస్ ప్రిన్సిపాల్ చిత్తరంజన్ మహాపాత్ర, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్‌రెడ్డి, జూడో సభ్యులు ఎల్వీ రమణ, సుధాకర్, శ్రీధర్, సాయిరామ్, ప్రియాంక తదితరులు అభినందించారు.

పాపన్నను ఆదర్శంగా తీసుకోవాలి



ఎమ్మెల్యేకు ఇమామ్ జామిన్ కడుతున్న సర్వర్‌పాషా



విగ్రహం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

చిగురుమామిడి(హుజూరాబాద్): సర్దార్ సర్వాయి పాపన్న పోరాట స్ఫూర్తిని ప్రతీఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్ కుమార్ అన్నారు. చిగురుమామిడిలో బుధవారం సర్వాయిపాపన్న విగ్రహాన్ని జెడ్పీచైర్‌పర్సన్ కనుమల్ల విజయ, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వెన్కెపల్లి– సైదాపూర్ మండలాన్ని సర్దార్ సర్వాయిపాపన్న మండలంగా ప్రతిపాదించినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్తామన్నారు. జెడ్పీచైర్‌పర్సన్ మాట్లాడుతూ సర్వాయిపాపన్న చరిత్ర భావితరాలకు స్ఫూర్తినిస్తుందన్నారు. చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ హుస్నాబాద్ అభివృద్ధికి ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌తో కలిసి పనిచేస్తామన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేకు బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు సర్వర్ పాషా ఇమామ్ జామిన్ కట్టారు. మండల గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి తిరుపతి, ఎంపీపీ కొత్త వినీత, జెడ్పీటీసీ గీకురు రవీందర్, గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్ ఉన్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లాలోని రామడుగు మండలంలో ఇటీవల జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో స్థానిక కోరా ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు యోగేశ్వరీ, నికిత సత్తాచాటి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. నేటి నుంచి రెండు రోజుల పాటు ఖమ్మం జిల్లాలో జరిగే పోటీల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగల సంతోష్‌రెడ్డి, పీఈటీ దుర్గా రాజు అభినందించారు.

జాతీయ డ్యాన్స్ స్పోర్ట్‌లో జిల్లావాసి ప్రతిభ



వినోద్‌తో కోచ్ రామకృష్ణ

కరీంనగర్‌స్పోర్ట్స్: తిరుపతిలో డిసెంబర్ 28 నుంచి 30 వరకు జరిగిన 5వ జాతీయ స్థాయి డ్యాన్స్‌స్పోర్ట్ చాంపియన్‌షిప్‌లో జిల్లాకు చెందిన ఎన్.వినోద్ ప్రతిభ కనబరిచి బంగారు పతకం కైవసం చేసుకున్నట్లు జిల్లా డ్యాన్స్ స్పోర్ట్ సంఘం ప్రధాన కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. సీనియర్స్ విభాగంలో పాల్గొన్న వినోద్ తనదైన శైలిలో రాణించి రాష్ట్రానికి తొలి పతకాన్ని అందించినట్లు వివరించారు. ఈ సందర్భంగా వినోద్‌ను సంఘం అధ్యక్షుడు కట్ట రమేశ్, సీనియర్ కొరియోగ్రాఫర్స్, తదితరులు అభినందించారు.

పుట్టిన ఊరుపై మమకారంతో వైద్య సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ దామోదర్

జమ్మికుంట(హుజూరాబాద్): పుట్టిన ఊరుపై మమకారంతో తల్లిదండ్రులు నేరేళ్ళ రాధమ్మ, రామస్వామి జ్ఞాపకార్థం మడిపల్లి గ్రామాన్ని దత్తతగా తీసుకొని ఉచిత వైద్య సేవలు అందించామని ఎన్‌ఆర్‌ఐ అమెరికా వైద్యుడు దామోదర్ తెలిపారు. మండలంలోని మడిపల్లిలో బుధవారం ఎన్‌ఆర్‌ఐ వైద్య బృందం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 215 మందికి వివిధ రకాల పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్య పరీక్షలు చేయించుకున్న వారి ఆరోగ్య పరిస్థితులపై రిపోర్టుల ఆధారంగా పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. అమెరికా వైద్యుల సంఘం (ఆపీ) ఆధ్వర్యంలో దేశంలో 61 గ్రామాలు ఎంపిక చేశామని, అందులో భాగంగా మడిపల్లిలో వైద్య సేవలు అందించేందుకు దత్తత తీసుకున్నామని వివరించారు. రోగుల పరిస్థితిపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని, రెండవ, మూడవ విడత వైద్య శిబిరాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యుల బృందం విజయభాస్కర్, శ్రీనివాస్, గనుకుల లక్ష్మారెడ్డి, సర్పంచ్ మూగల పరుశరాములు, మాజీ ఎంపీపీ నేరేళ్ళ రాజమల్లు, తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసు నిందితులపై పీడీయాక్టు



పీడీయాక్టు ప్రతులు అందిస్తున్న సీఐ శశిధర్‌రెడ్డి

కరీంనగర్‌క్రైం: సుపారీ తీసుకొని హత్య చేసిన కేసులో ఇద్దరు నిందితులపై తిమ్మాపూర్ పోలీసులు పీడీయాక్టు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. గోదావరిఖని గాంధీనగర్‌కు చెందిన శనిగరపు అరవింద్, పరుశురాంనగర్‌కు చెందిన నాగిరెడ్డి నిఖిత్‌రెడ్డి తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీలోని ఉపప్ను హోమ్స్‌లో నివాసముంటున్నారు. ఒక మైనర్ బాలుడి ద్వారా వీరిద్దరికీ కొమ్మెర అరుణేందర్‌రెడ్డి పరిచయమయ్యాడు. అత్త గుజ్జుల సులోచనతో విభేదాలున్నాయని ఆమెను హత్య చేయాలని అరుణేందర్‌రెడ్డి వారిద్దరిని కోరాడు. దీనికోసం రూ.60 వేలు, ఫిష్‌ఫారం మేనేజ్‌మెంట్ అప్పగిస్తే చంపుతామని చెప్పి రూ.10 వేలు అడ్వాన్స్‌గా తీసుకున్నారు. గతేడాది అక్టోబర్ 6 తేదీన గుజ్జుల సలోచనను హత్య చేసి, ఆమె తల్లి రాధమ్మపై హత్యాయత్నం చేశారు. గతంలో అరవింద్‌పై రామగుండం కమిషనరేట్ పరిధిలో రెండు నేరాలున్నాయి. కరీంనగర్ కమిషనరేట్‌లో సంచలనం రేపిన ఈ ఘటనతో సాధారణ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన ఇద్దరిపై బుధవారం పీడీయాక్టు అమలు చేశారు. సంబంధిత ఉత్తర్వులను చర్లపల్లి సెంట్రల్ జైలులో అందించారు. ఈ సందర్భంగా పీడీయాక్టు అమలులో కీలకపాత్ర పోషించిన తిమ్మాపూర్ సీఐ కె.శశిధర్‌రెడ్డి, పీడీసెల్ ఇన్‌చార్జి పండరీలను సీపీ సత్యనారాయణ అభినందించారు.

యువకుడి బలవన్మరణం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాగినేడు గ్రామానికి చెందిన నాగపురి రాజ్‌కుమార్ (20) మంగళవారం రాత్రి రైల్వే ఫ్లైఓవర్ ప్రాంతంలో గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. తమకు దక్కాల్సిన భూమి విషయమై నాన్నమ్మ నాగపురి వీరమ్మ, అత్త బుర్ర స్రవంతి మానసిక వేధింపులకు గురి చేస్తున్నారంటూ సెల్‌ఫోన్‌లో వాట్సాప్ మెస్సేజ్ పెట్టుకుని ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని పేర్కొన్నారు. మృతుడి తల్లి మంజుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఆటోమొబైల్ షాపులో అగ్ని ప్రమాదం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని పీవీ ఎంటర్‌ప్రైజెస్ ఆటోమొబైల్ దుకాణంలో మంగళవారం అర్ధరాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. దాదాపు రూ. కోటి మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. దుకాణంలో దాదాపు రూ.3కోట్ల మేర విలువ చేసే సామగ్రి ఉండగా అగ్ని ప్రమాదంలో పెద్ద ఎత్తున ఆస్తి నష్టం జరిగిందని అగ్ని మాపక శాఖ అధికారి దేవనంది శ్రీనివాస్ తెలిపారు.

'శ్రీచైతన్య' విద్యార్థుల ప్రతిభ



విజయకేతనం చూపుతున్న విద్యార్థులు

కరీంనగర్: స్థానిక వావిలాలపల్లిలోని శ్రీ చైతన్య పాఠశాలలో గత నవంబర్ 17,18 తేదీల్లో 'ఐఎన్‌టీఎస్‌వో' ఒలింపియాడ్ పరీక్ష నిర్వహించారు. పరీక్షలో 120 మంది విద్యార్థులు పాల్గొనగా 87 మంది ప్రతిభ కనబరిచి రెండోదశకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి తెలిపారు. ఇంకా ముందుముందు మంచి విజయాలు సాధించి, విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేస్తామని, విద్యార్థుల విజయానికి కారణమైన ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ మల్లంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, డీజీఎం లక్ష్మణరావు, రీజినల్ ఇన్‌చార్జి రాజు, కో ఆర్డినేటర్ ప్రవీణ్, డీన్ శ్రీధర్, ఏవో.కిషన్‌రెడ్డి, క్యాంపస్ ఇన్‌చార్జి సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో విజయకేతనం

తిమ్మాపూర్(మానకొండూర్): జాతీయస్థాయిలో ఐఎన్‌టీఎస్‌ఓ నిర్వహించిన ఒలింపియాడ్‌లో స్థానిక శ్రీచైతన్య తిమ్మాపూర్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. 115 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి రెండో దశ పరీక్షకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నాగరాజు తెలిపారు. విద్యార్థులను అభినందిస్తూ రెండో దశ పరీక్షకు సిద్ధం కావాలి సూచించారు. ఈసందర్భంగా విద్యార్థులను విజయ్‌కృష్ణ, ఒలింపియాడ్ ఇన్‌చార్జి విజయ్, ఏవో జ్యోతిరెడ్డి, మమత, కృష్ణవేణి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ఉరేసుకొని గర్భిణి ఆత్మహత్య



సంధ్య మృతదేహం వద్ద రోదిస్తున్నకుటుంబ సభ్యులు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండలంలోని కూనారం గ్రామానికి చెందిన సంధ్య(24) బుధవారం పుట్టింట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఏడాది క్రితం సంధ్యకు వరంగల్‌కు చెందిన బొట్టు శ్రీకాంత్‌తో వివాహం జరిపించారు. ప్రస్తుతం ఆమె ఆరునెలల గర్భిణి. వారం రోజుల కిందట సంధ్య బోనాల కార్యక్రమానికి పుట్టింటికి వచ్చింది. బుధవారం తల్లిదండ్రులు కొట్టె రమాదేవి–రాజేందర్ పొలం పనులకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతిచెంది ఉన్న కూతురును చూసి గుండెలు బాదుకున్నారు. ఘటనకు సంబంధించి కారణాలు తెలియలేదు. హైదరాబాద్‌లో ఉన్న సంధ్య సోదరుడు మహేందర్ వస్తేనే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తల్లిదండ్రులు పేర్కొన్నారు. కాల్వశ్రీరాంపూర్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి దర్యాప్తు చేస్తున్నారు.

గీతకార్మికుడికి తీవ్రగాయాలు

జమ్మికుంట(హుజూరాబాద్): ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడికి తీవ్రగాయాలైనాయి. స్థానికుల వివరాలు.. మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన గీతకార్మికుడు ఆరెల్లి ఐలయ్య బుధవారం ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడగా తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన తోటి గీత కార్మికులు చికిత్స నిమిత్తం జమ్మికుంటకు తరలించారు.

క్లుప్తంగా

ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన జగన్మోహన్‌రెడ్డి



కరీంనగర్ రూరల్: కరీంనగర్ రూరల్ ఎంపీడీవోగా సీహెచ్.జగన్మోహన్ రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఏడాదిక్రితం ఎంపీడీవోగా పనిచేసిన పవన్‌కుమార్ పదోన్నతిపై జెడ్పీ డిప్యూటీ సీఈవోగా బదిలీపై వెళ్లగా ఇన్‌చార్జి ఎంపీడీవోగా సూపరింటెండెంట్ సంపత్ కుమార్‌ను నియమించారు. ఈనెల 2న ఎంపీవో జగన్మోహన్‌రెడ్డికి ఎంపీడీవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ కర్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన జగన్మోహన్‌రెడ్డిని పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యాలయ సిబ్బంది కలిసి అభినందించారు.

సన్మానం



పురుషోత్తంను సన్మానిస్తున్న నాగరాజు

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్‌లోని పాత బజార్ చిన్న హనుమాన్ ఆలయంలో 41రోజులుగా అయ్యప్ప మాలాధారులకు భిక్ష ఏర్పాటు చేసిన గురుస్వామి అనంతుల పురుషోత్తంను బుధవారం భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అక్కినపల్లి నాగరాజు, సభ్యులు మల్యాల వేణుగోపాల్. తాటిపల్లి సతీశ్‌బాబు, చంద్రశేఖర్, శ్రీనివాస్, మధుతో పాటు అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

విద్యానగర్(కరీంనగర్): ఎస్సై, పోలీస్ కానిస్టేబుల్ ఈవెంట్స్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షల కోసం తెలంగాణ రాష్ట్ర బీసీ స్టడీ సర్కిల్ కరీంనగర్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ రవికుమార్ తెలిపారు. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన ఆసక్తి గల అభ్యర్థులు స్టడీ సర్టిఫికెట్లు, ఈవెంట్స్ క్వాలీఫై సర్టిఫికెట్, నూతన కులధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో నేరుగా కరీంనగర్ స్టడీ సర్కిల్ కార్యాలయంలో ఈనెల 7లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 0878–2268686 ఫోన్ నంబర్‌లో కానీ బీసీ స్టడీ సర్కిల్, కరీంనగర్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

మంత్రి 'గంగుల' పరామర్శ



కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మంత్రి

సప్తగిరికాలనీ(కరీంనగర్).: నగరంలోని 36వ డివిజన్ కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ శ్రీనివాస్‌ల సోదరుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. బుధవారం మంత్రి గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావులు జయశ్రీ స్వగృహంలో పరామర్శించారు. వీరి వెంట డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరిశంకర్, కార్పొరేటర్లు భూమాగౌడ్, నాంపల్లి శ్రీనివాస్, దిండిగాల మహేష్, నాయకులు అనిల్, దుబ్బాక రమేశ్, పొన్నం మధు, తదితరులున్నారు.

అర్చకుల నిరసన



హుజూరాబాద్: పట్టణంలోని పాటిమీది సరస్వతీ అమ్మవారి ఆలయం ఆవరణలో అర్చకులు బుధవారం నిరసన తెలిపారు. హిందూ దేవతలపై, అయ్యప్ప స్వామిపై బైరి నరేశ్ అసభ్య పదజాలంతో దూషించడం సరికాదని మండిపడ్డారు. దైవదూషణ చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నిరసనలో ప్రధాన అర్చకులు కుర్మి ప్రదీప్, తిరుణగిరి తిరుమల చార్యులు, జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సురేశ్, విష్ణుదాసు, గోపాల్‌రావు, సుజీత్ అర్చకులు, వానమమలై లలితా చార్యులు, చెన్నూరి రాజేశ్ శర్మ, చెరుకుపల్లి శ్రీధర్ శర్మ, కొడుమగుల్ల నందకిశోరాచార్యులు, కాట్రపల్లి విశ్వనాథ్ శర్మ, చెరుకుపల్లి నిఖిల్ శర్మ, చెరుకుపల్లి రాహుల్ శర్మ, ఎలుబాక కృష్ణ శర్మ, కందిలై రామ్మోహన్ చార్యులు, సముద్రాల కిరణ్, భక్తులు పాల్గొన్నారు

భేష్.. ట్రాఫిక్ పోలీస్

- రాష్ట్రంలో కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు టాప్
- ట్రాఫిక్ వర్టికల్‌లో ముందంజ
- నిత్యం రోడ్డు నిబంధనలపై అవగాహన సదస్సులు
- నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు కసరత్తు



కరీంనగర్‌లో వాహన తనిఖీలు చేస్తున్న ఏసీపీ విజయ్‌కుమార్

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు రాష్ట్రంలో టాప్ వన్‌గా నిలిచారు. డీజీపీ కార్యాలయం పర్యవేక్షిస్తున్న వర్టికల్స్‌లో ట్రాఫిక్ వర్టికల్ కరీంనగర్ ముందంజలో ఉంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ట్రాఫిక్ నియంత్రణ, వాహన దారులకు ఇబ్బందులు కలుగకుండా చూడడం, డ్రంకెన్ డ్రైవ్ కేసులు, కేసుల పరిష్కారం వంటి పలు అంశాలను పరిగణలోకి తీసుకోగా రాష్ట్ర వ్యాప్తంగా కరీంనగర్ ముందు వరుసలో ఉన్నట్లు ఉన్నాధికారులు ప్రశంసించారు. దీంతో పాటు సీపీ సత్యనారాయణ ఆదేశాల మేరకు ట్రాఫిక్ నియంత్రణకు మరిన్ని చర్యలు తీసుకుంటున్నారు.

రోడ్డు నిబంధనలపై సదస్సులు

కరీంనగర్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రజలకు, ఆటోడ్రైవర్లతో పాటు ఇతర వర్గాలకు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై నిత్యం అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా రోడ్డు నియమనిబంధనల గురించి లోతుగా అవగాహన కల్పిస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై ప్రత్యేక దృష్టిసారించి నిత్యం తనిఖీలు కొనసాగిస్తున్నారు. దీంతో పాటు నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్, నకిలీ ధ్రువపత్రాలు కలిగి ఉన్న, ధ్రువపత్రాలు సరిగా లేని పలు వాహనాలపై కేసులు నమోదు చేసి పోలీస్‌స్టేషన్‌లకు తరలిస్తున్నారు. జరిమానా కట్టించిన తర్వాత వాహనాలను విడిచిపెడుతున్నారు. గతేడాది డ్రంకెన్ డ్రైవ్ 11,867 కేసులు నమోదు చేశారు.

సిగ్నల్స్ ఏర్పాటుకు సన్నాహాలు

- నగరంలో గతంలో ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ తీసివేసి పెద్ద చౌరస్తాల వద్ద ఐలాండ్‌లు నిర్మించారు.
- వాహనాలు క్రమక్రమంగా పెరుగుతుండడంతో బస్టాండుతో పాటు ఇతర చౌరస్తాల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ ఇబ్బందులేర్పడుతున్నాయి.
- దీనిని దృష్టిలో పెట్టుకొని సిగ్నల్స్ ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది.
- బస్టాండ్, తెలంగాణ చౌక్, కోర్టు చౌరస్తా, కలెక్టరేట్‌కు వచ్చే చౌరస్తా, ఎన్టీఆర్ చౌరస్తా, బద్దం ఎల్లారెడ్డి చౌరస్తా, కమాన్‌తో పాటు ఇంకా పలు ప్రాంతాలను గుర్తించి సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.
- అంతేకాకుండా ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ఉదయం, సాయంత్రం సమయాల్లో యూటర్న్‌లు మూసివేసి నియంత్రణ చేస్తున్నారు.
- ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే ఆటోమెటిక్‌గా కనిపెట్టి ఫైన్ వేసే విధంగా సీసీ కెమెరాలు సైతం అమర్చుతున్నారు.

పెండింగ్ చలాన్‌లపై నజర్

కరీంనగర్‌లోని కమాన్‌చౌరస్తా వద్ద బుధవారం సాయంత్రం ట్రాఫిక్ సీఐ తిరుమల్‌గౌడ్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. మూడు కన్న ఎక్కువ చలాన్లు పెండింగ్‌లో ఉన్న వాహనదారుల నుంచి జరిమానాలు కట్టించారు. ఈ తనిఖీల్లో సీఐ నాగార్జునరావు, ఎస్సైలు లక్ష్మారెడ్డి, ఇసాక్ అహ్మద్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



కరీంనగర్ ట్రాఫిక్ వర్టికల్‌లో రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు సాధించడం సంతోషంగా ఉంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపడుతున్నాం. మద్యం తాగి వాహనాలు నడిపే వారిని నియంత్రించేందుకు నిత్యం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నాం. ఆటోమెటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిజేషన్ కెమెరాలు అమర్చుతున్నాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నాం.

– విజయ్‌కుమార్, ట్రాఫిక్ ఏసీపీ

'తొలిమెట్టు' విజయవంతం చేయాలి



మేళాను పరిశీలిస్తున్న ఎంఈవో మధుసూదనాచారి

కరీంనగర్‌రూరల్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలిమెట్టు కార్యక్రమాన్ని ఉపాధ్యాయులందరూ కలిసికట్టుగా విజయవంతం చేయాలని మండల విద్యాధికారి మధుసూదనాచారి అన్నారు. కరీంనగర్ మండలం దుర్శేడ్ జెడ్పీ హైస్కూల్‌లో తొలిమెట్టులో భాగంగా నిర్వహిస్తున్న టీఎల్ఎం మేళాను బుధవారం సందర్శించి మాట్లాడారు. చివరి రోజు నగునూరు, దుర్శేడ్ స్కూల్ కాంప్లెక్స్‌లకు చెందిన 22 మంది ఉపాధ్యాయులు తయారు చేసిన టీఎల్ఎంలను ప్రదర్శించారు. అనంతరం స్కూల్‌కాంప్లెక్స్ సమావేశం నిర్వహించి గతనెల ఎఫ్ఎల్ఎన్ నిర్వహణ, మేళాపై సమీక్షా జరిపారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి వెంకటపద్మాదేవి, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, వసంత తోపాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న భాగవత కథామృతం



ప్రవచనం చేస్తున్న రమణాచార్యులు

కరీంనగర్ కల్చరల్: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా చైతన్యపురి మహాశక్తి ఆలయంలో గోదాగోష్ఠి నిర్వహణలో జ్యోతిష్య, వాస్తు, ఆగమ శాస్త్ర పండితుడు నమిలకొండ రమణాచార్యులతో భాగవత కథామృతం వైభవంగా కొనసాగుతోంది. ఉదయం రామకృష్ణమాచార్యులు ధనుర్మాస కార్యక్రమం జరుపుతున్నారు. సాయంత్రం భాగవత కథా శ్రవణానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. రమణాచార్యులు భాగవతంలోని అతి విలువైన అంశాలు, కథలను వివరిస్తున్నారు. 11వ తేదీన కూడార్రై ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

పార్టీ బలోపేతానికి గ్రామకమిటీలు



గోపాల్‌పూర్ కాంగ్రెస్ కమిటీ నాయకులతో రోహిత్‌రావు

కరీంనగర్‌రూరల్: కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల కోఆర్డినేటర్ మెన్నేని రోహిత్‌రావు తెలిపారు. బుధవారం కరీంనగర్ మండలంలోని దుర్శేడ్, గోపాల్‌పూర్, మందులపల్లి, మొగ్ధుంపూర్, చేగుర్తి గ్రామాల్లో పర్యటించి కార్యకర్తలతో సమావేశం నిర్వహించి కాంగ్రెస్ గ్రామ, అనుబంధ శాఖల కమిలను ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించి అధికారంలోకి రావడం ఖాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సాయిల్ల రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిని తిరుపతి, కిసాన్‌సెల్ అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు నాగరాజు, లచ్చయ్య, శ్రీనివాస్, రమేశ్, మురళీ, గోవర్దన్, సాయిలు, గంగయ్య, అంజయ్య, గోపాల్, సంజీవ్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల విన్యాసాలు అదరహో..





కొత్తపల్లి: కొత్తపల్లిలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ (సీబీఎస్ఈ) విద్యార్థులు చేసిన విన్యాసాలు అదరహో అనిపించాయి. స్కూల్ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జిమ్నాస్టిక్స్, బైక్ రైడింగ్, కరాటే విన్యాసాలు, బైక్‌తో వస్తూ ట్యూబ్‌లైట్లు పగల గొట్టడం, చేతులపై నుంచి బైక్‌ను తోలడం, గుర్రపు సవారీ, మంటల్లోంచి దూకడం వంటి సాహస విన్యాసాలు అలరించాయి. కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, ఎస్సై అశోక్, ప్యారడైజ్, సెయింట్ జార్జ్ విద్యా సంస్థల చైర్మన్ పోలిరెడ్డి ఫాతిమారెడ్డిలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన ఈ కార్యక్రమంలో అకాడమిక్ సీఈవో ఉమాకాంత్, ప్రిన్సిపాల్స్ భార్గవ్, వి.నిరంజన్, మధు, కరాటే మాస్టర్ వేణుగోపాల్, డ్యాన్స్ మాస్టర్ సతీశ్, పీఈటీలు జగన్, రజిత, సాయి కిరణ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువజనోత్సవాలను విజయవంతం చేయండి

కరీంనగర్‌స్పోర్ట్స్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు యువజన సర్వీసుల శాఖ కరీంనగర్ ఆధ్వర్యంలో సాంస్కృతిక, క్రీడాంశాల్లో గురువారం జరుగనున్న జిల్లాస్థాయి యువజన ఉత్సవ పోటీలను విజయవంతం చేయాలని యువజన క్రీడా శాఖ జిల్లా అధికారి కీర్తి రాజవీరు అన్నారు. జానపద నృత్యం(గ్రూప్), జానపద గీతం (గ్రూప్), కబడ్డీ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొను వారు పోటీలు నిర్వహించే తేదీ నాటికి 15–29 ఏళ్ల వయస్సు లోపు ఉండాలని, జిల్లాకు చెందిన కళాకారులైన ఉండాలని పేర్కొన్నారు. అదే విధంగా పోటీలో పాల్గొనే అంశానికి సంబంధించిన సామగ్రిని సంబంధించిన తమ వెంట తెచ్చుకోవాలని తెలిపారు. సంబంధిత అంశాల్లో పాల్గొనే యువతీ యువకులు తమ ఎంట్రీలను అందించాలని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కరీంనగర్‌రూరల్: గోపాల్‌పూర్‌లో ఈనెల 3న రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డ పవన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ మండలం గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన ఎర్ర పవన్(27) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అనేక ఆస్పత్రుల్లో చూపించిన అతని ఆరోగ్యం కుదుటపడలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఈనెల 3న రాత్రి ఇంట్లో గడ్డి మందు తాగాడు. వెంటనే గుర్తించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడి నుంచి తిరిగి కరీంనగర్ జిల్లా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై ప్రశాంతరావు తెలిపారు.

హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రి తనిఖీ

హుజూరాబాద్: పట్టణంలోని ప్రాంతీయ ఏరియా ఆసుపత్రిని బుధవారం జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిణి డాక్టర్ సాజిదా తనిఖీచేశారు. చిన్నపిల్లల తల్లుతో మాట్లాడి టీకాల వివరాలు తెలుసుకున్నారు. జిల్లాలో అమలయ్యే పోలియో ఇంజక్షన్ ఐపీని, బూస్టర్ డోస్ అమలయ్యే విధానం పరిశీలించారు.



ఆల్‌ది బెస్ట్

కరీంనగర్‌స్పోర్ట్స్: ఖమ్మం జిల్లాలో గురువారం నుంచి రెండు రోజుల పాటు జరుగనున్న 44వ రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాలికల హ్యాండ్ బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా జూనియర్ బాలికల జట్టు బుధవారం కరీంనగర్ నుంచి బయలుదేరి వెళ్లింది. ఇటీవల వరంగల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలికల పోటీల్లో మూడోస్థానంలో నిలిచిన జిల్లా జట్టు ఈసారి జూనియర్స్‌లో విజేతగా నిలవాలని హ్యాండ్‌బాల్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్‌లు ఆకాంక్షించారు. జట్టుకు కోచ్‌గా అశోక్, మేనేజర్‌గా యశోదలు వ్యవహరించనున్నారు.

అటెన్షన్ ప్లీజ్



ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

కరీంనగర్‌లోని సప్తగిరికాలనీలో టెలిఫోన్ క్వార్టర్స్ ప్రాంతంలో ఇళ్ల మధ్యన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. మూలమలుపు ప్రాంతంలో ఇంటిలో ఉన్న ఈ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఎలాంటి రక్షణ చర్యలు ఏర్పాటు చేయలేదు. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి వచ్చే శబ్దానికి భయం భయంగా నిద్రిస్తున్నట్లు స్థానికులు తెలుపుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను మరో చోటికి తరలించి ప్రమాదం బారి నుంచి కాపాడాలని కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

ప్రశ్నించాల్సిన అధికారి : సుధీర్, ట్రాన్స్‌కో ఏడీఈ
సెల్ నంబర్ : 89851 44460

కొత్త రైతులకు కత్తెర

- తెరుచుకోని రైతుబంధు పోర్టల్
- దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



కొత్త రైతు నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న ఏవో

కరీంనగర్‌రూరల్: కొత్త రైతులకు రైతుబంధు పెట్టుబడి సాయం మంజూరుపై స్పష్టత కరువైంది. కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నప్పటికీ పోర్టల్ మాత్రం ఇప్పటివరకు తెరుచుకోలేదు. ఈనెల 7 చివరి గడువు సమీపిస్తున్నప్పటికీ నమోదు ప్రక్రియకు అవకాశం లేకపోవడంతో అధికారులు సైతం ఏమిచేయలేని పరిస్థితి నెలకొంది.

పోర్టల్ వివరాల ప్రామాణికంగా..

పెట్టుబడి సాయం పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా రైతుబంధు పోర్టల్‌ను రూపొందించింది. ప్రారంభంలో సీసీఎల్ఏ అధికారులు ఇచ్చిన సమాచారం వ్యవసాయాధికారులు ఆన్‌లైన్ చేసి రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేశారు. కరీంనగర్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులకు గతనెల 28 నుంచి విడతల వారీగా యాసంగి సీజన్ రైతుబంధు ఆర్థికసాయం మంజూరవుతోంది. మండలంలో 10,334 మంది రైతులకు రూ.8,44,88,093 కేటాయించగా ఎకరం నుంచి మొదలుకుని రైతుబంధు పోర్టల్‌లో నమోదైన రైతులందరికీ బ్యాంకుఖాతాల్లో నగదు జమవుతోంది. గతేడాది ప్రభుత్వం కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతుల వివరాలను క్షేత్రస్థాయిలో ఏఈవోలు పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే పెట్టుబడిసాయం మంజూరవుతోంది. ప్రస్తుత యాసంగి సీజన్‌లో డిసెంబరు 20 వరకు కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులకు రైతుబంధు ఆర్థిక సాయం పొందడానికి దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశమిచ్చింది. అయితే కొత్త రైతుల వివరాలను పోర్టల్‌లో నమోదు చేసేందుకు ప్రభుత్వం ఆప్షన్ ఇవ్వకపోవడంతో అధికారులు దరఖాస్తులను తీసుకోవడంతోనే సరిపెడుతున్నారు.

నమోదు ఆప్షన్ తెరుచుకోవడంలేదు

రైతుబంధు పోర్టల్‌లో కొత్త రైతుల వివరాలను నమోదు చేసే ఆప్షన్ తెరుచుకోవడం లేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కొత్త రైతుల నుంచి దరఖాస్తులను మాత్రం స్వీకరిస్తున్నాం. పోర్టల్ తెరుచుకోగానే వివరాలను నమోదు చేస్తాం.

– బి.సత్యం, కరీంనగర్ మండల వ్యవసాయాధికారి

సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కరీంనగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ప్రజా సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీపీఎం కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని చిట్యాల ఐలమ్మ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పన్నంగా అమ్ముతున్నారని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు రోజురోజుకు పెంచుతూ పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని, మోదీ హయాంలో తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని మభ్యపెట్టి ఏఒక్కరికీ డబుల్ బెడ్ రూమ్ ఇచ్చిన పాపాన పోలేదని అన్నారు. ధరణి పోర్టల్ సవరించి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి రుణ సౌకర్యం, రైతు బీమా, రైతు బంధు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏవో నారాయణకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గుడికందుల సత్యం, గీట్ల ముకుందరెడ్డి, జి.బీమాసాహెబ్, జిల్లా కమిటీ సభ్యులు, నాయకులు తదితరుల పాల్గొన్నారు.

పవర్ కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్‌లో తీగలబ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నందున గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు 33/11 కేవీ భగత్‌నగర్, ఉజ్వలపార్కు, పద్మనగర్, సప్తగిరికాలనీ, వాటర్ గ్రిడ్ అల్గునూర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని ప్రాంతాలతో పాటు 11 కేవీ ఎల్లమ్మ ఫీడర్ పరిధిలోని ఆటోనగర్, కోతిరాంపూర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–1, 2 ఏడీఈలు నరేందర్, ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు.

మళ్లీ ఉద్యోగ జాతర!

- గ్రామ, వార్డు సచివాలయాల్లో ఖాళీ పోస్టుల భర్తీకి సీఎం జగన్ ఆదేశం



సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నీ భర్తీ చేసేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే దేశ చరిత్రలో రికార్డు స్థాయిలో ఒకేసారి దాదాపు 1.34 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను కొత్తగా మంజూరు చేయడంతో పాటు, కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే వాటిని భర్తీ చేయడం తెలిసిందే. తొలి విడతలో భర్తీ కాని పోస్టులకు వరుసగా రెండో ఏడాది నియామక ప్రక్రియ చేపట్టడమూ విదితమే. ఈ నేపథ్యంలో గ్రామ, వార్డు సచివాలయాల కార్యకలాపాలకు సంబంధించి బుధవారం సీఎం తన క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమయంలో సచివాలయాల్లో ఇంకా ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ అంశం చర్చకు వచ్చింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 'గ్రామ, వార్డు సచివాలయాల్లో ఏర్పడ్డ ఖాళీలను భర్తీ చేయండి. గత నియామక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా చేపట్టారని మంచి పేరు వచ్చింది. ఎలాంటి లోపం లేకుండా సమర్థవంతంగా మళ్లీ నియామక ప్రక్రియ చేపట్టాలి' అని అధికారులకు సూచించారు. అన్ని ప్రభుత్వ విభాగాల నుంచి ఖాళీల వివరాలను సేకరిస్తున్నామని అధికారులు సీఎంకు తెలిపారు.

విశాఖ డెయిరీ చైర్మన్ తులసీరావు కన్నుమూత

సాక్షి, అనకాపల్లి/అమరావతి: విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు (84) బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయన భౌతికకాయాన్ని హైదరాబాద్ నుంచి స్వగ్రామమైన అనకాపల్లి జిల్లా యలమంచిలికి తీసుకువస్తున్నారు. తులసీరావుకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. రెండో కుమారుడు ఆడారి ఆనంద్‌కుమార్ వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తుండగా.. కుమార్తె రమాకుమారి యలమంచిలి మునిసిపల్ చైర్‌పర్సన్‌గా సేవలందిస్తున్నారు. తులసీరావు అంత్యక్రియలు గురువారం యలమంచిలిలో జరుగుతాయి. ఈ కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హాజరుకానున్నారు. తులసీరావు భౌతికకాయానికి సీఎం జగన్ నివాళులర్పించి, అతని కుటుంబ సభ్యులను పరామర్శిస్తారని ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది.

రోడ్లపై సభలు వద్దనటం తప్పా?

వరుసగా రెండు సంఘటనల్లో ఏకంగా 11 మంది ప్రాణాలు బలి

- ఇలాంటి దుర్ఘటనలకు చెక్ పెడుతూ రోడ్లపై సభలు వద్దన్న ప్రభుత్వం
- ఈ ఉత్తర్వులకు కూడా చంద్రబాబు నాయుడి వక్రభాష్యం

సాక్షి, అమరావతి: అసలు ఆ జీవోలో తప్పేమయినా ఉందా? రోడ్లపై సభలు, సమావేశాలను వద్దనటం మంచిదా... చెడ్డదా? అది కూడా కావాలని ఇరుకు రోడ్లో సభ నిర్వహించడంతో 8 మంది ప్రాణాలు కోల్పోయాక... అటువంటి సంఘటనలు ఇక పునరావృతం కాకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకు కదిలి ఇలాంటి ఉత్తర్వులు జారీ చేయటం సమంజసం కాదని అనగలమా? ఇవేమీ ఒక పార్టీనో, ఒక నాయకుడినో దృష్టిలో పెట్టుకుని ఇచ్చిన ఉత్తర్వులు కాదు కదా?!. రోడ్లపై సభలు పెట్టకూడదన్నది అన్ని పార్టీలకూ, అందరు నాయకులకూ సమానంగా వర్తించే అంశం. ఇది తప్ప వేరే కార్యక్రమాలేమైనా రోడ్లపై చేసుకోవాలంటే దానికి పోలీసుల నుంచి ముందస్తు అనుమతి తీసుకుంటే చాలని ఆ ఉత్తర్వుల్లోనే ఉంది. మరిప్పుడు దేన్ని తప్పు బడుతున్నారు? రోడ్లపై సభలు, సమావేశాలు వద్దనటాన్నా? లేక మిగతా కార్యక్రమాలకు ముందస్తు అనుమతి తీసుకోవాలనటాన్నా? వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా దానికి దురుద్దేశాలు ఆపాదిస్తూ దుష్ప్రచారానికి దిగుతున్నారనేది మరోసారి తేటతెల్లం కావటం లేదా? ఇన్ని మరణాలు సంభవించాక కూడా ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోకుండా ఉంటే చంద్రబాబుకు వంత పలికే ఇతర ప్రతిపక్ష పార్టీలు, మీడియా దీన్ని ఆక్షేపించకుండా ఉంటాయా? రాజకీయ ప్రయోజనాలు తప్ప ప్రజల భద్రతతో ఏమాత్రం సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్న తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబును ఏమనుకోవాలి? ఇరుకు రోడ్డులోకి కావాలని వాహనాన్ని పోనిచ్చి సభ నిర్వహించి, 8 మంది ప్రాణాలు బలితీసుకున్న ప్రతిపక్ష నాయకుడిలో కాస్తయినా పశ్చాత్తాపం కనిపించాలి కదా? పదుల సంఖ్యలో జనం గాయపడినా కూడా ఏ మాత్రం బాధపడకుండా రోడ్లపై మరో సభకు తయారై... దాన్ని ఎందుకు అడ్డుకుంటారంటూ రభస చేయటం సరైనదేనా?

ఎందుకిచ్చారు ఈ జీవో..?

ప్రతిపక్షాల గొంతునొక్కేందుకే ప్రభుత్వం ఈ జీవో జారీ చేసిందంటూ టీడీపీ చేస్తున్న ప్రచారంలో అక్షరం కూడా నిజం లేదన్నది యథార్థం. ఎందుకంటే చంద్రబాబు నాయుడి పబ్లిసిటీ దాహంతో నెల్లూరు జిల్లా కందుకూరులో రోడ్డుపై నిర్వహించిన సభలో 8 మంది దుర్మరణం చెందారన్నది విస్మరించలేని విషాదం. నాలుగు రోడ్ల కూడలిలో కాస్త విశాలమైన ప్రాంతంలో సభ నిర్వహిస్తామని ముందుగా అనుమతి తీసుకున్న చంద్రబాబు... కేవలం తన సభకు వచ్చిన జనాన్ని తక్కువ మందిని కూడా రద్దీరద్దీగా బీభత్సమైన స్థాయిలో చూపించాలన్న వ్యూహాన్ని ఎంచుకున్నారు. అందుకోసం డ్రోన్లతో షూటింగ్‌కు సిద్ధమయ్యారు. తీరా సభా స్థలమయిన ఎన్టీఆర్ సర్కిల్‌కు వచ్చేసరికి జనం అనుకున్నంతగా లేరని భావించారు. ఆ విశాలమైన రోడ్లోంచి తన వాహనంతో సహా కాన్వాయ్‌ని మరో 50–70 మీటర్లు ముందుకు... ఇరుకు రోడ్లోకి పోనిచ్చారు. అసలే ఇరుకు రోడ్డు... దానికి అటూ ఇటూ ఫ్లెక్సీలు కట్టడంతో మరింత కుదించుకుపోయింది. అన్ని వాహనాలు అంత చిన్న రోడ్లోకి దూసుకు రావటంతో... అప్పటిదాకా అక్కడ నిల్చుని ఉన్న జనం వెనక్కి వెళ్లాల్సి వచ్చింది. ఒకరినొకరు నెట్టుకుంటూ వెనక్కి వెళ్లే క్రమంలో కొందరు కింద పడిపోయారు. ఆ తోపులాటలో వారిని గమనించే పరిస్థితి లేక.. వారిని తొక్కుకుంటూనే మిగిలిన వారు వెనక్కి వెళ్లారు. దీంతో దాదాపుగా ఎనిమిది మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఇరుకు రోడ్లో తక్కువ జనం వచ్చినా... పై నుంచి డ్రోన్లతో షూట్ చేస్తే భారీగా వచ్చినట్లు కనిపిస్తారని, దాన్నే ప్రచారానికి వాడుకోవచ్చని బాబు వేసిన వ్యూహం బెడిసికొట్టడమే ఈ నిండు ప్రాణాలను బలితీసుకుందని చెప్పటానికి వేరే ఏమీ అక్కర్లేదు.

మరిన్ని వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అసలు ఆ జీవోలో ఏముంది?

ఇదిగో... ఈ సంఘటన నేపథ్యంలోనే ప్రజల ప్రాణాలను కాపాడటం తన బాధ్యతగా భావించి ప్రభుత్వం జీవో నెంబర్–1 జారీ చేసింది. పబ్లిసిటీ కోసం ఇరుకు రోడ్లలో జనాన్ని షూట్ చేసి.. మరిన్ని మరణాలకు కారణమయ్యే సంఘటనలేవీ జరగకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ జీవో జారీ చేసింది. అయితే ఈ జీవోలో... సభలు నిర్వహించకూడదని ఎక్కడా చెప్పలేదు. రోడ్లపై మాత్రమే నిర్వహించవద్దన్నారు. మైదానాలు, ఇతర ప్రత్యామ్నాయ ప్రదేశాల్లో సభలు నిర్వహించుకోవచ్చు. అందుకోసం గ్రామ, మండల, మున్సిపాలిటీల పరిధిలో ప్రత్యామ్నాయ ప్రదేశాలను గుర్తించాలని కూడా అధికార యంత్రాంగాన్ని స్వయంగా ప్రభుత్వమే ఆదేశించింది. అంటే ఏదైనా గ్రామంలో గానీ పట్టణంలో గానీ రోడ్లపై మాత్రమే సభలు నిర్వహించకూడదు. అక్కడి కాలేజీ మైదానాలు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో నిర్వహించుకోవచ్చు. అందుకు దరఖాస్తు చేస్తే పోలీసులు అనుమతిస్తారు. కాబట్టి ప్రభుత్వం జారీ చేసిన జీవో సభల నిర్వహణకు ఏ విధంగానూ అడ్డంకి కాదు. వీటన్నిటికీ తోడు... రోడ్లపై సభలు వద్దన్న నిబంధనకు అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వం మినహాయింపులిచ్చింది. ప్రత్యేక పరిస్థితుల్లో సభలు నిర్వహించాలని భావిస్తే అందుకు కారణాలను వివరిస్తూ జిల్లా ఎస్పీ/ పోలీస్ కమిషనర్‌కు దరఖాస్తు చేసుకోవాలి. సభ నిర్వహించే సమయం, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, హాజరయ్యే జనం, ఇతర ఏర్పాట్ల వివరాలను తెలియజేస్తూ దరఖాస్తు చేయాలి. వాటిని పరిశీలించి పోలీసులు సంతృప్తి చెందితే సభ నిర్వహణకు షరతులతో అనుమతినిస్తారు. అనుమతి కోసం పేర్కొన్న షరతులకు విరుద్ధంగా సభను నిర్వహిస్తే మాత్రం నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటారు.

బాబు మరో షో!

▶ మొదటి పేజీ తరువాయి

నోటీసులు ఇచ్చారు. చంద్ర బాబు కార్యక్రమాల వివరాలు ఏమిటి? ఎక్కడెక్కడ పర్యటించనున్నారు? బహిరంగ సభలు ఎక్కడ నిర్వహించనున్నారు? రోడ్‌షోలు ఎక్కడ? ర్యాలీలు ఉన్నాయా? అనే వివరాలు తెలియజేసి, అనుమతి తీసుకోవాలని సోమవారం రాత్రే నోటీసు ఇచ్చారు. అయితే మంగళవారం అర్ధరాత్రి వరకు చంద్రబాబు నుంచి కానీ, ఆయన పీఏ నుంచి కానీ పోలీసులకు ఎటువంటి సమాచారం లేదు. దీంతో చంద్రబాబు పర్యటనకు సంబంధించి తమకు ఎటువంటి సమాచారం లేదని, సభలు, సమావేశాలకు అనుమతులు లేవంటూ మంగళవారం అర్ధరాత్రి పోలీసులు లిఖిత పూర్వకంగా సమాచారం ఇచ్చారు.

అంతా పథకం ప్రకారమే..: చంద్రబాబు పర్యటనపై బుధవారం సాయంత్రం వరకు పోలీసులకు ఎటువంటి సమాచారం లేదు. అయితే టీడీపీ శ్రేణులు ఏపీ, కర్ణాటక సరిహద్దు లోని శాంతిపురం మండలం 121 పెద్దూరు, గడ్డూరు క్రాస్ వద్ద హంగామా చేస్తున్నారని పోలీసు లకు సమాచారం అందింది. శాంతి భద్రతల్లో భాగంగా పోలీసులు ఆ ప్రాంతంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. చంద్రబాబు పర్యటనకు కుప్పం వాసుల నుంచి పెద్దగా స్పందన లేకపోవడంతో టీడీపీ శ్రేణులు మదనపల్లె, వీ.కోట, కర్ణాటక నుంచి ప్రత్యేక వాహనాల్లో జనాన్ని తీసుకు రావడం ప్రారంభించారు. దీంతో పోలీసులు అనుమతి లేని వాహనాలకు ప్రవేశం లేదని వాటిని నిలువరించే ప్రయత్నం చేశారు. ఇక్కడి విషయాలను మాజీమంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, చంద్రబాబు పీఏ, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులు ఎప్పటికప్పుడు బాబుకు ఫోన్ ద్వారా చెబుతూ వచ్చారు.

డ్రామాను రక్తి కట్టించాలని..: కుప్పం వాసుల నుంచి స్పందన లేకపోవడం గ్రహించిన చంద్రబాబు.. తన ఎల్లో మీడియా ద్వారా ప్రచారానికి తెరతీశారు. బాబు పర్యటనను అడ్డుకుంటున్నారంటూ.. టీడీపీ శ్రేణుల ద్వారా హడావుడి చేయించారు. తన జనాన్ని రెచ్చగొట్టి పోలీసుల పైకి ఉసిగొల్పారు. పోలీసులు లాఠీచార్జ్ చేస్తే ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచవచ్చనే ఉద్దేశంతో కొందరు టీడీపీ శ్రేణులను సామాన్య జనం రూపంలో గడ్డూరు క్రాస్ వద్దకు పంపించారు. వారి వద్ద రాడ్లు, కర్రలు, రాళ్లు కనిపించాయి. వారి ద్వారా గొడవ సృష్టించి లబ్ధి పొందడానికి విఫల యత్నం చేశారు.

1861 పోలీసు చట్టమే వర్తించదంటూ వక్రభాష్యం

చంద్రబాబుకు చట్టాల పట్ల కనీస అవగాహన లేదని మరోసారి నిరూపితమైంది. రోడ్లపై సభలకు అనుమతులు రద్దు చేస్తూ ప్రభుత్వం 1861 పోలీసు చట్టం ప్రకారం జీవోను జారీ చేసింది. అయితే ఆ చట్టం ఆంధ్రప్రదేశ్‌కు వర్తించదని చంద్రబాబు పోలీసులతో వాగ్వాదం పెట్టుకోవడం విస్మయ పరిచింది. శాంతిభద్రతల పరిరక్షణ కోసం 30 పోలీస్ యాక్ట్‌ను ఇక్కడ ఎలా అమలు చేస్తారని కూడా ఆయన ప్రశ్నించారు. ఒక్క మన రాష్ట్రంలోనే కాదు.. కేంద్ర పోలీసు బలగాలతోపాటు దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని పోలీసు వ్యవస్థలు 1861 పోలీస్ యాక్ట్ ప్రకారమే పని చేస్తున్నాయని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్న రోజుల్లో కూడా రాష్ట్రంలో ఎన్నోసార్లు 30 పోలీస్ యాక్ట్ అమలు చేశారు.

జనం ముసుగులో పోలీసులపై దాడి: బుధవారం ఉదయం నుంచే గడ్డూరు వద్ద వందలాది మంది టీడీపీ కార్యకర్తలు, అద్దె మనుషులు ఇరుకైన రోడ్లపై గుమికూడారు. దీనిపై పోలీసులు అభ్యంతరం తెలిపారు. అనుమతిలేని కార్యక్రమాలకు ఇలా మూకుమ్మడిగా రావడం సరికాదని నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. టీడీపీ కార్యకర్తలు ససేమిరా అన్నారు. సభలో పాల్గొంటామని, ఎవరు ఏం చెప్పినా వినబోమంటూ తిరగబడ్డారు. మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తెలుగు తమ్ముళ్లను మరింత రెచ్చగొట్టారు. పోలీసులపై దాడికి దిగేలా ఉసిగొల్పారు. దీంతో కార్యకర్తలు ఆగ్రహంతో ఊగిపోయారు. రోడ్డుపై ఏర్పాటు చేసిన బ్యారికేడ్లను లాగేశారు. రోడ్డుపై బైఠాయించారు. 'సీఎం డౌన్‌డౌన్.. ఇదేం ఖర్మ.. ఇదేం ఖర్మ..' అంటూ నినాదాలతో రెచ్చిపోయారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. వారి వద్ద ఉన్న లాఠీలను లాక్కునే యత్నం చేశారు. ఈ గందరగోళం మధ్య కొందరు టీడీపీ కార్యకర్తలు పోలీసులపై పిడిగుద్దులతో దాడి చేశారు. పోలీసులు కూడా లాఠీలను పైకెత్తి వారిని తరిమే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు, టీడీపీ కార్యకర్తల నడుమ తోపులాట జరిగింది. సాయంత్రం 4 గంటలకు కర్ణాటక సరిహద్దు నుంచి చంద్రబాబు 121 పెద్దూరు చేరుకున్నాక టీడీపీ శ్రేణులు మరింతగా రెచ్చిపోయాయి. ఇంకో వైపు తమను అడ్డుకుంటున్నారంటూ ఎల్లో మీడియా ద్వారా బ్రేకింగ్ న్యూస్‌లు వేయించారు. ఉదయం నుంచి ఇలా జరిగేలా చంద్రబాబు ప్రణాళిక రచించి, అమలు చేయించారని స్పష్టమైంది. ఇలా గొడవ చేయడం ద్వారా పోలీసులు తనను అరెస్టు చేసేలా వ్యూహం పన్నారు. అయితే పోలీసులు ఏమాత్రం సంయమనం కోల్పోకుండా చంద్రబాబు, టీడీపీ నేతలు, శ్రేణులను సమర్థవంతంగా కట్టడి చేశారు.

పబ్లిసిటీ కోసమే స్పందించలేదు..: కందుకూరు, గుంటూరు ఘటనల నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక జీఓ ఇచ్చిన విషయం తెలిసీ తెలియనట్లు బాబు వ్యవహరించారు. అందులో భాగంగానే పోలీసులు ఇచ్చిన నోటీసులకు సమాధానం ఇవ్వొద్దని తన పీఏ మనోహర్‌కు ఫోన్ ద్వారా సూచించినట్టు విశ్వసనీయ సమాచారం. నోటీసులకు సమాధానం ఇవ్వకపోతే పోలీసులు అడ్డుకుంటారని, ఆ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేసి పబ్లిసిటీ పొందవచ్చనేది బాబు ఉద్దేశమని ఆ పార్టీ కుప్పం నేత ఒకరు తెలిపారు.

కొత్త జీవో చెల్లదు

- నా సభలకు జన స్పందన చూసి ఓర్వలేకే కొత్తచట్టాలు: చంద్రబాబు

సాక్షి, చిత్తూరు: బ్రిటిష్ కాలం నాటి 1861 యాక్ట్ 30 ప్రకారం ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబర్ 1 చెల్లదని, దాని ప్రకారం తనను అడ్డుకోవడం సబబు కాదని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అన్నారు. బుధవారం సాయంత్రం కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా శాంతిపురం మండలం 121 పెద్దూరుకు ఆయన ర్యాలీగా వస్తుండగా.. రోడ్‌షో, సభలకు ముందస్తు అనుమతి తప్పనిసరి అని డీఎస్పీ సుధాకర్‌రెడ్డి నోటీసు ప్రతులు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు పోలీసు అధికారులపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తన మేనేజర్‌కు ఇచ్చిన నోటీసులు తిరిగి తనకే ఇవ్వడం సరికాదని, ఎందుకు అడ్డుకుంటున్నారో రాత పూర్వకంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు అక్కడే ఉన్న టీడీపీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఓడిపోతామనే భయంతోనే జగన్‌రెడ్డి తన సభలను అడ్డుకునేందుకు ఇలాంటి పనికి మాలిన జీవోలు తీసుకువచ్చారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు వర్తించని చట్టాన్ని ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. కొత్త జీవో ప్రకారం పోలీసు యాక్ట్ 30.. 1వ తేది నుంచే అమల్లోకి వచ్చిందని డీఎస్పీ చెబుతుండగా, ఒకవేళ 1861 చట్టం అమల్లో ఉంటే కొత్తగా జీవో తీసుకురావాల్సిన అవసరం ఏముందని నిలదీశారు. కొత్త జీవో తీసుకురావాలంటే గెజిట్ ద్వారా చట్టబద్ధత ఉండాలని చెప్పారు. రాష్ట్రంలో పాలన బ్రిటిష్ వారికంటే దారుణంగా తయారైందని మండిపడ్డారు. తన సభలకు వస్తున్న జన స్పందన చూసి ఓర్వలేక కొత్త చట్టాలు తెస్తున్నారన్నారు.

దేశంలోనే నంబర్‌వన్‌గా తెలంగాణ

- రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- నిర్మల్‌లో ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: అభివృద్ధిలో దేశంలోనే తెలంగాణ నెంబర్‌వన్‌గా ఉందని రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని దివ్య గార్డెన్స్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఎఫ్ఎస్ సీఎస్ ఉద్యోగులు, అధ్యక్షుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సమక్షంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి ఉద్యోగులు, అధ్యక్షులు పాలాభిషేకం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సహకార సంఘాల ఉద్యోగులకు హెచ్ఆర్పీ పాలసీ అమలు చేసి సీఎం కేసీఆర్ వారి జీవితాల్లో వెలుగు నింపారని తెలిపారు. జీవో ఎంఎస్ నంబర్ 44ను కాపాడుకుంటూ మెరుగైన సేవలందిస్తూ సంఘాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. జీవోలో అభ్యంతరాలుంటే సరిచేయడానికి తమవంతు పాత్ర పోషిస్తామన్నారు. సీఎం కేసీఆర్‌కు సహకార సంఘాల ఉద్యోగులంతా అండగా ఉండాలని సూచించారు. రైతుల శ్రేయస్సుకు సీఎం కేసీఆర్ ఎనలేని కృషి చేస్తున్నారని చెప్పారు. అనంతరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, మంత్రి ఐకే రెడ్డికి సహకార సంఘాల ఉద్యోగులంతా అండగా ఉండాలని, వచ్చే ఎలక్షన్‌లో సత్తా చూపాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్, ఎఫ్ఎస్ సీఎస్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రూప్‌సింగ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లాకు చెందిన చైర్మన్లు, డైరెక్టర్లు, సహకార సంఘాల ఉద్యోగులు పాల్గొన్నారు.

నానోటెక్నాలజీపై ప్రసంగం

బాసర(ముథోల్): ఆర్జీయూకేటీ ఎంఎంఈ విభాగం ఆధ్వర్యంలో స్థానిక సాక్ భవనంలో బుధవారం 'నానోటెక్నాలజీ రంగంలో జీవ ఇంధనాల అభివృద్ధి' అంశంపై ప్రముఖ ప్రొఫెసర్ కల్లూరి రంగనాథ్ ప్రసంగించారు. ఇంజినీరింగ్ విద్యార్థులతో పరిశోధన అనుభవాన్ని పంచుకున్నారు. బయోఫ్యూయల్ అప్లికేషన్ల కోసం కార్బోహైడ్రేట్లను బయోమాస్‌గా మార్చడంలో అడ్వాన్స్‌డ్ ఫంక్షనల్ మెటీరియల్స్ పాత్ర గురించి వివరించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజినీరింగ్, కెమికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సతీశ్‌కుమార్, పీఆర్వో విజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికి తీయాలి

ఉట్నూర్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్‌ఫేర్‌లు దోహదపడుతాయని గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు దిలీప్‌కుమార్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ డివిజన్ పరిధిలోని 22 ఆశ్రమ పాఠశాలలకు సంబంధించిన సైన్స్‌ఫేర్‌ను స్థానిక కేబీ ప్రాంగణంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల ఆలోచనలకు పదును పెట్టేలా ఉపాధ్యాయులు బోధన చేపట్టాలని సూచించారు. నూతన ఆవిష్కరణలు రూపొందించేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో జామ్డా ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చౌహాన్ నెహ్రూ, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



సైన్స్‌ఫేర్‌ను పరిశీలిస్తున్న డీడీటీడబ్ల్యూ దిలీప్‌కుమార్

తహసీల్ ఎదుట వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- ఇంటి స్థలం కబ్జా చేయడంతో మనస్తాపం..
- సకాలంలో స్పందించిన అధికారులు

ఆదిలాబాద్‌రూరల్: ఇంటి స్థలాన్ని కబ్జా చేశారని ఆదిలాబాద్ పట్టణానికి చెందిన చింతకుంటల్‌వార్ శ్రీనివాస్ మావల తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. అప్రమత్తమైన అధికారులు అతడి వద్ద నుంచి అగ్గిపెట్టెను లాక్కోవడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న పోలీసులకు సంఘటన స్థలానికి చేరుకుని బాధితుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా బాధితుడు శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం తనకు 2013లో మావల మండలంలో 170 సర్వే నంబర్‌లో 255 నంబర్ గల ఇంటి స్థలాన్ని కేటాయించి పట్టా ఇచ్చిందని తెలిపాడు. ఆ ప్లాట్‌లో బేస్‌మెంట్ నిర్మించుకున్నానని, అయితే వేరేవారు వచ్చి నా ఇంటి స్థలాన్ని కబ్జా చేసి నేను నిర్మించుకున్న బేస్‌మెంట్‌పై గుడిసే నిర్మించారని ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో తాను మావల తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు చెప్పాడు. నెలన్నర నుంచి కార్యాలయం, పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా అధికారులు న్యాయం చేయడం లేదన్నారు. అనంతరం తహసీల్దార్ వనజారెడ్డి మాట్లాడుతూ తన ఇంటి స్థలాన్ని కబ్జా చేశారని శ్రీనివాస్ ఫిర్యాదు చేసిన మాట వాస్తమేనని. అయితే సర్వే నంబర్ 170లోని ప్లాట్ నంబర్ 255పై రెండు పట్టాలు ఉన్నాయన్నారు. విచారణ చేపట్టి పోలీసులకు నివేదికను అందించినట్లు తెలిపారు. ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి అసలు లబ్ధిదారుడని, కబ్జాకు గురైన స్థలాన్ని పోలీసులు ఖాళీ చేయించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇదే విషయంపై ఎస్సై విష్ణువర్ధన్‌ను సంప్రదించగా రెవెన్యూ, మున్సిపాలిటీ వారు కబ్జాకు గురైన స్థలాన్ని ఖాళీ చేయిస్తే బందోబస్తు ఇచ్చే బాధ్యత మాత్రమే తమది ఉంటుందన్నారు. తమకు మాత్రం గుడిసే వేసుకుని నివాసం ఉంటున్న వారిని ఖాళీ చేయించే అర్హత లేదని పేర్కొన్నారు.



శ్రీనివాస్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న పోలీస్

మురికి నీటిగోస మళ్లీ మొదలు

- గోదావరిలో నిలకడ నీటితో పెరుగుతున్న కలుషితం
- పదిరోజులుగా రంగుమారిన నీరు సరఫరా
- ఆందోళన చెందుతున్న కార్మిక కుటుంబాలు



బకెట్‌లో ఉన్న రంగుమారిన నీరు

గోదావరిఖని(రామగుండం): కార్మిక కుటుంబాలకు మళ్లీ మురికినీటి గోస మొదలైంది. పదిరోజులుగా రంగుమారిన నీరు కార్మికవాడలకు సరఫరా అవుతోంది. దీంతో కార్మిక కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. గతేడాది ఇదే నెలలో నదిలో వ్యర్థాలు పెరగడంతో కలుషిత నీరు సరఫరా అయి చాలా మంది ఆసుపత్రి పాలయ్యారు. గోదావరిఖని, యైటింక్లయిన్‌కాలనీ, సెంటనరీకాలనీలోని కార్మిక కుటుంబాలతో పాటు సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న కుటుంబాలకు గోదావరినది ఇంటెక్‌వెల్ నుంచి నల్లాల ద్వారా రోజూ 8.5 మిలియన్ గ్యాలన్ల నీరు సరఫరా అవుతోంది. అయితే ఫిల్టర్ బెడ్‌ల ద్వారా శుద్ధి చేస్తున్నా నీటి రంగు అలాగే ఉంటోంది. నీరు వాసన వస్తోంది. గతేడాది ఇదే పరిస్థితి ఎదురు కాగా మిషన్ భగీరథ తరహాలో నీటి శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించి సింగరేణి నిధులు మంజూరు చేసింది. సాంకేతిక కారణాలతో మంజూరైన నిధులు వాపస్ పోయాయి.

కార్మిక సంఘాల ఆగ్రహం

సీఎస్ఆర్ నిధుల పేరుతో రూ.కోట్లు ఇతర ప్రాంతాలకు ధారాదత్తం చేస్తున్న సింగరేణి కార్మికుల విషయంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. కార్మిక కుటుంబాలకు స్వచ్ఛమైన నీరందించడంతో సంస్థ విఫలమవుతోందని నాయకులు విమర్శిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో గోదావరిలో నీటి ప్రవాహం నిలిచి పోయింది. సుందిళ్ల బ్యారేజీ మూలంగా పారిశ్రామిక ప్రాంతం వెంట గోదావరినదిలో పది రోజులుగా ప్రవాహం నిలిచి రంగుమారాయి. పారిశ్రామిక వ్యర్థాలు, రామగుండం కార్పొరేషన్‌కు చెందిన డ్రైనేజీ నీరు నేరుగా నదిలో కలిసి నిలిచిపోవడంతో ఉన్న నీరంతా కలుషితంగా మారింది. ఇప్పటి వరకు నదిలో నీటిప్రవాహం ఉండటంతో ఇలాంటి సమస్య సింగరేణికి ఏర్పడలేదు. గతేడాది ఇదే సమయంలో నీరు కలుషితంగా మారి, కార్మిక కుటుంబాలు వాంతులు, విరేచనాలతో ఆసుపత్రి పాలయ్యారు. సమాచారం తెలుసుకున్న ఆర్జీ–1 జీఎం కె.నారాయణ నీటి శుద్ధి చేసే ఫిల్టర్‌బెడ్‌లను పరిశీలించి మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

ర్యాపిడ్‌గ్రాడ్ ఫిల్టరైజేషన్ చేయాలి

మిషన్ భగీరథ తరహాలో ర్యాపిడ్‌గ్రాడ్ ఫిల్టరైజేషన్, నీటి శుద్ధి కేంద్రాన్ని గోదావరినది సమీపంలో ఏర్పాటు చేసి స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. మల్కాపూర్ వద్ద మున్సిపల్ డ్రైనేజీ, గోదావరిబ్రిడ్జి సమీపంలో ఆర్ఎఫ్‌సీఎల్ వ్యర్థాలు కలుస్తున్నాయి. జనగామ సమీపంలో ఫైవింక్లయిన్, టూఇంక్లెయిన్ డ్రైనేజీ నీరు కలుస్తోంది. పారిశ్రామిక వ్యర్థాలు నదిలో నేరుగా కలుస్తుండటంతో నీళ్లు కలుషితం అవుతున్నాయి.

పట్టించుకోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు

- ప్రజలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.
- గోదావరినదికి మూడు కిలోమీటర్ల దూరంలోనే పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యాలయం ఉండటం, డ్రైనేజీ నీరు, పారిశ్రామిక వ్యర్థాలు నేరుగా నదిలో కలుస్తోన్న ప్రేక్షక పాత్ర వహిస్తోందని ఆగ్రహం వ్యక్తం కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.
- తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలనే డిమాండ్ పెరుగుతోంది.
- గోదావరినదిలోని ఇంటెక్ వెల్ నుంచి ఆర్జీ–1 ఏరియాలోని 7వేల క్వార్టర్లు, సింగరేణి కార్యాలయాలు, ఏరియా ఆసుపత్రికి రోజుకు 5మిలియన్ గ్యాలన్లు, ఆర్జీ–2 ఏరియాలో 6వేల క్వార్టర్లకు 2 మిలియన్ గ్యాలన్లు, ఆర్జీ–3 ఏరియాలోని 2వేల క్వార్టర్లకు 1.5మిలియన్ గ్యాలన్ల నీటిని సింగరేణి గోదావరినది నుంచి నల్లాల ద్వారా సరఫరా చేస్తోంది.

నీటి శాంపిళ్లను పరీక్షకు పంపించాం



గోదావరినదిలో నిల్వ మూలంగా నీరు రంగు మారుతోంది. కార్మిక కుటుంబాలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాం. ఫిల్టర్‌బెడ్‌ను సందర్శించి నీటి శుద్ధి తీరును పరిశీలించాం. స్వచ్ఛమైన నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటాం. నీటి శాంపిళ్లను పరీక్ష కోసం పంపిచాం. – కె.నారాయణ, ఆర్జీ–1 జీఎం

స్వచ్ఛమైన నీటిని అందించాలి: ఎమ్మెల్యే చందర్



ఫిల్టర్ బెడ్ వద్ద నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చందర్, తదితరులు

కార్మిక కుటుంబాలకు స్వచ్ఛమైన నీరందించాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు. ఇందుకు సింగరేణి యాజమాన్యం అన్ని చర్యలు చేపట్టాలన్నారు. మిషన్ భగీరథ నీటిని కార్మిక వాడలకు సరఫరా చేసేలా ప్రభుత్వ అధికారులతో మాట్లాడుతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వ్యర్థాల మూలంగానే నీరు కలుషితంగా మారుతోందని సింగరేణి అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే వెంట మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, ఆర్జీ–1 జీఎం కె.నారాయణ తదితరులున్నారు.

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
గురువారం ॥ 5-1-2023

ముగ్గు - ముచ్చట







డి. సుగుణ
సోమాజిగూడ, హైదరాబాద్

21 చుక్కలు, 7 వరుసలు
7 వచ్చేవరకు,
చుక్క వదిలి చుక్క



కోమట్ల ప్రభావతి
ఏజీఎం కాంపౌండ్,
బాపట్ల

25 చుక్కలు,
8 వచ్చే వరకు,
మధ్య చుక్క

ముగ్గులకు ఆహ్వానం

చిరునామా: ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ మెయిల్:muggulu.sakshi@gmail.com
(మీ ఊరుతోపాటు కాలనీ- వీధి పేరు కూడా రాయండి)

సియాచిన్ పై వీర వనిత

ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన సరిహద్దు రక్షణ స్థానం సియాచిన్‌లో మొట్టమొదటిసారిగా ఒక మహిళా ఆఫీసర్ దళాధిపతిగా నియమితురాలయ్యింది. 15 వేల అడుగున ఎత్తున దేశ రక్షణకు నిలిచిన కెప్టెన్ శివ చౌహాన్ ఈ పోస్ట్ పొందడానికి ఎంతో కష్టతరమైన ట్రయినింగ్‌ను పూర్తి చేశారు. శివ చౌహాన్ వివరాలు.





గతంలో సియాచిన్‌కు విధి నిర్వహణకు పంపే సైనికులతో అధికారులు 'మీరు ముగ్గురు వెళితే ఇద్దరే తిరిగి వస్తారు' అని హెచ్చరించి పంపేవారు. 'ఇద్దరే తిరిగి వచ్చినా దేశం కోసం పోరాడతాం' అని సైనికులు సమరోత్సాహంతో వెళ్లేవారు. అయితే వారి ప్రథమ శత్రువు పాకిస్తాన్ కాదు. ప్రతికూలమైన ప్రకృతే. మైనస్ 55 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత, తీవ్రమైన చలి గాలులు, హిమపాతం, కాలు జారితే ఆచూకీ తెలియని మంచులోయలు... సియాచిన్‌లో 35 అడుగుల ఎత్తు మేరకు కూడా మంచు పడుతుందంటే ఊహించండి. ప్రపంచంలోనే ఎత్తయిన యుద్ధస్థావరమైన సియాచిన్ అటు పాకిస్తాన్ నుంచి ఇటు చైనా నుంచి రక్షణ పొందడానికి ఉపయోగపడే కీలకప్రాంతం. అక్కడ ఇన్నాళ్లు మగవారే విధులు నిర్వహించారు. మొదటిసారి ఒక మహిళా ఆఫీసర్ అడుగు పెట్టింది ఆమె పేరే శివ చౌహాన్.

1984 నుంచి

దేశ విభజన సమయంలో వాస్తవాధీన రేఖకు అంచున మానవ మనుగడకు ఏమాత్రం వీలు లేని సియాచిన్ ప్రాంతాన్ని అటు పాకిస్తాన్ కాని ఇటు ఇండియాగాని పట్టించుకోలేదు. కాని 1984లో దాని మీద ఆధిపత్యం కోసం పాకిస్తాన్ ప్రయత్నిస్తున్నదని తెలుసుకున్న భారత్ సియాచిన్ అధీనం కోసం హుటాహుటిన రంగంలో దిగి 'ఆపరేషన్ మేఘదూత్' పేరుతో విజయవంతమైన సైనిక చర్య చేయగలిగింది. ఆ తర్వాత 1999 వరకూ ఇరు పక్షాల మధ్య చర్యలు, ప్రతిచర్యలు సాగాయి. 'వాస్తవ మైదాన స్థానరేఖ'ను ఇరుపక్షాలు అంగీకరించి అక్కడ సైనిక స్థావరాలు నిర్మించుకున్నా మంచు ఖండం వంటి సియాచిన్ మీద భారత్ గాని, పాకిస్తాన్‌గాని తన స్థావరాలను తీసేయలేదు. ఇప్పటివరకూ ఇరువైపులా అక్కడ 2000 మంది సైనికులు మరణించారని అంచనా. వారిలో ఎక్కువ మంది కేవలం ప్రతికూల వాతావరణానికే మరణించారు. సైనిక కాల్పుల్లో కాదు.

అడుగు పెట్టిన ఆఫీసర్

సంప్రదాయిక విధానాలతోనే నడిచే ఇండియన్ ఆర్మీ మహిళల ప్రవేశాన్ని అన్నిచోట్ల అంగీకరించరు. ఇంతవరకూ 9000 అడుగుల ఎత్తులో ఉన్న సియాచిన్ బేస్ క్యాంప్ వరకే మహిళా ఆఫీసర్లను అనుమతించింది ఆర్మీ. కాని 15000 అడుగుల నుంచి 20 వేల అడుగుల (బాణాసింగ్ బంకర్) ఎత్తు వరకూ సియాచిన్‌లో వివిధ స్థానాలలో ఉండే స్థావరాలకు మహిళా ఆఫీసర్లను పంపలేదు. మొదటిసారిగా శివ చౌహాన్‌కు ఆర్మీ సియాచిన్ హెడ్‌క్వార్టర్స్‌లో పోస్టింగ్ ఇచ్చింది.

రాజస్థాన్ సాహసి

శివ చౌహాన్‌ది రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్. 11వ ఏట తండ్రి మరణిస్తే గృహిణి అయిన తల్లి శివ చౌహాన్‌ను పెంచింది. 'మా అమ్మే నాకు చిన్నప్పటి నుంచి ఆర్మీ మీద ఆసక్తి కలిగించింది' అంటుంది శివ. ఉదయ్‌పూర్‌లో సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన శివ 2020 సర్వీస్ సెలక్షన్ బోర్డ్ పరీక్షలు రాసి ఆలిండియా మొదటి ర్యాంకు సాధించింది. చెన్నైలో ట్రైనింగ్ అయ్యాక 2021లో లెఫ్టినెంట్‌గా ఇంజనీర్ రెజిమెంట్‌లో బాధ్యత తీసుకుంది. ఆ వెంటనే కెప్టెన్ హోదా పొందింది. 2022 కార్గిల్ దివస్ సందర్భంగా సియాచిన్ వార్ మెమోరియల్ నుంచి కార్గిల్ వార్ మెమోరియల్ వరకు 508 కిలోమీటర్ల సైకిల్ యాత్రను శివ చౌహాన్ తన నాయకత్వంలో పూర్తి చేయడంతో ఆమె అధికారుల దృష్టిలో పడింది. దాంతో ఆమెను సియాచిన్‌లో టీమ్ లీడర్‌గా పోస్ట్ వరించింది.

త్రివిధ దళాలలో చరిత్ర సృష్టిస్తున్న స్త్రీల సరసన ఇప్పుడు శివ చౌహాన్ నిలిచింది.

కఠిన శిక్షణ

సియాచిన్‌లో ఏ స్థావరంలో విధులు నిర్వహించాలన్నా సియాచిన్ హెడ్‌క్వార్టర్స్‌లోని బేటిల్ స్కూల్‌లో మూడు నెలల శిక్షణ పూర్తి చేయాలి. మిగిలిన మగ ఆఫీసర్లతో పాటు శివ ఈ శిక్షణను పూర్తి చేసింది. ఇందులో కఠినమైన మంచు గోడలను అధిరోహించడం, మంచు లోయల్లో పడినవారిని రక్షించడం, శారీరక ఆరోగ్యం కోసం డ్రిల్ పూర్తి చేయగలగడం వంటి అనేక ట్రయినింగ్‌లు ఉంటాయి. 'ఆమె శిక్షణను విజయవంతంగా పూర్తి చేసింది. మూసను బద్దలు కొట్టింది' అని ఆర్మీ అధికారులు అన్నారు.

విజయపథం

ఏమీ తెలియని రంగంలోకి ప్రవేశించి, ఉన్నత శిఖరాలకు చేరడానికి అద్భుత దీపాలతో పనిలేదు. ఆసక్తి ఉంటే, అనుభవ పాఠాలు తోడుంటే చాలు! అంతంతమాత్రం అవగాహనతో అడ్వర్‌టైజింగ్ రంగంలోకి అడుగు పెట్టిన కైనజ్ కర్మాకర్ ఆ రంగంలో ఉన్నతస్థాయికి చేరుకుంది. ఆదర్శ ఉద్యోగిగా నిలిచింది.

● స్ఫూర్తిని ఇచ్చే సృజన



● కైనజ్ కర్మాకర్

క్రియేటివ్ క్వీన్

సైకాలజీలో పట్టా పుచ్చుకున్న కైనజ్ కర్మాకర్ (ముంబై) అడ్వర్‌టైజింగ్ రంగంలోకి అడుగు పెట్టే నాటికి ఆ రంగం గురించి పెద్దగా తెలియదు. విదేశాలలో ఉన్నత చదువులు చదవాలనే కోరిక సాకారం కాకపోవడంతో ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టింది కైనజ్. అడ్వర్‌టైజింగ్ రంగంలో కనిపిస్తున్న ఆర్ట్ డైరెక్షన్, కాపీ రైటింగ్ అనే రెండు దారుల్లో రెండో దారిని ఎంచుకుంది. దీనికి కారణం తనకు రచనలు చేయడం అంటే ఇష్టం. అయితే అడ్వర్‌టైజింగ్ కాపీ రైటింగ్ గురించి మాత్రం ఏమీ తెలియదు.

ముంబైలోని ఒక యాడ్ ఏజెన్సీలో చేరినప్పుడు, ఉద్యోగంలో చేరినట్లు కాకుండా మొదటిసారిగా బడికి వచ్చిన విద్యార్థిలా అనిపించింది.

'అదృష్టాన్ని నమ్ముకున్నవారు దాని కోసమే నిరీక్షిస్తూ తమకు తెలియకుండానే దురదృష్టంలోకి జారుకుంటారు' అనే మాట ఉంది.అయితే కైనజ్ అదృష్టం కంటే కష్టాన్నే నమ్ముకుంది. 2000 సంవత్సరంలో 'లియో బర్నెట్ ఇండియా'లో చేరినప్పుడు అక్కడ అగ్నెలో డయాస్ పరిచయం అయ్యాడు. తాను ఒక గురువై అడ్వర్‌టైజింగ్‌కు సంబంధించిన సూక్ష్మనైపుణ్యాలను బోధించాడు. విలువైన పాఠాలు అవి.

'ఒగిల్వీ ఇండియా' కంపెనీలో అడుగు పెట్టడానికి ముందు రకరకాల కామెంట్స్ వినిపించాయి...

'కొత్తవాళ్లు అక్కడ పనిచేయడం కష్టం'

'అక్కడ ఎప్పటికప్పుడు నిలదొక్కుకోవడం తప్ప ఉన్నత స్థాయికి చేరడం అనేది కలలో మాట'

అయితే ఇలాంటి కామెంట్స్‌ను పట్టించుకోకుండా తన పనిపైనే పూర్తిగా దృష్టి పెట్టింది కైనజ్.

కంపెనీ నేర్పిన పాఠాలు, కాలం నేర్పిన పాఠాలతో తనలోని సృజనాత్మకతకు మెరుగులు దిద్దుకుంది.

'ఒగిల్వీ ఇండియా' చీఫ్ క్రియేటివ్ ఆఫీసర్ స్థాయికి ఎదిగింది.

'చెప్పే విధానం ఎంత ఆకర్షణీయంగా ఉంటే, మార్పు అనేది అంత త్వరగా మొదలవుతుంది' అంటున్న 46 ఏళ్ల కైనజ్ తన సృజనాత్మక కృషికి దేశ, విదేశాల్లో 40కి పైగా ప్రతిష్ఠాత్మకమైన అవార్డ్‌లు అందుకుంది.

'క్లయింట్ సమస్యను తన వ్యక్తిగత సమస్యగా భావించి వెంటనే రంగంలోకి దిగుతుంది. అది పరిష్కారం అయ్యే వరకు కష్టపడుతుంది. తన పనేదో తాను నిశ్శబ్దంగా చేసుకుంటూ పోతుంది తప్ప హడావిడి, ఆర్భాటం కనిపించవు. కైనజ్ ప్రాధాన్యతలలో పని మొదటిస్థానంలో ఉంటుంది. ఔత్సాహికులకు స్ఫూర్తిని ఇచ్చే వ్యక్తి' అంటున్నాడు కైనజ్‌తో ఎన్నో సంవత్సరాలు కలిసి పనిచేసిన హర్షద్ రాజాధ్యక్ష.

'ఒగిల్వీలో ఎందరో దిగ్గజాల దగ్గర ఎన్నో విలువైన పాఠాలు నేర్చుకున్నాను. అడ్వర్‌టైజింగ్‌కు సంబంధించి నా ఆలోచనలు మార్చుకోవడానికి, కొత్తగా ఆలోచించడానికి అవి ఉపకరించాయి' అంటున్న కైనజ్ ఐటీసీ, బ్రూక్ బాండ్, ఫియట్, బజాజ్... మొదలైన ప్రసిద్ధ బ్రాండ్‌లకు పనిచేసింది.

కెరీర్ కొత్తలో చేదు అనుభవాలు ఎదురైనా, వాటిని ఎప్పటికప్పుడూ డిలీట్ చేస్తూ వస్తోంది కైనజ్.

'చేదు జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకోవడం కంటే కొత్త ఐడియాల గురించి ఆలోచించడానికి ఇష్టపడతాను. కొత్తగా ఆలోచించడం అనేది నా వృత్తిలో భాగం. నేను ఎంచుకున్న రంగంలో విజయం సాధించాలనే ఆలోచన తప్ప వేరే రంగాన్ని ఎంచుకొని ఉంటే బాగుండేది అని ఎప్పుడూ ఆలోచించలేదు. వృత్తిజీవితాన్ని, వ్యక్తిగత జీవితాన్ని సమన్వయం చేసుకోగలిగే రంగమే నా దృష్టిలో గొప్ప రంగం' అంటుంది కైనజ్ కర్మాకర్.

జర్నీ

ఓ బాటసారీ... మోగించు విజయభేరీ!



సాహసయాత్రలు యాత్ర వరకు మాత్రమే పరిమితం కావు. మనలో కొత్త వెలుగును నింపుతాయి. కొత్త దారి చూపుతాయి. కొత్త విజయాలు సాధించేలా సంకల్పబలాన్ని ఇస్తాయి. సైకిల్‌పై ఎన్నో సుదూరయాత్రలు చేసి రికార్డ్‌లు సాధించిన ప్రీతి మస్కే తాజాగా ఇండియా నుంచి సింగపూర్‌కు సైకిల్‌యాత్ర చేయడానికి సన్నద్ధం అవుతోంది...

ఫాస్టెస్ట్ ఫిమేల్ సోలో సైకిలిస్ట్‌గా గత సంవత్సరం నవంబర్ నెలలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లో చోటు సంపాదించింది పుణెకు చెందిన ప్రీతి మస్కే. 13 రోజుల 18 గంటల 38 నిమిషాలలో గుజరాత్ నుంచి అరుణాచల్‌ప్రదేశ్ సైకిల్ యాత్రను పూర్తి చేసింది. గుజరాత్‌లోని కోటేశ్వర్ నుంచి మొదలైన ఈ సైకిల్ యాత్ర ఏడు రాష్ట్రాల గుండా సాగి అరుణాచల్‌ప్రదేశ్‌లోని కిబితులో ముగిసింది.

'ప్రతి ఒక్కరూ అస్సామ్, అరుణాచల్ ప్రదేశ్‌లను చూడాలనుకుంటారు. అయితే సైకిల్‌పై యాత్ర అనేసరికి వెనక్కి తగ్గుతారు. దీనికి కారణం అంతదూరం సైకిల్‌యాత్ర అంత సులువైన విషయం కాదు. ఈ యాత్ర చేయగలనా? అని మొదట్లో నేను కూడా సందేహించాను. కొద్ది సమయంలోనే ఆ సందేహం నుంచి బయటపడి సాహసయాత్రకు పూనుకున్నాను' అని గతాన్ని గుర్తు తెచ్చుకుంది ప్రీతి.

'యాత్ర కోసం యాత్ర' అని కాకుండా తన యాత్రకు సామాజిక సందేశాన్ని కూడా జోడించింది. దారి పొడుగునా అవయవదానం ప్రాముఖ్యత గురించి ప్రచారం చేస్తూ వెళ్లింది.

చిన్నప్పుడు ప్రీతికి ఆటలు అంటే ఇష్టం. హాకీ, బాస్కెట్‌బాల్ బాగా ఆడేది. అయితే స్కూలు చదువుల తరువాత తనకు ఆటలు దూరమయ్యాయి. 2017లో సరదాగా చేసిన సైకిలింగ్ తన జీవితాన్నే మార్చేసింది. ఎంతో సానుకూల శక్తిని ఇచ్చి ముందుకు నడిపిస్తోంది.

'ఇద్దరు పిల్లలకు తల్లి అయిన తరువాత, నలభై ఏళ్ల వయసులో పిల్లలు, కుటుంబం తప్ప వేరే ప్రపంచం ఏదీ తెలియని ప్రపంచంలోకి వెళ్లిపోతాం. సైకిలింగ్ నా కోసం ఎన్నో కొత్త ద్వారాలు తెరిచింది. కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. సాధించాల్సింది ఎంతో ఉంది అని చెప్పింది' అంటుంది ప్రీతి.

2019లో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సోలోగా సైకిల్‌యాత్ర చేపట్టినప్పుడు చాలామంది భయపెట్టేలా మాట్లాడారు. అయితే ఆ భయంగొల్పే మాటలు ప్రీతిని వెనక్కి తీసుకువెళ్లకపోగా మరింత ధైర్యాన్ని ఇచ్చాయి. పట్టుదలను పెంచాయి. అసాధ్యం అనుకున్న సైకిల్ యాత్ర విజయవంతం అయ్యేలా చేశాయి. ఇక అప్పటి నుంచి ఆమె వెనక్కి చూడలేదు.

సుదీర్ఘ సైకిల్‌యాత్రలు లేని సమయంలో ఆసక్తి ఉన్నవారికి సైకిలింగ్‌లో శిక్షణ ఇస్తోంది. స్విమ్ చేస్తోంది. శరీరం ఫిట్‌గా ఉండేలా రకరకాల ఎక్సర్‌సైజ్‌లు చేస్తుంది. వారాంతాలలో 100 నుంచి 300 కి.మీ వరకు సైకిలింగ్ చేస్తోంది.

ఎన్నో సుదూర సైకిల్ యాత్రలు పూర్తి చేసిన ప్రీతి 'ప్రతి రికార్డ్ ఒక సవాలే. దేనికదే ప్రత్యేకమైనది' అంటోంది.

ఒక మంచిపని, స్ఫూర్తిని ఇచ్చే పని చేస్తే, సాహసాన్ని తట్టిలేపే పనిచేస్తే సమాజం తనకు తానుగా ముందుకు వచ్చి భుజం తట్టి ముందుకు నడిపిస్తుంది.

సైకిల్ యాత్రలో ఎన్నో రాష్ట్రాలలో, ఎన్నోచోట్ల అపరిచితురాలైన తనను ఆప్యాయంగా పలకరించారు ప్రజలు. ఆతిథ్యం ఇచ్చారు. సైకిల్‌కు రిపేర్లు వస్తే బాగు చేయించారు. హైవే హోటళ్ల వాళ్లు కూడా మర్యాదగా పలకరించి తనకు ఆతిథ్యం ఇచ్చారు.

సాధించిన దానితో సంతృప్తి చెంది అదే విజయం అనుకోవడం లేదు ప్రీతి. తాజాగా ఇండియా నుంచి సింగపూర్ సైకిల్ యాత్రకు సన్నద్ధం అవుతోంది.

'సాధ్యం అవుతుంది' అనడం తేలిక.

'అసాధ్యం' అనుకోవడం అంతకంటే తేలిక.

అయితే అసాధ్యాలను, సుసాధ్యం చేయడం కొందరికే సాధ్యం. ఆ కొందరిలో ప్రీతీ మస్కే ఒకరు.

అన్యోన్య సేవ

వివేకానందుడు యువతకు స్ఫూర్తిప్రదాత.
ఆ స్ఫూర్తితో నడిచిన యువకుడు రామకృష్ణారెడ్డి.
అతడి బాటలోనే అడుగులేసిన భార్య రామ తులసి.
వీరి అవిశ్రాంత సేవాపరిశ్రమకు ఓ గుర్తింపు.
ఆ గుర్తింపునకు చిహ్నంగా ఓ పురస్కారం.
ఆ యువజంట పెద్ద మనసుకు ఇది పరిచయవాక్యం.



● రామకృష్ణా రెడ్డి, రామ తులసి

వివేకవంతమైన స్ఫూర్తి

పాపజెన్ని రామకృష్ణారెడ్డి, రామతులసి దంపతులు వైఎస్‌ఆర్ కడప జిల్లా, కాశినాయన మండలం, ఓబుళాపురంలో సగిలేరు ఒడ్డున వివేకానంద సేవాశ్రమాన్ని ప్రారంభించి వృద్ధుల సేవ చేస్తున్నారు. వారి నిస్వార్థ సేవకు గత నెల 24వ తేదీన కేంద్రమంత్రి మురళీధర్ చేతుల మీదుగా 'జనమంచి గౌరీశంకర్ యువ పురస్కారం' అందుకున్నాడు రామకృష్ణారెడ్డి. ఈ సందర్భంగా ఈ దంపతులు సాక్షితో పంచుకున్న సేవాప్రస్థాన వివరాలివి.

''అది 2014. మా అమ్మానాన్న నాకు పెళ్లి సంబంధం తెచ్చారు. అబ్బాయి రైల్వే ఉద్యోగి. జీవితం హాయిగా ఉంటుందని, వాళ్లు సంతోషంగా ఉన్నారు. పెళ్లి చూపుల్లో ఆయన నాతో మాట్లాడినప్పుడు చెప్పిన ఒకే ఒక మాట నన్ను ఆశ్చర్యానికి గురిచేసింది. తనకు పెళ్లి చేసుకునే ఆలోచనే లేదని, వివేకానందుని స్ఫూర్తితో సమాజ సేవకు అంకితం కావాలనుకున్నానని, వాళ్ల అమ్మానాన్న పట్టుబట్టి పెళ్లి చూపులకు తీసుకువచ్చారని... చెప్పారు. తన నెల జీతంలో సగం సమాజ సేవకు ఖర్చు చేయాలని తీర్మానించుకున్నట్లు కూడా చెప్పారు. నేను డిగ్రీ చదివాననే కానీ నాకప్పటికి సోషల్ సర్వీస్ అంటే ఏం చేస్తారనే అవగాహన కూడా లేదు. ఇతరులకు మంచి చేయాలనుకుంటున్నాడంటే మంచివాడేలాగుండని పెళ్లికి ఒప్పుకున్నాను. పెళ్లయిన తర్వాత ఆయనతో కలిసి హాస్పిటల్, స్కూళ్లకు వెళ్లాను. మా వారు ఏమిటనేది అర్థం కాసాగింది. కానీ ఒక ఏడాది పాటు ఆందోళనగానే గడిచింది.

ఫోన్ రావడం... వెళ్లిపోవడం

హాస్పిటళ్లు, స్కూళ్లకు ఎప్పుడు వెళ్లేది ముందుగానే తెలుస్తుంది. ఆరోగ్యం బాగాలేని వాళ్లను ఇంటికి తీసుకువచ్చి రెండు–మూడు రోజులు ఉంచుకుని వైద్యం చేయించి పంపించేవారు. వాళ్లకు అవసరమైనవి చూసుకోవడం కూడా నాకు ఇబ్బంది కలగలేదు. కానీ ఎమర్జెన్సీ సర్వీస్‌లు నన్ను భయపెట్టేవి. ఆశ్రమం నిర్మాణానికి ముందు మేము ప్రొద్దుటూరులో ఉండేవాళ్లం. ఆయన ఉద్యోగానికి వెళ్లి ఇంటికి వచ్చిన తర్వాత ఏ అర్ధరాత్రో బ్లడ్ కావాలని, ఎవరో మరణించారు అంత్యక్రియలు చేయాలని ఫోన్ వచ్చేది. ఫోన్ కాల్ మాట్లాడుతూనే నాకు బయలుదేరుతున్నానని చెప్పి వెళ్లిపోయేవారు. నేను ఏడవ నెల గర్భంతో ఉన్నప్పుడు వచ్చిన అంత్యక్రియల ఫోన్ కాల్ ఎంతగా భయపెట్టిందో ఇప్పటికీ మర్చిపోలేను. నాకు మరణించిన వారిని చూడాలంటేనే భయం, వారం– పది రోజుల పాటు రాత్రి కలలు వచ్చేవి. అందుకే పెళ్లికి ముందు నన్ను బంధువుల మరణాలకు కూడా తీసుకువెళ్లేవారు కాదు. అలాంటిది ఈ సేవలో ఏ క్షణాన మరణం గురించి వినాల్సి వస్తుందోనని భయమేసేది. అలాంటి నేను ఇప్పుడు ఆయన డ్యూటీలో ఉన్నప్పుడు మా సేవాశ్రమంలో ఎవరైనా తుదిశ్వాస వదిలితే స్వయంగా అన్ని కార్యక్రమాలనూ పూర్తి చేస్తున్నాను. కరోనా సమయంలో ఓ వ్యక్తి మరణిస్తే భార్య, పిల్లలు కూడా ముందుకురాలేదు, అప్పుడు ఆ పార్థివదేహాన్ని మోసి అంత్యక్రియలు చేశాను.

రక్తదానం ప్రాణదానమే అని తెలిసింది

రక్తం కోసం ఫోన్ వచ్చిన వెంటనే మా వారు ఎందుకు అంతగా పరుగులు తీసేవారో నా డెలివరీలో తెలిసి వచ్చింది. రక్తం ఎక్కువగా పోవడంతో నాకు రక్తం ఎక్కించాల్సి వచ్చింది. ఆలస్యమైతే తల్లీబిడ్డల్లో ఒకరే దక్కుతారని చెప్పారు. మా వారు బ్లడ్ డొనేషన్ వాట్సాప్ గ్రూప్‌లో పెట్టగానే ఓ అన్న గంటలోపే వచ్చి రక్తం ఇచ్చి నన్ను రక్షించారు. ఆ తర్వాత నుంచి నేను కూడా బ్లడ్ డొనేట్ చేస్తున్నాను.



● ఆశ్రమవాసులకు భోజనం వడ్డిస్తున్న రామ తులసి

ఆశ్రమంలోనే నివాసం

ఏ దిక్కూ లేని వాళ్ల కోసం ఒక స్థిర నివాసం ఏర్పాటు చేయాలనే ఆలోచన వచ్చిన తర్వాత స్థలం కోసం చాలా ప్రయత్నాలు చేశాం. మా సంకల్పానికి ఆ భగవంతుడే దారి చూపించినట్లు మాజీ ఆర్మీ ఉద్యోగి విద్యార్థన రెడ్డిగారు ఎకరా స్థలం ఇచ్చారు. అందులో నిర్మాణం ఎలాగన్నది ఆ తర్వాత మా ముందున్న ప్రశ్న. 2018లో భూమి పూజ చేసి పనులు మొదలుపెట్టాం. కానీ ముందుకు సాగలేదు. నా పెళ్లికి మా పుట్టింటి వాళ్లు పెట్టిన బంగారం ఇచ్చాను. బ్యాంకులో తాకట్టు పెడితే రెండు లక్షలు వచ్చాయి. మా వారి ఫేస్‌బుక్ ఫ్రెండ్ రాజోలు శ్రీధర్‌రెడ్డిగారు తాడిపత్రిలో వ్యాపారి. ఆయన లక్ష రూపాయలతో బోరు వేయించారు. నిర్మాణ పనులు జరుగుతున్నప్పుడు ఊరి వాళ్లు ఐదు వందల నుంచి ఎంత ఇవ్వగలిగితే అంత మొత్తం ఇచ్చారు. ఈ భవన నిర్మాణంలో వందలాది మంది భాగస్వామ్యం ఉంది. ఉత్తరప్రదేశ్‌లో ఉండే రామకృష్ణారెడ్డి అనే దాత ఆ సమయంలో ఇక్కడికి రావడం కూడా దేవుడు పంపినట్లే జరిగింది. ఆయన ఆరు లక్షల రూపాయల వరకు సహాయం చేశారు. మా సేవాశ్రమం 2021 జనవరి 12న వివేకానంద జయంతి రోజే ప్రారంభమైంది. రెండు రోజులకు ముగ్గురు వచ్చారు, ఇప్పుడు పన్నెండు మంది ఉన్నారు. మా నివాసం కూడా ఆశ్రమంలో వారితోనే.

వైద్యసహాయం

ఆశ్రమవాసులకు ఆహారం అందివ్వగలుగుతున్నాం. కానీ వైద్యఖర్చులు మా శక్తికి మించి ఉండడంతో పోరుమామిళ్లలోని బ్లెస్డ్ బ్రయాన్ హాస్పిటల్ డాక్టర్‌లు ఉచితంగా వైద్యం చేస్తున్నారు. ఆశ్రమ నిర్వహణ, బ్యాంకు ఈఎమ్ఐలకు డబ్బు తగ్గినప్పుడు మా తమ్ముడు, ఆయన తమ్ముడు కూడా సహాయం చేస్తున్నారు. ముఖ్యమైన కార్యక్రమాల సమయంలో మాత్రం ఈ ఫౌండేషన్ ఏర్పాటు ఆలోచన నుంచి ఆయనకు తోడుగా ఉన్న స్నేహితులు ఆదుకుంటున్నారు. స్టూడెంట్స్‌గా ఉన్నప్పుడు మొదలైన వారి ఆలోచనకు ప్రతిరూపమే ఈ ఆశ్రమం. ఇప్పుడు వాళ్లలో ఒకరు పోలీస్, ఒకరు ఆర్మీ జవాన్, మా వారు రైల్వే గేట్ మేన్. ఒకరు ఫొటో స్టూడియో నిర్వహిస్తున్నారు. చేతినిండా డబ్బు ఉండి మొదలు పెట్టిన సేవ కాదిది. సేవ అవసరమైన చోట డబ్బు లేకపోయినా సరే వెనుకాడకుండా వేసిన ముందడుగు''.

– ఇంటర్వ్యూ: **వాకా మంజులారెడ్డి**, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు : **పాలకొలను వెంకటరామిరెడ్డి**, సాక్షి, బద్వేల్, కడప జిల్లా

పురస్కారం అందరిదీ!

మాది కడప జిల్లా, కలసపాడు మండలం, తెల్లపాడు గ్రామం. రెండెకరాల భూమి, వర్షమే ఆధారం. మా అమ్మానాన్నలు కష్టపడి చదివించారు. నేను ఇంటర్‌లో కాలేజ్ టాపర్, జిల్లాలో సెకండ్ ప్లేస్. నా పరిస్థితి చూసి ఓ పెద్దాయన ఉద్యోగం వచ్చే వరకు సహాయం చేస్తానని నాకు బ్యాంకు అకౌంట్ ఓపెన్ చేయించి నెలకు వెయ్యి రూపాయలు చొప్పున ఉద్యోగం వచ్చే వరకు సహాయం చేశారు. ఇతర ఖర్చులకు ట్యూషన్‌లు చెప్పేవాడిని. దసరా, వేసవి సెలవుల్లో బేల్దారి పనులు, భవనాలకు రంగులు వేయడం వంటి పనులు చేశాను. అలా రూపాయి రూపాయి జమ చేసుకుంటున్న రోజుల్లో కూడా రోడ్డు మీద అన్నం లేని వాళ్లకు అన్నం పెట్టడం వంటివి చేసేవాడిని. దీనంతటికీ కారణం వివేకానందుని స్ఫూర్తి. స్వామి వివేకానందుని గురించి ఇంటర్‌లో ఉండగా తెలిసింది. అప్పటి నుంచి ఏడాదిపాటు వివేకానందను విపరీతంగా చదివాను. ఆ ప్రభావమే నన్ను సేవామార్గం వైపు మళ్లించింది. ఈ పురస్కారం నా జీవితంలో ఓ మైలురాయి. నా పనిని మరొకరు గుర్తించారు అనే సంతోషం. పురస్కారం అందుకున్న చేతులు నావే, కానీ పురస్కారానికి నాకు అర్హతను చేకూర్చిన చేతులు ఎన్నో చెప్పలేను. ఈ గౌరవం నా స్నేహితులు, నా భార్య, తమ్ముడు, బావమరిది, ఇతర దాతలందరిదీ.

– పాపిజెన్ని రామకృష్ణారెడ్డి,
ఫౌండర్, వివేకానంద సేవాశ్రమం



సెమీఫైనల్లో హుసాముద్దీన్

జాతీయ సీనియర్ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు (ఎస్‌ఎస్‌సీబీ) జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ బాక్సర్ హుసాముద్దీన్ (57 కేజీలు) సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. హిసార్‌లో బుధవారం ఏకపక్షంగా జరిగిన క్వార్టర్‌ఫైనల్లో నిజామాబాద్ జిల్లాకు చెందిన హుసాముద్దీన్ 5–0తో మనీశ్ రాథోడ్ (ఉత్తరప్రదేశ్)పై గెలిచాడు. నేడు జరిగే సెమీఫైనల్లో ఆశిష్ (హిమాచల్‌ప్రదేశ్)తో హుసాముద్దీన్ తలపడతాడు.



ఆసియా బ్యాడ్మింటన్ టోర్నీకి భారత జట్టు ప్రకటన

వచ్చే నెలలో దుబాయ్‌లో జరిగే ఆసియా మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత జట్టును బుధవారం ప్రకటించారు. పురుషుల సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్, లక్ష్య సేన్... మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు, ఆకర్షి కశ్యప్... పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి, పంజాల విష్ణువర్ధన్ గౌడ్–గరగ కృష్ణప్రసాద్ జోడీలు... మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ, శిఖా గౌతమ్–అశ్విని భట్ జోడీలు.... మిక్స్‌డ్ డబుల్స్‌లో ఇషాన్ భట్నాగర్–తనీషా క్రాస్టో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తారు.

సిరీస్ లక్ష్యంగా...

- నేడు శ్రీలంకతో భారత్ రెండో టి20
- ఆత్మవిశ్వాసంతో హార్దిక్ బృందం
- గాయంతో సామ్సన్ సిరీస్‌కు దూరం
- రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం



పుణే: గెలుపుతో కొత్త ఏడాదిని ప్రారంభించిన భారత్ వరుస విజయంతో ఇప్పుడు సిరీస్‌పై కన్నేసింది. గురువారం జరిగే రెండో టి20లో సిరీస్ సొంతం చేసుకోవడమే లక్ష్యంగా బరిలోకి దిగుతుంది. మరోవైపు తొలి మ్యాచ్ ఓటమితో ఒత్తిడిలో కూరుకుపోయిన శ్రీలంక సిరీస్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిన స్థితిలో ఉంది. ఆసియా కప్ టి20 చాంపియన్ అయిన లంక బౌలింగ్‌లో ఆతిథ్య జట్టును చక్కగా కట్టడి చేసినప్పటికీ బ్యాటింగ్‌లో తడబడింది. దీంతో పటిష్టమైన భారత్‌ను దీటుగా ఎదుర్కొనేందుకు లోపాలపై దృష్టి పెట్టింది. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ (ఎంసీఏ) మైదానంలో ఇరు జట్ల మధ్య రెండో టి20 కూడా ఆసక్తికరంగా జరగనుంది. మోకాలి గాయం కారణంగా సంజూ సామ్సన్ టి20 సిరీస్‌కు దూరమయ్యాడు. అతని స్థానంలో విదర్భకు చెందిన వికెట్ కీపర్ జితేశ్ శర్మను జట్టులోకి ఎంపిక చేస్తున్నట్లు బీసీసీఐ తెలిపింది.

గెలిచింది కానీ...

భారత్ సిరీస్‌లో శుభారంభం చేసింది. కానీ అంత గొప్ప విజయమైతే కాదు. ఓపెనింగ్, టాపార్డర్ వైఫల్యం జట్టును కంగారు పెట్టించింది. పొట్టి మ్యాచ్‌ల్లో శివమెత్తే 'మిస్టర్ 360 డిగ్రీ' బ్యాటర్ సూర్యకుమార్ సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాడు. రోహిత్, కోహ్లిలాంటి స్టార్లు లేని ప్రస్తుత టీమిండియాకు సంచలన బ్యాటర్ సూర్యకుమారే కీలక ఆటగాడు. అలాంటి బ్యాటర్ బాధ్యతను విస్మరిస్తే మాత్రం జట్టుకు మూల్యం తప్పదు. మిడిలార్డర్‌లో కెప్టెన్ హార్దిక్ పాండ్యాతో పాటు దీపక్ హుడా, అక్షర్ పటేల్ గత మ్యాచ్‌లో ఆదుకున్నారు. ఈ మ్యాచ్‌లో వారిదాకా బ్యాటింగ్ రాకుండా భారత టాపార్డర్ బ్యాటర్లు రాణించాలి.

ఉమ్రాన్ స్థానంలో అర్ష్‌దీప్

గత మ్యాచ్‌లో అనారోగ్యం కారణంగా బరిలోకి దిగలేకపోయిన యువ సీమర్ అర్ష్‌దీప్ సింగ్ రెండో టి20కి సిద్ధంగా ఉన్నాడు. ఉమ్రాన్ మాలిక్ స్థానంలో అతను ఆడతాడు. దీంతో పేస్ విభాగం కాస్త పటిష్టమవుతుంది. శివమ్ మావి తొలి మ్యాచ్‌లో సత్తా నిరూపించుకోవడంతో అతని స్థానానికి వచ్చిన ఢోకా అయితే లేదు. అనుభవజ్ఞుడైన స్పిన్నర్ చహల్ ధారాళంగా పరుగులు సమర్పించుకోవడం ఇబ్బందికర అంశం. స్పిన్‌కు కలిసొచ్చే ఎంసీఏ పిచ్‌పై అతను సత్తా చాటుకోవాలి.

రేసులో పదాలనే లక్ష్యంతో...

భారత్ సిరీస్ వేటలో పడితే... లంక సిరీస్ రేసులో ఉండాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. ఆతిథ్య జట్టులాగే లంక జట్టులోనూ టాపార్డర్ విఫలమైంది. మెరుపులు మెరిపించే నిసాంక, ధనంజయ డిసిల్వా పవర్‌ప్లేలోనే డగౌట్‌లో చేరడం, హిట్టర్ రాజపక్స వైఫల్యం లంక లక్ష్యఛేదనను భారంగా మార్చింది. కీలకమైన ఈ పోరులో వీరంతా ఫామ్‌లోకి వస్తే శ్రీలంక మ్యాచ్‌లో గెలిచి రేసులో నిలుస్తుంది. బౌలింగ్‌లో 4 ఓవర్లలో 47 పరుగులు సమర్పించుకున్న కసున్ రజిత స్థానంలో లాహిరు కుమారను ఆడించాలని జట్టు మేనేజ్‌మెంట్ భావిస్తోంది. ఇది మినహా దాదాపు తొలి మ్యాచ్ ఆడిన తుదిజట్టే బరిలోకి దిగుతుంది.

పిచ్, వాతావరణం

ఎంసీఏ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలం. పేసర్లకంటే స్పిన్నర్లకు కలిసొచ్చే పిచ్. వర్షం ముప్పు లేదు. మంచు ప్రభావం ఉంటుంది. ఈ మైదానంలో భారత్ మూడు అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లు ఆడింది. 2012లో ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ ఐదు వికెట్లతో నెగ్గగా... 2016లో శ్రీలంక చేతిలో టీమిండియా ఐదు వికెట్ల తేడాతో ఓడిపోయింది. 2020లో శ్రీలంకపైనే భారత్ 78 పరుగులతో గెలిచింది.

'మట్టి కుస్తీ' సవాల్

- రేపటి నుంచి హైదరాబాద్‌లో 'హింద్ కేసరి' పోటీలు
- 2011 తర్వాత మరోసారి భాగ్యనగరం ఆతిథ్యం
- బరిలో 550 మంది రెజ్లర్లు
- పురుషులు, మహిళల విభాగాల్లో పోరు

సాక్షి, హైదరాబాద్: పుష్కర కాలం తర్వాత భాగ్యనగరంలో మరోసారి సాంప్రదాయ కుస్తీ పోటీలకు రంగం సిద్ధమైంది. ప్రస్తుతం పెద్ద స్థాయి ఈవెంట్లలో అధికారిక క్రీడగా ఉన్న 'మ్యాట్ రెజ్లింగ్' కాకుండా మట్టిలో జరిగే హోరాహోరీ సమరాలకు దేశవ్యాప్తంగా మంచి ఆదరణ ఉంది. అందుకే గత 65 ఏళ్లుగా పలువురు అగ్రశ్రేణి రెజ్లర్లను భాగస్వాములుగా చేస్తూ ఈ టోర్నీలను 'ఇండియన్ స్టయిల్ రెజ్లింగ్ అసోసియేషన్' విజయవంతంగా నిర్వహిస్తోంది. 'హింద్ కేసరి'గా గుర్తింపు తెచ్చుకునేందుకు రెజ్లర్లు తలపడే ఈ ఆసక్తికర మట్టి కుస్తీ టోర్నీకి ఎల్బీ స్టేడియం వేదికవుతోంది. శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో ప్రముఖ రెజ్లర్లందరూ తలపడతారు. గురువారం సాయంత్రం రెజ్లర్ల వెయింగ్ తీసుకుంటారు. సుదీర్ఘ కాలం పాటు తెలంగాణలో రెజ్లింగ్ సంఘానికి చిరునామాగా నిలిచిన విజయ్‌కుమార్ యాదవ్ స్మారకంగా ఈ టోర్నమెంట్‌ను వ్యవహరిస్తున్నారు. హైదరాబాద్‌లో 'హింద్ కేసరి' పోటీలు జరగడం ఇది మూడోసారి. 1958లో తొలిసారి జరగ్గా... 2011లో రెండోసారి హైదరాబాద్ ఈ మెగా ఈవెంట్‌కు ఆతిథ్యం ఇచ్చింది. 2011లో మధ్యప్రదేశ్‌కు చెందిన రోహిత్ పటేల్ ఫైనల్లో మౌజమ్ ఖత్రీని ఓడించి 'హింద్ కేసరి' టైటిల్ సాధించాడు.



2011లో హైదరాబాద్‌లో జరిగిన 'హింద్ కేసరి' టోర్నీలో టైటిల్ నెగ్గిన రోహిత్ పటేల్ (ఫైల్)

'హింద్ కేసరి' ఇతర విశేషాలు...

- జనవరి 6 నుంచి 8 వరకు ఎల్బీ స్టేడియంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్న రెండు మట్టి కోర్టులలో బౌట్‌లు జరుగుతాయి. దేశం నలుమూలల నుంచి దాదాపు 550 మంది రెజ్లర్లు పాల్గొంటారు.
- పురుషుల విభాగంలో 55 కేజీల నుంచి 90 కేజీల మధ్య 8 కేటగిరీలలో బౌట్‌లు ఉంటాయి. 'హింద్ కేసరి' టైటిల్ కోసం 85 కేజీల నుంచి 140 కేజీల మధ్య ఉన్న రెజ్లర్లు పోటీపడతారు. మహిళల విభాగంలో 48 కేజీల నుంచి 68 కేజీల మధ్య 5 కేటగిరీల్లో బౌట్‌లు ఉంటాయి. 'మహిళా హింద్ కేసరి' టైటిల్ కోసం 65 నుంచి 90 కేజీల మధ్య రెజ్లర్లు బరిలోకి దిగుతారు.
- పురుషుల విభాగంలో 'హింద్ కేసరి' టైటిల్ విజేతకు రూ. 3 లక్షలతోపాటు 3 కిలోల వెండి గద బహుమతిగా లభిస్తుంది. రన్నరప్‌కు రూ. 2 లక్షలు, మూడో స్థానంలో నిలిచిన రెజ్లర్‌కు రూ. 1 లక్ష అందజేస్తారు. మహిళల 'హింద్ కేసరి'కి రూ. 1 లక్ష నగదు బహుమతి అందజేస్తారు. ఇతర వెయిట్ కేటగిరీ విజేతలకు కూడా నగదు పురస్కారాలు ఇస్తారు.

సౌద్ షకీల్ అజేయ శతకం



కరాచీ: న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో మూడో రోజు ఆట ముగిసే సమయానికి పాకిస్తాన్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 407 పరుగులు చేసింది. సౌద్ షకీల్ (336 బంతుల్లో 124 బ్యాటింగ్; 17 ఫోర్లు) కెరీర్‌లో తొలి సెంచరీ నమోదు చేయగా...ఇమామ్ ఉల్ హక్ (83), సర్ఫరాజ్ అహ్మద్ (78), ఆగా సల్మాన్ (41) రాణించారు. ఓవర్‌నైట్ స్కోరు 154/3తో ఆట కొనసాగించిన పాక్ బుధవారం 85 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి మరో 253 పరుగులు జోడించింది. కివీస్ బౌలర్లలో ఎజాజ్ పటేల్ 3, సోధి 2 వికెట్లు తీశారు. ప్రస్తుతం చేతిలో ఒకే వికెట్‌తో మరో 42 పరుగులు వెనుకబడి ఉన్న పాక్... తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కోల్పోయే అవకాశాలు ఉన్నాయి.

జ్ఞానేశ్వర్, భరత్ అర్ధ సెంచరీలు

- రెండో ఇన్నింగ్స్‌లో ఆంధ్ర 230/3
- హైదరాబాద్‌తో రంజీ మ్యాచ్



జ్ఞానేశ్వర్



భరత్

సాక్షి, విజయనగరం: హైదరాబాద్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు కోలుకుంది. 62 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 48 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 230 పరుగులు సాధించింది. తద్వారా తమ ఆధిక్యాన్ని 168 పరుగులకు పెంచుకుంది. సీఆర్ జ్ఞానేశ్వర్ (96 బంతుల్లో 72; 15 ఫోర్లు), కెప్టెన్ హనుమ విహారి (33; 4 ఫోర్లు, 1 సిక్స్), కోన శ్రీకర్ భరత్ (52 బంతుల్లో 70 బ్యాటింగ్; 12 ఫోర్లు, 2 సిక్స్‌లు), రికీ భుయ్ (51 బంతుల్లో 43 బ్యాటింగ్; 4 ఫోర్లు, 1 సిక్స్) బాధ్యతాయుత ఆటతీరుతో ఆంధ్ర జట్టును నిలబెట్టారు. ఆంధ్ర కోల్పోయిన మూడు వికెట్లను హైదరాబాద్ బౌలర్ రక్షణ్ రెడ్డి పడగొట్టాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 79/3తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ మరో 118 పరుగులు జోడించి మిగతా ఏడు వికెట్లు కోల్పోయి 197 పరుగులవద్ద ఆలౌటై 62 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించింది. శశాంక్ (55 బంతుల్లో 47; 4 ఫోర్లు, 1 సిక్స్) హైదరాబాద్ ఇన్నింగ్స్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఆంధ్ర బౌలర్లు నితీశ్ కుమార్ రెడ్డి (4/64), కేవీ శశికాంత్ (3/40), సుదర్శన్ (2/47) విజృంభించి హైదరాబాద్‌ను 200 స్కోరులోపు కట్టడి చేశారు.

సౌరాష్ట్ర 503/6

రాజ్‌కోట్: ఢిల్లీతో జరుగుతున్న మరో మ్యాచ్‌లో సౌరాష్ట్ర 370 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 184/1తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన సౌరాష్ట్ర రెండో రోజు ఆట ముగిసే సమయానికి 6 వికెట్లు నష్టపోయి 503 పరుగులు సాధించింది. అర్పిత్ (127 బ్యాటింగ్; 11 ఫోర్లు, 1 సిక్స్), హార్విక్ దేశాయ్ (107; 15 ఫోర్లు) సెంచరీలు సాధించారు. తొలి రోజు జైదేవ్ ఉనాద్కట్ (8/39) ధాటికి ఢిల్లీ తొలి ఇన్నింగ్స్‌లో 133 పరుగులకే ఆలౌటైన సంగతి తెలిసిందే.

యషశ్రీకి మూడు వికెట్లు

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా అండర్–19 మహిళల జట్టుతో బుధవారం జరిగిన చివరిదైన ఆరో టి20 మ్యాచ్‌లో భారత అండర్–19 మహిళల జట్టు ఏడు వికెట్ల తేడాతో గెలిచి సిరీస్‌ను 4–0తో దక్కించుకుంది. రెండు మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దయ్యాయి. తొలుత బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 13.2 ఓవర్లలో 54 పరుగులకు ఆలౌటైంది. హైదరాబాద్ అమ్మాయి యషశ్రీ 14 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా... ఫలక్ నాజ్, సోనమ్ యాదవ్, పార్శవి చోప్రా రెండు వికెట్ల చొప్పున తీశారు. అనంతరం భారత్ 9.2 ఓవర్లలో 3 వికెట్లకు 55 పరుగులు చేసి నెగ్గింది. కెప్టెన్ షఫాలీ వర్మ (22; 3 ఫోర్లు, 1 సిక్స్), హైదరాబాద్ అమ్మాయి గొంగడి త్రిష (10 నాటౌట్; 1 ఫోర్) రాణించారు.

ఆస్ట్రేలియా 147/2

సిడ్నీ: దక్షిణాఫ్రికాతో చివరిదైన మూడో టెస్టులో ఆస్ట్రేలియా టాపార్డర్ బ్యాటర్స్ ఉస్మాన్ ఖాజా (54 బ్యాటింగ్; 6 ఫోర్లు), లబ్‌షేన్ (79; 13 ఫోర్లు) అర్ధసెంచరీలతో రాణించారు. వర్షం అంతరాయం కలిగించడంతో తొలిరోజు 47 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. ఆస్ట్రేలియా 2 వికెట్ల నష్టానికి 147 పరుగులు చేసింది. ఖాజా, లబ్‌షేన్ రెండో వికెట్‌కు 135 పరుగులు జోడించారు.

మెరుగైన చికిత్స కోసం...

ఎయిర్ అంబులెన్స్ ద్వారా ముంబైకి పంత్ తరలింపు



న్యూఢిల్లీ: కారు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన భారత క్రికెటర్ రిషభ్ పంత్‌కు మరింత మెరుగైన చికిత్స అవసరమని బీసీసీఐ భావించింది. దాంతో ఇప్పటి వరకు చికిత్స పొందుతున్న డెహ్రాడూన్ ఆస్పత్రి నుంచి పంత్‌ను ఎయిర్ అంబులెన్స్ ద్వారా ముంబైకి తరలించింది. ఇకపై ముంబైలోని ప్రతిష్టాత్మక కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ హాస్పిటల్‌లో పంత్‌కు చికిత్స కొనసాగుతుందని బోర్డు కార్యదర్శి జై షా వెల్లడించారు. ప్రధానంగా పంత్ మోకాలి గాయాల తీవ్రత ఎక్కువగా ఉండటం, వాటికి తక్షణ చికిత్స అవసరం కావడంతో బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. స్పోర్ట్స్ మెడిసిన్ హెడ్, ఆర్థోస్కోపీ నిపుణుడైన డాక్టర్ దిన్షా పర్దీవాలా పంత్ చికిత్సను పర్యవేక్షిస్తారు. దిన్షా గతంలో సచిన్, యువరాజ్, బుమ్రా, జడేజాలతో పాటు పలువురు ఇతర అథ్లెట్లకు చికిత్స అందించారు. పంత్ కోలుకునేందుకు బోర్డు అన్ని రకాలుగా సహకారం అందిస్తుందని షా చెప్పారు. పంత్ ఆరోగ్యం నిలకడగానే ఉన్నా... అతని మోకాలు, మడమ గాయాల తీవ్రత ఎంతగా ఉందంటే ఇప్పటి వరకు వాటికి కనీసం ఎంఆర్‌ఐ స్కానింగ్ కూడా చేయలేకపోయారు. ఇదే కాస్త ఆందోళన కలిగించే అంశం.

సినిమా

విన్నారా... విన్నారా...


షూటింగ్ చేయడం.. కొత్త సినిమా కోసం కథలు వినడం... ప్రస్తుతం సీనియర్ స్టార్స్ ఇలా కథలు వినే పని మీద ఉన్నారు. ఫలానా దర్శకుడు చెప్పిన కథను ఫలానా హీరో విన్నారట అనే టాక్ రావడంతో విన్నారా? నిజమేనా? అనే చర్చ మొదలైంది. ఇక వార్తల్లో ఉన్న ప్రకారం ఏయే హీరో ఏయే దర్శకుడు చెప్పిన కథ విన్నారో చూద్దాం.



చిరంజీవి



బాలకృష్ణ



నాగార్జున



వెంకటేశ్

చిరంజీవి ఖాతాలో ప్రస్తుతం ఉన్న రెండు చిత్రాలు 'వాల్తేరు వీరయ్య', 'భోళా శంకర్'. వీటిలో 'వాల్తేరు వీరయ్య' ఈ 13న విడుదల కానుండగా, 'భోళా శంకర్' ఏప్రిల్ 14న రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ రెండు చిత్రాల తర్వాత యువ దర్శకుడు వెంకీ కుడుములతో చిరంజీవి హీరోగా నటించే సినిమా తెరకెక్కాల్సింది. కానీ ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం హోల్డ్‌లో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో చిరంజీవి తర్వాతి సినిమా ఏ దర్శకుడితో అనే చర్చ మొదలైంది. అయితే గత ఏడాది వేసవిలో చిరంజీవి హీరోగా తాను నిర్మాతగా ఓ సినిమా చేయనున్నట్లు నటి రాధిక ట్వీట్ చేసిన సంగతి గుర్తుండే ఉంటుంది. చిరంజీవి నెక్ట్స్ చేయబోయేది ఈ సినిమాయే అని, ఇటీవలే కథా చర్చలు కూడా ఊపందుకున్నాయన్నది ఫిల్మ్‌నగర్ లేటెస్ట్ టాక్. ఆల్రెడీ కొంతమంది దర్శకులు చెప్పిన కథలు విన్నారట చిరంజీవి. ఇటు రాధిక కూడా కొంతమంది రచయితలను సంప్రదించగా, వారు చిరంజీవికి స్టోరీ లైన్ చెప్పారట. మరోవైపు దర్శకుడు పూరి జగన్నాథ్ కూడా చిరంజీవి కోసం ఓ కథను రెడీ చేస్తున్నారని తెలిసింది. అలాగే ప్రభుదేవా కూడా ఓ కథ సిద్ధం చేశారట. మరి.. చిరంజీవి ఏ దర్శకుడికి గ్రీన్ సిగ్నల్ ఇస్తారు? అనే విషయంపై స్పష్టత రావాలంటే మరికొన్ని రోజులు వెయిట్ చేయక తప్పదు. ఇటు 'వీరసింహారెడ్డి' సినిమాను ఈ సంక్రాంతి బరిలో ఉంచిన బాలకృష్ణ ప్రస్తుతం అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. కాగా బాలకృష్ణకు 'సింహా', 'లెజెండ్', 'అఖండ' వంటి సూపర్ హిట్స్ అందించిన బోయపాటి శ్రీను ఇటీవల ఆయనకు ఓ కథ వినిపించారట. అలాగే దర్శకుడు పరశురామ్ కూడా బాలకృష్ణకు కథ చెప్పారట.

మరోవైపు 'ఆదిత్య 369'కు సీక్వెల్‌గా 'ఆదిత్య మ్యాక్స్ 999' సినిమా చేయాలని బాలకృష్ణ భావిస్తున్నారు. మరి.. బాలకృష్ణ 109వ దర్శకుడు ఎవరు? అనే విషయంపై క్లారిటీ రావాలంటే కొంత సమయం పడుతుంది. ఇక మరో ఇద్దరు సీనియర్ హీరోలు వెంకటేశ్, నాగార్జున కూడా ప్రస్తుతం కొన్ని కథలు వింటున్నారు. నాగార్జునకు గతంలో కథలు వినిపించిన వారిలో తమిళ దర్శకుడు మోహన్‌రాజా, రచయిత బెజవాడ ప్రసన్నకుమార్ పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే ప్రస్తుతానికి ప్రసన్న కుమార్ కథ పట్ల నాగార్జున మొగ్గు చూపారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సినిమా గురించిన అధికారిక ప్రకటన సంక్రాంతి సమయంలో రానున్నట్లు తెలిసింది. కాగా, గత ఏడాది రిలీజైన 'ఎఫ్ 3' తర్వాత మరో కొత్త సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్లలేదు వెంకటేశ్. 'జాతిరత్నాలు' ఫేమ్ దర్శకుడు కేవీ అనుదీప్, దర్శక–రచయిత తరుణ్ భాస్కర్ కథలు వినిపించినప్పటికీ... ఇంకా ఏ ప్రాజెక్టుకీ పచ్చజెండా ఊపలేదు వెంకీ. కాగా వెంకటేశ్‌కి కథ వినిపించిన దర్శకుల జాబితాలో తాజాగా 'హిట్' ఫ్రాంచైజీ ఫేమ్ శైలేష్ కొలను పేరు కూడా చేరిందని, శైలేష్ చెప్పిన కథకు వెంకీ ఇంప్రెస్ అయ్యారని టాక్. వెంకటేశ్ నెక్ట్స్ మూవీ శైలేష్ దర్శకత్వంలోనే అనే ప్రచారం ఊపందుకుంది. ఇక ఈ నలుగురి హీరోల నెక్ట్స్ డైరెక్టర్ ఎవరో అధికారిక ప్రకటన వస్తేనే తెలుస్తుంది.

మన పవర్ ఆ రకం



విజయ్

'ఇల్లు అనేది ఇటుక, ఇసుకేరా.. వదిలేసి వెళ్లిపోవచ్చు, కుటుంబం అలా కాదుగా' అనే జయసుధ డైలాగ్‌తో 'వారసుడు' ట్రైలర్ విడుదలైంది. దళపతి విజయ్, రష్మికా మందన్న జంటగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'వారసుడు'. తమిళంలో 'వారిసు'. 'దిల్' రాజు, శిరీష్, పరమ్ వి. పొట్లూరి, పెరల్ వి. పొట్లూరి నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ని విడుదల చేశారు. 'పవర్ సీట్లో ఉండదు సార్.. అందులో వచ్చి ఒకడు కూర్చుంటాడే వాడిలో ఉంటుంది. మన పవర్ ఆ రకం', 'గ్రౌండ్‌లో ఎంతమంది ప్లేయర్స్ అయినా ఉండొచ్చు కానీ ఆడియన్స్ అంతా ఒక్కణ్ణే మాత్రమే చూస్తారు.. ఎవరినో తెలుసా.. ఆట నాయకుణ్ణి' అని విజయ్ చెప్పే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి.

అవికా ఎప్పుడో పాన్ వరల్డ్ స్టార్! - అక్కినేని నాగార్జున



మురళి గంధం, బోగేంద్ర గుప్తా, నాగార్జున, చలపతి రాజు, అవికా, సాయి రోనక్

''పాప్ కార్న్' ట్రైలర్ చాలా బాగుంది. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రూపొందిన ఈ చిత్రాన్ని ప్రేక్షకులు హిట్ చేస్తారనే నమ్మకం ఉంది'' అన్నారు హీరో అక్కినేని నాగార్జున. అవికా గోర్, సాయి రోనక్ జంటగా మురళి గంధం దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పాప్ కార్న్'. ఎం.ఎస్. చలపతి రాజు సమర్పణలో బోగేంద్ర గుప్తా నిర్మించారు. అవికా గోర్, ఎం.ఎస్. చలపతి రాజు, శేషు బాబు పెద్దింటి సహనిర్మాతలు. ఫిబ్రవరి 10న ఈ సినిమా విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను నాగార్జున విడుదల చేసి, మాట్లాడుతూ– ''పదేళ్ల ముందు బ్రెజిల్‌లో రియో సిటీకి ఓ స్టూడియో చూద్దామని వెళ్లాను. అక్కడ అవికా గోర్ ముఖాన్ని చూశాను. 'చిన్నారి పెళ్లికూతురు' సీరియల్‌ను స్పానిష్‌లోనూ డబ్ చేశారు. 128 దేశాల్లో 'చిన్నారి పెళ్లికూతురు' సీరియల్‌ను డబ్ చేశారని ఆ తర్వాత తెలిసింది. అవికా ఎప్పుడో పాన్ వరల్డ్ స్టార్ అయ్యింది. 'పాప్ కార్న్'లో హీరోయిన్‌గా నటించి, నిర్మాతగానూ మారినందుకు అభినందనలు'' అన్నారు. ''తెలుగులో నా తొలి చిత్రం 'ఉయ్యాలా జంపాలా' అన్నపూర్ణ స్టూడియోస్‌తోనే ప్రారంభమైంది. నాగార్జునగారు మంచి నిర్మాత మాత్రమే కాదు.. మంచి మనిషి కూడా. 'పాప్ కార్న్'కి నిర్మాతగా చేయటం రిస్క్ అని కొందరు అన్నారు. కానీ, ఆ రిస్క్ తీసుకోవటం గర్వంగా ఉంది'' అన్నారు అవికా గోర్.

ఇంకా మంచి కంటెంట్‌తో వస్తాం - చైతన్యా రావు



సునీల్, చైతన్యా రావు, తేజ, ఉదయ్

''మంచి కంటెంట్ ఉంటే ప్రేక్షకులు ఆదరిస్తారని మా 'జగమే మాయ' నిరూపించింది. ఇలానే ప్రేక్షకులు సపోర్ట్ చేస్తే ఇంకా మంచి కంటెంట్‌తో వస్తాం'' అని నటుడు చైతన్యా రావు అన్నారు. ధన్యా బాలకృష్ణ, చైతన్యా రావు, తేజ ఐనంపూడి ప్రధాన పాత్రల్లో సునీల్ పుప్పాల దర్శకత్వం వహించిన చిత్రం 'జగమే మాయ'. ఉదయ్ కోలా, శేఖర్ అన్నే నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో డిసెంబర్ 15న రిలీజైంది. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన సమావేశంలో ఉదయ్ కోలా మాట్లాడుతూ– ''విడుదలైన అన్ని భాషల్లోనూ మా సినిమా టాప్ ట్రెండింగ్‌లో ఉంది'' అన్నారు. ''ఉదయ్‌గారు నన్ను బలంగా నమ్మారు. ప్రేక్షకుల ఆదరణ గొప్ప ఆనందాన్ని ఇస్తోంది'' అన్నారు సునీల్ పుప్పాల.

పెద్ద హీరోలకు రాయడం ఓ సవాల్

- రామజోగయ్య శాస్త్రి



''సింగిల్ కార్డ్ అయినా, ఒక్క పాట అయినా.. దర్శకుడు విజన్‌కి తగ్గట్టు రాయడంలోనే గేయ రచయిత గొప్పదనం ఉంటుంది'' అని పాటల రచయిత రామజోగయ్య శాస్త్రి అన్నారు. చిరంజీవి, శ్రుతీహాసన్ జంటగా కొల్లి రవీంద్ర (బాబీ) దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వాల్తేరు వీరయ్య'. బాలకృష్ణ, శ్రుతీహాసన్ జంటగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందిన సినిమా 'వీరసింహారెడ్డి'. ఈ రెండు చిత్రాలను నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించారు. 'వీరసింహారెడ్డి' ఈ నెల 12న విడుదలవుతుండగా, 13న 'వాల్తేరు వీరయ్య' ప్రేక్షకుల ముందుకు వస్తోంది. 'వీరసింహారెడ్డి'లో అన్ని పాటలకు, 'వాల్తేరు వీరయ్య'లోని 'నీకేమో అందమెక్కువ.. నాకేమో తొందరెక్కువ..' పాట రాసిన రామజోగయ్య శాస్త్రి చెప్పిన విశేషాలు...

- చిరంజీవి, బాలకృష్ణగార్ల ఇమేజ్ పాట రాయడానికి ఒక ఊతమిస్తుంది. కొన్ని మాటలు వాళ్ల ఇమేజ్‌కి మాత్రమే రాయగలం. 'వాల్తేరు వీరయ్య', 'వీరసింహా రెడ్డి'... ఈ రెండు సినిమాలు ప్రేక్షకులకు విజువల్ ఫీస్ట్, మంచి మ్యూజికల్ ట్రీట్ ఇవ్వడంతో పాటు భూమ్ బద్దలు రికార్డులు సృష్టిస్తాయి. 'వీరసింహారెడ్డి'లో 'మా బావ మనోభావాలు..' పాటలో నేను ఓ చోట కనిపిస్తాను.
- పెద్ద హీరోల సినిమాలకి రాస్తున్నపుడు కొత్తగా ఏం చెప్పాలనే ఒత్తిడి, సవాల్ ఉంటుంది. నేను 'అఖండ'కి రాయలేదు.. ఆ పట్టుదలతో 'వీరసింహారెడ్డి'కి రాశాను. సింగిల్ కార్డ్ రాయడంలో ఒక సౌలభ్యం ఉంటుంది. పాటలన్నీ ఒకరే రాస్తారు కాబట్టి ఏ పాటలో ఎలాంటి మాట వాడాం, ఏ భావం చెప్పాం, ఫ్లో సరిగ్గా ఉందో లేదో చెక్ చేసుకునే చాన్స్ ఉంటుంది. ఆరు పాటలు ఆరుగురు రాస్తే ఆ కో–ఆర్డినేషన్‌ని దర్శకుడు చూసుకుంటాడు.
- గొప్ప పాట రావాలి, నెక్ట్స్ లెవెల్ కంటెంట్ కావాలంటే కొంచెం ఎక్కువ టైమ్ పడుతుంది. సంగీత దర్శకుడికి, లిరిక్ రైటర్‌కి కేంద్ర బిందువు డైరెక్టర్. ఆయన కథ, సందర్భం, విజన్‌కి తగ్గట్టు రాయాల్సి ఉంటుంది.

కాశీ యాత్ర నేపథ్యంలో...



బాలాజీ, శేఖర్ సూరి, కేటలిన్ గౌడ, మునికృష్ణ

''ఏ జర్నీ టు కాశీ' ట్రైలర్ బాగుంది. ప్రస్తుత పరిస్థితుల్లో మన సనాతన ధర్మాన్ని మనమే కాపాడుకోవాలి'' అని దర్శకుడు శేఖర్ సూరి అన్నారు. చైతన్యా రావు, అలెగ్జాండర్ సాల్నికోవ్, ప్రియా పాల్వాయి, కేటలిన్ గౌడ ముఖ్య పాత్రల్లో మునికృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఏ జర్నీ టు కాశీ'. వారణాసి క్రియేషన్స్ పతాకంపై కేపీ లోకనాథ్, దొరడ్ల బాలాజీ, శ్రీధర్ వారణాసి నిర్మించిన ఈ చిత్రం రేపు (శుక్రవారం) విడుదలకానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో మునికృష్ణ మాట్లాడుతూ– ''కాశీ నేపథ్యంలోని ఒక కుటుంబం, కాశీ యాత్రకు సంబంధించిన కథే ఈ చిత్రం. ఎంటర్‌టైన్మెంట్, ఎమోషనల్, ఫ్యామిలీ డ్రామాగా ఉంటుంది'' అన్నారు. ''ఈ చిత్రంలో ఒక తెలుగు పాట, ఒక సంస్కృత పాట, ఒక ఇంగ్లీష్ సాంగ్ చేశాను'' అన్నారు సంగీత దర్శకుడు ఫణి కల్యాణ్. ఈ చిత్రానికి కెమెరా: గోకుల్ భారతి– శ్రీ సాయి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: తిరుపతి రెడ్డి.

సాక్షి **బిజినెస్**
గురువారం
5-1-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	637	60,657
నిఫ్టీ ▽	190	18,043

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (బుధవారం రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	10,494	▲	107
డోజోన్స్	33,136	▲	205
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,585	▲	31
డాక్స్	14,490	▲	309
షాంఘై	3,124	▲	7
నికాయ్	25,717	▽	378

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	56,142 ▲ 561
బంగారం (99.5 స్వచ్ఛత)	55,917 ▲ 558
వెండి (కిలో)	69,371 ▲ 144

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	[illegible]	82.07	83.74
£	బ్రిటన్ పౌండ్	[illegible]	86.08	89.16
€	యూరో	[illegible]	97.73	101.06
¥	జపాన్ ఎన్ (100)	[illegible]	62.41	64.43
AUS	ఆస్ట్రేలియా డాలర్	[illegible]	55.02	57.43
S$	సింగపూర్ డాలర్	[illegible]	60.79	62.79
SAR	సౌదీ రియాల్	[illegible]	21.08	22.76
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.65	23.44
¥	చైనా యువాన్	[illegible]	10.91	12.94

డిసెంబర్‌లో 'సేవలు' భేష్

6 నెలల గరిష్టానికి ఎస్‌అండ్‌పీ సూచీ



న్యూఢిల్లీ: భారత్ సేవల రంగం డిసెంబర్‌లో మంచి ఫలితాన్ని నమోదుచేసుకుంది. స్టాండెర్డ్ అండ్ పూర్స్ (ఎస్అండ్‌పీ) గ్లోబల్ ఇండియా సర్వీస్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ ఆరు నెలల గరిష్ట స్థాయిలో 58.5ను తాకింది. కొత్త ఆర్డర్లు, సానుకూల మార్కెట్ పరిస్థితులు ఈ ఫలితానికి కలిసి వచ్చాయి. పీఎంఐ ఇండెక్స్ 50పైన ఉంటే వృద్ధి ధోరణిగా, ఆ దిగువకు పడిపోతే క్షీణతగా పరిగణిస్తారు. ఈ ప్రాతిపదికన సేవల సూచీ 50పైన ఉండడం వరుసగా ఇది 17వ నెల. భవిష్యత్ పట్ల కంపెనీలు ఆశావహ ధోరణితో ఉన్నట్లు ఎస్అండ్‌పీ గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్ ఎకనమిక్స్ అసోసియేట్ డైరెక్టర్ పోలీయానా డీ లిమా పేర్కొన్నారు. డిసెంబర్‌లో సేవల రంగంలో ఉపాధి అవకాశాలు కూడా మెరుగ్గా వున్నట్లు వెల్లడించాయి. భారత్ మొత్తం స్థూల దేశీయోత్పత్తిలో సేవల రంగం దాదాపు 60 శాతం వాటా ఉన్న సంగతి తెలిసిందే.

తయారీ స్పీడ్

ఇక భారత్ తయారీ రంగానికి సంబంధించి స్టాండెర్డ్ అండ్ పూర్స్ గ్లోబల్ ఇండియా మ్యానుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) కూడా డిసెంబర్‌లో 13 నెలల గరిష్టం 57.8ని తాకింది. కొత్త ఆర్డర్లు, పటిష్ట డిమాండ్ తాజా సానుకూల ఫలితానికి కారణమని పోలీయానా డీ లిమా పేర్కొన్నారు. పీఎంఐ వరుసగా 18 నెలల నుంచి వృద్ధిలోనే (50 పైన సూచీ) కొనసాగుతోంది. జీడీపీలో దాదాపు 15% వాటా కలిగిన పారిశ్రామిక రంగంలో తయారీ రంగం వెయిటేజ్ 65%. ఇక తయారీ, సేవలు రెండు కలిపిన ఎస్అండ్‌పీ గ్లోబల్ ఇండియా కాంపోజిట్ పీఎంఐ అవుట్‌పుట్ ఇండెక్స్ నవంబర్‌లో 56.7 వద్ద ఉంటే, డిసెంబర్‌లో 59.4కు ఎగసింది. డిమాండ్ పటిష్టంగా ఉన్నట్లు లిమా తెలిపారు.

ఎన్‌సీఎల్‌ఏటీలో గూగుల్‌కు ఎదురుదెబ్బ

- సీసీఐ జరిమానాపై స్టేకు నిరాకరణ
- 10 శాతం డిపాజిట్ చేయాలని ఆదేశం



న్యూఢిల్లీ: కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) జరిమానా విధించిన కేసులో టెక్ దిగ్గజం గూగుల్‌కు ఎన్‌సీఎల్‌ఏటీ (నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్)లో ఎదురుదెబ్బ తగిలింది. సీసీఐ ఆదేశాలపై మధ్యంతర స్టే విధించేందుకు ఎన్‌సీఎల్‌ఏటీ బుధవారం నిరాకరించింది. అలాగే జరిమానాలో 10 శాతాన్ని డిపాజిట్ చేయాలని ఆదేశించింది. అటు సీసీఐకి నోటీసులు ఇవ్వడంతో పాటు మధ్యంతర స్టేపై తదుపరి విచారణను ఫిబ్రవరి 13కు వాయిదా వేసింది. ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్ ఆపరేటింగ్ సిస్టంకు సంబంధించి దేశీయంగా గూగుల్ తన గుత్తాధిపత్యాన్ని దుర్వినియోగం చేస్తోందనే ఆరోపణలపై సీసీఐ రూ. 1,337.76 కోట్ల జరిమానా విధించిన సంగతి తెలిసిందే. ఆండ్రాయిడ్ ప్లాట్‌ఫాంను ఉపయోగించే స్మార్ట్‌ఫోన్ యూజర్లకు యాప్స్‌ను అన్‌ఇన్‌స్టాల్ చేసేందుకు, తమకు కావాల్సిన సెర్చ్ ఇంజిన్‌ను ఎంచుకునేందుకు వీలు కల్పించాలని గతేడాది అక్టోబర్‌లో సూచించింది. సీసీఐ ఆదేశాలు జనవరి 19 నుంచి అమల్లోకి రానున్నాయి. అయితే, వీటిపై తక్షణం స్టే విధించాలంటూ ఎన్‌సీఎల్‌ఏటీని గూగుల్ ఆశ్రయించింది. భారతీయ యూజర్లు, డెవలపర్లు, తయారీ సంస్థలకు ఆండ్రాయిడ్‌తో గణనీయంగా ప్రయోజనాలు చేకూరాయని, భారత్ డిజిటల్‌కు మారడంలో ఇది తోడ్పడిందని పిటిషన్‌లో వివరించింది. బుధవారం జరిగిన విచారణలో గూగుల్ తరఫున సీనియర్ అడ్వకేట్ అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపించారు. గూగుల్ గుత్తాధిపత్య దుర్వినియోగానికి పాల్పడిందనడానికి ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేశారు.

టెక్నాలజీతో సాధికారత సాకారం

- భారత్‌కు కట్టుబడి ఉన్నాం
- మైక్రోసాఫ్ట్ చైర్మన్ సత్య నాదెళ్ల వెల్లడి
- కేంద్ర మంత్రి జైశంకర్‌తో భేటీ



న్యూఢిల్లీ: సమ్మిళిత వృద్ధి, సాధికారత లక్ష్యాల సాధనకు టెక్నాలజీని వినియోగించుకోవడం కీలకమని టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ చైర్మన్, సీఈవో సత్య నాదెళ్ల చెప్పారు. సాంకేతికత, ఆర్థిక వృద్ధి అనేవి అంతిమం కావని.. అందరి ఆకాంక్షలను నెరవేర్చే సాధనాలని ఆయన పేర్కొన్నారు. బుధవారం న్యూఢిల్లీలో టెక్ ఫర్ గుడ్ అండ్ ఎడ్యుకేషన్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మైక్రోసాఫ్ట్ ప్రోగ్రామ్‌లు, సాధనాలను ఉపయోగించి వినూత్న ప్రయోగాలు చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు, వృత్తి నిపుణులతో సత్య నాదెళ్ల భేటీ అయ్యారు. సమాజంలో సానుకూల మార్పులను తీసుకొచ్చేందుకు వారు చేస్తున్న కృషిని ప్రశంసించారు. భారత్‌లో పెట్టుబడులకు మైక్రోసాఫ్ట్ కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. 'మేకిన్ ఇండియా గురించి మాట్లాడుకుంటే భారత్‌లో మాకు భారీ సంఖ్యలో ఉద్యోగులు ఉన్నారు. డేటా సెంటర్లు ఉన్నాయి. దాదాపు అన్ని అప్లికేషన్లలో ఉపయోగిస్తున్న కృత్రిమ మేధ(ఏఐ)లో ఎంతో కొంత భారత్ నుంచి వచ్చినదే అయి ఉంటోంది' అని నాదెళ్ల చెప్పారు. ప్రతి వ్యక్తి, ప్రతి సంస్థ మరింత ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు టెక్నాలజీ దోహదపడాలన్నది తమ ఆకాంక్షని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు తదితరులు షోకేస్ చేస్తున్న ప్రాజెక్టుల గురించి నాదెళ్ల అడిగి తెలుసుకున్నారు. సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు వారి ప్రశ్నలకు ఓపిగ్గా సమాధానాలిచ్చారు. మరోవైపు, కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్ జైశంకర్‌తో నాదెళ్ల భేటీ అయ్యారు. డిజిటల్ రంగంలో గవర్నెన్స్, సెక్యూరిటీ వంటి అంశాలపై చర్చించారు. భారత్‌లో నాలుగు రోజుల పాటు పర్యటిస్తున్న నాదెళ్ల మంగళవారం ముంబైలో జరిగిన మైక్రోసాఫ్ట్ ఫ్యూచర్ రెడీ లీడర్‌షిప్ సమిట్ కార్యక్రమంలో పాల్గొన్న సంగతి తెలిసిందే. ఈ వారంలో ఆయన హైదరాబాద్, బెంగళూరు కూడా సందర్శించనున్నారు.

'నీలిట్'తో మైక్రోసాఫ్ట్ జట్టు..

ఉద్యోగార్థులకు నైపుణ్యాల్లో శిక్షణ కల్పించే దిశగా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (నీలిట్)తో మైక్రోసాఫ్ట్ చేతులు కలిపింది. ఈ ఒప్పందం కింద ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో నీలిట్‌కి చెందిన 30 ట్రెయినింగ్ సెంటర్లలో 3,500 మందికి సైబర్ శిక్షా, రెడీ4సైబర్ సెక్యూరిటీ ప్రోగ్రామ్‌లలో శిక్షణనిస్తారు. ఇది పూర్తి చేసుకున్న వారికి సైబర్‌సెక్యూరిటీలో ఇంటర్న్‌షిప్‌లు, ఉద్యోగావకాశాలు లభించగలవు.

సాహ్ పాలిమర్స్ ఐపీవో సక్సెస్

రిటైల్ ఇన్వెస్టర్ల క్యూ • 17 రెట్లు అధిక స్పందన

న్యూఢిల్లీ: సాహ్ పాలిమర్స్ పబ్లిక్ ఇష్యూ విజయవంతమైంది. చివరి రోజు బుధవారానికల్లా 17.46 రెట్లు అధికంగా స్పందన లభించింది. కంపెనీ 56.1 లక్షల షేర్లను ఆఫర్ చేయగా.. 9.79 కోట్లకుపైగా షేర్ల కోసం బిడ్స్ దాఖలయ్యాయి. ఎన్ఎస్ఈ గణాంకాల ప్రకారం రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి 39.8 రెట్లు అధిక దరఖాస్తులు వచ్చాయి. సంస్థాగతేతర విభాగంలో 32.7 రెట్ల బిడ్స్ దాఖలయ్యాయి. షేరుకి రూ. 61-65 ధరలో కంపెనీ ఐపీవో చేపట్టింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

5-1-2023	
విశాఖ	555-00
చిత్తూరు	568-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540-00
విజయవాడ	540-00
రిటైల్ ధర (డజను)	78.00
4-1-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	541-00
వరంగల్	543-00
రిటైల్ ధర	6.00

కొత్త ఏడాదిలో తొలి నష్టం

- ఫెడ్ మినిట్స్ వెల్లడి ముందు ఇన్వెస్టర్ల అప్రమత్తత
- అంతర్జాతీయ మార్కెట్లలో అనిశ్చితి
- అన్ని రంగాల షేర్లలోనూ అమ్మకాలే
- సెన్సెక్స్ 637 పాయింట్ల పతనం
- 18,150 దిగువకు నిఫ్టీ



ముంబై: అమెరికా ఫెడ్ రిజర్వ్ మినిట్స్ వెల్లడి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించడంతో భారత స్టాక్ మార్కెట్ కొత్త ఏడాదిలో తొలిసారి నష్టాలతో ముగిసింది. విదేశీ ఇన్వెసర్ల పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగుతుండడం, ప్రపంచ మార్కెట్లలోని బలహీనతలు సెంటిమెంట్‌ను మరింత దెబ్బతీశాయి. అన్ని రంగాల షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో సెన్సెక్స్ 637 పాయింట్లు క్షీణించి 60,657 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 190 పాయింట్లు నష్టపోయి 18,043 వద్ద నిలిచింది. దీంతో సూచీల రెండురోజుల వరుస ర్యాలీకి బ్రేక్ పడినట్లైంది. సెన్సెక్స్ సూచీలో మారుతీ సుజుకీ, టీసీఎస్ షేర్లు మాత్రమే లాభపడగా, మిగిలిన అన్ని దెబ్బతిన్నాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచే ఒడిదుడుకులతో మొదలై చివరి వరకు అదే ధోరణిలో కొనసాగాయి. ఒక దశలో సెన్సెక్స్ 700 పాయింట్లు కోల్పోయి 61,294 వద్ద, నిఫ్టీ 212 పాయింట్లు క్షీణించి 18,021 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని నమోదు చేశాయి. మిడ్ సెషన్ తర్వాత కోలుకునే ప్రయత్నం చేసినప్పటికీ.., చివర్లో మరోసారి అమ్మకాలు తలెత్తడంతో సూచీలకు నష్టాలు తప్పలేదు. విస్తృత స్థాయి మార్కెట్లో అమ్మకాలతో బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.97%, 0.79% చొప్పున నష్టపోయాయి. అధిక ద్రవ్యోల్బణం, మాంద్యం భయాలతో టెస్లా, యాపిల్‌తో సహా టెక్నాలజీ షేర్లలో విక్రయాలు తలెత్తడంతో అమెరికా మార్కెట్లు ఈ ఏడాది తొలి ట్రేడింగ్ సెషన్(మంగళవారం)లో అరశాతానికి పైగా నష్టపోయాయి. అక్కడి నుంచి ప్రతికూల సంకేతాలు అందుకున్న ఆసియా, యూరప్ మార్కెట్లు అరశాతానికి పైగా నష్టపోయాయి. సెన్సెక్స్ ఒకశాతానికి పైగా నష్టపోవడంతో ఇన్వెస్టర్లు రూ.2.91 లక్షల కోట్ల సంపద కోల్పోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.2621 కోట్ల షేర్లను విక్రయించారు. దేశీ ఇన్వెస్టర్లు రూ.774 కోట్ల షేర్లను కొన్నారు. అంతర్జాతీయంగా క్రూడ్ ధరలు దిగిరావడంతో రూపాయి విలువ చరిత్రాత్మక కనిష్ట స్థాయి నుంచి కోలుకుంది. డాలర్ మారకంలో 23 పైసలు బలపడి 82.77 స్థాయి వద్ద స్థిరపడింది.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- రేడియంట్ క్యాష్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ షేర్లు తొలిరోజే అదిరిపోయే ఆరంభాన్ని అందుకున్నాయి. బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.94.00)తో పోలిస్తే 5.63శాతం లాభంతో రూ.99.30 వద్ద లిస్టయ్యింది. మార్కెట్ అనిశ్చితుల్లోనూ ఈ షేరుకు డిమాండ్ లభించడంతో ట్రేడింగ్‌లో 24.14 శాతం బలపడి రూ.116.70 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకుంది. చివర్లో లాభాల స్వీకరణ కారణంగా 11.38% లాభంతో రూ.104.70 వద్ద స్థిరపడింది. మార్కెట్ ముగిసే సరికి కంపెనీ విలువ రూ.1,117.23 కోట్లుగా నమోదైంది.
- మెటల్, రియల్టీ, యుటిలిటీ, ఇంధన, ఆయిల్–గ్యాస్, విద్యుత్ రంగాల సూచీలు వరుసగా మూడు నుంచి 1.50% క్షీణించాయి. మరోవైపు బడ్జెట్‌పై ఆశలతో బీమా, ఫెర్టిలైజర్, వినిమయ, వ్యవసాయ ఆధారిత రంగాల షేర్లు రాణించడంతో విశేషం.

రిలయన్స్ కిట్టీలో సోస్యో డ్రింక్

- 50 శాతం వాటా కొనుగోలు
- గుజరాత్‌లో తయారీ ప్లాంటు
- ప్రస్తుత ప్రమోటర్లవద్ద మిగిలిన వాటా



న్యూఢిల్లీ: కార్బొనేటెడ్ పానీయాల కంపెనీ సోస్యో హజూరీ బెవరేజెస్‌లో రిలయన్స్ కన్జూమర్ ప్రొడక్ట్స్ 50 శాతం వాటాను కొనుగోలు చేయనుంది. ఈ గుజరాత్ కంపెనీలో మిగిలిన 50 శాతం వాటాను ప్రస్తుత ప్రమోటర్లు హజూరీ కుటుంబం కలిగి ఉంటుందని డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ సంస్థ రిలయన్స్ రిటైల్ వెంచర్స్ తాజాగా తెలియజేసింది. అయితే డీల్ విలువను వెల్లడించలేదు. తాజా కొనుగోలుతో పానీయాల విభాగం మరింత బలపడనున్నట్లు రిలయన్స్ రిటైల్ ఎఫ్ఎంసీజీ అనుబంధ సంస్థ రిలయన్స్ కన్జూమర్ పేర్కొంది. శత వసంతాల పురాతన కంపెనీ సోస్యో కార్బొనేటెడ్ పానీయాలు, జ్యూస్‌ల తయారీలో ఉంది. కాగా.. ఇప్పటికే రిలయన్స్ రిటైల్ సుప్రసిద్ధ బ్రాండ్ క్యాంపాకోలాను సొంతం చేసుకోవడం తెలిసిందే.

1923లోనే..: సోస్యో హజూరీ బెవరేజెస్‌ను 1923లో అబ్బాస్ అబ్దుల్‌రహీమ్ హజూరీ ఏర్పాటు చేశారు. గుజరాత్‌లో తయారీ యూనిట్ ఉంది. ప్రధాన బ్రాండ్ సోస్యో పేరుతో గుజరాత్‌తోపాటు పొరుగు రాష్ట్రాలలోనూ పానీయాలు విక్రయిస్తోంది. పానీయాలను యూఎస్, యూకే, కెనడా, ఆస్ట్రేలియాకు ఎగుమతి చేస్తోంది. తాజా పెట్టుబడి ద్వారా స్థానిక హెరిటేజ్ బ్రాండ్లకు మరింత ప్రాచుర్యాన్ని కల్పించడంతోపాటు.. వృద్ధి అవకాశాలకు తెరతీయనున్నట్లు రిలయన్స్ రిటైల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇషా అంబానీ పేర్కొన్నారు.

భవిత

ఆంధ్రప్రదేశ్ ఇంటర్ ఫస్టియర్, సెకండియర్‌కు సంబంధించిన స్టడీ మెటీరియల్, సిలబస్, మోడల్‌పేపర్స్, ప్రీవియస్ పేపర్స్, గైడెన్స్ మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఫార్మసీతో 18 డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కొలువు

ఫార్మసీ పూర్తిచేసిన అభ్యర్థులకు శుభవార్త. తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ).. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్‌లో 18 డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులను భర్తీ చేయనున్నారు.

అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు జనవరి 5వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 18
- **అర్హతలు:**డిగ్రీ(ఫార్మసీ/ఫార్మాస్యూటికల్ సైన్స్), ఫార్మాడీ లేదా మెడికల్(క్లినికల్ ఫార్మకాలజీ/మైక్రోబయాలజీ స్పెషలైజేషన్) ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 01.07.2022 నాటికి 18–44 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.
- **వేతనాలు:** ప్రతి నెల రూ.51,320–రూ. 1,27,310 వరకు వేతనంగా లభిస్తుంది.
- **ఎంపిక విధానం:** రాత పరీక్ష, ధృవపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **రాత పరీక్ష:** ఈ పరీక్షను రెండు పేపర్లుగా నిర్వహిస్తారు. రెండు పేపర్లకు కలిపి మొత్తం 450 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. పరీక్ష సమయం 300 నిమిషాలు.
- **పేపర్–1:** ఈ పేపర్‌లో జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్ నుంచి ప్రశ్నలుంటాయి. 150 ప్రశ్నలకు 150 మార్కులుంటాయి. పరీక్ష సమయం 150 నిమిషాలు.
- **పేపర్–2:** ఈ పేపర్‌లో సంబంధిత సబ్జెక్ట్‌కు సంబంధించిన డిగ్రీ స్థాయి ప్రశ్నలు అడుగుతారు. ప్రతి ప్రశ్నకు రెండు మార్కుల చొప్పున మొత్తం 300 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. పరీక్ష సమయం 150 నిమిషాలు. -పేపర్–1 పరీక్షను ఇంగ్లిష్/తెలుగు మాధ్యమాల్లో నిర్వహిస్తారు. పేపర్–2 పరీక్ష మాత్రం ఇంగ్లిష్‌లోనే ఉంటుంది.
- **పరీక్ష కేంద్రాలు:** రాత పరీక్షకు సంబంధించి పరీక్ష కేంద్రాలు కేవలం హైదరాబాద్ పరిధిలో(హెచ్ఎండీఏ) మాత్రమే ఉంటాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** 05.01.2023
- **వెబ్‌సైట్:** https://www.tspsc.gov.in

టీఎస్‌పీఎస్సీ-ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 544 పోస్టులు

తెలంగాణ రాష్ట్రంలోని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ).. అసిస్టెంట్ ప్రొఫెసర్లు(లెక్చరర్లు), ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 544
- **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ ప్రొఫెసర్లు(లెక్చరర్లు), ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్లు.
- **సబ్జెక్టుల వారీగా ఖాళీలు:** ఇంగ్లీష్–23, తెలుగు–27, ఉర్దూ–02, సంస్కృతం–05,స్టాటిస్టిక్స్–23, మైక్రో బయాలజీ–05,బయోటెక్నాలజీ–09, అప్లైడ్ న్యూట్రిషన్–05, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్–311,బిజినెస్ అడ్మినిస్ట్రేషన్–39, కామర్స్ బిజినెస్ అనలిటిక్స్–08,డైరీ సైన్స్–08, క్రాప్ ప్రొడక్షన్–04,డేటాసైన్స్–12, ఫిషరీస్–3, కామర్స్ విదేశీ వాణిజ్యం–01, కామర్స్ ట్యాక్సేషన్–06, ఫిజికల్ డైరెక్టర్–29, లైబ్రేరియన్–24.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 31.01.2023.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.02.2023.
- **వెబ్‌సైట్:** tspsc.gov.in

ఆర్మీ పబ్లిక్ స్కూల్, బొల్లారంలో 63 టీచింగ్ పోస్టులు

సికింద్రాబాద్ బొల్లారంలోని ఆర్మీ పబ్లిక్ స్కూల్.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉపాధ్యాయ(రెగ్యులర్/ఫిక్స్‌డ్ టర్మ్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 63
- **పోస్టుల వివరాలు:** పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్–15, ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్–25, ప్రైమరీ టీచర్–23.
- **సబ్జెక్టులు:** మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లిష్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇన్ఫర్మేటిక్స్ ప్రాక్టీసెస్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, జాగ్రఫీ, హోమ్ సైన్స్, సైకాలజీ, పెయింటింగ్/ఫైన్ ఆర్ట్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్, మ్యూజిక్, డ్యాన్స్, హిందీ, సంస్కృతం తదితరాలు.
- **అర్హత:** డిగ్రీ, పీజీ, బీఈడీ, బీఈఎల్ఈడీ, డీఈఎల్ఈడీ ఉత్తీర్ణతతోపాటు సీటెట్/టెట్ అర్హత సాధించి ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** దరఖాస్తును ప్రిన్సిపాల్, ఆర్మీ పబ్లిక్ స్కూల్ బొల్లారం, జేజే నగర్, సికింద్రాబాద్ చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 30.01.2023.
- **వెబ్‌సైట్:** apsbolarum.edu.in

కాకినాడ జిల్లాలో అకౌంటెంట్ పోస్టులు

కాకినాడలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ లిమిటెడ్, జిల్లా కార్యాలయం.. ఒప్పంద ప్రాతిపదికన అకౌంటెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 02
- **అర్హత:** సీఏ/సీఎంఏ, ఇంటర్ ఉత్తీర్ణులవ్వాలి. కంప్యూటర్ పరిజ్ఞానంతోపాటు రెండేళ్ల పని అనుభవం ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.30,000 చెల్లిస్తారు.
- **దరఖాస్తు విధానం:** దరఖాస్తును జాయింట్ కలెక్టర్, ఈవోఈడీ, ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ లిమిటెడ్, కలెక్టరేట్ కాంపౌండ్, కాకినాడ చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 19.01.2023.
- **వెబ్‌సైట్:** eastgodavari.ap.gov.in

నీట్-యూజీ.. ఇలా ఈజీ !

» మే 7న నీట్-యూజీ 2023 ఎంట్రన్స్
» షెడ్యూల్ ప్రకటించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ
» ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సుల్లో ప్రవేశానికి నీట్
» ప్రణాళికబద్ధ ప్రిపరేషన్‌తోనే సక్సెస్ అంటున్న నిపుణులు

ఎంబీబీఎస్, బీడీఎస్.. ఇంటర్మీడియెట్ బైపీసీ చదువుతున్న లక్షల మంది విద్యార్థుల స్వప్నం! ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో చేరాలని, వైద్య వృత్తిలో స్థిరపడాలని కలలు కనే వారి సంఖ్య లక్షల్లోనే ఉంటుంది. అలాంటి విద్యార్థులంతా తమ స్వప్నం సాకారం చేసుకునేందుకు..అడుగులు వేయాల్సిన తరుణం వచ్చింది! కారణం.. దేశ వ్యాప్తంగా మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే.. నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్)-యూజీ-2023 పరీక్ష తేదీ ఖరారు కావడమే! నీట్-యూజీ-2023.. మే 7వ తేదీన నిర్వహించనున్నట్లు ఎన్‌టీఏ ప్రకటించింది! ఈ నేపథ్యంలో.. నీట్-యూజీ పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ గైడెన్స్..



మెడికల్ ఎడ్యుకేషన్

నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్.. నీట్‌గా సుపరిచితమైన ప్రవేశ పరీక్ష. ఈ ఎంట్రన్స్‌లో స్కోర్‌తోనే ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ వంటి వైద్య కోర్సుల్లో ప్రవేశం లభిస్తోంది. అందుకే ఈ పరీక్షకు దేశవ్యాప్తంగా ఏటా లక్షల మంది విద్యార్థులు సన్నద్ధమవుతుంటారు. అలాంటి వారంతా.. ఇప్పటి నుంచి నీట్ ప్రిపరేషన్‌కు పదును పెట్టుకోవాలి.

పోటీ తీవ్రం

- ఇంటర్మీడియెట్ బైపీసీ గ్రూప్ అర్హతగా నిర్వహించే నీట్‌కు జాతీయ స్థాయిలో లక్షల సంఖ్యలో విద్యార్థులు హాజరవుతున్నారు. గత ఏడాది 17, 64,571 మంది ఈ పరీక్ష రాశారు. జాతీయ స్థాయిలో అందుబాటులో ఉన్న దాదాపు 96 వేల ఎంబీబీఎస్, 28 వేల వరకు బీడీఎస్, 52 వేలకు పైగా ఆయుష్ కోర్సుల సీట్లకు పోటీ తీవ్రంగా ఉంది.
- తెలుగు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి 65,305 మంది; తెలంగాణ నుంచి 59,296 మంది గతేడాది ఈ పరీక్షకు హాజరయ్యారు. తెలంగాణలో 6,690, ఆంధ్రప్రదేశ్‌లో 5,485 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. అదే విధంగా ఏపీలో 1400, తెలంగాణలో 1300 బీడీఎస్ సీట్లు ఉన్నాయి.
- ఈ సీట్లను నీట్ యూజీ స్కోర్ ఆధారంగా ఆల్ ఇండియా కోటా,స్టేట్ కోటా విధానంలో భర్తీ చేస్తారు. ఆల్ ఇండియా కోటా విధానంలో.. అన్ని రాష్ట్రాల్లోని 15 శాతం సీట్లకు జాతీయ స్థాయిలో కౌన్సెలింగ్ నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తారు. స్టేట్ కోటా విధానంలో..రాష్ట్ర స్థాయిలో ఆల్ ఇండియా కోటాకు బదిలీ అయిన సీట్లను మినహాయించి.. మిగిలిన సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

నాలుగు సబ్జెక్టులు.. 720 మార్కులు

నీట్ పరీక్షను నాలుగు సబ్జెక్టులలో 720 మార్కులకు నిర్వహిస్తారు. ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష వ్యవధి మూడు గంటలు. వివరాలు..

సబ్జెక్ట్	సెక్షన్	ప్రశ్నలు	మార్కులు
ఫిజిక్స్	సెక్షన్–ఎ	35	140
	సెక్షన్–బి	15	40
కెమిస్ట్రీ	సెక్షన్–ఎ	35	140
	సెక్షన్–బి	15	140
బోటనీ	సెక్షన్–ఎ	35	140
	సెక్షన్–బి	15	40
జువాలజీ	సెక్షన్–ఎ	35	140
	సెక్షన్–బి	15	40
మొత్తం మార్కులు			720

ప్రతి సబ్జెక్ట్‌లోనూ సెక్షన్–బిలోని 15 ప్రశ్నలకు గాను పదింటికి సమాధానాలు గుర్తిస్తే సరిపోతుంది. అంటే..సెక్షన్–బిలో ఛాయిస్ వెసులుబాటు ఉంది.

- ప్రతి ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయిస్తారు. నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు కోత పడుతుంది.
- వాస్తవానికి ఛాయిస్ విధానాన్ని 2021లో అందుబాటులోకి తెచ్చారు. గత ఏడాది కూడా దీన్ని కొనసాగించారు. ఈ ఏడాది కూడా ఛాయిస్ విధానంతోనే పరీక్ష నిర్వహించే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సన్నద్ధతకు తగినంత సమయం

నీట్ యూజీ–2023ని మే 7న నిర్వహించనున్నారు. ఈ తేదీని పరిగణనలోకి తీసుకుంటే.. విద్యార్థులకు తగినంత సమయం అందుబాటులో ఉందని చెప్పొచ్చు. మార్చి చివరి నాటికి ఇంటర్మీడియెట్ పరీక్షలు పూర్తవుతాయి. ఆ తర్వాత నీట్ పరీక్ష తేదీకి దాదాపు 40 రోజుల సమయం అందుబాటులో ఉంటుంది. ఈ వ్యవధిలో పూర్తిగా నీట్ ప్రిపరేషన్, రివిజన్, మాక్ టెస్ట్‌లకు హాజరు వంటి వ్యూహాలు అనుసరిస్తే..మెరుగైన స్కోర్ సాధించే అవకాశముంది.

ప్రతి సబ్జెక్ట్‌లో 130-140 మార్కులు లక్ష్యంగా

- నీట్‌కు సన్నద్ధమవుతున్న విద్యార్థులు.. ప్రతి సబ్జెక్ట్‌లోనూ 180 మార్కులకు గాను 130 నుంచి 140 మార్కులు సాధించేలా సిలబస్ అంశాలను ఔపోసన పట్టాలి. అప్పుడే సీటు సాధించేలా మెరుగైన ర్యాంకు సొంతమవుతుంది. ప్రతి రోజు ప్రతి సబ్జెక్ట్‌కు నిర్దిష్ట సమయాన్ని కేటాయించుకుని అధ్యయనం సాగించాలి.
- బోర్డ్ పరీక్షలకు నెల రోజుల ముందు వరకు ఇంటర్, నీట్ సిలబస్‌లను సమన్వయం చేసుకుంటూ చదవాలి.
- బోర్డ్ పరీక్షలు ముగిశాక.. నీట్ సిలబస్‌కు అనుగుణంగా ఆయా సబ్జెక్ట్‌లకు సమయం కేటాయిస్తూ ప్రిపరేషన్ చేయాలి. స్వీయ సామర్థ్యాలపై స్పష్టతతో వ్యవహరించాలి.
- వీలైనంత మేరకు రివిజన్‌కు ఎక్కువ సమయం కేటాయించాలి.
- ప్రతి రోజు చదవాల్సిన టాపిక్స్‌ను ముందుగానే విభజించుకుని.. దానికి అనుగుణంగా అధ్యయనం చేయాలి. ప్రతి రోజు మాక్ టెస్టులకు హాజరవ్వాలి. మోడల్ కొశ్చన్స్‌ను ప్రాక్టీస్ చేయాలి.
- డైరెక్ట్ కొశ్చన్స్ కంటే ఇన్ డైరెక్ట్ ప్రశ్నలనే ఎక్కువగా అడుగుతున్న విషయాన్ని గుర్తించాలి. దీనికి అనుగుణంగా మోడల్ టెస్ట్‌లను వీలైనంత ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి.
- ప్రిపరేషన్ సమయంలోనే షార్ట్ నోట్స్ రూపొందించుకోవాలి. ఇది రివిజన్‌కు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

ముఖ్య సమాచారం

- 2023, మే 7న నీట్ యూజీ పరీక్ష.
- మార్చి రెండో వారంలో నోటిఫికేషన్ వెలువడే అవకాశం.
- పెన్–పేపర్ విధానంలో మూడు గంటల వ్యవధిలో 720 మార్కులకు పరీక్ష.
- నీట్ స్కోర్ ఆధారంగానే ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్, వెటర్నరీ సైన్స్ కోర్సుల సీట్ల భర్తీ.
- **అర్హత:**బైపీసీ గ్రూప్‌తో ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సు ఉత్తీర్ణత ఉండాలి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- నీట్‌కు ఇంటర్ బైపీసీ ఉత్తీర్ణత అర్హతగా పేర్కొన్నప్పటికీ.. ప్రవేశాల సమయంలో కొన్ని ఇన్‌స్టిట్యూట్‌లు బైపీసీ గ్రూప్ సబ్జెక్ట్‌లలో 50 శాతం మార్కులు ఉండాలనే నిబంధన విధిస్తున్నాయి.

సబ్జెక్ట్ వారీగా సన్నద్ధత ఇలా

ఫిజిక్స్.. ప్రాక్టీస్‌తోనే విజయం

ఫిజిక్స్‌లో విద్యార్థులు ప్రాక్టీస్‌కు ప్రాధాన్యమివ్వాలి. ఆప్టిక్స్, మెకానిక్స్, హీట్ అండ్ థర్మోడైనమిక్స్, ఎలక్ట్రానిక్ డివైజెస్, కరెంట్ ఎలక్ట్రిసిటీ, మోడరన్ ఫిజిక్స్ చాప్టర్లపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లో అధ్యాయానికి చివర ఇచ్చిన ప్రశ్నలను సాధించాలి.అవకలనం,సమాకలనం, అనువర్తనాలపై పట్టు సాధించాలి.

-రవీంద్ర, ఫిజిక్స్ ఫ్యాకల్టీ

కాన్సెప్ట్స్, రివిజన్ ప్రధానంగా

కెమిస్ట్రీలో విద్యార్థులు ఆయా విభాగాలకు సంబంధించిన కాన్సెప్ట్‌లపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా రివిజన్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, మోల్ కాన్సెప్ట్, కెమికల్ బాండింగ్, ఎలక్ట్రోకెమిస్ట్రీ, కోఆర్డినేషన్ కాంపౌండ్, ఈక్విలిబ్రియమ్, పాలిమర్‌లు, బయో మాలిక్యూల్స్, పరమాణు నిర్మాణం, సాలిడ్ స్టేట్, ద్రావణాలు, సర్ఫేజ్ కెమిస్ట్రీ; ఆర్గానిక్ కెమిస్ట్రీలో ఐసోమెరిసమ్, సమ్మేళనాల తయారీలకు కొంత వెయిటేజీ ఎక్కువగా ఉంటుంది. కెమిస్ట్రీలో విద్యార్థులు చర్యలు, సమీకరణాలను మర్చిపోతుంటారు. దీంతో నిరంతరం పునఃశ్చరణ చేయాలి. ఇనార్గానిక్ కెమిస్ట్రీలో వివిధ మూలకాలు, వాటి సమ్మేళనాల ధర్మాలను అధ్యయనం చేయాలి. ఫిజికల్, ఆర్గానిక్, ఇనార్గానిక్ కెమిస్ట్రీలను వాటి వాటి స్వభావాల ఆధారంగా ప్రిపేరవ్వాలి.

-కృష్ణ, కెమిస్ట్రీ ఫ్యాకల్టీ

బోటనీ.. విభిన్నంగా

బోటనీకి సంబంధించి.. ఫిజియాలజీ ఆఫ్ ప్లాంట్స్ అండ్ యానిమల్స్, మార్ఫాలజీ, జెనిటిక్స్ అండ్ ఎవల్యూషన్, సెల్ బయాలజీ, బయోటెక్నాలజీ, హ్యూమన్ ఫిజియాలజీ, డైవర్సిటీ ఆఫ్ లివింగ్ ఆర్గానిజమ్‌లను ముఖ్య చాప్టర్లుగా భావించి చదవాలి. అన్ని అంశాలకు సంబంధించి కాన్సెప్ట్‌లపై పట్టు సాధించాలి. ఎకాలజీలో ఆర్గనైజేషన్స్ అండ్ పాపులేషన్, ఎకోసిస్టమ్‌పై ప్రశ్నలు వస్తున్నాయి. వీటితోపాటు బయోడైవర్సిటీ, ఎన్విరాన్‌మెంట్ ఇష్యూస్ పాఠ్యాంశాలపై దృష్టిపెట్టడం లాభిస్తుంది. ప్లాంట్ ఫిజియాలజీలో ప్లాంట్ గ్రోత్ అండ్ డెవలప్‌మెంట్, మొక్కల హార్మోనులు, ట్రాన్స్‌పోర్ట్ ఇన్ ప్లాంట్స్, మినరల్ న్యూట్రిషన్ చాప్టర్లను ప్రిపేరవ్వాలి. సెల్ స్ట్రక్చర్స్ అండ్ ఫంక్షన్స్‌లో కణవిభజన (సమ విభజన, క్షయకరణ విభజన)లోని వివిధ దశల్లో జరిగే మార్పులు, కణచక్రం తదితరాలను అధ్యయనం చేయాలి. బయోమాలిక్యూల్స్ నుంచి కంటెంట్ సంబంధిత ప్రశ్నలు వస్తాయి. రీప్రొడక్షన్ నుంచి దాదాపు 10 ప్రశ్నల వరకు అడుగుతున్నారు.మాలిక్యులర్ బేసిస్ ఆఫ్ ఇన్‌హెరిటన్స్‌లో రెప్లికేషన్, ట్రాన్స్‌క్రిప్షన్, ట్రాన్స్‌లేషన్, రెగ్యులేషన్‌పై దృష్టిపెట్టాలి.

- బి.రాజేంద్ర, బోటనీ ఫ్యాకల్టీ

జువాలజీ.. ప్రీవియస్, మోడల్ పేపర్స్

జువాలజీ సబ్జెక్ట్‌లో రాణించేందుకు విద్యార్థులు హ్యూమన్ ఫిజియాలజీ, ఎకాలజీ, జెనిటిక్స్, ఎవల్యూషన్ టాపిక్స్‌పై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ఎన్‌సీఈఆర్‌టీతోపాటు ఇంటర్ పుస్తకాల నుంచీ ప్రశ్నలు అడుగుతున్నారు. కాబట్టి గత ప్రశ్న పత్రాలను, ఇంటర్‌లో ఆయా చాప్టర్స్ చివరలో అడిగే ప్రశ్నలను సాధన చేయాలి. ఎన్‌సీఆర్‌టీ, ఇంటర్ పుస్తకాలను క్షుణ్నంగా చదవాలి.

-కె.శ్రీనివాసులు, జువాలజీ ఫ్యాకల్టీ.

క్లుప్తంగా...

శ్రీరాముడిగా నారసింహుడు



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు పాంచరాత్ర ఆగమ రీత్యా కొనసాగుతున్నాయి. మూడో రోజు బుధవారం ఉదయం శ్రీస్వామి వారు శ్రీరాముడిగా, రాత్రి వేంకటేశ్వరస్వామిగా అలంకార సేవలో తిరు వీధిలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం, రాత్రి జరిగిన సేవల్లో పారాయణాన్ని పఠించారు. ఉదయం నిర్వహించిన వేడుకల్లో ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, టిస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఈవో గీతారెడ్డి, ప్రధానార్చకులు, ఇతర అర్చకులు, పారాయణీకులు పాల్గొన్నారు.

వైద్యారోగ్య రంగంలో దేశంలోనే ముందంజ

మంత్రి హరీశ్‌రావును కలిసిన అమెరికా డాక్టర్ల బృందం



సాక్షి, హైదరాబాద్: వైద్యారోగ్య రంగంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉందని ఆర్థిక, వైద్యారోగ్య శాఖమంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. బుధవారం హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ గ్లోబల్ కో ఆర్డినేటర్ మహేశ్ బిగాల ఆధ్వర్యంలో హరీశ్‌రావుతో అమెరికా డాక్టర్ల బృందం భేటీ అయింది. ఈ భేటీలో వైద్య రంగంపై చర్చించారు. అనంతరం హరీశ్ మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటు తర్వాత మెడికల్ సీట్ల కోసం ఇతర దేశాలకు వెళ్లకుండా సీఎం కేసీఆర్ మెడికల్ కాలేజీలపై దృష్టి పెట్టారని తెలిపారు. అందులో భాగంగా 8 మెడికల్ కాలేజీలు నిర్మించి వైద్య విద్య బోధనకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రజలకు నిత్యం అవసరమయ్యే వైద్య సేవలు ప్రభుత్వ పరంగా అందిస్తున్నామని హరీశ్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా గర్భిణీలు, నవజాత శిశు సంక్షేమం కోసం కేసీఆర్ కిట్, అమ్మఒడి పథకం, బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేశామని వివరించారు.



తన జన్మదినం సందర్భంగా బుధవారం సీఎం కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్న రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్. ఈ సందర్భంగా జూలూరు రచించిన 'ఈ సమరం సామరస్యం కోసం' పుస్తకాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

రాష్ట్రవ్యాప్తంగా ఈవీ చార్జింగ్ కేంద్రాలు

రెడ్కో చైర్మన్ వై.సతీశ్‌రెడ్డి వెల్లడి



ఎలక్ట్రిక్ వాహన చార్జింగ్ మెషీన్‌ను పరిశీలిస్తున్న రెడ్కో చైర్మన్ వై.సతీశ్ రెడ్డి

గచ్చిబౌలి (హైదరాబాద్): రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహన చార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు రెడ్కో (రెన్యూయేబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) చైర్మన్ వై. సతీశ్‌రెడ్డి తెలిపారు. దుర్గం చెరువు వద్ద బుధవారం ఏర్పాటు చేసిన రెడ్కో ఎలక్ట్రిక్ వాహన చార్జింగ్ మెషీన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... హైదరాబాద్‌లో త్వరలోనే 150 రెడ్కో ఎలక్ట్రిక్ వాహన చార్జింగ్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కేవలం 30 నుంచి 45 నిమిషాల్లోనే కారు చార్జింగ్ చేసుకోవచ్చని తెలిపారు. ఇతర సంస్థలతో పోలిస్తే తక్కువ ధరలతో వాహనాలను చార్జింగ్ చేసుకునే వీలుంటుందని తెలిపారు. చార్జింగ్ కేంద్రాల ఏర్పాటులో ముందుగా రుసుమును నిర్ణయించిన రాష్ట్రం తెలంగాణ దేశంలోనే మొదటిదన్నారు. చార్జింగ్ కేంద్రాల్లో పార్కింగ్ సౌకర్యం, ఇతర వసతులు కల్పించాలని సూచించారు.

వేలిముద్రలు కొట్టేసి.. బ్యాంకు ఖాతా లూటీ చేసి..



- కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్న సైబర్ కేటుగాళ్లు
- పలు మార్గాల్లో అక్రమంగా వేలిముద్రల సేకరణ
- వాటి ద్వారా ఆధార్ లింకై ఉన్న ఖాతాల నుంచి దోపిడీ
- ఆధార్ ఆధారిత మోసాలపై అప్రమత్తంగా ఉండాలంటున్న సైబర్ పోలీసులు

సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త తరహా మోసానికి తెర తీస్తున్నారు. తాజాగా 'ఆధార్'ను ఆధారంగా చేసుకుని దోచుకుంటున్నారు. 'ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టం (ఏఈపీఎస్)' మోసాలు క్రమంగా పెరుగుతున్నట్లు సైబర్ క్రైం పోలీసులు చెప్పారు. ఈ తరహా మోసాలు హరియాణా, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్‌ల్లో ఇటీవల పెరిగాయన్నారు. ఇవి తెలంగాణలోనూ అక్కడక్కడ వెలుగు చూస్తున్నట్టు తెలిసింది. ఇటీవలే తెలంగాణ సీఐడీ విభాగంలోని సైబర్ క్రైం పోలీసులు ఈ తరహా కేసులో నిందితుడిని బిహార్‌లో అరెస్టు చేసి నగరానికి తెచ్చారు. ఈ తరహా మోసాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

\- సాక్షి, హైదరాబాద్

ఇలా జరిగితే అప్రమత్తం కావాలి

మీకు తెలియకుండానే ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ విధానంలో మీ బ్యాంకు ఖాతాలోంచి డబ్బులు పోయినట్టు గుర్తిస్తే వెంటనే మీ ఆధార్ కార్డుతో అనుసంధానమైన మీ వేలిముద్రలను డిజేబుల్ చేసుకోవాలని సైబర్‌క్రైం పోలీసులు సూచించారు. ఆధార్ వివరాలు గుర్తు తెలియని వ్యక్తులకు ఎట్టిపరిస్థితుల్లోనూ షేర్ చేయొద్దన్నారు. వివిధ మార్గాల్లో దొంగిలించిన వేలిముద్రలను సిలికాన్ ఫింగర్ ప్రింట్స్‌గా రూపొందించి వాటి ద్వారా ఏఈపీఎస్ విధానంలో ఆధార్ లింకై ఉన్న బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు కొట్టేస్తున్నట్టు తెలిపారు.

ఈ జాగ్రత్తలు పాటిస్తే..

- ఏఈపీఎస్ సదుపాయాన్ని తరచుగా వాడనట్లయితే బ్యాంకు ఖాతా నుంచి ఆ సదుపాయాన్ని డీయాక్టివేట్ చేసుకోవాలి.
- మీ బయోమెట్రిక్ దుర్వినియోగం కాకుండా ఆధార్ వెబ్‌సైట్‌లోకి (https:// resident. uidai. gov. in/ aadhaar& lockunlock) వెళ్లి ఆధార్ బయోమెట్రిక్‌ను లాక్ చేసుకోవాలి.
- వీలైనంత వరకు ప్రైవేటు సంస్థలు, వ్యక్తులకు ఆధార్‌కార్డ్ కాపీలు ఇవ్వకూడదు. ఒకవేళ ఆధార్‌కార్డును ఏదైనా ధ్రువీకరణ కోసం వాడాల్సి వస్తే తప్పకుండా మాస్క్‌డ్ ఆధార్ (ఆధార్ నంబర్‌పూర్తిగా కనిపించకుండా ఉండేది) కాపీని వాడుకోవాలి.
- సైబర్ నేరం జరిగినట్టు గుర్తిస్తే వెంటనే 1930 నంబర్‌కు లేదా www. cybercrime. gov. in లో ఫిర్యాదు చేయాలి.
- అనధికార వెబ్‌సైట్‌లు, ఏజెన్సీల వారికి వేలిముద్రలను ఇవ్వవద్దు.

ఏఈపీఎస్ అంటే..?



ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టం (ఏపీపీఎస్) అంటే.. ఏటీఎంలు అందుబాటులో లేని ప్రాంతాల్లో నగదు లావాదేవీల కోసం బ్యాంకు ఏర్పాటు (మైక్రో ఏటీఎంలుగా పేర్కొనవచ్చు) చేసేవి. ఏ బ్యాంక్ ఏజెంట్ అయినా ఆధార్ అథెంటిఫికేషన్ ద్వారా ఇతర ఏ బ్యాంకునకు సంబంధించిన నగదు లావాదేవీలనైనా ఆన్‌లైన్‌లో చేయొచ్చు. ఇందుకోసం ఖాతాదారుడి పేరు, బ్యాంక్ ఖాతాకు లింకైన ఆధార్ నంబర్, ఆధార్ నమోదు సమయంలో ఇచ్చిన వేలిముద్ర ఉంటే సరిపోతుంది. సదరు ఖాతాదారుడు ఏఈపీఎస్ విధానంలో నగదు తీసుకోవాలంటే సంబంధిత బ్యాంక్ ఏజెంట్ దగ్గరకు వెళ్లి బ్యాంకు పేరు, ఆధార్ నంబర్, వేలిముద్ర ఇస్తే సరిపోతుంది. సరిగ్గా ఇదే అంశాన్ని కొందరు మోసగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. రిజిస్ట్రేషన్ విభాగం వెబ్‌సైట్ నుంచి వేలిముద్రలను సేకరించి వాటిని సిలికాన్ షీట్ల ద్వారా నకిలీ వేలిముద్రలను తయారు చేస్తున్నారు. వీటి ద్వారా ఆన్‌లైన్‌లో డబ్బులు కొల్లగొడుతున్నారు.

మాస్క్‌డ్ ఆధార్ అంటే?

ఆధార్ కార్డులోని మొత్తం 12 నంబర్లలో మొదటి ఎనిమిది నంబర్లు కనిపించకుండా (వాటి స్థానంలో XXX గుర్తులు ఉంటాయి) కేవలం చివరి నాలుగు అంకెలు మాత్రమే కనిపించే దాన్ని మాస్క్‌డ్ ఆధార్ అంటారు. ఆధార్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి మాస్క్ ఆధార్ ఆప్షన్ ఆన్ చేసి పెట్టుకుంటే మన ఆధార్ కార్డు ఆన్‌లైన్‌లో ఎవరు డౌన్‌లోడ్ చేసినా పూర్తి వివరాలు కనిపించవు. దీని వల్ల 'ఆధార్' మోసాలు జరగకుండా కాపాడుకోవచ్చు.



కుదుళ్లు కట్టి... డ్రిప్ పెట్టి!

ఏజెన్సీ అడవుల్లో గంజాయి సాగు



- ప్రవీణ్ కుమార్ విచారణలో గుర్తించిన హెచ్–న్యూ
- నగదు, క్రెడిట్ విధానంలో దందా
- బెంగళూరులో ప్రవీణ్ అనుచరుడు అరెస్టు



ప్రవీణ్

సాక్షి, హైదరాబాద్: అడవి మధ్యలో ఉన్న చదునైన ప్రాంతాల్లో చెల్లాచెదురుగానో, కొండ వాలుల్లోనే గంజాయిని సాగుచేయడం ఇప్పటి వరకు వింటూనే ఉన్నాం. పోలీసులు, ప్రత్యేక బలగాలు ఈ తోటల్ని గుర్తించినప్పుడు వీటిని ధ్వంసం చేస్తుంటారు. అయితే హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్–న్యూ) అధికారులు 'డ్రగ్ డిస్ట్రిబ్యూటర్' ఎస్.ప్రవీణ్ కుమార్‌ను విచారించినప్పుడు విశాఖపట్నం ఏజెన్సీ కేంద్రంగా జరుగుతున్న గంజాయి సాగులో కొత్త కోణం వెలుగుచూసింది.

ఆధారాల కోసం అన్వేషిస్తుంటే...

హైదరాబాద్ నుంచి విశాఖ ఏజెన్సీకి పెట్రోలియం ఈథర్... అక్కడ నుంచి సిటీకి హష్ ఆయిల్ అక్రమ రవాణా చేస్తున్న కుత్బుల్లాపూర్ వాసి ప్రవీణ్ కుమార్‌ను హెచ్–న్యూ మంగళవారం అరెస్ట్ చేసింది. ప్రవీణ్ దందాలకు సంబంధించిన ఆధారాల కోసం అన్వేషిస్తూ అతడి ఫోన్‌ను తనిఖీ చేసింది. అందులో కొన్ని తోటలకు సంబంధించిన వీడియోలను గుర్తించింది. కొండలకు సమీపంలో చదునైన ప్రాంతంలో ఉన్న అక్కడి మొక్కలకు కుదుళ్లు కట్టి ఉండటం, నీటి సరఫరా కోసం డ్రిప్ ఇరిగేషన్ పైపులు ఏర్పాటు చేయడం చూసింది. అక్రమార్జన ద్వారా అతడు కూడబెట్టిన సొమ్ముతో దాన్ని ఖరీదు చేసినట్లు భావించింది. దీనిపై ప్రవీణ్‌ను ప్రశ్నించగా... అది ఏజెన్సీలోని గూడెం మాడుగుల మండలంలోని అలగం గ్రామంలో అడవి మధ్యలో గిరిజనులు సాగుచేస్తున్న గంజాయి పంట అని అతడు చెప్పగా, అవాక్కవడం అధికారుల వంతయింది.

అరెస్టు అయితే బెయిల్ ఇప్పిస్తాడు


సాధారణంగా డ్రగ్స్‌వంటి అక్రమ దందాలు చేసే వాళ్లు 'క్యాష్ అండ్ క్యారీ' లేదా అడ్వాన్స్ చెల్లిస్తేనే సరుకు సరఫరా వంటి విధానాలను అవలంబిస్తుంటారు. వీరికి రెగ్యులర్ కస్టమర్లు తక్కువ కావడంతో ఈ పంథా అనుసరిస్తారు. అయితే ప్రవీణ్ మాత్రం తన హష్ ఆయిల్ దందాను క్రెడిట్ విధానంలోనూ చేస్తున్నాడు. నగరంలో ఉన్న 15 మంది పెడ్లర్స్ (అక్రమరవాణా చేసేవారు)కు వాళ్లు ఇచ్చిన ఆర్డర్ ఆధారంగా 20 నుంచి 30 డబ్బాల (ఒక్కోటి 5 ఎంఎల్) హష్ ఆయిల్ ముందే సరఫరా చేస్తాడు. దాన్ని వాళ్లు అమ్ముకున్న తర్వాత ప్రవీణ్‌కు డబ్బు చెల్లిస్తుంటారు. ఇతడి వద్ద పెడ్లర్స్‌గా పనిచేస్తున్న వారిలో ఎవరైనా అరెస్టు అయితే...వారికి బెయిల్ కూడా ఇప్పిస్తుంటాడు. అతడి వాట్సాప్‌లోని ఓ సందేశం ఆధారంగా పోలీసులు ఈ విషయం గుర్తించారు. ఇతడి వద్ద పనిచేసే విక్రమ్ అనే సరఫరాదారుడిని బెంగళూరు పోలీసులు ఇటీవల అరెస్టు చేశారు. అతడికి బెయిల్ ఇవ్వడానికి అదే నగరానికి చెందిన ఓ లాయర్‌తో ప్రవీణ్ సంప్రదింపులు జరిపాడు. అందుకు అవసరమైన ఖర్చులను కూడా పంపించాడు. ఇతడి వ్యవహారాలు, నెట్‌వర్క్‌ను పూర్తిస్థాయిలో గుర్తించడానికి మరోసారి విచారించాలని పోలీసులు నిర్ణయించారు. దీని కోసం అతడిని తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.



శభాష్ బిడ్డా..

రాయదుర్గం: పర్యావరణ పరిరక్షణపై ప్రాజెక్టులు రూపొందించిన తన కుమారుడు ఆర్య, ఇతర విద్యార్థులను ఎమ్మెల్సీ కవిత అభినందించారు. ఖాజాగూడలోని ఓక్రిడ్జ్ అంతర్జాతీయ పాఠశాలలో బుధవారం ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తిలకించారు. తన కుమారుడు కూడా ప్రాజెక్టును రూపొందించడం చూసి ఒక తల్లిగా గర్వపడుతున్నానని ఆమె పేర్కొన్నారు.

కొత్తగా ఐదు కరోనా కేసులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బుధవారం 5,495 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు చేయగా, అందులో ఐదుగురు వైరస్ బారినపడ్డారు. దీంతో రాష్ట్రంలో ఇప్పటివరకు నమోదైన మొత్తం కేసుల సంఖ్య 8.41 లక్షలకు చేరింది. ఒక్కరోజులో కరోనా నుంచి 12 మంది కోలుకోగా, ఇప్పటి వరకు కరోనా నుంచి కోలుకున్న వారి సంఖ్య 8.37 లక్షలకు చేరింది. ప్రస్తుతం 60 మంది ఐసోలేషన్ లేదా చికిత్స పొందుతున్నట్లు ప్రజారోగ్య సంచాలకుడు శ్రీనివాసరావు వెల్లడించారు. కాగా, రాష్ట్రంలో బుధవారం 3,944 మందికి కరోనా వ్యాక్సిన్లు ఇచ్చారు. అందులో బూస్టర్ డోసు 3,276 మందికి వేయగా, రెండో డోసు 427 మందికి, మొదటి డోసు 241 మందికి వేసినట్లు ఆయన తెలిపారు.

భోజనం తినాలంటే భయమేస్తోంది

- పురుగులు, రాళ్లు వస్తున్నాయంటూ కేజీబీవీ విద్యార్థినుల ధర్నా
- విద్యార్థినులు, టీచర్‌ను గదిలో నిర్బంధించిన ఎస్‌ఓ
- డీఈవో విచారణ.. ఎస్‌ఓ సస్పెన్షన్



ధర్నా చేస్తున్న విద్యార్థినులు

నెన్నెల: మంచిర్యాల జిల్లా నెన్నెల మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులు బుధవారం ఆందోళనకు దిగారు. ప్రతిరోజూ భోజనంలో పురుగులు, రాళ్లు వస్తున్నాయని, ఆ తిండి తినలేక అర్ధాకలితో అలమటిస్తున్నామంటూ ఉదయం అల్పాహారాన్ని బహిష్కరించి విద్యాలయం ఆవరణలో ధర్నా చేపట్టారు. విద్యార్థినులు రోడ్డుపైకి వెళ్లి బైఠాయించేందుకు ప్రయత్నించగా స్పెషల్ ఆఫీసర్ (ఎస్‌ఓ) అమూల్య వారిని అడ్డుకుని గేటుకు తాళం వేశారు. విషయం తెలుసుకున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, డీఈవో వెంకటేశ్వర్లు, ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ రమాదేవి, ఎస్సై రాజశేఖర్ పాఠశాలకు చేరుకుని మూసిఉన్న మెయిన్ గేట్‌ను తెరిపించి లోపలికి వెళ్లారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించకుండా నిత్యం కిచిడీ, టమాటా, నీళ్ల పప్పు, చాలీచాలని అన్నం పెడుతున్నారని విద్యార్థినులు రోదించారు. టిఫిన్ బాగుండడం లేదని ఎస్‌ఓకు చెబితే 'ఇంటివద్ద టిఫిన్ తింటారా' అంటూ తీవ్ర పదజాలంతో దూషిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ టీచర్ పద్మ నుంచి సెల్‌ఫోన్ లాక్కొని తామందరినీ గదిలో నిర్బంధించారని సిబ్బంది పేర్కొన్నారు. దీంతో ఎస్‌ఓ అమూల్యపై డీఈవో ఆగ్రహం వ్యక్తం చేశారు. కన్నెపల్లిలో ఇలానే ప్రవర్తించడంతో సస్పెన్షన్ వేటు పడిందని, మానవతా దృక్పథంతో నెన్నెలకు పంపిస్తే ఇక్కడా అదే పద్ధతి అయితే ఎలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్‌ఓను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటిస్తూ, కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని పేర్కొన్నారు.

రూ.4 కోట్లతో రియల్టర్ పరారీ | పట్టిస్తే రూ.3 లక్షలిస్తాం

బహుమతిస్తామని బాధితుల ఫ్లెక్సీలు



జగిత్యాల క్రైం: దొంగల్ని పట్టిస్తే నగదు బహుమానం ఇస్తాం.. అంటూ పోలీసులు ప్రకటించడం చూసే ఉంటారు. కానీ జగిత్యాలలో ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి రూ.4 కోట్ల వరకు అప్పులు చేసి పారిపోవడంతో.. అతన్ని పట్టిస్తే రూ.3 లక్షల నజరానా.. అంటూ బాధితులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం విశేషం. జగిత్యాల జిల్లా గోవిందుపల్లికి చెందిన గాండ్ల వెంకన్న కుటుంబంతో సహా 15 రోజులుగా కనిపించడం లేదు. వెంకన్న చాలాకాలంగా చిట్టీలు నడుపుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. నమ్మకంగా ఉండటంతో చాలామంది నమ్మి అతనికి సుమారు రూ.4 కోట్ల వరకు అప్పు ఇచ్చారని ప్రచారం జరుగుతోంది. వెంకన్న పదిహేను రోజుల క్రితం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి పరారయ్యాడు. దీంతో బాధితులు జిల్లా కేంద్రంలోని వివిధ ప్రాంతాల్లో 'గాండ్ల వెంకన్న కనిపించడం లేదు.. ఆయనను పట్టించిన వారికి రూ.3 లక్షల నజరానా ఇస్తాం' అని ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. బాధితులెవరూ తమకు ఫిర్యాదు చేయలేదని పోలీసులు స్పష్టం చేశారు.

ఈ నెలలోనే వందే భారత్ రైలు?



స్వయంగా ప్రధాని ప్రారంభించే అవకాశం

- దీంతోపాటు మరికొన్ని పనులకు శ్రీకారం
- కాజీపేట వర్క్‌షాప్, సికింద్రాబాద్‌స్టేషన్ రీడెవలప్‌మెంట్, సికింద్రాబాద్–మహబూబ్‌నగర్ డబ్లింగ్ పనులు ప్రారంభానికి సన్నాహాలు
- వందేభారత్ రైలు నిర్వహణపై సిబ్బందికి శిక్షణ

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ రైల్వేకు ప్రత్యేక ఆకర్షణగా మారిన వందేభారత్ రైలు ఈ నెలలోనే దక్షిణ మధ్య రైల్వేలో పట్టాలెక్కే అవకాశం కనిపిస్తోంది. కాజీపేట మీదుగా సికింద్రాబాద్–విజయవాడ మధ్య ఇది పరుగుపెట్టనుంది. దీన్ని ప్రారంభించేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ నగరానికి వచ్చే అవకాశం ఉన్నందున, దీంతోపాటు మరికొన్ని రైల్వే ప్రాజెక్టులకు కూడా శంకుస్థాపనలు/ప్రారంభోత్సవాలు నిర్వహించేందుకు వీలుగా సన్నాహాలు జరుగుతున్నాయి.

కాజీపేటలో నిర్మించతలపెట్టిన పీరియాడికల్ ఓవర్ హాలింగ్ వ్యాగన్ వర్క్‌షాప్ ప్రాజెక్టుకు సంబంధించి కొద్ది రోజుల క్రితమే టెండర్‌ను ఖరారు చేసిన రైల్ వికాస్‌నిగమ్ లిమిటెడ్. ఆ పనులను ఓ సంస్థకు అప్పగించిన విషయం తెలిసిందే. ఇక సికింద్రాబాద్ స్టేషన్ రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు కూడా టెండర్లు ఖరారై పనులను ప్రారంభించుకుంటోంది. ఈ రెండు పనులను లాంఛనంగా ప్రారంభించటంతోపాటు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న సికింద్రాబాద్–మహబూబ్‌నగర్ రెండో లైన్ పనులు పూర్తయినందున దాన్ని ప్రారంభించాల్సి ఉంది. వందేభారత్ రైలు ప్రారంభంతోపాటు ఈ మూడు పనులకు కూడా శ్రీకారం చుట్టే అవకాశం ఉంది. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి అధికారిక ఆమోదం అందాల్సి ఉంది.

లాబీయింగ్ లేకపోవటం లోపం..

రైల్వే ప్రాజెక్టుల విషయంలో రైల్వే బోర్డుపై ఒత్తిడి ఉంటేనే త్వరగా సాధ్యమవుతుంది. ఆ విషయంలో తెలంగాణ వెనకబడి ఉందనే చెప్పాలి. వందే భారత్ రైళ్ల కోసం చాలా జోన్లు ముమ్మరంగా లాబీయింగ్ చేస్తున్నాయి. ఈ విషయంలో దక్షిణ మధ్య రైల్వే పక్షాన ఢిల్లీలో పొలిటికల్ లాబీయింగ్ బలహీనంగా ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే పట్టాలెక్కిన ఏడు వందేభారత్ రైళ్లలో దక్షిణ భారతానికి దక్కింది ఒక్కటే. మిగతావన్నీ ఉత్తర భారత్‌కే పరిమితమయ్యాయి. కనీసం రెండు రైళ్లన్నా దక్షిణ భారత్‌కు దక్కాల్సి ఉంది. ఇప్పటికైనా కొంత ఒత్తిడి పెరగకుంటే దక్షిణమధ్య రైల్వేకు మంజూరైన ఈ రైలు మరో జోన్‌కు మళ్లే ప్రమాదం ఉందన్న వాదనలూ లేకపోలేదు.

సికింద్రాబాద్–విజయవాడ మధ్య 130 కి.మీ. వేగంతో పరుగు..

వాస్తవానికి వందేభారత్ రైలు గంటకు 160 కి.మీ. వేగంతో పరుగుపెట్టగలదు. టెస్టింగ్ సమయంలో 180 కి.మీ.వరకు విజయవంతంగా పరుగెత్తింది. కానీ సికింద్రాబాద్–విజయవాడ మధ్య అది 130 కి.మీ. వేగంతో తిరుగుతుంది. ఆ ట్రాక్ గరిష్ట వేగ సామర్థ్యం అంతే. విశేషమేంటంటే.. ఈ ట్రాక్‌లో ఈ గరిష్ట వేగంతో తిరిగే మొదటి రైలు వందేభారతే కానుంది. కొంతకాలం క్రితమే సికింద్రాబాద్– కాజీపేట మధ్య ట్రాక్ సామర్థ్యాన్ని గంటకు 110 కి.మీ. నుంచి 130 కి.మీ. వేగానికి పెంచారు. కానీ మూడో లైన్ నిర్మాణ పనులు, ఇతర నిర్వహణ పనుల వల్ల వేగం తగ్గుతోంది. ఇప్పుడు వందేభారత్ రైలు వస్తే, ఆ అడ్డంకులు ఉన్నా..గరిష్ట వేగంతో వెళ్లే అవకాశం ఉంది.

టోల్‌గేట్ వద్ద బెల్లంపల్లి ఎమ్మెల్యే హల్‌చల్

సిబ్బందిపై దాడికి యత్నం



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కొత్తగా నిర్మిస్తున్న జాతీయ రహదారి–363పై మంచిర్యాల జిల్లా మందమర్రి శివారులోని టోల్‌ప్లాజా వద్ద బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మంగళవారం రాత్రి హల్‌చల్ చేశారు. చిన్నయ్య మంచిర్యాల నుంచి బెల్లంపల్లి వెళ్తుండగా టోల్‌ప్లాజా సిబ్బంది వాహనం ఆపడంతో కారుదిగిన ఆయన ఆగ్రహంతో వారి పై దాడికి యత్నించారు. కాగా, పక్కనున్న వారు ఆయనను సముదాయించినట్లు తెలుస్తోంది. ఇదంతా సీసీ కెమెరాలో రికార్డయింది. ఈ ఘటనపై ఎమ్మెల్యే చిన్నయ్యను 'సాక్షి'సంప్రదించగా.. ప్రమాదంలో గాయపడిన తమ బంధువుల అబ్బాయిని అంబులెన్స్‌లో తరలిస్తుండగా అక్కడి సిబ్బంది టోల్ వసూలు చేయడంపై మేనేజర్‌ను కలిసే ప్రయత్నం చేశానని చెప్పారు. ఎవరిపైనా తాను దాడి చేయలేదని తెలిపారు. కాగా, సోషల్‌మీడియా, టీవీ చానళ్లలో సీసీ ఫుటేజీ వీడియో ప్రసారం కావడంతో 'రోడ్డు పనులు పూర్తి కాకుండానే టోల్ వసూలు చేయడంపై స్థానిక ఎమ్మెల్యేగా అక్కడి అధికారులను అడిగా'అని వివరణ ఇచ్చారు. ఎన్‌హెచ్ఏఐ పీడీ రవీందర్‌రావును 'సాక్షి'సంప్రదించగా, ఘటనపై విచారణ చేపట్టామని తెలిపారు.

షార్జాకి తీసుకెళ్లి... పత్తా లేకుండా పోయి..

- 250మంది వలస కార్మికులకు వంచన...
- విజిట్ వీసాలపై యూఏఈకి పంపించిన ఏజెంట్...
- అక్కడ వర్క్ వీసా ఇప్పిస్తానని నమ్మించి మోసం
- కార్మికుల నుంచి దాదాపు రూ.2 కోట్లు వసూలు

మోర్తాడ్(బాల్కొండ): యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని షార్జాలో అల్వాజ్ క్యాటరింగ్ కంపెనీలో పని ఉందని చెప్పి 250 మందిని విడతల వారీగా విజిట్ వీసాలపై పంపించిన ఏజెంట్ పని చూపకుండా చేతులెత్తేశాడు. షార్జాకు మొదట విజిట్ వీసాలపై వెళ్లాలని అక్కడ వర్క్ వీసా ఇప్పిస్తానని నమ్మించిన ఏజెంట్ దాదాపు రూ.2 కోట్ల వరకు వసూలు చేసి ఉడాయించాడు. ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలకు చెందిన ఆ కార్మికులు షార్జాలోని ఒక హోటల్‌లో గత నెల రోజులుగా ఉండిపోగా.. కొందరు తమకు తెలిసిన వారి ద్వారా మరో కంపెనీలో పని వెతుక్కున్నారు. మరి కొందరు ఇంటిముఖం పట్టారు.

ఒక్కొక్కరి నుంచి రూ.75వేలు వసూలు

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో వర్ని మండలం కొత్తపేట్‌కు చెందిన ఓ వ్యక్తి ట్రావెల్ ఏజెన్సీని కొన్నేళ్లుగా కొనసాగిస్తున్నాడు. లైసెన్స్ లేకపోయినా ఎంతో మందిని నమ్మకంగా గల్ఫ్ దేశాలకు పంపించాడనే ఉద్దేశంతో వలస కార్మికులు అతనిపై నమ్మకంతో డబ్బులు, పాస్‌పోర్టులు అందించారు. సదరు వ్యక్తి వివిధ ప్రాంతాల్లో దాదాపు 40 మందిని సబ్ ఏజెంట్లుగా నియమించుకుని వారి ద్వారా షార్జా పంపించడానికి 250 మంది కార్మికులకు విజిట్ వీసాలను జారీ చేశాడు. ఒక్కొక్కరి వద్ద విజిట్ కమ్ వర్క్ వీసాల కోసం రూ.75 వేల నుంచి రూ.85 వేల వరకు వసూలు చేశాడు. అయితే కేవలం విజిట్ వీసాలనే కార్మికులకు అంటగట్టి షార్జా పంపించాడు. అక్కడ వర్క్ వీసా ఇప్పించకుండా పత్తా లేకుండా పోయి మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసేయడంతో ఏజెంట్ మోసం బయటపడింది. కాగా, వలస కార్మికుల నుంచి వసూలు చేసిన సొమ్ముతో ఏజెంట్ సుమారు 12 ఎకరాల భూమిని కొనుగోలు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా, కేఎస్ ట్రావెల్స్‌కి చెందిన చిట్యాల స్వామిపై వలస కార్మికుల కుటుంబ సభ్యులు వివిధ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. అసలేం జరిగిందనేది విచారణ చేస్తున్నాం.. అని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ నాగరాజు సాక్షికి వెల్లడించారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.